శనివారం 25-1-2025

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 304

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'మహిళల ముఖాలు
కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ,
సమాజమూ బాగుంటాయి '



సోలో ట్రావెల్ సో బెటర్!



నేడు నేషనల్ టూరిజమ్ డే

పర్యటనలకు మనదేశం పుట్టిల్లు. తీర్థయాత్రలు మన సంస్కృతిలో భాగం. పర్యటన... ఒక పాఠం... రచనకు అదే మూలం. జీవన వైవిధ్యత అధ్యయనానికి ఓ మాధ్యమం. పర్యటనలు ఒత్తిడి నుంచి సాంత్వన కలిగిస్తాయి. జీవితాన్ని కొత్తగా చూడడానికి కళ్లు తెరిపిస్తాయి. అణగారిన జీవితేచ్ఛను తిరిగి చిగురింపచేస్తాయి. అందుకే... ఫ్రెండ్స్‌తో టూర్‌లు... ఫ్యామిలీ టూర్‌లు... అలాగే... మహిళల సోలో ట్రావెల్స్ కూడా పెరిగాయి.

మహిళలు ఒంటరిగా పర్యటనలు చేయడానికి సందేహించాల్సిన అవసరమేలేదిప్పుడు. ప్రపంచంలో మనుషులందరినీ కలిపే భాష ఇంగ్లిష్. మనదేశంలో పర్యటనలైనా, విదేశీ పర్యటనలైనా ఇంగ్లిష్ భాష వస్తే చాలు. అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం లేకపోయినప్పటికీ మనకు అవసరమైన సమాచారాన్ని అడగగలగడం, చెప్పింది అర్థం చేసుకోవడం తెలిస్తే చాలు. సేఫ్టీ, సెక్యూరిటీ నియమాలు పాటిస్తూ ప్రయాణం కొనసాగిస్తే మహిళలు ఒంటరిగా ప్రయాణించినా సరే ఎటువంటి ఇబ్బందులూ ఎదురు కావన్నారు రజని లక్కా. ఆత్మవిశ్వాసం ఉండాలి, కనీసం ఆత్మవిశ్వాసంతో ఉన్నట్లు కనిపించి తీరాలి. బిత్తర చూపులు చూస్తే మోసగించేవాళ్లు అక్కడిక్కడే ప్రత్యక్షమవుతారు. మరో తప్పనిసరి జాగ్రత్త ఏమిటంటే సహ ప్రయాణికులతో కూడా డబ్బు లావాదేవీలు చేయకూడదు. అలాగే పర్యటనను ఆస్వాదించాలంటే లగేజ్ తక్కువగా ఉండాలి. ట్రావెల్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. సోలోగా పర్యటనకు వెళ్లిన వాళ్లు ఇంట్లో వాళ్లకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తుండాలి. అయితే లైవ్ లొకేషన్స్ ఇతరులకు ఎవ్వరికీ షేర్ చేయవద్దు. సోషల్‌మీడియాలో లైక్‌ల కోసం తాపత్రయపడి టూరిస్ట్ ప్లేస్‌లో ఫొటోలు తీసుకుని గంటకో పోస్ట్ పెడుతూ ఉంటే మన కదలికలు ఎప్పటికప్పుడు ప్రపంచానికి తెలిసిపోతుంటాయి. మనల్ని ఎవరైనా రహస్యంగా వెంటాడుతున్నట్లయితే చేజేతులా వారికి దారి చూపించినట్లవుతుంది. పర్యటన వివరాలను సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌తో షేర్ చేయాలనుకుంటే పర్యటన పూర్తయి ఇంటికి వచ్చిన తర్వాత పోస్ట్ చేసుకోవచ్చు. ఇలాంటి కొన్ని జాగ్రత్తలతో ఒంటరిగా ప్రయాణం చేయవచ్చని చెబుతున్నారు జెన్నిఫర్. మనవాళ్లకు అడ్వెంచర్ టూర్‌లు చేయడం కంటే నియమాలను ఉల్లంఘించడంలో సాహసాన్ని ప్రదర్శిస్తుంటారు. ఫొటోగ్రఫీ నిషేధం అన్న చోట ఫొటోలు తీసుకుంటారు. సెక్యూరిటీ కళ్లు కప్పి నిషేధిత ప్రదేశాల్లోకి, డేంజర్ జోన్‌లలోకి దొంగ చాటుగా వెళ్లే ప్రయత్నం చేస్తుంటారు. అలాంటి ప్రయత్నాలు ప్రమాదకరం మాత్రమే కాదు నేరం కూడా. పర్యటనను ఆస్వాదించడం కూడా ఒక కళ. ఎప్పటికీ వన్నె తగ్గని కళ.

సురక్షితంగా వెళ్లిరావచ్చు!



ఒంటరి పర్యటనలు ఆస్వాదించే వారి సంఖ్య పెరుగుతోంది. కెనడాలో మాంట్రియల్‌లో నేను ప్రయాణించిన టూరిస్ట్ బస్‌లో తొమ్మిది దేశాల వాళ్లున్నారు. అంత మందిలో ఇద్దరు మినహా అంతా సోలో ట్రావెలర్స్. అయితే వెళ్లే ముందు పర్యటనకు వెళ్లే ప్రదేశం గురించి ప్రాథమిక వివరాలైనా తెలుసుకోవాలి. ఇప్పుడు ఇంటర్నెంట్, జీపీఎస్ సౌకర్యాలున్నాయి కాబట్టి స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు, ధైర్యంగా ఒంటరి ప్రయాణాలు చేయవచ్చు. భద్రంగా వెళ్లి, సంతోషంగా తిరిగి రాగలిన పరిస్థితులున్నాయి.

– రజని లక్కా, సోషల్ యాక్టివిస్ట్

మనదేశం ప్రపంచానికి ప్రతీక

కశ్మీర్‌లో తప్ప సోలో ట్రావెలర్‌గా మరెక్కడా నాకు ఇబ్బంది ఎదురుకాలేదు. తమిళనాడు ప్రజలు సింపుల్‌గా ఉంటారు. 76 దేశాల్లో పర్యటించిన తరవాత నాకనిపించిందేమిటంటే... ప్రపంచంలో ఉన్నవన్నీ మనదేశంలో ఉన్నాయి. మనదేశంలో లేనిది ప్రపంచంలో మరెక్కడా లేదు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతం బొలీవియాను తలపిస్తుంది. మన దగ్గర ఎడారులు, హిమాలయాలు, బీచ్‌లు ఒక్కొక్కటీ ఒక్కోదేశంలో ప్రత్యేకమైన టూరిస్ట్ ప్లేస్‌ను తలపిస్తాయి. ఆర్కిటెక్చర్ పరంగా తమిళనాడు ఆలయాలు, రాజస్థాన్ కోటలకు ప్రపంచంలో మరేవీ సాటి రావు.

– పొనుగోటి నీలిమ, ట్రావెలర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

ట్రావెల్ లైట్... ట్రావెల్ సేఫ్

ఈశాన్య రాష్ట్రాలు మినహా దేశమంతటా పర్యటించాను. ఏడు దేశాలు కూడా చూశాను. మనల్ని మనం మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగింది పర్యటన ద్వారానే. సోలో ట్రావెల్ అయితే మన అభిరుచికి తగినట్లు టూరిస్ట్ ప్రదేశాలను ఎంచుకోవచ్చు. ఇప్పుడు పర్యటనలకు సౌకర్యాలు బాగున్నాయి. సోలో ట్రావెల్‌లో అన్నీ మనమే సమకూర్చుకోవడం కష్టం అనిపిస్తే టూర్ ప్యాకేజీలో వెళ్లవచ్చు. ఎక్కడికి వెళ్తే ఆ ప్రదేశంలో స్థానికులతో కలిసిపోతున్నట్లుగా ఉండాలి. మనల్ని మనం ఎక్స్‌పోజ్ చేసుకునే ప్రయత్నం చేయరాదు. ఆ ప్రదేశానికి సరిపోలని వస్త్రధారణ, మాటల ద్వారా ఇతరుల దృష్టి మన మీద సులువుగా పడుతుంది. ప్రమాదాలు కూడా అక్కడి నుంచే మొదలవుతాయి. సోలో ట్రావెల్ చేసే మహిళలు జాగ్రత్తగా ఉండాల్సింది ఈ విషయంలో మాత్రమే.

– జెన్నిఫర్ ఆల్ఫాన్స్, డైరెక్టర్



– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మీసాలు.. గడ్డాలకు ఖ్షైన తైలాలు





మింగ మెతుకు లేదు గాని మీసాలకు సంపెంగ నూనె అని మనకో సామెత ఉంది. స్తోమతకు మించి డాబులొలికే దిలాసారాయుళ్ల తీరును ఎద్దేవా చేయడానికి పుట్టిన సామెత అది. ఆనాటి సమాజంలో సంపన్నులైన పెద్దమనుషులు మీసాలకు సంపెంగ నూనెలు, ఇతరేతర సుగంధ తైలాలను పూసుకుంటూ, దర్జా ప్రదర్శించేవారు. ఇదివరకు కాస్త వయసు మళ్లినవాళ్లే ఏపుగా గడ్డాలు పెంచేవాళ్లు. ఇటీవలి కాలంలో కుర్రాళ్లు కూడా ఎడాపెడా గడ్డాలు పెంచేసుకుంటున్నారు. కొందరు అడ్డదిడ్డంగా గడ్డాలు పెంచుకుంటూ, చిరిగిన జీన్స్ తొడుక్కుని వీథుల్లో ఆవారాగా తిరుగుతుంటే, ఇంకొందరు సూటు బూట్లు ధరించి, పద్ధతిగా గడ్డాలను రకరకాల తీరుల్లో కత్తిరించుకుంటూ, గడ్డాలు దట్టంగా పెరగడానికి నానా రకాల పోషక తైలాలు వాడుతున్నారు. గడ్డాల మీద యువతరం మోజు గమనించిన మార్కెట్ శక్తులు ఊరుకుంటాయా? యువకుల మోజును సొమ్ము చేసుకోవడానికి గడ్డాల పోషణకు ప్రత్యేకంగా రూపొందించిన రకరకాల తైలాలను మార్కెట్‌లో ముంచెత్తుతున్నాయి. బియర్డ్ ఆయిల్స్, బియర్డ్ క్రీమ్స్ పురుషుల సౌందర్య ఉత్పత్తులలో కీలకంగా మారిపోయాయి. తలకు రాసుకునే హెయిరాయిల్స్, బ్రిలియంటైన్స్, జెల్స్‌తో పోల్చుకుంటే మీసాలు గడ్డాలకు పూసుకునే బీర్డ్ ఆయిల్స్, క్రీమ్స్ ధరలు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటున్నా, గడ్డాలరాయుళ్లు ఏమాత్రం వెనుకాడటం లేదు.

మంచి ఆరోగ్యాన్ని తేగలవు



చలికాలం మొదలు కాగానే మార్కెట్లలో విరివిగా కనిపించే వాటిలో తేగలు ఒకటి. వీటిని కొన్ని ప్రాంతాలలో గేగులు అని అంటారు. వీటిని తినేందుకు కొందరు ఇష్టపడరు. అయితే తేగల్లో ఆరోగ్య పోషకాలు పుష్కలంగా వున్నాయి. అవేంటో తెలుసుకుంటే ఇప్పుడైనా వీటిని తినేందుకు త్వరపడతారు.

తేగలను ఉడికించి మిరియాలు, ఉప్పు అద్దుకుని తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. తేగలు తింటే బరువు తగ్గడంతోపాటు కాన్సర్ కూడా దూరం అవుతుంది. అలాగే తేగలను ఉడికించి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని పిండి కొట్టి, కొబ్బరిపాలు, బెల్లం, ఏలకుల పొడి చేర్చి తీసుకుంటే కొలెస్ట్రాల్ ఇట్టే కరిగిపోతుంది.

తేగలపిండితో రొట్టెలు చేసుకుని తినొచ్చు. ఇందులోని పీచు జీర్ణక్రియకు ఎంతగానో తోడ్పడుతుంది. పెద్ద పేగుల్లో మలినాలను చేరకుండా చేస్తుంది. టాక్సిన్లను తొలగిస్తుంది. ఇందులోని కాల్షియం ఎముకలకు బలాన్నిస్తుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తంలో తెల్ల కణాలను వృద్ధి చేస్తుంది. శరీరానికి చలువనిచ్చి, నోటిపూతను తగ్గిస్తుంది. తేగలను పాలలో ఉడికించి ఆ పాలను చర్మానికి పూతలా రాసుకుంటే చర్మం మిలమిలలాడుతుంది.

తేగలు దొరికే రోజుల్లో పిల్లలకు రెగ్యులర్‌గా వీటిని పెడితే ఎముకల ఎదుగుదలకు దోహద పడుతుంది. తాటి తేగలను మధుమేహం ఉన్నవారు కూడా తినవచ్చు. రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించి మధుమేహాన్ని అదుపు చేస్తుంది. రక్తం తక్కువగా ఉండి అనీమియాతో బాధపడుతున్నవారు ఈ సీజన్‌లో వచ్చే తేగలను తింటూ ఉంటే మంచి ఫలితం కనపడుతుంది. మంచిది కదా అని అతిగా తింటే మాత్రం చెరుపు చేస్తుంది.



యోగా

ఎముకల బలానికి అధో ముఖం

ఎముకలు, కండరాలను బలోపేతం చేయడానికి, అకస్మాత్తుగా పడిపోయే ప్రమాదాన్ని నివారించగల శక్తి అధో ముఖానానికి ఉంది. రోజూ ఈ ఆసనాన్ని దినచర్యలో భాగం చేస్తూ ఉంటే మైండ్, బాడీ చురుకుదనం పెరుగుతుంది.

ఇలా వేయాలి....

- మ్యాట్ పైన లేదా నేలపైన నిటారుగా నిల్చొని చేతులను పైకి స్ట్రెచ్ ఉంచాలి. తర్వాత నడుం భాగం వంచుతూ, చేతులను పూర్తిగా నేలమీద ఆనించాలి.
- చేతులను పాదాలకు దూరంగా తీసుకెళుతూ త్రికోణాకారంలో ఉండాలి.
- కాలి వేళ్ల మీద ఉంటూ మడమలను పైకి లేపాలి. శరీర బరువు చేతులు, కాలి ముని వేళ్ల మీద ఉంటుంది.
- నిమిషం సేపు ఇదే భంగిమలో ఉండాలి. తిరిగి యథాస్థితికి రావాలి. ఇలా ఒకటి నుంచి 3 సార్లు ఈ ఆసనాన్ని పునరావృతం చేయాలి.

ఈ ఆసనం వేయటానికి మొదట్లో కాస్త కష్టంగా వున్నా రోజూ సాధన చేస్తూ ఉంటే సులువవుతుంది. వెన్నెముక, కాళ్లను బలోపేతం చేస్తుంది. అదే విధంగా ఏకాగ్రత పెంచి, ఒత్తిడి నుండి రిలీఫ్‌ని ఇస్తుంది. అజీర్తి సమస్యలు దూరమవుతాయి. నడుము నొప్పి తగ్గుతుంది. ఆస్టియోపోరోసిస్ సమస్య నుండి రక్షిస్తుంది. సైనస్, ఆస్తమా, పీరియడ్స్‌లో వచ్చే సమస్యల నుంచి రిలీఫ్‌ని ఇస్తుంది. ఇన్ని ప్రయోజనాలని ఈ ఆసనం ద్వారా పొందవచ్చు.

సాక్షి సినిమా

వేసవిలో జాట్



● సన్నీ డియోల్

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ హీరోగా టాలీవుడ్ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన హిందీ చిత్రం 'జాట్'. రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా ఇతర పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ఈ చిత్రాన్ని వేసవిలో ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించి, కొత్త పోస్టర్ విడుదల చేశారు. ''భారీ యాక్షన్ మూవీగా 'జాట్' రూపొందింది. 'పుష్ప 2: ది రూల్' సినిమాతో పాటు ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్లలో ప్రదర్శితమైన 'జాట్' టీజర్‌కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: రిషి పంజాబీ, సీఈఓ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: బాబా సాయికుమార్ మామిడిపల్లి, జయ ప్రకాశ్ రావు (జేపీ).

టాక్సిక్‌లో ఫిక్స్



● నయనతార

'కేజీఎఫ్: చాప్టర్ 1, కేజీఎఫ్: చాప్టర్ 2' వంటి చిత్రాలతో రాఖీ భాయ్‌గా పాన్ ఇండియా స్థాయిలో ఎంతో గుర్తింపు సొంతం చేసుకున్నారు యశ్. ఆ సినిమాల తర్వాత యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ చిత్రానికి మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె. నారాయణ, యశ్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ కొన్నాళ్లుగా జరుగుతోంది. అయినప్పటికీ హీరోయిన్ ఎవరనే విషయంపై చిత్రయూనిట్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో కియారా అద్వానీ, కరీనా కపూర్, నయనతార వంటి హీరోయిన్ల పేరు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా యశ్‌కి జోడీగా నయనతార నటిస్తున్నట్లు ఈ మూవీలో కీలక పాత్ర చేస్తున్న బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ మాటలతో స్పష్టత వచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్షయ్ ఒబెరాయ్ మాట్లాడుతూ– ''యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమా షూటింగ్‌తో ప్రస్తుతం బిజీగా ఉన్నాను. ఇందులో నయనతార కూడా భాగమయ్యారు. ఇంతకు మించి వివరాలను నేను ఇప్పుడే వెల్లడిస్తే బాగోదు కాబట్టి నన్ను ఎక్కువగా అడగకండి. త్వరలోనే గీతూ మోహన్‌దాస్ ఓ ప్రకటన చేస్తారు. అప్పటివరకు వేచి చూడండి'' అని పేర్కొన్నారు. ఇక నయనతార గురించి దర్శక–నిర్మాతల నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం. ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది.

అంతే తేడా!



● రవితేజ, అనంతిక

'ఇట్స్ ఓకే.. మూవ్ ఆన్ అవ్వాలిరా.. తప్పదు' అంటూ అనంతిక సనీల్‌కుమార్ చెప్పిన డైలాగ్‌తో '8 వసంతాలు' మూవీ టీజర్ ఆరంభమైంది. 'మ్యాడ్' మూవీ ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల, సంజన, కన్నా పసునూరి, స్వరాజ్ రెబ్బా ప్రగడ, సమీరా కిశోర్ ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. ''ఎవరి తుఫాన్‌లు వారికి ఉంటాయి లోపల... కొందరు బయట పడతారు, ఇంకొందరు ఎప్పటికీ పడరు... అంతే తేడా'' అంటూ కన్నా పసునూరితో అనంతిక సనీల్ కుమార్ చెప్పే డైలాగ్స్ కూడా టీజర్‌లో ఉన్నాయి. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, కెమేరా: విశ్వనాథ్ రెడ్డి.

అఖండలో...



● సంయుక్తా మీనన్

'సింహా, లెజెండ్, అఖండ' వంటి హిట్ సినిమాల తర్వాత హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ మూవీలో హీరోయిన్‌గా సంయుక్తా మీనన్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని చిత్రయూనిట్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం మహా కుంభమేళాలో జరుగుతోంది. సినిమాలోని కీలక సీన్స్ షూట్ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకూ హీరోయిన్ ఎవరు? అనే విషయంపై చిత్రబృందం ప్రకటించలేదు. తాజాగా సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా ఎంపిక అయినట్లు మేకర్స్ ప్రకటించారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమేరా: సి. రాంప్రసాద్, సంతోష్ డి.

వెంకటలచ్చిమి ప్రతీకారం



● పాయల్ రాజ్‌పుత్

'ఆర్‌ఎక్స్ 100, వెంకీ మామ, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, మంగళవారం' వంటి పలు సినిమాల్లో నటించి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు పాయల్ రాజ్‌పుత్. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో 'వెంకటలచ్చిమి' అనే పాన్ ఇండియా చిత్రం ఆరంభమైంది. ముని దర్శకత్వంలో సినిమా టికెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రాజా, ఎన్‌ఎస్ చౌదరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం అనంతరం ముని మాట్లాడుతూ– ''వెంకటలచ్చిమి' కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిగ్గా సరిపోతారనిపించింది. గిరిజన ప్రాంతానికి చెందిన వెంకటలచ్చిమి అనే అమ్మాయి ప్రతీకారం, యాక్షన్ నేపథ్యంలో ఈ మూవీ ఉంటుంది. ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో తెరకెక్కిస్తున్నాం'' అని తెలిపారు. పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ– ''మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నా, నచ్చకపోవడంతో తిరస్కరించాను. మునిగారు 'వెంకటలచ్చిమి' కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఈ చిత్రం తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అనేంత బలమైన కథ ఇది''అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బడిశా.

ప్రేమ కోసం...



● విరాజ్ రెడ్డి

విరాజ్ రెడ్డి చీలం హీరోగా నటించిన చిత్రం 'గార్డ్'. రివెంజ్ ఫర్ లవ్ (ప్రేమకోసం ప్రతీకారం) అనేది ఉపశీర్షిక. జగ పెద్ది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మిమీ లియానార్డ్, శిల్పా బాలకృష్ణ హీరోయిన్లుగా నటించారు. అనసూయ రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరిలో విడుదల కానుంది. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలతో రూపొందిన చిత్రం 'గార్డ్'. సుశాంత్ అనే సెక్యూరిటీ గార్డుగా విరాజ్ కనిపిస్తారు. విరాజ్ యాక్షన్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకునేలా ఉంటాయి. యాక్షన్–ప్యాక్డ్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో లవ్ ట్రాక్ కూడా ఉంటుంది. ప్రేమ పేరుతో ఊహించని శక్తులపై హీరో చేసే పోరాటాలు ఈ సినిమాకు హైలైట్'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ ఇది చూడొచ్చు

బీ కేర్‌ఫుల్...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం డేంజరస్ వాటర్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



జీవితమన్నది క్షణభంగురం. ఏ క్షణానికి ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. కాబట్టి అనుక్షణం అప్రమత్తత అవసరం. ఈ నేపథ్యంలోనే రూపొందిన హాలీవుడ్ సినిమా 'డేంజరస్ వాటర్స్'. ఇదో పూర్తి థ్రిల్లర్ జోనర్ మూవీ. సినిమా మొత్తం ఓ మూడు పాత్రలతో 90 శాతం సముద్రంలోనే జరిగిన కథ. సినిమాలో ఉన్నది మూడు పాత్రలే అయినా మంచి స్క్రీన్‌ప్లేతో చూసే ప్రేక్షకులను మాత్రం కట్టిపడేసే ప్రయత్నం చేశారు దర్శకుడు జాన్ బర్. ఈ సినిమా లయన్స్ గేట్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. ఇది పెద్దవాళ్ల మాత్రమే చూసే సినిమా. ఇక ఈ చిత్రకథ విషయానికొస్తే... అల్మా తన కూతురు కోసం ఓ సూపర్ వెకేషన్ ప్లాన్ చేస్తుంది. తన బాయ్ ఫ్రెండ్ డెరెక్‌తో కలిసి కూతురుతో పాటు బోట్‌లో బెర్ముడా వరకు ట్రావెల్ చేసి, సముద్రం మధ్యలో తన బర్త్ డే సెలబ్రేట్ చేసుకోవాలన్నది ప్లాన్. దీనికి కూతురు రోజ్ అయిష్టంగానే ఒప్పుకుంటుంది. ప్రయాణం మొదలైనపుడు అంతా బాగానే ఉంటుంది. దారి మధ్యలో వేరే ఒక బోట్ వీళ్లకు ఎదురుగా వచ్చి అల్మాను చంపేసి డెరెక్‌ను గాయపరుస్తారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనలో నడి సంద్రంలో రోజ్ ఒంటరిదైపోతుంది. దాడి చేయడానికి వచ్చినవాళ్లు బోట్‌లోని రేడియోను అలాగే బోట్ ఇంజన్‌ను ధ్వంసం చేసి వెళతారు. చుట్టూ నీళ్ల తప్ప ఏమీ లేని ఆ ప్రాంతం నుండి రోజ్ ఎలా బయటపడిందనేది సినిమాలోనే చూడాలి. ఈ సినిమా చాలా నెమ్మదిగా ప్రారంభమై, ఉత్కంఠభరితంగా సాగుతూ ఊహకందని క్లైమాక్స్ ట్విస్టులతో అద్భుతంగా ముగుస్తుంది. గంటా నలభై నిమిషాల నిడివితో సాగే ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టదు. థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవాళ్లకి ఇదో సూపర్ సినిమా. మరింకేం... ఈ వీకెండ్ 'డేంజరస్ వాటర్స్'లోకి మీరూ ట్రావెల్ చేయండి.

– ఇంటూరు హరికృష్ణ

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 304

శనివారం 25-1-2025



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



'ఉపాధి'కి చేయూత కావాలి

నైపుణ్యం, శిక్షణ అవసరం.. బడ్జెట్–'25పై పరిశ్రమ వర్గాల డిమాండ్లు -19లో



పైచేయి కోసం...

చెన్నైలో నేడు ఇంగ్లండ్‌తో రెండో టి 20 మ్యాచ్ ఆడనున్న భారత్ -19లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కెనెడీ ఫైల్స్ డీ క్లాసిఫై

కెనెడీ, రాబర్ట్ ఎఫ్.కెనెడీ, మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ హత్యోదంతాల రహస్య ఫైళ్లను బహిర్గతం చేయాలని ట్రంప్ ఆదేశించారు.

వివరాలు 6లో ▸



ముంచుకొస్తున్న మంచు ముప్పు

అతిపెద్ద ఐస్‌బర్గ్ ఏ23ఏ అంటార్కిటికాలోని మారుమూల ద్వీపమైన దక్షిణ జార్జియా వైపు శరవేగంగా దూసుకొస్తోంది.

వివరాలు 6లో ▸



జేపీసీ సమావేశంలో రగడ

వక్ఫ్ సవరణ బిల్లుపై జరిగిన జేపీసీ సమావేశంలో విపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

వివరాలు 6లో ▸



అక్రమ వలసదార్ల అరెస్టు

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదార్లపై కఠినంగా వ్యవహరిస్తోంది. 538 మందిని అరెస్టు చేసినట్లు ప్రకటించింది.

వివరాలు 6లో ▸

పెన్షన్.. టెన్షన్!

కొత్త పింఛన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఎదురుచూపులు

పెంచుతామన్న మొత్తం కాకపోయినా పాత పింఛనైనా మంజూరు చేయాలనే విజ్ఞప్తి

- 2022 ఆగస్టు నుంచి అందుబాటులో లేని ఆసరా పింఛన్ల ఆన్‌లైన్ పోర్టల్..
- మాన్యువల్‌గా వివిధ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఎంతో మంది
- పింఛన్ల మొత్తం పెంచుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ సర్కారు హామీ.. అది అమలు చేసేలోగా.. కొత్తవైనా ఇచ్చి ఆదుకోవాలనే వేడుకోళ్లు
- పెద్ద వయసులో బతుకు వెళ్లదీసుకోవడానికి పింఛన్ ఆసరా అవుతుందంటున్న వృద్ధులు



సాక్షి, హైదరాబాద్

భర్త చనిపోయి ఎలాంటి ఆధారం లేక తండ్లాడుతున్న వితంతువు..
పెద్ద వయసులో తోడెవరూ లేక, ఎలా బతకాలో తెలియక గోస పడుతున్న వృద్ధుడు..
వైకల్యంతో ఏ పనీ చేయలేక, వైద్యం కోసం డబ్బుల్లేక ఆగమైతున్న దివ్యాంగుడు..

.. ఇలా ఎందరో.. అందరిదీ ఒకే వేదన. ఎలాగోలా బతుకు వెళ్లదీసేందుకు కనీసం ప్రభుత్వమిచ్చే పింఛన్ అయినా తోడ్పడుతుందనే ఆలోచన. తిరగని ఆఫీసులు లేవు.. కలవని అధికారులు లేరు.. వేడుకోని రాజకీయ నాయకులు లేరు.. అయినా పింఛన్ రావడం లేదు. ఏళ్లకేళ్లుగా, ఎన్నోసార్లు దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నా ఫలితం ఉండటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేసి, తమను ఆదుకోవాలని వారంతా వేడుకుంటున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలకు వచ్చి దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డుల మిగతా 17వ పేజీలో ▶

పింఛన్ వస్తే బతుకు వెళ్లదీసుకుంటా..

నాకు 75 ఏళ్లు. వృద్ధాప్య పింఛన్ కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న. గతంలో రూ.200 ఇచ్చేప్పటి నుంచీ నా భార్యతోపాటు నాకు కూడా పింఛన్ వచ్చేది. తర్వాత ఇంట్లో ఒక్కరికే పింఛన్ అని నా పేరు తీసేశారు. ఆరేళ్ల క్రితం భార్య చనిపోయింది. అప్పట్నుంచీ పింఛన్ కోసం చాలా సార్లు దరఖాస్తు చేసుకున్న. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్న. ఇప్పుడు గ్రామసభలో అధికారులకు మొరపెట్టుకున్న. పింఛన్లకు దరఖాస్తులు తీసుకోవడం లేదన్నరు. పింఛన్ వస్తే ఈ వయసులో బతుకు వెళ్లదీసుకోవడానికి ఆసరా అవుతుంది.

– గంటే రాములు, నేరడగందొడ్డి గ్రామం, మాగనూరు మండలం, నారాయణపేట జిల్లా



'ఎన్నికల' వజ్రోత్సవం

నేడు ఈసీ 75 ఏళ్ల వేడుకలు

- పాల్గొననున్న రాష్ట్రపతి ముర్ము
- సుదీర్ఘ ప్రస్థానంలో మెరుపులెన్నో
- పదేళ్లుగా పెరుగుతున్న సవాళ్లు
- సన్నగిల్లుతున్న ఈసీ విశ్వసనీయత

ఈవీఎంల పనితీరు మీదే సందేహాలు 16లో

- చివరి గంటల్లో అనూహ్య పోలింగ్
- మాజీ సారథులే అవాక్కవుతున్న వైనం
- పోలైన ఓట్ల కంటే లెక్కిస్తున్నవి ఎక్కువ
- అన్నింటికీ మౌనమే ఈసీ సమాధానం

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు కమిటీ!

ప్రభుత్వానికి రాష్ట్ర విద్యా కమిషన్ సిఫారసులు

- పాఠశాలల్లో కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలి
- స్కూళ్లను కేటగిరీలుగా విభజించి ఫీజులు నిర్ధారించాలి
- బుక్స్, స్కూల్ డ్రెస్‌లు, షూలు, టైలు విక్రయించకుండా చూడాలి
- కమిటీ ఎందుకనుకుంటే కమిషన్‌కే ఆ బాధ్యత అప్పగించాలి!
- నివేదిక సమర్పించిన కమిషన్ చైర్మన్, సభ్యులు

16లో

న్యూస్‌రీల్

తెలంగాణలో ఉన్న వారిని తీసుకెళ్లి ఒప్పందాలా?



తెలంగాణ వ్యక్తులను, సంస్థలను దావోస్‌కి తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకోవడం ఏమిటోనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వేధింపులతో పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారని అన్నారు.

- వివరాలు 2లో▶

కేసీఆర్, కేటీఆర్‌లలో ఎవరైనా రండి



'పదేళ్లలో మీరు దావోస్ నుంచి తెచ్చిన పెట్టుబడులు రూ.27వేల కోట్లే.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రూ.1.79 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీనిపై మీరు ఎక్కడికి, ఎప్పుడు రమ్మన్నా వచ్చి చర్చిస్తాం' అని కేటీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సవాల్ విసిరారు.

- వివరాలు 2లో▶

రివైజ్డ్ డిజైన్లు ఇవ్వకనే బరాజ్‌కు నష్టం!



మేడిగడ్డ బరాజ్‌ను తొలిసారి 2019లో నీళ్లతో నింపారని, అదే ఏడాది బరాజ్‌కు నష్టం జరిగిందని నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ' ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంవీ రామకృష్ణరాజు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు వెల్లడించారు.

- వివరాలు 14లో▶

ఇంటర్ ఫీజులు తీసుకోండి



ఆలస్య రుసుము కోసం పట్టుబట్టకుండా విద్యార్థుల ఫీజుల చెల్లింపునకు అంగీకరించాలని తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ (టీజీబీఐఈ)ను హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని ఈ నెల 25లోగా చెల్లించాలని కళాశాలలకు స్పష్టం చేసింది.

- వివరాలు 17లో▶

రాష్ట్ర ప్రభుత్వం బాండ్ల వేలం ద్వారా తెచ్చిన రుణాల తిరిగి చెల్లింపుపై రిజర్వు బ్యాంకు స్పష్టత



ఏటా

రూ.15 వేల కోట్లపైనే!

- వచ్చే నాలుగేళ్లలో రూ.60 వేల కోట్లకుపైగా విలువైన బాండ్లకు ముగియనున్న కాలపరిమితి
- సెక్యూరిటీ బాండ్లపై నివేదిక విడుదల చేసిన ఆర్బీఐ
- కేంద్రం, సంస్థలు, కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలకు చెల్లింపులు అదనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా తెచ్చుకున్న అప్పుల తిరిగి చెల్లింపుపై రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) స్పష్టతనిచ్చింది. 2015 జనవరి 1వ తేదీ నుంచి 2025 జనవరి 15వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రం రూ.3,49,137 కోట్లను బాండ్ల వేలం ద్వారా తీసుకున్నట్టు వెల్లడించింది. గరిష్టంగా 45 ఏళ్ల కాలపరిమితితో ఈ నిధులు సమీకరించారని.. అంటే 2060 నాటికి ఈ అప్పులన్నింటినీ తీర్చాల్సి ఉంటుందని తాజాగా విడుదల చేసిన 'ఔట్ స్టాండింగ్ స్టేట్ గవర్నమెంట్స్ సెక్యూరిటీస్'నివేదికలో తెలిపింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు చేసిన అప్పుల లెక్కలను అందులో వెల్లడించింది. తెలంగాణ వచ్చే నాలుగేళ్లలో రూ.60,947.18 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని వివరించింది.

ఈ ఏడాది రూ.17 వేల కోట్ల పైమాటే..

రాష్ట్రం బాండ్ల వేలం ద్వారా సేకరించిన రుణాలను ఏ సంవత్సరంలో ఎంత తీర్చాల్సి ఉంటుందో ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడించింది. దాని ప్రకారం 2025లో రూ.17,150 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించాల్సి ఉంది. 2026లో రూ.20వేల కోట్లను అప్పులకు అసలు, వడ్డీ కింద చెల్లించాలి. మొత్తమ్మీద వచ్చే నాలుగేళ్లలో మిగతా 17వ పేజీలో ▶

20 లక్షల పీఎంఏవై ఇళ్లు ఇవ్వండి

మెట్రో విస్తరణకు సహకరించండి.. 'మూసీ' ప్రాజెక్టుకు చేయూతనివ్వండి

- విద్యుత్ అప్పులపై వడ్డీ రేట్లు తగ్గించండి
- కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- పీఎంఏవై(యూ), పట్టణాభివృద్ధి, విద్యుత్‌పై ఖట్టర్ సమీక్ష

కేంద్ర మంత్రి ఖట్టర్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి తదితరులు



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశ పట్టణ జనాభాలో 8% ప్రజలు తెలంగాణలో ఉన్నందున అర్బన్ యూనిట్లను ఎక్కువగా ఇవ్వాలని కోరారు. పీఎంఏవై (యూ), పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖలపై మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం గురించి సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. పీఎంఏవై 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ.. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన డేటా, పూర్తి ప్రణాళికతో సిద్ధంగా ఉన్నందున 20 లక్షల ఇళ్లు కేటాయించాలని కోరారు.

మెట్రో విస్తరణకు సహకరించండి

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు విస్తరణకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ప్రతిపాదిత మెట్రో విస్తరణ ప్రణాళికను కేంద్రమంత్రి ముందుంచారు. నాగోల్–శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), రాయదుర్గం–కోకాపేట నియోపోలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్–పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్బీ నగర్–హయత్‌నగర్ (7.1 కి.మీ), అంతర్జాతీయ విమానాశ్రయం–ఫోర్త్ మిగతా 14వ పేజీలో ▶

లిటరరీ ఫెస్టివల్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ. చిత్రంలో లిథువేనియా రాయబారి డయానా మికెవిసీన్ తదితరులు



సాహిత్యం, కళలతో సమాజం పురోగతి

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- ప్రజల స్నేహాభిమానాలు, కవిత్వానికి హైదరాబాద్ ప్రతీక
- 'సిటీ ఆఫ్ డిస్కవరీ'గా నిలిచినందునే వేగంగా అభివృద్ధి
- త్వరలో ఈశాన్య భారతం–హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

వివరాలు 14లో



ఆందోళన కలిగించేలా దేశంలో పరిణామాలు

- చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి
- హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్ చర్చాగోష్టిలో షబానా ఆజ్మీ

14లో

తారలు.. అక్షరాలు తళుక్కుమన్నాయి 18లో

ఇవాంజ్యూక్‌



మొత్తం మీ గురించే కాకుండా కాస్త రాష్ట్రం గురించి కూడా చెప్పాల్సింది సార్!

● రోడ్ అలర్ట్



హైవేలపై బ్లాక్‌స్పాట్లను ముందుగానే గుర్తించే టెక్నాలజీ

సురక్షితం ఏఐ రాస్తే

నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని ప్రమాదాలకు మానవ తప్పిదాలు కారణమవుతుండగా, మరికొన్ని చోట్ల రోడ్ల నిర్మాణంలోని లోపాలు కారణంగా నిలుస్తున్నాయి. ఈ రెండో సమస్యకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పరిష్కారం కనిపెట్టారు. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీలోని ఐఎన్ఏఐ కేంద్రం ఆవిష్కరించిన ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ ఫర్ రోడ్ సేఫ్టీ త్రూ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ (ఐరాస్తే) ఈ సమస్యకు దారి చూపింది. తెలంగాణ ప్రభుత్వం, ఇంటెల్ సహకారంతో ఐరాస్తేను అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే.

– సాక్షి, హైదరాబాద్

- 691 కిలోమీటర్ల మేర రోడ్ల అధ్యయనం
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా ప్రదేశాల గుర్తింపు
- రాష్ట్ర ప్రభుత్వం, ఇంటెల్ సహకారంతో ట్రిపుల్ ఐటీ హెచ్ అధ్యయనం
- ప్రమాదాల నివారణ సూచిస్తూ ఎన్‌హెచ్ఏఐకి నివేదిక

ఒక రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశం 80 నుంచి 90 శాతం ఉన్న ప్రదేశాన్ని గ్రే స్పాట్‌గా గుర్తిస్తారు. అయితే, వరుసగా మూడేళ్లపాటు అదే చోట ప్రమాదాలు జరిగి పది మందికంటే ఎక్కువ చనిపోతే, ఆ ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్ జాబితాలో చేర్చుతారు. ఇలాంటి ప్రదేశాలను గ్రే స్పాట్ల స్థాయిలోనే తెలుసుకోగలిగితే ప్రమాదాలు మిగతా 14వ పేజీలో ▶

3 ప్రధాన రహదారులపై ఐరాస్తే ప్రయోగం

200 ఆర్టీసీ బస్సుల్లో ఏడీఏఎస్ పరికరాలు అమర్చి పరిశోధన

20 చొప్పున గ్రే స్పాట్లు ఒక్కో రహదారిపై ఉన్నట్టు గుర్తింపు


కోల్ కారిడార్‌కు లైన్‌క్లియర్!

కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ ముందుకు రామగుండం–మణుగూరు రైలుమార్గం ప్రతిపాదన

- ఇక్కడ సరే అంటే, వచ్చే బడ్జెట్‌లో చోటు
- ఇప్పటికే డీపీఆర్‌కు ఓకే చెప్పిన రైల్వే బోర్డు
- 208 కి.మీ. నిడివి, రూ.3,997 కోట్ల అంచనా వ్యయం

సాక్షి, హైదరాబాద్: ఇన్నాళ్లూ ప్రతిపాదనలకే పరిమితమైన కోల్ కారిడార్ ఎట్టకేలకు సాకారం కాబోతోంది. ఇటీవల అందిన డీపీఆర్‌ను పరిశీలించిన రైల్వే బోర్డు, దీనిని సాధ్యమయ్యే ప్రాజెక్టుగా తేల్చటంతో తుది ఆమోదం లభించే కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ(సీసీఈఏ)కి చేరింది. ఇక్కడ ఆమోదం లభిస్తే.. కేంద్ర బడ్జెట్‌లో దీనికి నిధులు కేటాయించే అవకాశం ఉంది. 207.80 కి.మీ. మిగతా 17వ పేజీలో ▶

నెట్ ఆగితే నష్టమే!



ఆర్థికంగా ప్రభావం చూపిస్తున్న ఇంటర్నెట్ నిలిపివేత

పలు కారణాలతో సేవలు నిలిపివేస్తున్న దేశాలు

2024లో ప్రపంచవ్యాప్తంగా 88,788 గంటలపాటు ఆగిన నెట్

నెట్ నిలిపివేత, సోషల్ మీడియా ఖాతాల స్తంభనతో రూ.68,319 కోట్ల నష్టం

రూ.279 కోట్ల మేర ప్రభావంతో 6వ స్థానంలో భారత్

సాక్షి, హైదరాబాద్: నిరసనలు, ఆందోళనలు, ఎన్నికలు, మత ఘర్షణలు, చివరకు పరీక్షల సమయంలో సమాచారం, సందేశాల వ్యాప్తిని నిరోధించేందుకు ప్రాంతాల వారీగా ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం, సామాజిక మాధ్యమాలను స్తంభింప జేయడం ఇటీవలి కాలంలో సాధారణ విషయమై పోయింది. రాష్ట్రం, దేశంలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఇది జరుగుతోంది. 2024లో 88,788 గంటల పాటు ఇంటర్నెట్ సేవలు, సామాజిక మాధ్యమాలు స్తంభించడంతో 60.48 కోట్ల మంది వినియోగదారులపై ప్రభావం పడినట్లు అంచనా. 28 దేశాల ఆర్థిక రంగంపై రూ.68,319 కోట్ల మేర ప్రభావం చూపించగా..మన దేశంలో రూ.279 కోట్ల మేర 6.77 కోట్ల మంది వినియోగదారులపై ప్రభావం చూపించినట్లుగా లెక్కలు వేశారు. ఇంటర్నెట్ సేవల నిలిపివేత కారణంగా నష్టపోతున్న దేశాల జాబితాలో భారత్ ఆరో స్థానంలో ఉండగా పొరుగు దేశం పాకిస్తాన్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. మయన్మార్ రెండు, బంగ్లాదేశ్ ఐదో స్థానంలో ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో 'ఎక్స్', టిక్‌టాక్, సిగ్నల్ అత్యధిక గంటల పాటు స్తంభించిపోయాయి. ఇంటర్నెట్ నిలిపివేత డిజిటల్ ఎకానమీ, టూరిజం, స్టార్టప్ రంగాలపై ఎక్కువగా ప్రతికూల ప్రభావం చూపుతోంది. అలాగే విద్య, టెలీ మెడిసిన్‌తో పాటు అత్యవసర సేవలపైనా ప్రభావం చూపుతోంది.

గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఓ గిరిజన మహిళపై అత్యాచారం నేపథ్యంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. పరిస్థితులను అదుపులోకి తెచ్చే చర్యల్లో భాగంగా పోలీసులు ఇంటర్‌నెట్ సేవలను కూడా నిలిపివేశారు.

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో జిల్లా కలెక్టర్, అధికారులపై రైతుల దాడి నేపథ్యంలో.. శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని గత ఏడాది నవంబర్ 12న దుద్యాల ప్రాంతంలో కొద్ది గంటల పాటు ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి.

గత ఏడాది నవంబర్‌లో మత ఘర్షణలతో పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో, రెండు వర్గాల మధ్య హింస చెలరేగడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంభాల్‌లో ఇంటర్నెట్ అందుబాటులో లేకుండా చేశారు. డిసెంబర్‌లో రైతుల నిరసనల నేపథ్యంలో హరియాణాలోని అంబాలాలో, జాతి ఘర్షణలు చెలరేగుతున్న మణిపూర్‌లో మరోసారి ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి.

పలు సంస్థల సూచికలు పరిగణనలోకి..

ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు ప్రభుత్వాలు ఇచ్చే ఆదేశాల ద్వారా జరిగే నష్టాన్ని ప్రపంచ బ్యాంకు, ఇంటర్నేషనల్ టెలీ కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ), యూరోస్టాట్, యూఎస్ సెన్సస్ తదితర సంస్థల సూచికలను ఆధారంగా చేసుకుని లెక్కిస్తారు. ప్రభుత్వాలు ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేయడం, సోషల్ మీడియా స్తంభన, ఇంటర్నెట్ స్పీడ్‌ను 2జీ స్థాయికి తగ్గించడం తదితరాలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేస్తున్నారు. ఇంటర్నెట్ నిలిపివేత, సామాజిక మాధ్యమాలను స్తంభింప చేసేందుకు ప్రభుత్వాలు తీసుకునే చర్యలను ఒక రకంగా ఇంటర్నెట్ సెన్సార్‌షిప్‌గా భావించవచ్చు.

తరచూ స్తంభిస్తున్న 'ఎక్స్', 'టిక్ టాక్'

ప్రాంతాల వారీగానే కాకుండా దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రతకు ప్రమాదం పొంచి ఉందనుకున్న ఖాతాలపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది. స్థానిక పరిస్థితుల ఆధారంగా కూడా నిర్ణయాలు తీసుకుంటారు. భారత్‌లో గత ఏడాది 28 వేలకు పైగా సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేయగా ఇందులో ఫేస్‌బుక్, 'ఎక్స్'కు సంబంధించినవే సుమారు 10 వేల వరకు ఉన్నాయి. సామాజిక మాధ్యమ ఖాతాల తొలగింపులో.. అభ్యంతరకర సమాచారం ఉన్న యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌కు సంబంధించిన ఖాతాలు తర్వాతి స్థానంలో ఉన్నాయి. తొలగింపునకు గురైన వాటిలో ఎక్కువగా ఖలిస్తానీ అనుకూల సమాచారంతో కూడిన ఖాతాలతోపాటు విద్వేష ప్రసంగాలు, జాతీయ భద్రత, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే రీతిలో ఉన్న ఖాతాలు ఉన్నాయి.

2019- 24 మధ్య ఇంటర్నెట్ సేవల నిలిపివేత ప్రభావం

సంవత్సరం	ఎన్నిసార్లు	దేశాలు	వ్యవధి (గంటల్లో)	ఆర్థిక ప్రభావం (రూ.కోట్లలో)
2024	168	28	88,788	68,319
2023	196	25	79,238	34,764
2022	144	23	50,095	24.61
2021	50	21	30,179	2,12,827 (రష్యా యుద్ధ ప్రభావం)
2020	93	21	27,165	34,678
2019	134	22	19,207	69,789

2024లో టాప్ 6 దేశాల్లో ఇంటర్నెట్ నిలిపివేత సమయం, దాని ప్రభావం వివరాలు

దేశం	వ్యవధి (గంటల్లో)	ఆర్థిక ప్రభావం (రూ.కోట్లలో)
పాకిస్తాన్	9,735	14,009
మయన్మార్	20,376	13,663
సూడాన్	12,707	9,685
వెనెజులా	3,840	9,685
బంగ్లాదేశ్	444	688
భారత్	2,920	279



నాలుగు పథకాలపై.. నేడు కీలక భేటీ

అధికారులు, మంత్రులతో సీఎం సమావేశం

- పథకాల అమలు, ప్రారంభంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- లబ్ధిదారుల ఎంపిక మార్గదర్శకాలపై చర్చ
- రాష్ట్రవ్యాప్తంగా 16,348 గ్రామ/వార్డు సభలు పూర్తి
- జీహెచ్‌ఎంసీలో మరికొన్ని రోజులు జరగనున్న వార్డు సభలు

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలను ఈనెల 26వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు ప్రారంభించాలన్న దానిపై కీలకభేటీ జరగనుంది. దావోస్ పర్యటన ముగించుకొని శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశమవుతారు. ఈ నాలుగు పథకాలను జిల్లా స్థాయిలో కార్యక్రమాలు పెట్టి ప్రారంభించాలా లేక రాష్ట్రస్థాయిలో లాంఛనంగా ప్రారంభించాలా అన్న దానిపై నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. లబ్ధిదారుల ఎంపిక విషయంలో కూడా ఆ సమావేశంలోనే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తారని, అదే సమయంలో లబ్ధిదారుల సంఖ్యపై కూడా పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలిసింది. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గ్రామసభల్లో పేర్లు చదవడంపై కొన్ని జిల్లాల్లో లబ్ధిదారులు ఆందోళన చేయడం, అధికారుల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి విదితమే. మంత్రులతో సమావేశానంతరం పథకాల ప్రారంభానికి సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూల్ విడుదల చేయనున్నట్టు సమాచారం.

నాలుగు రోజుల గ్రామసభలు పూర్తి: ఇందిరమ్మ ఇళ్లతోపాటు ఇతర మూడు పథకాలకు సంబంధించి గ్రామస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్రంలో మొత్తం 16,348 గ్రామ/వార్డు సభలు పూర్తయ్యాయని ప్రభుత్వం ప్రకటించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో మాత్రం వార్డు సభలు మరికొన్ని రోజులు జరగనున్నాయి. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఈ సభల్లో ఆయా పథకాల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలు, లబ్ధిదారుల జాబితాలను చదివి వినిపించిన అధికారులు పలు పథకాల కోసం మళ్లీ ప్రజల నుంచి కొత్తగా దరఖాస్తులు కూడా తీసుకున్నారు. ప్రధానంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షల సంఖ్యలో దరఖాస్తులు అందినట్టు సమాచారం. ఈ దరఖాస్తులను వడపోసిన తర్వాతే పూర్తిస్థాయి లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతుందని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన గత సంవత్సరంలో నిర్వహించిన ప్రజాపాలన సమావేశాల్లో 83 లక్షల దరఖాస్తులు రాగా, అందులో 30 లక్షల మంది అర్హులుగా తేల్చారని, అందులోనూ తొలి విడతలో భాగంగా అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్ల, గిరిజనులకు ప్రాధాన్యమివ్వాలని, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్టు సర్టిఫికెట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

- రేషన్‌కార్డులకు సంబంధించి 6.85లక్షల మంది లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించారు. ఇందులో అభ్యంతరాలు వచ్చిన దరఖాస్తులను, గ్రామసభల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను పునఃపరిశీలించనున్నారు. ఆ తర్వాతే కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల తుది జాబితా తయారు చేయనున్నారు.
- రైతు భరోసా కోసం ఈనెల 16 నుంచి 20వ తేదీవరకు గ్రామస్థాయిలో సాగు యోగ్యం కాని భూముల గుర్తింపు ప్రక్రియ జరిగింది. ఈ ప్రక్రియలో భాగంగా 10–15 లక్షల ఎకరాలు సాగు యోగ్యం కావని తేల్చినట్టు తెలిసింది. ఆత్మీయ భరోసా కింద 10 లక్షల మంది వరకు అర్హులను గుర్తించారని, వీరికి తొలి విడతలో భాగంగా అవసరమయ్యే నిధుల చెక్కును కూడా విడుదల చేస్తారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.

సీఎం రేవంత్‌కు ఘన స్వాగతం

శంషాబాద్: దావోస్‌లో మూడురోజుల పర్యటన ముగించుకొని వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. విమానాశ్రయ లాంజ్‌లో ఎమ్మెల్యేలు శాలువాలతో సీఎంను సత్కరించారు.



విమానాశ్రయంలో సీఎం రేవంత్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

ప్రజాపాలనలో ఒక్క దరఖాస్తూ లేదు!

కరీంనగర్ జిల్లా బంజరుపల్లి గ్రామసభలో పరిస్థితి

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల్లో చాలామంది తమ పేర్లు లిస్టులో రాలేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. వందలసంఖ్యలో దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అయితే కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం బంజరుపల్లి గ్రామ పంచాయతీలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. నూతనంగా ఏర్పడిన ఈ గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించగా.. అధికారులు వెల్లడించిన జాబితాలో ఒక్క పేరూ లేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, మిగతా పథకాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రైతు భరోసా కింద గ్రామంలోని అందరికీ డబ్బులు వస్తున్నాయన్నారు. సాగుకు యోగ్యంగా లేని భూములు ఇక్కడ లేవని తెలిపారు. రేషన్‌కార్డుకు, ఇందిరమ్మ ఇల్లుకు కూడా దరఖాస్తులు రాలేదని వెల్లడించారు.

గణతంత్ర వేడుకలకు 138 మంది ప్రత్యేక అతిథులు

ఆహ్వానించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 26న ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల కవాతుకు తెలంగాణ నుంచి 138 మంది విశిష్ట అతిథులను కేంద్రం ఆహ్వానించింది. 16 రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ప్రత్యేక అతిథులు వారి ఆదర్శప్రాయమైన కృషి, అత్యుత్తమ విజయాలకు గుర్తింపు పొందడంతో వీరందరినీ ప్రత్యేకంగా వేడుకలకు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణలో ఉన్న వారిని తీసుకెళ్లి ఒప్పందాలా?

దావోస్‌లో ఎంఓయూలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఉన్న వ్యక్తులను, సంస్థలను దావోస్‌కు తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకోవడం ఏమిటని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'తెలంగాణకు పెట్టుబడులు రావాలి. ఇతర రాష్ట్రాల నుంచి కంపెనీలు రావాలి. ఒప్పందాలు కాగితాలకే పరిమితం కావొద్దు. క్షేత్రస్థాయిలో కనిపించాలి' అని ఆయన హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేయడంతో ఎందరో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దావోస్‌లో ఎంఓయూలు చేసుకోవడంపై ఆయన పైవిధంగా స్పందించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో భారతరత్న కర్పూరీ ఠాకూర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'బీజేపీ 2025'డైరీని ఆవిష్కరించారు. తర్వాత కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఆనాటి ఇందిరా గాంధీ పాలనకు వ్యతిరేకంగా జనతా పార్టీ ద్వారా ఒక నిశ్శబ్ద విప్లవం వచ్చిందన్నారు. అప్పటి ఉద్యమాల్లో కర్పూరీ ఠాకూర్ పాత్ర మరువలేనిదని, కులాలు, మతాలకు అతీతంగా దేశం కోసం పనిచేశారని కొనియాడారు. రాజ్యాంగం గురించి అవగాహన లేని రాహుల్ గాంధీకి దాని గురించి మాట్లాడే నైతిక హక్కులేదని మండిపడ్డారు. రాజ్యాంగం విషయంలో రాహుల్ గాంధీ సర్టిఫికెట్ తమకు అవసరం లేదన్నారు. దేశంలోని 140 కోట్ల ప్రజలు మోదీ నాయకత్వానికి సర్టిఫికెట్ ఇవ్వడంతో ఆయన మూడోసారి ప్రధానమంత్రి అయ్యారన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

ముగ్గురిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

సిటీ, కోర్టులు (హైదరాబాద్): ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ శుక్రవారం నాంపల్లి కోర్టులో జరిగింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులు ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్న నేపథ్యంలో భుజంగరావు కోర్టుకు హాజరుకాకపోవడంతో ఆయన తరపు న్యాయవాది పిటిషన్ వేశారు. ఈ కేసులో పోలీసులు తదుపరి దర్యాప్తును కొనసాగిస్తున్న నేపథ్యంలో కేసు విచారణను ఫిబ్రవరి 7కు కోర్టు వాయిదా వేసింది. దీంతో ముగ్గురు నిందితుల రిమాండ్‌ను తదుపరి విచారణ వరకు పొడిగిస్తున్నట్లు కోర్టు ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చంద్రబాబుకు సీఎం రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నారా?

గోదావరి జలాలను రాయలసీమకు తరలిస్తుంటే అడ్డుకోరా?

- రూ.80,112 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి ఏపీ సీఎం లేఖ రాశారు
- ఏడీబీ నుంచి రూ.40 వేల కోట్లు ఇస్తామని ఏపీకి కేంద్రం హామీ
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సాగునీటి విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రేవంత్ ప్రభుత్వం కేంద్రానికి కనీసం ఉత్తరం కూడా రాయడం లేదని మాజీమంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. గోదావరి, తుంగభద్ర జలాలను తరలించుకుపోతున్న ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారా అని ప్రశ్నించారు. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ సాగునీటి విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా సీఎం, మంత్రులు, అధికారులకు సలహాలు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. తెలంగాణభవన్‌లో పార్టీనేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, రామచంద్రరావు తదితరులతో కలిసి హరీశ్‌రావు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. 'పోలవరం ప్రధాన కుడికాలువ సామర్థ్యాన్ని మూడు రెట్లు పెంచి 200 టీఎంసీల నీటిని బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా పెన్నా బేసిన్ (రాయలసీమ)కు తరలించే ప్రయత్నం జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు రూ.80,112 కోట్లు కేటాయించాలని కోరుతూ చంద్రబాబు ఇప్పటికే రెండుమార్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా ఏపీకి రూ.40 వేల కోట్లు ఇప్పించేందుకు ఆర్థికశాఖలో ఫైల్ కదులుతోంది. ఇది తెలంగాణకు జీవన్మరణ సమస్య.. త్యాగాల మీద తెచ్చుకున్న తెలంగాణకు నీటి వాటాలో నష్టం జరిగితే బీఆర్ఎస్ సహించదు'అని హరీశ్‌రావు హెచ్చరించారు.

ప్రాజెక్టులను ఆపాలనే సోయి లేదా ?

'గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీల నీటిని కేటాయించినా.. సీతమ్మసాగర్ (67 టీఎంసీలు), సమ్మక్కసాగర్ (45టీఎంసీలు), అంబేడ్కర్ వార్ధా (12 టీఎంసీలు), కాళేశ్వరంలో మూడో టీఎంసీ నీటి కేటాయింపులు పెండింగులో ఉన్నా తెలంగాణ ప్రభుత్వం నిద్రపోతోంది. 13 నెలలుగా అనుమతులు సాధించడంలో విఫలమైంది. కేంద్ర జలవనరుల కమిషన్, అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం, జీఆర్‌ఎంబీ, కేఆర్‌ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం గోదావరి జలాలను తీసుకెళుతున్నా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కనీసం లేఖ రాయాలనే సోయి లేదు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సీఎం స్వయంగా వెళ్లి కేంద్ర మంత్రులను కలవాలి లేదా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి. గతంలో ఏపీ కడుతున్న రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై సుప్రీంకోర్టులో తప్పుడు వాదనలు వినిపించిన అధికారి ఇప్పుడు తెలంగాణ నీటిపారుదల శాఖ సలహాదారుడిగా ఉన్నారు. సీఎం, మంత్రులు, సలహాదారు మౌనం వెనుక మర్మమేంటో చెప్పాలి'అని హరీశ్ డిమాండ్ చేశారు.

తుంగభద్ర జలాలకూ గండి

'తుంగభద్రలో లెవెల్ కెనాల్‌కు సమాంతరంగా మరో కాలువ తవ్వుతున్న కర్ణాటక నావలీ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 31 నుంచి 50 టీఎంసీలకు పెంచుతోంది. హెచ్ఎల్‌సీ (హైలెవల్ కెనాల్) ద్వారా తుంగభద్ర నీటిని మళ్లించేందుకు ఏపీ ప్రయత్నిస్తోంది. దీంతో శ్రీశైలం ఎండిపోయి, పాలమూరు ఎత్తిపోతల, కల్వకుర్తి, డిండితోపాటు నాగార్జునసాగర్ ఆయకట్టుపై ప్రభావం చూపుతుంది. 330 టీఎంసీ గోదావరి జలాలను పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రయత్నాలను నాటి సీఎం కేసీఆర్ అడ్డుకున్నారు. గోదావరి, కృష్ణా బేసిన్‌లో తెలంగాణ హక్కుల కోసం అనేక లేఖలు రాశారు. నదీజలాల పంపిణీ కోసం కేసీఆర్ పోరాట ఫలితంగా సాధించిన సెక్షన్ 3పై ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం కనీసం కేవియట్ కూడా దాఖలు చేయలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు చిల్లర రాజకీయాలు మానుకొని ఏపీ, కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన అడ్డుకోవాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి. సాగునీటి మంత్రిగా ఉత్తమ్ ఘోరంగా విఫలమయ్యారు' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

ఉత్తమ్... మీ తప్పుడు ప్రచారాన్ని పటాపంచలు చేస్తా

ఏపీకి నదీ జలాల తరలింపుపై తెలంగాణ ప్రభుత్వం తీరును తాను ఎండగట్టిన గంటల వ్యవధిలోనే మంత్రి ఉత్తమ్ కేంద్రానికి లేఖ రాశారన్నారు. 'నేను పత్రిక సమావేశం పెట్టిన గంటల వ్యవధిలోనే మంత్రి మేల్కొని జనవరి 22 తేదీతో లెటర్‌ను రాసి ఈ రోజు విడుదల చేసినందుకు ధన్యవాదాలు. నిజంగా 22వ తేదీనే లేఖ రాసి ఉంటే దాచిపెట్టకుండా ఇప్పటికే మీడియాకు ఇచ్చి ఉండేవారు. ఏపీ సీఎం నిధుల కోసం గత ఏడాది రెండు లేఖలు రాసినా.. మీరు ఈ రోజు వరకు ఎందుకు స్పందించలేదు. 200 టీఎంసీల నీటి తరలింపునకు గోదావరి బనకచర్ల ప్రాజెక్టు రూపకల్పన జరుగుతుందనే నా వ్యాఖ్యలను వక్రీకరించారు. ట్రిబ్యునల్ సమావేశానికి 2016లో నాటి సీఎం కేసీఆర్‌తోపాటూ నేనూ హాజరయ్యా. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలోనూ మంత్రి ఉత్తమ్ నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పారు. గోదావరి, తుంగభద్ర జలాల్లో అన్యాయాన్ని నేను ప్రశ్నిస్తే మంత్రి విషయాన్ని డైవర్ట్ చేస్తున్నారు. మీ అబద్ధాలను వాస్తవాలతో మీడియా ముఖంగా పటాపంచలు చేస్తాను'అని హరీశ్‌రావు మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలపై ప్రతిస్పందించారు.

ఒక్క చుక్కా తరలించలేదు

200 టీఎంసీలు తరలించినట్టు హరీశ్ పచ్చిఅబద్ధాలు

- గోదావరి–బనకచర్లను వ్యతిరేకిస్తూ ఇప్పటికే కేంద్రానికి లేఖలు
- హరీశ్‌రావు ఆరోపణలకు కౌంటర్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: 'గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును ఏపీ నిర్మించి 200 టీఎంసీలు తరలించుకుపోతుంటే మేము మౌనంగా ఉన్నామని మాజీమంత్రి హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు, అసత్యాలను జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అసలా ప్రాజెక్టు నిర్మాణమే జరగలేదు. 200 టీఎంసీలు కాదుకదా ఒక్క చుక్కనీరు ఎవరూ తీసుకుపోలేదు' అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం రాత్రి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుకు నిధుల కోసం ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాస్తే ఆ లేఖను ఆమె కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు పంపించారని వివరించారు. ఏపీ పునర్విభజన చట్టానికి వ్యతిరేకమైన ఈ అక్రమ ప్రాజెక్టుకు నిధులు కేటాయించొద్దని కోరుతూ తాము నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్‌కు ఇప్పటికే కౌంటర్ లేఖలు రాశామని స్పష్టం చేశారు. 'ఈ అంశంపై అఖిలపక్షం పెట్టాలని అడగడానికి వారెవరు ? పిలవాలో లేదో మేము నిర్ణయం తీసుకుంటాం.. అబద్ధాలు మాట్లాడి పిలవమంటే ఎలా?'అని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పాలనలో తెలంగాణకు కోలుకోలేని నష్టం..

'బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి కేటాయింపుల్లో అన్ని విధాలుగా తీవ్రమైన నష్టం జరిగింది'అని ఉత్తమ్ అన్నారు. ఆ నష్టాలను పూడ్చడానికి ప్రయత్నిస్తుంటే ఓర్వలేకనో అధికారం పోయిందనో అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రానికి కృష్ణా జలాల్లో 811 టీఎంసీల వాటా ఉండగా, తెలంగాణ ఏర్పడ్డాక 2015 జూన్ 18, 19న, అలాగే 2016 జూన్ 21, 22న కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశాలకు హాజరై తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల ఇచ్చుకోండి అని చెప్పి వచ్చారని తప్పుబట్టారు. అదే ఏడాది సెప్టెంబర్ 21న జరిగిన తొలి అపెక్స్ కౌన్సిల్‌తోపాటు ఆ తర్వాత జరిగిన రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి నాటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు హాజరై తెలంగాణకు 299 టీఎంసీలు చాలని ఒప్పుకొని సంతకం పెట్టి వచ్చారన్నారు. కృష్ణా ట్రిబ్యునల్–1 ప్రాజెక్టుల వారీగా కాకుండా గంపగుత్తగా కేటాయింపులు జరిపిందని, దీని ఆధారంగా మనకు ఎక్కువ వాటా అడగాల్సింది పోయి తక్కువ వాటా అడిగారన్నారని విమర్శించారు. క్యాచ్‌మెంట్ ఏరియా, జనాభా, సాగుకు యోగ్యమైన భూములు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని తెలంగాణకు కృష్ణా జలాల్లో 70 శాతం, ఏపీకి 30 శాతం కేటాయింపులు జరపాలని తాము కృష్ణా ట్రిబ్యునల్–2, కేఆర్‌ఎంబీతోపాటు సుప్రీం కోర్టులో పోరాడుతున్నామన్నారు.

'రాయలసీమ'కు బీఆర్ఎస్ సహకారం

ఏపీలోని ముచ్చుమర్రి ప్రాజెక్టు సామర్థ్యం బీఆర్ఎస్ హయాంలో 3,850 నుంచి 6,738 క్యూసెక్కులకు పెరిగినా నాటి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ నిశ్శబ్దంగా ఉన్నారని ఉత్తమ్ ఆరోపించారు. నాడు ఏపీ నిర్వహించిన రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్లు సాఫీగా జరిగేలా, 2020 ఆగస్టు 5న జరగాల్సిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని నాటి కేసీఆర్ ప్రభుత్వం వాయిదా వేయాలని కోరిందని తప్పుబట్టారు. రోజుకు 3 టీఎంసీలను తరలించడానికి చేపట్టిన ఈ ప్రాజెక్టుతో మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు తీవ్ర నష్టమన్నారు. కేసీఆర్ పాలనలోనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 44,000 నుంచి 92,000 క్యూసెక్కులకు పెరిగిందని, హెచ్‌ఎన్ఎస్ఎస్, మల్యాల, ముచ్చుమర్రి నుంచి గతంలో కంటే ఎక్కువ నీటిని తీసుకెళ్లడం ప్రారంభమైందన్నారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి రోజుకు 4.1 టీఎంసీలను తరలిస్తే గత ప్రభుత్వ హయాంలో 9.69 టీఎంసీకి పెరిగిందని ఆరోపించారు.

కేసీఆర్, కేటీఆర్‌లలో ఎవరైనా రండి

దావోస్ పెట్టుబడులపై బహిరంగంగా చర్చిద్దాం

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దావోస్ వేదిక ద్వారా ఎన్ని పెట్టుబడులు వచ్చాయో, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పెట్టుబడులు వచ్చాయో బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణకు దావోస్ దమాఖా లభించింది. ఇదో చరిత్ర. వ్యాపార సంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, రాష్ట్ర ప్రభుత్వ జవాబుదారీతనం, ఏడాది కాలంలో సాధించిన పురోగతి ఇందుకు కారణమయ్యాయి. పదేళ్లలో రూ.7.5 లక్షల కోట్ల అప్పులు తెచ్చి తెలంగాణను ముంచిన కేసీఆర్ పలాయనం చిత్తగించి ఫామ్‌హౌస్‌లో సేదదీరుతున్నాడు. తానో సూపర్‌స్టార్‌నని, తనకు అన్ని భాషలు వచ్చునని గొప్పలు చెప్పుకునే కేటీఆర్ పదేళ్లలో తెలంగాణకు దావోస్ నుంచి తెచ్చిన పెట్టుబడులు రూ. 27 వేల కోట్లే. కానీ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణకు రూ.1.79 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది ఆషామాషీ కాదు. దీనిపై మీరు ఎక్కడకు, ఎప్పుడు రమ్మన్నా వచ్చి చర్చిస్తాం. కేసీఆర్, కేటీఆర్‌లలో ఎవరు వచ్చినా సరే. నాతోపాటు మా మంత్రి శ్రీధర్‌బాబు వస్తారు. బహిరంగ చర్చ చేసి ప్రజలకు వాస్తవాలేంటో చెబుదాం' అని శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి, సంక్షేమమని మరోమారు దావోస్ వేదికగా రుజువైందన్నారు.

పటాన్‌చెరు ఘటనపై త్వరలో నిర్ణయం

కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త నేతల మధ్య కొంత ఇబ్బంది ఉందని, పటాన్‌చెరు ఘటనపై కమిటీ వేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం 3,4 రోజుల్లో ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. పటాన్‌చెరు, ఖైరతాబాద్ ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, నాగేందర్ చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తున్నామని, తమకూ మూడో కన్ను ఉందని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు.

కష్టసుఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు సమంగా తలచి యుద్ధం చేయుము. అట్లు చేయుట వలన పాపకర్మములు అంటవు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 25 జనవరి 2025

ట్రంప్ 'వాణిజ్య యుద్ధభేరి'

అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసింది మొదలుకొని నాలుగు రోజులుగా డోనాల్డ్ ట్రంప్ వరసపెట్టి జారీచేస్తున్న ఉత్తర్వులు జనాన్ని హడలెత్తిస్తున్నాయి. తాజాగా దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికనుద్దేశించి గురువారం ఆయన చేసిన ప్రసంగం కూడా ఆ కోవలోనిదే. అది ఒకరకంగా 'వాణిజ్య యుద్ధభేరి'. తమ దేశంలో పెట్టుబడులు పెడితే ప్రపంచ దేశాలన్నిటికన్నా తక్కువ పన్నులు విధిస్తామనీ, కాదంటే ట్యారిఫ్‌ల మోత మోగిస్తామనీ ఆయన హెచ్చరించారు. భారత్, చైనాలపై ఆయనకు మొదటినుంచీ ఆగ్రహం ఉంది. ఈ రెండు దేశాలూ వర్ధమాన దేశాల ముసుగులో అనేక వెసులుబాట్లు పొందుతూ అమెరికాకు నష్టం కలిగిస్తున్నాయని గతంలో ఆయన విరుచుకుపడ్డారు. అనంతర కాలంలో దక్షిణాఫ్రికా, ఇండొనేసియాలను కూడా ఈ జాబితాలో చేర్చారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వల్ల అమెరికా బాగా నష్టపోతున్నదని చీటికీ మాటికీ ఆరోపించేవారు. నిజానికి డబ్ల్యూటీవో అమెరికా మానసపుత్రిక. వాణిజ్య ప్రపంచంలో హద్దులుండరాదని, కనీసం వాటిని తగ్గించాలని, హేతుబద్ధమైన ట్యారిఫ్‌లు అమలయ్యేలా చూడాలని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. వర్ధమాన దేశాలకు సాధారణ ప్రాధాన్యతల వ్యవస్థ (జీఎస్‌పీ) కింద దిగుమతి చేసుకునే కొన్ని సరుకులపై సుంకాలు తగ్గుతాయి. ఇతర దేశాల ఉత్పత్తులను సైతం సమానంగా చూసే దేశాన్ని అత్యంత అనుకూల దేశం (ఎంఎఫ్ఎన్)గా పరిగణించే సూత్రం డబ్ల్యూటీవో పాటిస్తోంది. ఇవన్నీ ట్రంప్‌కు కంటగింపుగా ఉన్నాయి. సంస్థ నిబంధనల్లో ఉన్న లొసుగులు అమెరికాను దెబ్బతీస్తూ వేరే దేశాలకు తోడ్పడుతున్నాయని ఆరోపించటం అందుకే!

ఇంతకూ ట్రంప్ నిజంగానే అన్నంత పనీ చేస్తారా? అలాచేస్తే అమెరికా వాణిజ్యం ఏమవుతుంది? ట్రంప్ హెచ్చరించి 24 గంటలు కాకుండానే పొరుగునున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గట్టి జవాబే ఇచ్చారు. కెనడా, మెక్సికోల ఉత్పత్తులపై 25 శాతం ట్యారిఫ్ విధించే ఆలోచన చేస్తున్నామని, బహుశా ఫిబ్రవరి 1 నుంచి అది అమలుకావచ్చని ప్రకటించటాన్ని ప్రస్తావిస్తూ అదే జరిగితే తమ నుంచి కూడా ప్రతీకారం ఉంటుందని, అమెరికా వినియోగదారులు భారీయెత్తున నష్టపోవాల్సి వస్తుందని ట్రూడో హెచ్చరించారు. కెనడా నుంచి అమెరికా 34 అత్యవసర ఖనిజాలు, లోహాలు దిగుమతి చేసుకుంటున్నది. అలాగే అమెరికా నుంచి భారీ యంత్రాలూ, సహజవాయువు, విద్యుత్, ముడి చమురు, పండ్లు, కూరగాయలు, మాంస ఉత్పత్తులు కొనుగోలు చేస్తోంది. నిత్యం 270 కోట్ల డాలర్ల విలువైన సరుకులు, సేవలు అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ వెళ్తుంటాయి. భిన్న వాతావరణ పరిస్థితులున్నప్పుడు కావలసిన సమస్తాన్నీ ఏ దేశమూ సొంతంగా ఉత్పత్తి చేసుకోవటం సాధ్యం కాదు. ఈ సంగతి ట్రంప్‌కు తెలియదనుకోలేం. క్రితంసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా ఉత్పత్తి చేస్తున్న ఖరీదైన హార్లీ–డేవిడ్‌సన్ బైక్‌లపై సుంకాలు తగ్గించాలని మన దేశంపై ఒత్తిళ్లు తెచ్చారు. తీరా తగ్గించాక చాలదని పేచీ పెట్టారు. ప్రతీకారంగా మన ఉక్కుపై 25 శాతం, అల్యూమినియం ఉత్పత్తులపై 10 శాతం అదనపు టారిఫ్‌లు విధించారు. దీనికి ప్రతిగా మన దేశం కూడా అమెరికా నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై సుంకాలు పెంచింది. ట్రంప్ అక్కడితో ఆగలేదు. జీఎస్‌పీ నిబంధనలు భారత్‌కు వర్తింపజేయొద్దని డబ్ల్యూటీవోకు లేఖ రాశారు.

మనం భాగస్వామిగా ఉన్న బ్రిక్స్ దేశాలపై మరింతగా ట్యారిఫ్ వడ్డింపులు ఉంటాయని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. బ్రిక్స్‌లో ఉన్న రష్యా, చైనాలు దానివల్ల దండిగా లాభపడతాయని, శక్తిమంతంగా రూపుదిద్దుకుంటాయని ఆయన ఆందోళన. ఉన్నంతలో మనను ఆ సంస్థకు దూరం చేయాలన్నది ట్రంప్ లక్ష్యంగా కనబడుతోంది. అయితే తెగేదాకా లాగే ధైర్యం ట్రంప్‌కు ఉందా అన్నది సందేహమే. ఎందుకంటే 2019లో చైనా ఎగుమతులపై 30 వేల కోట్ల డాలర్ల సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించిన వెంటనే అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల్ని కొనడం ఆపేయాలని తమ పబ్లిక్‌రంగ సంస్థలకు చైనా సూచించింది. ఆ వెంటనే అమెరికా స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పతనమయ్యాయి. మళ్లీ ట్రంప్ రంగంలోకి దిగి చైనాపై సుంకాల పెంపు ఇప్పట్లో ఉండబోదని ప్రకటించాకగానీ పరిస్థితి కుదుటపడలేదు.

తన ప్రకటనల పర్యవసానం ఎలావుంటుందో ట్రంప్ ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. 1930లో అమెరికా తీసుకొచ్చిన టారిఫ్ చట్టానికి ప్రతీకారంగా ఎవరికి వారు వాణిజ్య ఆంక్షలు అమలు చేయటం పెను సంక్షోభానికి దారితీసిన సంగతి ట్రంప్ గుర్తుంచుకోవాలి. ఈ పరస్పర హననం వల్ల ఎన్నో దేశాల జీడీపీలు భారీయెత్తున పడిపోవటం పర్యవసానంగానే అప్పట్లో అన్ని చోట్లా అశాంతి, అపనమ్మకం ప్రబలాయి. దీన్ని హిట్లర్ వంటి నియంతలు చక్కగా వినియోగించుకున్నారు. జాతి విద్వేషాలు, జాతీయ దురభిమానాలను రెచ్చగొట్టారు. సహజ వనరుల వినియోగం పెరగటం, సాంకేతికతల అభివృద్ధి జరగటం తదితర కారణాల వల్ల కొంత హెచ్చుతగ్గులతో చాలా దేశాలు అభివృద్ధి చెందాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యూటీవో వంటి సంస్థల వెనకుండి ప్రపంచ వాణిజ్యాన్ని శాసించినవారే, లాభపడ్డవారే ఇప్పుడు 'అమెరికా ఫస్ట్' అంటూ స్వరం మారిస్తే ఇతర దేశాలు సాగిలపడాలా? 'అమెరికా మితిమీరినా డబ్ల్యూటీవో ద్వారా వివాద పరిష్కారానికి గల అవకాశాలను వినియోగించుకోండి. తీవ్ర చర్యలొద్దు' అని ఇతరేతర దేశాలకు డబ్ల్యూటీవో సంస్థ డైరెక్టర్ జనరల్ గోజీ ఒకాంజో ఇవేలా హితవు చెబుతున్నారు. మంచిదే! మరి ట్రంప్‌కు చెప్పగలవారెవరు? ఆయనను నియంత్రించగలిగేదెవరు?

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.ఏకాదశి సా.6.32 వరకు తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ఉ.11.35 నుండి 1.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.42 నుండి 8.11 వరకు, **అమృతఘడియలు:** రా.9.44 నుండి 11.25 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

మాయాబజార్‌లో మన స్వతంత్రం

సందర్భం



మాడభూషి శ్రీధర్

స్వాతంత్ర్యానికి పూర్వం మొత్తం భారత దేశంలో కేవలం రెండు, రెండున్నర శాతం ప్రజలకు మాత్రమే ఓటు హక్కు ఉందంటే బానిస పాలన లక్షణం తేలిపోతుంది. కొందరు జమీందారులు, సంస్థానాధీశులు, భూస్వాములు, విపరీత సంపన్నులకు మాత్రమే ఓటు హక్కు ఉండేది. ఇది అర్థం చేసుకుంటే మన స్వాతంత్ర్యం గొప్పతనం అర్థమవుతుంది. వయోజనుడైన ప్రతి వ్యక్తికీ ఓటు హక్కు ఇచ్చారు. ఇది సామాన్యమైన హక్కు కాదు. ప్రాణాలకు ప్రాణమైన హక్కు. మనకు స్వరాజ్యం ఉంది కానీ సురాజ్యం లేదనే విమర్శలు ఉన్నాయి. అందరికీ సమానంగా ఓటు హక్కు మాత్రం ఉంది. బలహీనులకు ఓటు ఇవ్వకూడదు అన్నా, మహిళలకు ఇవ్వలేమన్నా, చదువుకున్నవారికే ఇస్తామన్నా సమానత ఉండదు.

నిశ్శబ్ద విప్లవం

1950 నాటికి ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకున్న అనేకానేక దేశాల్లో సమాన ఓటు హక్కు లేదు. మన దేశంలో ఓటింగ్ హక్కుపైన ఒకటే పరిమితి ఉండేది. అదే 21 సంవత్సరాల వయసు. ఆ తరువాత 18 ఏళ్లంటే చాలు కచ్చితంగా ఓటు హక్కు ఇవ్వాల్సిందే! ఓటు అమ్ముకుంటున్నారో కొంటున్నారో, ఓటు వేస్తున్నారో లేదో అవసరం లేదు. కానీ హక్కు మాత్రం ఉంది. మనం వాడుకుంటున్నందువల్లనే ఇవ్వాళ రక్తపాతం లేకుండానే అధికారం మారిపోతూ ఉన్నది. ఇది నిశ్శబ్ద విప్లవం. ఓ అర్ధరాత్రి ఫలితాలు తెలిసినపుడు అధికారం మార్పిడి జరుగుతున్నది. ఎంత గొప్ప విషయం!

మనదేశంలో ఎందరికి ఓటు హక్కు ఉందో తెలుసా? 99.1 కోట్ల మందికి ఓటు అనే అధికారం ఉంది. వీరిలో 18 నుంచి 29 వయసున్న 21.7 కోట్ల యువశక్తి కాస్త మెదడు వాడుకుంటే చాలు ప్రభుత్వం మారిపోతుంది. అదీ ఈ ఓటు మాయ. 'ఓటింగ్ వంటిది మరోటి లేదు. కచ్చితంగా నేను ఓటేస్తాను' అనే నినాదంతో ఈ జనవరి 25న ఎన్నికల కమిషన్ 75వ వార్షిక ఉత్సవం జరుగుతున్నది. 2011 నుంచి ఇదే తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

రాజ్యాంగం ఏర్పడిన తరువాత 1952లో తొలి ఎన్నికల సంగ్రామం జరిగింది. అదొక గొప్ప పండుగ అని పెద్దలు అనేవారు. కొన్ని దశాబ్దాల కింద మనిషి పోలింగ్ బూత్‌కు రాకపోతే ఆ వ్యక్తి చనిపోయినాడనుకునేది. ఇంత కష్టపడి ఓటేయడం ఎందుకు అని ఎవరైనా అంటే, ఓటు వేయడం నేను బతికి ఉన్నాను అనడానికి నిదర్శనం అనేవారు. అధికారులు, ఉద్యోగులు, నాలుగోస్థాయి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇది చాలా కష్టమైన పని. వాళ్లంతా కొన్ని నెలలపాటు కష్టపడితే, ఆడుతూ పాడుతూ ఓటు వేసుకోవచ్చు.

పారదర్శకత ఎంత?

ఇదివరకు ఒక్కరే కమిషనర్‌గా టి.ఎన్.శేషన్ ఎన్నికలు అద్భుతంగా నిర్వహించారు. ఆ తరువాత ముగ్గురు కమిషనర్లు వచ్చారు. ప్రధాన మంత్రి నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ సిఫారసు మేరకు రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్‌ను నియమిస్తారు. వారిలో సీనియర్ కమిషనర్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా నియమిస్తారు. ఈ అధికారం భారత రాజ్యాంగం ఆర్టికల్



324 నుండి సంక్రమించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ప్రత్యేక అధికారాలు లేవు. ఆ ముగ్గురిలో మెజారిటీ అభిప్రాయం ద్వారా నిర్ణయం సాగుతుంది. ఈ మధ్య 2023లో సవరణ చట్టం చేశారు. ఎంపిక కమిటీలో ప్రధానితో పాటు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, ఎంపికైన మరొక మంత్రి ఉంటారు. అభిశంసన ప్రక్రియ ద్వారా సీఈసీని పదవి నుండి తొలగించవచ్చు. కానీ ఆ పరిస్థితి ఎప్పుడూ రాలేదు.

ముగ్గురిలో ఇద్దరి మెజారిటీ ఉంటే కొన్ని నిర్ణయాలు తీసుకోవచ్చు. కానీ ఒకరి నిరసన ఉంటే అది తీవ్రమైన అంశంగా పరిగణించాలి. ప్రధాని నాయకత్వంలో రాష్ట్రపతి నియమించినప్పటికీ ముగ్గురూ నీతిగా ఉంటూ, ప్రభుత్వ ఒత్తిళ్లను ప్రతిఘటించడం అవసరం. ముగ్గురూ ప్రభుత్వానికి పక్షపాతంగా ఉంటే స్వేచ్ఛగా ఎన్నికలు జరగవు. ఆ మధ్య అరుణ్ గోయల్‌తో మిగిలిన ఇద్దరికి అభిప్రాయ భేదం రావడం వల్ల రాజీనామా చేశారు. 2027 డిసెంబర్ దాకా కమిషనర్‌గా ఆయనకు గడువు ఉన్నప్పటికీ, 2024 మార్చ్ 9న రాజీనామా చేయడం వల్ల అనుమానాలు వచ్చాయి కూడా!

ప్రవర్తనా నియమావళిలో ఏ మాత్రం గందరగోళం ఉన్నా అనుమానాలు పెరుగుతాయి. సార్వత్రిక ఎన్నికలలో, ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికలలో తీవ్రమైన అనుమానాలు వచ్చాయి. ఇప్పటికీ అనేక వివాదాలు వస్తున్నాయి. అలాగే మతాన్ని ఎన్నికలలో విరివిగా దుర్వినియోగం చేస్తుంటే, ఎన్నికలు స్వేచ్ఛగా జరిగినట్లు కాదు. విపరీతమైన డబ్బు వెదజల్లడం, ఓటర్లను బెదిరించడం, కండబలం వాడటం, ఫేక్ న్యూస్‌ను వ్యాపింపజేయడం వల్ల ఎన్నికలు పారదర్శకంగా సాగవు. ప్రభుత్వాలే అక్రమాలకు పాల్పడితే ప్రజాస్వామ్యం మీద నమ్మకం తగ్గిపోతుంది.

చీకటి నిధులు

ఓటర్లకు అభ్యర్థులను గురించి తెలుసుకునే హక్కు ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన తరువాత ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థీ తన నేరాల చిట్టాలు, స్థిరచరాస్తులు పట్టాల వివరాలతో ఇచ్చిన ప్రమాణ పత్రాలు అట్లా పడి ఉన్నాయి. ఓటర్లకూ పట్టదు, రాజకీయ పార్టీలకూ పట్టదు. 43 శాతం ప్రజాప్రతినిధుల మీద ఉన్న తీవ్రనేరాలను త్వరగా విచారణ జరపకపోతే దేశ రాజ్యాంగ సంవిధాన సుపరిపాలనా వ్యవస్థ కుప్పకూలిపోతుంది.

నిజానికి ఈసారి ఎన్నికల బాండ్లు చాలా అనుమానాలకు దారితీశాయి. కోట్లకు కోట్ల రూపాయలను బాండ్ల ద్వారా 'సంపాదించారు'. వీటిని మనం విరాళాలు అంటున్నాం. ఎలక్టోరల్ బాండ్స్ ప్రవేశపెట్టడానికి ఆనాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017 జనవరి 28న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అభిప్రాయం కోరుతూ లేఖ రాశారు. జనవరి 30న రాసిన జవాబులో ఈ పద్ధతి అక్రమాలకు దారితీసే అవకాశం ఉందనీ, పారదర్శకంగా ఉండవలసిన ఎన్నికల విరాళాలను గోప్యంగా మారుస్తుందనీ, దీనివల్ల బలవంతపు విరాళాలు వసూలు చేసే అవకాశం ఉందనీ రిజర్వ్ బ్యాంక్ అభిప్రాయపడింది. అయినా పార్లమెంటులో ఎటువంటి చర్చా జరగకుండానే, ఎలక్టోరల్ బాండ్స్ దేశంలోకి దొడ్డిదారిన ప్రవేశించాయి. అందుకు తగినట్టుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాన్ని కూడా సవరించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయిపోయి 2018 జనవరి 2న ఎలక్టోరల్ బాండ్ పథకం మొదలైంది.

ఎలక్టోరల్ బాండ్లను వ్యతిరేకించిన ఎన్నికల సంఘం 2019 మార్చ్ 25న అఫిడవిట్ దాఖలు చేసింది. విరాళాలకు సంబంధించిన వివరాలను పంచుకోవడం నుండి రాజకీయ పార్టీలను మినహాయించడం విదేశీ నిధుల సమాచారాన్ని చీకటిలో ఉంచుతుందని చెప్పింది. 'భారతదేశంలోని రాజకీయ పార్టీల విదేశీ నిధులను తనిఖీ చేయలేము, ఇది భారతీయ విధానాలను విదేశీ కంపెనీలు ప్రభావితం చేయడానికి కారణం అవుతుంది' అని పేర్కొంది. అయితే, 2019 ఏప్రిల్ 12 నుండి ఇప్పటివరకు కొనుగోలు చేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఎస్బీఐని సుప్రీం కోర్టు ఆదేశించింది. మొత్తం మీద గడచిన ఐదేళ్లలో దాదాపు 1,300 కార్పొరేట్ సంస్థలు దాదాపు 20 రాజకీయ పార్టీలకు రు 12,156 కోట్ల విరాళాలు అందజేశాయి. అందులో అత్యధిక భాగం రు. 6,060 కోట్లు బీజేపీకే దక్కాయి. చివరికి 2024 ఫిబ్రవరి 15న కేంద్రం కళాత్మకంగా నిర్మించిన ఎలక్టోరల్ బాండ్స్ పథకాన్ని కోర్టు ఏకగ్రీవంగా కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ)లో పొందుపరిచిన ఓటర్ల సమాచార హక్కును ఈ పథకం ఉల్లంఘించిందని బెంచ్ పేర్కొంది. ఎన్నికలు మాయాబజార్‌గా నిర్వహిస్తే రాజ్యాంగం ఉన్నట్టా, లేనట్టా?

◆ 75 ఏళ్ల కిందట, గణతంత్రానికి ఒక్కరోజు ముందు, అంటే 1950 జనవరి 25న మన భారత ఎన్నికల కమిషన్ ఏర్పడింది. ఎన్నికలు లేకపోతే ప్రజాస్వామ్యం లేదు, భారత రాజ్యాంగం లేదు. ఇంతెందుకు మన స్వాతంత్ర్యానికి కూడా అర్థం పర్థం ఉండదు.

◆ ఇంగ్లీషు, హిందీ, తెలుగు వంటి అన్ని భాషల్లో అందరికీ బాగా తెలిసిన మాట... ఓటు!

◆ ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి నియమించినప్పటికీ ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ప్రభుత్వ ఒత్తిళ్లు ప్రతిఘటించడం అవసరం. ప్రభుత్వానికి పక్షపాతంగా ఉంటే స్వేచ్ఛగా ఎన్నికలు జరగవు.

వ్యాసకర్త కేంద్ర మాజీ సమాచార కమిషనర్

సోషల్ మీడియా

ఎందుకు వెళ్లినట్టు?



భారత విదేశాంగ కార్యదర్శి చైనా పర్యటన గురించి మీడియా కథనాల్లో ప్రస్తావించనిది ఏమంటే, ఆయన వెళ్లిన అసాధారణ సమయం గురించి! భారత గణతంత్ర దినోత్సవం రోజున ఆయన బీజింగ్‌లో చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య కుదిరిన 'ఒప్పందం' గురించి ఎంత ఊదరగొట్టినప్పటికీ, ఇండియా గస్తీ హక్కుల పూర్తి పునరుద్ధరణ జరగలేదు. సైనిక ప్రతిష్టంభన ఇంకా ముగియలేదు.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

తారుమారైందా?



నాజీ సెల్యూట్‌ను యూదులు సమర్థిస్తూ, యూదు వ్యతిరేకులు అనబడే వాళ్లు దాన్ని వ్యతిరేకించడం విచిత్రం! ఇలాంటి ఒక రోజు వస్తుందని ఎవరనుకున్నారు?

– రాణా అయూబ్, జర్నలిస్ట్

ఆగితే ఓడినట్టు కాదు!



వర్షం పడినప్పుడు తమ రెక్కలను కాపాడుకోవడానికి సీతాకోకచిలుకలు విశ్రమిస్తాయి. జీవితంలో విపత్తు వచ్చినప్పుడు కొంచెం ఆగడంలో తప్పు లేదని ఇది గుర్తుచేస్తుంది. అది దాటిపోతే మళ్లీ ఎగురుతావు. అది గుర్తుంచుకోవాల్సిన పాఠం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఏం సాధించినట్టు?



పాకిస్తాన్ హోంమంత్రి యూఎస్ కాంగ్రెస్ సభ్యుడిని కలిశారు. వెంటనే ఆ కాంగ్రెస్ సభ్యుడు 'ఇమ్రాన్ ఖాన్‌కు స్వేచ్ఛ కల్పించాలి' అని ట్వీట్ చేశారు. ఇది పాక్ హోమ్‌మంత్రి, ఆయన బాసుల దారుణ వైఫల్యం.

– మైకేల్ కుగెల్‌మాన్, విధానాంశాల వ్యాఖ్యాత

మారిన కాలం



క్రిప్టో కరెన్సీని అభివృద్ధి చేయడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తొలి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. బిలియనీర్ వెంచర్ క్యాపిటలిస్ట్, రాజకీయ విరాళాలు దండిగా ఇచ్చే డేవిడ్ సాక్స్ అమెరికా అధ్యక్షుడికి ఏఐ, క్రిప్టో సలహాదారుగా ఉన్నారు. బిలియనీర్లు విధాన నిర్ణేతలుగా ఉన్న కొత్త యుగం ఇది.

– ఎం.కె. వేణు, సంపాదకుడు

గుడ్డెద్దు చందమేనా?



బోరెల్ అవిచ్ఛిన్న మర్కట సిద్ధాంతం: టైప్‌రైటర్ మీద ఏదో ఒక 'కీ'ని నొక్కే కోతి ఎప్పటికో ఒకసారి షేక్స్‌పియర్ సమగ్ర సాహిత్యాన్ని టైప్ చేస్తుంది. దీన్నిబట్టి చూస్తే, మనం నివసిస్తున్న ఈ ప్రపంచం మొత్తం కూడా ఏ లోతైన భావమూ లేని ఏవో కొన్ని గుడ్డి చర్యల ఫలితం.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఎందుకీ ఆదరణ?



అడాల్ఫ్ హిట్లర్ ఆత్మకథ 'మై కాంఫ్'ను బెస్ట్ సెల్లర్‌గా ఇండియాలోని బుక్‌స్టోర్ చెయిన్స్ ప్రముఖంగా ప్రదర్శిస్తుంటాయి. దీన్ని నేను రెండు దశాబ్దాలుగా గమనిస్తున్నాను. నిజంగా దీన్ని ఎవరు చదువుతున్నారో తెలుసుకోవాలని ఉంది.

– అనుభవ్ సింగ్, మార్క్సిస్ట్

ఇన్ బాక్స్

ఓటు దీటైన ఆయుధం

'బుల్లెట్ కంటే బ్యాలెట్ శక్తిమంతమైనది' అంటారు అబ్రహాం లింకన్. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. దేశ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే సాధనం. ప్రజల భవిష్యత్తును నిర్ణయించే ఆయుధం. ఉన్నతమైన పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం (ఆర్టికల్ 326) మనకు కల్పించినదీ ఓటు హక్కు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు విలువ తెలియజేసి, వారి హక్కును సద్వినియోగ పరచుకోవడానికి అవగాహన కల్పించేందుకు 2011 నుంచి ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం.

ఎంతో పవిత్రమైన ఓటు కొన్ని దశాబ్దాలుగా అమ్మకపు సరుకుగా మారిపోవడం శోచనీయం. ఈ ధోరణి మారాలి. ఓటు వేశామంటే అధికారికంగా చట్టబద్ధమైన మన పనులు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికైన వారికి ఉందని మనం గ్రహించాలి. ఎవరి ఓటు వారి వాయిస్ కావాలి. ఎలక్షన్ కమిషన్ తీసుకొచ్చిన 'సీ విజిల్' యాప్ ద్వారా ఎన్నికల్లో జరుగుతున్న అవకతవకలను పౌరులు ఎవరైనా సరే ఫోటోగానీ, వీడియోగానీ తీసి ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయి. ఓటు వేయడం మనందరి బాధ్యత. ఎన్నికల సంఘం 85 ఏళ్ళ కన్నా ఎక్కువ వయసున్న వారికి, వికలాంగులకు ఇంటి నుండే ఓటు వేసే అవకాశం కల్పించింది. దీనికోసం ఫారమ్ 12డిని పూర్తి చేసి, ఎన్నికల సంఘానికి సమర్పించాలి. పోలింగ్ ఆఫీసర్, పోలీస్, ఫోటోగ్రాఫర్, ఇద్దరు అధికారుల టీమ్ ఇంటికి వచ్చి ఓటు వేయించి డాక్యుమెంటేషన్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

మన దేశం గణతంత్ర దేశంగా మారడానికి ఒక్కరోజు ముందు అంటే 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పాటయ్యింది. పార్లమెంటు, అసెంబ్లీ, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలను కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుంది. మున్సిపాలిటీ, జిల్లా పరిషత్, గ్రామ పంచాయితీ వంటి స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుంది. ఈ కనీస అవగాహనతో ఓటరు తన ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

– యస్.ఆర్.వి. సుబ్బారెడ్డి, చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గిద్దలూరు
(నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం)

పురోగామి పాలన అంటే ఇదేనా?

అభిప్రాయం



జూలకంటి రంగారెడ్డి

గత దశాబ్ద కాలంగా కేంద్ర పాలకులు దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలను ధ్వంసం చేసేలా వ్యవహరిస్తున్నారు. అవినీతి, నిరుద్యోగాలు లేకుండా చేస్తామని డాంబికాలు పలికిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగం, కార్మికవర్గ హక్కులపై లాఠీలను, తూటాలను ఉపయోగిస్తోంది. సంస్కరణల పేరుతో ప్రజా వ్యతిరేక చట్టాలను చేసింది. పెట్టుబడిదారులకు మేలు చేసే చర్యలు కొనసాగిస్తున్నది. దీంతో ప్రజల జీవనం దుర్భరంగా తయారైంది.

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెలుచుకుంటామని బీరాలు పలికిన బీజేపీ, అధికారం చేపట్టడానికి అవసరమైన 272 సీట్లు సాధించలేక పోయింది. 240 సీట్ల దగ్గరే చతికిల బడింది. మిత్రపక్షాల సహకారంతో నెట్టుకొస్తోంది. కమ్యూనిస్టులపై విషం కక్కుతూ వారిని బలహీనపరచాలని ప్రయత్నిస్తోంది. మణిపూర్‌లో ప్రజల మధ్య చిచ్చుపెట్టింది. ప్రజలను జాతి, మత, కుల ప్రాతిపదికన చీల్చి మారణహోమాన్ని సృష్టిస్తున్నది. పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలతో ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుంది. జమిలి ఎన్నికల విధానాన్ని ప్రవేశపెట్టి ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నది. బీజేపీ పాలకులు ప్రశ్నించే గొంతులను వేధించడంతో పాటు జైల్లో పెట్టడం పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మల్టీ నేషనల్ కంపెనీలకు, బడా పెట్టుబడిదారులకు అడ్డగోలుగా విక్రయించడం–అప్పగించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజా వ్యతిరేక, తిరోగమన ఆర్థిక విధానాలు అనుసరిస్తున్న నియంతృత్వ, కార్పొరేట్ అనుకూల పాలకులకు బుద్ధి చెప్పిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల శ్రీలంక, ఫ్రాన్స్, వెనిజులా, బ్రెజిల్, కెన్యా, నేపాల్ దేశాలలో వామపక్ష,




అభ్యుదయ శక్తులు నిరంకుశ పాలకులను గద్దె దించడం తెలిసిందే.

బీజేపీ గత పదేళ్ల పాలనలో శాస్త్ర సాంకేతిక రంగాలలో కొత్తగా ఏ విధమైన ఆవిష్కరణలూ లేవు. 2014లో మోదీ ప్రధాని కావడానికి ముందు డాలర్ రేట్ రూపాయి మారకం విలువ సుమారు 59 రూపాయలుగా ఉంది. ఇవాళ డాలర్‌తో రూపాయి మరీ బక్క చిక్కి దాదాపు 86 రూపాయలకు పైగా పడిపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా సంక్షోభంలోకి కూరుకుపోయే ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. యువతకు ఉద్యోగ–ఉపాధి అవకాశాలు క్షీణిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. దీనికి తోడు వారానికి 70, 80 గంటలు పని చేయాలని కొందరు కార్పొరేట్ పెద్దలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పుకుంటున్నప్పటికీ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనామీ (సి.ఎం.ఐ.ఇ), నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్.ఎస్.ఎస్.ఒ.) నివేదిక ప్రకారం గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగింది. నల్లధనాన్ని రాబట్టి ప్రజల ఖాతాలో వేస్తామని ఎన్నికల్లో చేసిన వాగ్దానం నీటి మూట అయింది. జీఎస్టీ పేరుతో అన్ని వస్తువుల మీద విపరీతంగా పన్నుల భారం మోపారు. తద్వారా సమకూరిన ఆదాయాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేయడంలో కేంద్రం తన ఇష్టానుసారం వ్యవహరిస్తున్నది. అవినీతిని అరికడతామని పదేపదే ప్రకటనలు చేసిన కూటమి ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్లు, రఫేల్ డీల్ వంటివాటికి సంబంధించి పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయింది. దేశ ప్రజల భవిష్యత్తుకు, సామరస్యానికి ప్రమాదకరమైన ఫాసిస్టు విధానాలు అమలు చేసేందుకు జరుగుతున్న కుట్రలు, కుయుక్తులను ఎండగట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంతిమంగా ఈ దేశ ప్రజల ఆకాంక్షలకు వామపక్ష పార్టీలే ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి.

వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు (నేటి నుంచి 28 వరకు సంగారెడ్డిలో సీపీఎం తెలంగాణ 4వ రాష్ట్ర మహాసభలు)

దేవుడు ఇచ్చే అవకాశం

ఎంతటి అయోగ్యుడు అయినప్పటికీ... సరిదిద్దుకోవడానికీ, తానెందుకు అలా ఉన్నానని ఆలోచించడానికీ భగవంతుడు ప్రతి ఒక్కరికీ ఒక అవకాశం ఇస్తాడు. హిరణ్యకశిపునికి అటువంటి అవకాశం నరసింహుడి ఒడిలో పడుకున్నప్పుడు లభించింది. కానీ ఆ అవకాశాన్ని హిరణ్యకశిపుడు వినియోగించుకోలేదు. రావణుడికి అటువంటి అవకాశం 'ఈరోజు పోయి రేపు రా' అనే మాటతో లభించింది. కానీ రావణుడు కూడా ఆ అవకాశాన్ని వదులుకున్నాడు.



జ్యోతిర్మయం

దుర్యోధనుడికి కృష్ణ పరమాత్ముడు రాయబార వేళ కల్పించాడు. కానీ దుర్యోధనుడూ ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. కృష్ణుడు తన విశ్వరూపంతో తానెవరో తెలియజేసినప్పటికీ దుర్యోధనుడు పట్టించుకోలేదు. అంతే కాదు, ఓ క్షణం ఆలోచించే అవకాశమూ ఇచ్చాడు కృష్ణుడు. అటువంటి అవకాశాన్ని 'మూమెంట్ ఆఫ్ ట్రూత్' అని ఆంగ్లంలో అంటారు.

ప్రతి మనిషికీ తన జీవితకాలంలో ఒకసారి ఈ 'మూమెంట్ ఆఫ్ ట్రూత్' ఎదురవుతుంది. ఆ క్షణంలో తీసుకునే నిర్ణయమే వారి జీవితాలను మారుస్తుంది. అర్జునుడు కురుక్షేత్ర యుద్ధ రంగాన అయోమయంలో పడ్డాడు. అప్పుడు కృష్ణపరమాత్మ గీతను ఉపదేశించి... 'యుద్ధం చేస్తావా లేక ఆయుధాన్ని కింద పడేస్తావా' అని అడిగాడు. ఆలోచించమన్నాడు. అయితే అర్జునుడు తనకు లభించిన అవకాశాన్ని వదులుకోకుండా అందిపుచ్చుకున్నాడు. అలాగే కర్ణుని ఎదుట నిలిచి అతనికీ ఒక అవకాశం ఇచ్చాడు పరమాత్మ. కానీ కర్ణుడు దానిని మూర్ఖంగా నిరాకరించాడు. భాగవతం, పురాణాలలో అవకాశాలు జారవిడుచుకున్న వారి సంగతులు, అందువల్ల వారు నష్టపోయిన తీరు కనిపిస్తుంటాయి. భగవంతుడు ఎవరినీ వెంటనే దండించడు. తమను సరిదిద్దుకోవడానికి తగిన అవకాశం ఇస్తాడు, పరీక్షిస్తాడు. కానీ ఆ అవకాశాన్ని చాలామంది దుర్వినియోగం చేసుకుంటారు, క్షీణిస్తారు.

– యామిజాల జగదీశ్


VISHAL MEGA MART
నమ్మశక్యం కాని
గణతంత్ర దినోత్సవ
ఆఫర్లు
25వ నుండి 26వ జనవరి 2025
ఆహారం & గ్రోసెరీ
బాదం 1kg ₹779
జీడిపప్పు 500g ₹439
రైస్ బ్రాన్ ఆయిల్ ₹134/ℓ
సన్‌ఫ్లవర్ ఆయిల్ ₹137/ℓ
దేశీ నెయ్యి ₹521/ℓ
ఆవు నెయ్యి ₹535/ℓ
ఫస్ట్ క్రాప్ రోజానా బాస్మతి బియ్యం 5kg MRP ₹675 ₹369
ఇండియా గేట్ రోజానా బాస్మతి బియ్యం 5kg MRP ₹575+ ₹419
దావత్ రోజానా బాస్మతి బియ్యం 5kg MRP ₹575+ ₹399
ప్యూర్ బర్స్ట్ హెల్త్ డ్రింక్ 500g MRP ₹249 ₹99
హార్లిక్స్/ బూస్ట్ హెల్త్ డ్రింక్ 750g/ 1kg MRP ₹449+ ₹145 / ₹171 తగ్గింపు
ఫుల్ బ్లూమ్ టీ 1kg MRP ₹460+ 7kg చక్కెర ఉచిత
టాటా టీ ప్రీమియం/ గోల్డ్ టీ 1kg MRP ₹510+ ₹200 తగ్గింపు
ఫస్ట్ క్రాప్ నమ్కీన్ 900g/ 1kg MRP ₹380+ ₹159
బికానో నమ్కీన్ 1kg, MRP ₹290+ ₹101 తగ్గింపు
ఫస్ట్ క్రాప్ బిస్కట్స్ & కుకీస్ 200g+ MRP ₹40+
ఏదైనా 1 కొనండి ఏదైనా 1 ఉచితంగా పొందండి
బిస్కట్స్ & కుకీస్ 120g+
ఏదైనా 1 కొనండి ఏదైనా 1 ఉచితంగా పొందండి
ఫస్ట్ క్రాప్ మసాలా చిల్లీ/ ఆట్టా నూడుల్స్ 280g/ 420g MRP ₹70+
1 కొనండి 1 ఉచితంగా పొందండి
మాగీ మసాలా నూడుల్స్ 560g MRP ₹112+
శనగపిండి/చక్కటి పిండి/ సూజీ/ కార్న్‌ఫ్లేక్స్/ ఓట్స్/ సాస్/ హనీ/ పాస్తా/ వెర్మిసెల్లీ/ కాఫీ/ సూప్
1 కొనండి 1 ఉచితంగా పొందండి
హెడ్ & షోల్డర్స్/ పాంటీన్/ షాంపూ 340ml
1 కొనండి 40% తగ్గింపు పొందండి
2 కొనండి 45% తగ్గింపు పొందండి
కోల్గేట్ డెంటల్ క్రీమ్ 500g/ పెప్సోడెంట్ 300g MRP ₹204+ 33% తగ్గింపు
కోల్గేట్ మ్యాక్స్ ఫ్రెష్ 300g MRP ₹265+ 40% తగ్గింపు
1 కొనండి 1 ఉచితంగా పొందండి
హోమ్ నింజా డిటర్జెంట్ 4kg/ 5kg MRP ₹515+
1 కొనండి 1 ఉచితంగా పొందండి
MRP ₹799
1 కొనండి 1 ఉచితంగా పొందండి
పాంపర్స్ బేబీ డైపర్ జంబో ప్యాక్ MRP ₹899 ₹350 తగ్గింపు
టైడ్ 5kg/ 8kg డిటర్జెంట్ MRP ₹659+ 40% తగ్గింపు
20 ప్యాడ్స్ MRP ₹80
1 కొనండి 1 ఉచితంగా పొందండి
3 X 15 ప్యాడ్స్ MRP ₹480 ₹299
100g/ 125g MRP ₹43+
డోవ్/ పియర్స్/ లక్స్ సోప్ MRP ₹179+ 40% తగ్గింపు
హోమ్ నీడ్స్ & ఉపకరణాలు
డోర్ మ్యాట్స్ MRP ₹99+
కింగ్ సైజ్ డబుల్ బెడ్ షీట్ + 2 పిల్లో కవర్ MRP ₹299+
కర్టెన్స్, MRP ₹179+
100% కాటన్ బాత్ టవల్ MRP ₹199+
ప్లాస్టిక్ కంటైనర్ MRP ₹149+
2వ మీద 20% తగ్గింపు
స్టీల్ వాటర్ బాటిల్ MRP ₹199+
2వ మీద 20% తగ్గింపు
స్పిన్ మాప్ MRP ₹1350 ₹599 ఆదా చేయండి ₹751
మెలమైన్ డిన్నర్ సెట్ 40 యూనిట్ MRP ₹1200 ₹599 ఆదా చేయండి ₹601
tandem
స్టీమ్ ఐరన్ 1350W MRP ₹1399 ₹699 SAVE ₹700
USHA
డ్రై ఐరన్ 1000W MRP ₹900+ ₹579 ఆదా చేయండి ₹321
tandem
ఎగ్ బాయిలర్ MRP ₹599 ₹299 ఆదా చేయండి ₹300
tandem
ప్రెషర్ కుక్కర్ 3ℓ MRP ₹1199 ₹599 ఆదా చేయండి ₹600
Prestige
ప్రెషర్ కుక్కర్ 3ℓ MRP ₹1425+ ₹999 ఆదా చేయండి ₹426
tandem
ఎలక్ట్రిక్ కెటిల్ 1.5ℓ MRP ₹1299 ₹499
Prestige
ఎలక్ట్రిక్ కెటిల్ 1.5ℓ MRP ₹1445 ₹629 ఆదా చేయండి ₹816
tandem
ఇన్‌ఫ్రారెడ్ కుక్‌టాప్ 2200W, MRP ₹4799 ₹2399 ఆదా చేయండి ₹2400
tandem
మిక్సర్ గ్రైండర్ 2 జార్ MRP ₹2499 ₹1099 ఆదా చేయండి ₹1400
BAJAJ
మిక్సర్ గ్రైండర్ 3 జార్ MRP ₹4150 ₹2099 ఆదా చేయండి ₹2051
BAJAJ
2 బర్నర్ గ్యాస్ స్టవ్ స్టెయిన్లెస్ స్టీల్ MRP ₹2959+ ₹1799 ఆదా చేయండి ₹1160
tandem
2 బర్నర్ గ్లాస్ టాప్ స్టవ్ MRP ₹3599 ₹1699 ఆదా చేయండి ₹1900
NIRLEP
లిడ్ తో ఇండక్షన్ కుక్‌వేర్ సెట్ 3 యూనిట్ MRP ₹2645 ₹1199 ఆదా చేయండి ₹1446
safari
VIP
అప్‌రైట్ ట్రాలీ బ్యాగ్ మీడియం సైజ్ MRP ₹9999+ ₹2299 ఆదా చేయండి ₹7700
VIP
అప్‌రైట్ ట్రాలీ బ్యాగ్ 2 యొక్క సెట్ (కేబిన్ + మీడియం సైజ్) MRP ₹10500+ ₹3999 + డఫిల్ ట్రాలీ ఉచిత
VIP
అప్‌రైట్ ట్రాలీ బ్యాగ్ 3 యొక్క సెట్ (కేబిన్ + మీడియం + లార్జ్ సైజ్) MRP ₹26000+ ₹4899 ఆదా చేయండి ₹20801
1 కొనండి 1 ఉచితంగా పొందండి • అన్ని వింటర్ ఫ్యాషన్ మీద
జాకెట్ ₹399+
పుల్ఓవర్ ₹299+
పుల్ఓవర్ ₹299+
ఉచిత బహుమతులు
₹3000 డిస్కౌంట్ కూపన్ ₹7500 పై
₹1000 డిస్కౌంట్ కూపన్ ₹5000 పై
₹300 డిస్కౌంట్ కూపన్ ₹1500 పై [అప్పారెల్స్ & ఫుట్‌వేర్]
VISHAL MEGA MART

ముంచుకొస్తున్న మంచు ముప్పు

జార్జియా కేసి దూసుకొస్తున్న అతి పెద్ద ఐస్‌బర్గ్ ఏ23ఏ

పెంగ్విన్స్, ఇతర వన్య ప్రాణులకు ముప్పు



ఏ23ఏ మంచు ఫలకం

ప్రపంచంలోనే అతి పెద్ద ఐస్‌బర్గ్ ఏ23ఏ అంటార్కిటికాలోని మారుమూల ద్వీపమైన దక్షిణ జార్జియా వైపు శరవేగంగా దూసుకొస్తోంది. ప్రస్తుతం దానికి కేవలం 280 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రవాహ వేగాన్ని బట్టి రెండు నుంచి నాలుగు వారాల్లో జార్జియాను ఢీకొట్టవచ్చని ఓషనోగ్రాఫర్స్ చెబుతున్నారు. వన్యప్రాణులకు స్వర్గధామమైన దక్షిణ జార్జియా ఈ మెగా ఐస్‌బర్గ్ దెబ్బకు తీవ్రంగా ప్రభావితం కానుంది. కింగ్ పెంగ్విన్స్‌తోపాటు ఏనుగులు, సీల్స్ భవితవ్యాన్ని ఇది ప్రమాదంలో పడేస్తుందని బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే (బీఏఎస్) చెందిన ఓషనోగ్రాఫర్ డాక్టర్ ఆండ్రూ మీజర్స్ చెప్పారు. ఈ ప్రాంతంలో జంతువులు అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కోవడం ఇది తొలిసారేమీ కాదు. 2004లో దక్షిణ జార్జియా ఈశాన్య ప్రాంతాన్ని ఏ38 ఐస్‌వర్గ్ ఢీకొంది. దాని భారీ మంచు ముక్కలు మార్గాన్ని అడ్డుకోవడంతో పెంగ్విన్, సీల్ జనాభా క్షీణించింది. 2023లో ఏ76 ముక్కలైన ఐస్‌బర్గ్ ఫలకలు ఇప్పటికీ ద్వీపం చుట్టూ తేలియాడుతూ ఉన్నాయి.

ఏ23ఏ ప్రయాణం

ఈ ఐస్‌బర్గ్ లక్ష కోట్ల టన్నులకు పైగా బరువుతో 3,500 చ.కి.మీ. మేర విస్తరించింది. ఇది 1986లో 'ది మెగాబర్గ్' ఫిల్చ్‌నర్ ఐస్‌షెల్ఫ్ నుంచి విడివడింది. తర్వాత 30 ఏళ్లపాటు వెడ్డెల్ సముద్రం అడుగున చిక్కుకుపోయింది. 2020 వరకు మంచు ద్వీపంగా ఉంది. తర్వాత మళ్లీ కదలడం ప్రారంభించింది. జార్జియా ద్వీపకల్పం చివరకు చేరుకోవడానికి మూడేళ్లకు పైగా పట్టింది. 2024లో నెలలపాటు సుడిగుండాల వంటి అసాధారణ ప్రవాహాల్లో చిక్కుకుపోయింది. దాంతో అట్లాంటిక్‌లోకి తిరిగి వెళ్తుందని, అక్కడ వెచ్చని నీటిలో కరిగిపోతుందని భావించారు. కానీ 2024 డిసెంబర్‌లో ముక్కలై దక్షిణ దిశగా వేగంగా ప్రయాణించడం ప్రారంభించింది. దక్షిణ జార్జియాలోని మారుమూల ద్వీపానికి చేరేలోగా విచ్ఛిన్నమై కరిగిపోతుందని అప్పుడు కూడా బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే విభాగం అంచనా వేసింది. కానీ ఇప్పటికైతే అది నిక్షేపంలా ఉన్నట్టు ఉపగ్రహ చిత్రాలు చెబుతున్నాయి. దాంతో ఐస్‌బర్గ్ రోజువారీ కదలికలను ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఉపగ్రహ చిత్రాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అది ఏదోలా జార్జియా ద్వీపాన్ని ఢీకొట్టకుండా ఉండాలని ఆశిస్తున్నారు. గ్లోబల్ వార్మింగ్ అంటార్కిటికాలో ఆందోళనకరమైన మార్పులకు కారణమవుతోంది. ఇది ప్రపంచ సముద్ర మట్టంలో పెరుగుదలకు దారి తీస్తోంది. భవిష్యత్తులో తలెత్తబోయే విపత్తులకు ఇవన్నీ ముందస్తు సంకేతాలని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

90 శాతం నీటి అడుగునే..

ఐస్‌బర్గ్ ఏకంగా 90 శాతం సముద్ర మట్టానికి లోపలే ఉంటుంది. చిన్న భాగం మాత్రమే పైకి కనిపిస్తుంది. ఇవి కొన్నిసార్లు చిన్న దేశం పరిమాణంలోనూ ఉంటాయి! సాధారణంగా ఉత్తర అట్లాంటిక్, అంటార్కిటికా చుట్టుపక్కల కనిపించే ఈ ఐస్‌బర్గ్‌లు కలిగించే నష్టం అంతా ఇంతా కాదు. 1912 ఏప్రిల్ 15న టైటానిక్ మునకకు కారణమైన ఐస్‌బర్గ్ చరిత్రలో నిలిచిపోయింది. వీటి వేగం స్థిరంగా ఉండదు. పరిమాణం, ఆకారం, సముద్ర ప్రవాహాలు, అలలు, గాలిపై ఆధారపడి ఉంటుంది. ఐస్‌బర్గ్‌లు కాంక్రీట్ కంటే కూడా బలంగా ఉంటాయి! ఇవి పరస్పరం ఢీకొంటే అది మరీ విపత్తులకు దారితీస్తుంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

మతిలేని యుద్ధం ఆపండి

రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు డొనాల్డ్ ట్రంప్ హితవు



వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో మతిలేని యుద్ధానికి ఇకనైనా తెరదించాలని రష్యా అధినేత పుతిన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హితవు పలికారు. యుద్ధాన్ని ముగించేలా ఉక్రెయిన్‌తో ఒప్పందానికి రావాలని సూచించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. పుతిన్‌తో సాధ్యమైనంత త్వరగా సమావేశమవుతానని చెప్పారు. యుద్ధం ఆపకపోతే రష్యాపై కఠిన ఆంక్షలు విధించక తప్పదని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆంక్షల భయంతో పుతిన్ వెనక్కి తగ్గుతారని మీరు భావిస్తున్నారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, అది నాకు తెలియదు అని ట్రంప్ బదులిచ్చారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధక్షేత్రంలో అమాయకులు బలైపోతున్నారని, అందుకే తక్షణమే ఆ యుద్ధం ఆగిపోవాలని తాను కోరుకుంటున్నట్లు పునరుద్ఘాటించారు. రష్యాతో సంధికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సిద్ధంగా ఉన్నారని ట్రంప్ తెలిపారు.

అబార్షన్ వ్యతిరేక ఉద్యమకారులకు ట్రంప్ క్షమాభిక్ష

షికాగో: అబార్షన్‌లకు వ్యతిరేకంగా క్లినిక్‌ల వద్ద నిరసన తెలిపిన ఉద్యమకారులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్షమాభిక్ష ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేయడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. శాంతియుతంగా నిరసనలు చేపట్టిన వీరికి శిక్షలు విధించడం సరికాదని తెలిపారు. 2020 అక్టోబర్‌లో వాషింగ్టన్‌లోని అబార్షన్ క్లినిక్‌ను దిగ్బంధించి, తలుపులు మూసి తాళాలు వేసి నిరసన తెలిపిన లారెన్ హాండీతోపాటు మరో 9 మంది సహ నిందితులకు ట్రంప్ క్షమాభిక్ష ప్రకటన వర్తించనుంది.

సివిల్స్ దరఖాస్తుతో పాటే వయస్సు, కోటా ధ్రువీకరణలు

నిబంధనలను మార్చిన యూపీఎస్సీ



న్యూఢిల్లీ: సివిల్స్ అభ్యర్థులు ఇకపై ప్రిలిమినరీ పరీక్ష దరఖాస్తుతోపాటు వయస్సు, రిజర్వేషన్ కోటాకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా జత చేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తెలిపింది. ఈ ధ్రువీకరణలను ఆన్‌లైన్‌లో సమర్పించని వారి అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఈ నెల 22న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఇందుకు సంబంధించిన సూచనలున్నాయి. గతంలో, ప్రిలిమినరీ పరీక్ష పాసై మెయిన్స్‌కు వెళ్లే వారు మాత్రమే ఈ ధ్రువీకరణలను అప్‌లోడ్ చేయాల్సి ఉండేది. మాజీ ఐఏఎస్ ప్రొబెషనరీ పూజా ఖేడ్కర్ వివాదం నేపథ్యంలో యూపీఎస్సీ నిబంధనలను మార్చింది. సివిల్స్‌కు ఎంపికయ్యేందుకు వీలుగా పూజా ఖేడ్కర్ సమర్పించిన ఓబీసీ, దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలపై వివాదం తలెత్తడంతో ప్రభుత్వం ఆమెను సర్వీసు నుంచి తొలగించడం తెలిసిందే. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర సర్వీసులకు ఎంపికల కోసం యూపీఎస్సీ నిర్వహించే వార్షిక పరీక్ష ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల్లో ఉంటుంది. 2025 ప్రిలిమినరీ పరీక్ష మే 25న జరగనుంది. ఇందుకు ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు http:// upsconline. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముందని యూపీఎస్సీ తెలిపింది.

సోషల్ మీడియా స్వచ్ఛంగా ఉండాలి: సీఈసీ



న్యూఢిల్లీ: పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకున్నట్లుగానే సామాజిక మాధ్యమాల్లో కాలుష్యంపై పోరాడేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ చెప్పారు. ఫేక్ పోస్టులు, చిత్రాల వంటి వాటిని బ్లాక్ చేయడం, కనీసం వాటిపై ఫేక్ అంటూ లేబుల్ వేయడం వంటివి కూడా చేయడం లేదని సామాజిక మాధ్యమ వేదికలను ఆయన తప్పుబట్టారు. లాభాలే పరమావధిగా ఇవి పనిచేస్తున్నాయన్నారు. ముందుగా వ్యాధిని వ్యాపింపజేయడం, తీరిగ్గా వాటికి ఔషధాలను విక్రయించినట్లుగా వీటి తీరు ఉందని విమర్శించారు. సామాజి మాధ్యమ వేదికలు అనుసరించే ఇటువంటి వైఖరి ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థ నిష్పాక్షికత, విశ్వసనీయతలను దెబ్బతీస్తున్నాయని సీఈసీ ఆరోపించారు. మరింత ఆలస్యం కాకమునుపే సామాజిక మాధ్యమ సంస్థలు ఆత్మావలోకనం చేసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన అంతర్జాతీయ ఎన్నికల సంఘాల సదస్సు ముగింపు సమావేశంలో సీఈసీ రాజీవ్ కుమార్ ప్రసంగించారు.


'ఈవీఎంల వెరిఫికేషన్' పిటిషన్‌పై త్వరలో సుప్రీంకోర్టు విచారణ



న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఉపయోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను(ఈవీఎంలు) తనిఖీ చేసుకొని, ధ్రువీకరించుకొనే విధానం తీసుకురావాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం త్వరలో విచారణ చేపట్టనుంది. హరియాణా మాజీ మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కరణ్ సింగ్ దలాల్‌తోపాటు లఖన్‌కుమార్ సింగ్ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. ఇది శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఇలాంటి పిటిషన్లు ఇప్పటికే మరికొన్ని దాఖలైన నేపథ్యంలో అన్నింటినీ కలిపి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనానికి పంపించాలని నిర్ణయించారు. ఈవీఎంలోని నాలుగు ముఖ్యమైన భాగాలు.. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్, సింబల్ లోడింగ్ యూనిట్లలోని మైక్రోకంట్రోలర్‌ను తనిఖీ చేసుకొని ధ్రువీకరించుకొనేలా ఒక ప్రొటోకాల్‌ను అమలు చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ కరణ్ సింగ్ దలాల్, లఖన్‌కుమార్ సింగ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో ఉపయోగించిన మొత్తం ఈవీఎంల్లో ఐదు శాతం ఈవీఎంలను ఎన్నికల ఫలితాల తర్వాత ఇంజనీర్లు వెరిఫికేషన్ చేయొచ్చని సుప్రీంకోర్టు గతంలో తీర్పు వెలువరించింది.


సీఎం పదవి ఆఫర్ చేశారు

బీజేపీపై మనీశ్ సిసోడియా ఆరోపణ



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకుడు, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సంచలన వ్యాఖ్యలు చేశారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయ్యి తీహార్ జైలులో ఉన్న సమయంలో బీజేపీ తనకు ఢిల్లీ ముఖ్యమంత్రి కట్టబెడతామని హామీ ఇచ్చిందని చెప్పారు. ఆయన తాజాగా జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీని విచ్ఛిన్నం చేసి బీజేపీలో చేరితే ఢిల్లీకి ముఖ్యమంత్రిని చేస్తామంటూ బీజేపీ ఆఫర్ ఇచ్చిందని పేర్కొన్నారు. మాట వినకపోతే ఎప్పటికీ జైల్లోనే ఉండిపోయేలా చేస్తామని బెదిరించిందని చెప్పారు. ప్రతిపక్షాలను ముక్కలు చేయడమే బీజేపీ ఎజెండాగా మారిపోయిందని ఆరోపించారు. మాట వినని వారిని జైలు పంపించడం ఆ పార్టీ విధానమని దుయ్యబట్టారు. అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ నీచ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు..8 మంది మృతి



భండారా: మహారాష్ట్రలోని భండారా జిల్లాలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం సంభవించిన పేలుడులో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. జవహర్ నగర్ ప్రాంతంలోని ఫ్యాక్టరీ ఎల్‌టీపీ విభాగంలో ఉదయం 10.30 గంటలప్పుడు సంభవించిన పేలుడు తీవ్రతకు పైకప్పు లేచిపోయిందని పోలీసులు తెలిపారు. ఆ శబ్దం సమీపంలోని మూడు గ్రామాల్లో ప్రకంపనలు రేపిందని, ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ ప్రాంతమంతటా దట్టమైన పొగలు కమ్ముకున్నాయని చెప్పారు. ఆ సమయంలో ఫ్యాక్టరీ ఎల్‌టీపీ సెక్షన్‌లో 14 మంది వరకు పనిచేస్తున్నట్లు సమాచారం. శిథిలాలను తొలగించేందుకు దాదాపు 8 గంటలు పట్టిందని కలెక్టర్ సంజయ్ కోల్టే చెప్పారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించామన్నారు. ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరుగుతోందన్నారు. కాగా, ప్రమాదంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

ఎల్గార్ కేసులో విల్సన్, ధావలెకు బెయిల్



దావలె విల్సన్

ముంబై: ఎల్గార్ పరిషత్–మావోయిస్టుల లింకు కేసులో పరిశోధకుడు రొనా విల్సన్, ఉద్యమకారుడు సుధీర్ ధావలె దాదాపు ఆరేళ్ల అనంతరం శుక్రవారం జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. వీరిద్దరికీ ఈ నెల 8వ తేదీన బాంబే హైకోర్టు బెయిలిచ్చింది. 'వీరు 2018 నుంచి జైలు జీవితం గడుపుతున్నారు. వీరిపై ఇప్పటికీ ఆరోపణలను నమోదు చేయలేదు. ఈ కేసులో 300 మంది సాక్ష్యులను విచారించాల్సి ఉందని ఎన్ఐఏ అంటోంది. ఈ దృష్ట్యా కేసు విచారణ కనీస భవిష్యత్తులో ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదు'అని ఈ సందర్భంగా న్యాయస్థానం వ్యాఖ్యానించింది. విల్సన్, ధావలెలు శుక్రవారం ఎన్ఐఏ కోర్టులో బెయిల్‌కు సంబంధించిన లాంఛనాలు పూర్తి చేసి తలోజా జైలు నుంచి విడుదలయ్యారు. 2017 డిసెంబర్ 31వ తేదీన పుణేలో జరిగిన ఎల్గార్ పరిషత్ సమావేశంలో చేసిన రెచ్చగొట్టే ప్రసంగాలే ఆ తర్వాత కోరెగావ్-భీమాలో హింసాత్మక ఘటనలకు దారి తీసినట్లు కేసు నమోదైంది. వీరికి మావోయిస్టులతో సంబంధాలున్నట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఉద్యమకారులు, విద్యావేత్తలు సహా14 మందిని అరెస్ట్ చేశారు. వరవరరావు, సుధా భరద్వాజ్, ఆనంద్ తెల్తుండే, అరుణ్ ఫెరీరా తదితర 8 మంది విడుదలయ్యారు. మహేశ్ రౌత్ పెట్టుకున్న బెయిల్‌కు వ్యతిరేకంగా ఎన్ఐఏ వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో ఆయన జైలులోనే ఉన్నారు. స్టాన్ స్వామి అనే క్రైస్తవ ప్రబోధకుడు జైలులోనే 2021లో చనిపోయారు.

భిన్నత్వంలో ఏకత్వం ఎంతో అవసరం

గణతంత్ర పరేడ్‌లో పాల్గొనే వారితో ముఖాముఖిలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భిన్నత్వంలో ఏకత్వం అవసరం ఎంతో ఉందని ప్రధాని మోదీ చెప్పారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని ద్విగుణీకృతం చేయాలని కోరారు. ప్రధాని మోదీ శుక్రవారం గణతంత్ర పరేడ్‌లో పాలుపంచుకునే వివిధ రాష్ట్రాలకు చెందిన వారితో తన నివాసంలో జరిగిన ముఖాముఖిలో మాట్లాడారు. మై భారత్ పోర్టల్‌లో నమోదై జాతి నిర్మాణానికి దోహదపడే కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. మంచి అలవాట్లు, క్రమశిక్షణ, సమయపాలన కలిగి, రోజూ డైరీ రాయడం అలవాటు చేసుకోవాలని యువతను కోరారు. ఫిట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాలుపంచుకోవాలని యోగాకు రోజులో కొంత సమయం కేటాయించాలని, ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామాలు చేయాలని కోరారు. ప్రధానితో మాట్లాడిన వారిలో ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గిరిజన అతిథులు, శకటాల కళాకారులు ఉన్నారని ఓ అధికార ప్రకటన వివరించింది. అంతకు ముందు వీరంతా దేశ సంస్కృతి, భిన్న త్వాలను ప్రతిబింబించేలా కళారూపాలను ప్రదర్శించినట్లు తెలిపింది.

జేపీసీ సమావేశంలో రగడ

- చైర్మన్ జగదాంబికా పాల్ తీరుపై విపక్ష సభ్యులు ఆగ్రహం
- పది మందిపై ఒకరోజు పాటు సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై జరిగిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) సమావేశంలో విపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ నేత, చైర్మన్ జగదాంబికా పాల్ నేతృత్వంలో జేపీసీ శుక్రవారం సమావేశమైంది. చైర్మన్ తీరుపై విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే ఆయన నడుచుకుంటున్నారని, నియమ నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. మీటింగ్ ఎజెండాను రాత్రికి రాత్రే ఇష్టారాజ్యంగా మార్చేస్తున్నారని ధ్వజమెత్తారు. జేపీసీ కార్యకలాపాలను ఒక ఫార్స్‌గా మార్చేశారని దుయ్యబట్టారు. విపక్ష సభ్యుల తీరుపై జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. తనను ఇష్టానుసారంగా దూషిస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీపై మండిపడ్డారు. సమావేశానికి అంతరాయం కలిగించడానికే వచ్చారా? అని నిలదీశారు. దీంతో జగదాంబికా పాల్‌కు వ్యతిరేకంగా విపక్ష సభ్యులు బిగ్గరగా నినాదాలు చేశారు. రెండో చైర్మన్ సమావేశాన్ని రెండు సార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో పది మంది విపక్ష సభ్యులను ఒకరోజుపాటు సస్పెండ్ చేస్తూ బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబే తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మాన్ని జేపీసీ ఆమోదించింది. దీంతో కల్యాణ్ బెనర్జీ, నదీమ్–ఉల్ హక్(తృణమూల్ కాంగ్రెస్), మొహమ్మద్ జావెద్, ఇమ్రాన్ మసూద్, సయీద్ నసీర్ హుస్సేన్(కాంగ్రెస్), ఎ.రాజా, మొహమ్మద్ అబ్దుల్లా(డీఎంకే), అసదుద్దీన్ ఓవైసీ(ఎంఐఎం), మొహిబుల్లా(సమాజ్‌వాదీ పార్టీ), అరవింద్ సావంత్(శివసేన-ఉద్ధవ్) జేపీసీ భేటీ నుంచి సస్పెండయ్యారు. విపక్ష సభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఒక లేఖ రాశారు. ఈ నెల 27న జరగాల్సిన జేపీసీ సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌కు చెందిన మతపెద్ద మిర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్ నేతృత్వంలో ఓ బృందం శుక్రవారం జేపీసీతో సమావేశమైంది. వక్ఫ్ సవరణ బిల్లుపై తమ అభ్యంతరాలను కమిటీ దృష్టికి తీసుకొచ్చింది. ఈ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఈ నెల 29వ తేదీన తమ తుది నివేదికను సిద్ధం చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. వక్ఫ్ సవరణ బిల్లు–2024ను కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టు 8వ తేదీన జేపీసీకి పంపించిన సంగతి తెలిసిందే.

అమెరికాలో 538 మంది అక్రమ వలసదార్ల అరెస్టు


వాషింగ్టన్: అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అక్రమ వలసదార్లపై కఠినంగా వ్యవహరిస్తోంది. 538 మందిని అరెస్టు చేసినట్లు ప్రకటించింది. వీరిలో అక్రమంగా తమ దేశంలోకి ప్రవేశించి నేరాలకు పాల్పనడివారు, ఒక అనుమానిత ఉగ్రవాది, అక్రమ వలసదార్లుగా ఉంటూ మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పనడివారు ఉన్నట్లు వెల్లడించింది. వందలాది మంది అక్రమ వలసదార్లను సైనిక విమానంలో బయటకు పంపించినట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. చరిత్రలోనే అతిపెద్ద సామూహిక తరలింపు ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. హామీ ఇచ్చామని, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుంటున్నామని ఉద్ఘాటించారు. అమెరికాలోకి అక్రమంగా అడుగుపెడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్న సందేశాన్ని తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యావత్ ప్రపంచానికి ఇస్తున్నారని స్పష్టంచేశారు. దొంగతనం, హింస వంటి నేరాల్లో నిందితులుగా ఉన్న అక్రమ వలసదార్లను బయటకు పంపించేందుకు ఉద్దేశించిన బిల్లుపై ట్రంప్ ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది.

ఎట్టకేలకు కెనెడీ ఫైల్స్ డీ క్లాసిఫై

- ప్రజల ముందు ఉంచండి
- మార్టిన్ లూథర్ హత్య ఫైల్స్ కూడా
- ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు



జాన్ ఎఫ్.కెనెడీ



మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్



రాబర్ట్ ఎఫ్.కెనెడీ

వాషింగ్టన్: అప్పట్లో ప్రపంచమంతటా సంచలనం సృష్టించిన అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెనెడీ, ఆయన సోదరుడు, సెనేటర్ రాబర్ట్ ఎఫ్.కెనెడీ, పౌర హక్కుల నాయకుడు మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ హత్యలకు సంబంధించి త్వరలో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి. వారి హత్యోదంతాలకు సంబంధించిన రహస్య ఫైళ్లన్నింటినీ బహిర్గతం చేయాల్సిందిగా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై ఆయన గురువారం సంతకం చేశారు. ''ఈ హత్యల వెనక నిజానిజాలను అమెరికా ప్రజలు తెలుసుకోవాల్సిన సమయం వచ్చేసింది. ఇందుకోసం వారు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. కనుక అన్ని విషయాలనూ బయట పెట్టబోతున్నాం'' అని విలేకరులకు స్పష్టం చేశారు. సంబధిత ఫైళ్లను డీక్లాసిఫై చేయడానికి 15 రోజుల్లోగా ప్రణాళిక సిద్ధం చేయాల్సిందిగా జాతీయ నిఘా విభాగం డైరెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం 45 రోజుల్లోగా ఫైళ్లన్నింటినీ ప్రజల ముందు పెట్టాలని పేర్కొన్నారు. సంబంధిత ఉత్వర్వులపై సంతకం చేసిన పెన్నును రాబర్ట్ ఎఫ్.కెనెడీ కుమారుడు, కాబోయే ఆరోగ్య మంత్రి రాబర్ట్ ఎఫ్.కెనెడీ జూనియర్‌కు ఇవ్వాల్సిందిగా అధికారులకు ట్రంప్ సూచించారు. కెనెడీల హత్యపై అధికారిక కథనాలపై కెనెడీ జూనియర్ చాలాకాలంగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆదేశాలు ఏమేరకు కార్య రూపం దాలుస్తాయన్నది అనుమానంగా మారింది.

..నేటికీ మిస్టరీయే

1963లో కెనెడీ డాలస్‌లో ఓపెన్ టాప్ కారులో వెళ్తుండగా లీ హార్వే ఓస్వాల్డ్ అనే మాజీ సైనికుడు కాల్చి చంపడం సంచలనంగా మారింది. ఐదేళ్ల అనంతరం స్థానంలో అధ్యక్ష ఎన్నికల బరిలో దిగిన ఆయన సోదరుడు రాబర్ట్ కూడా కాలిఫోర్నియాలో హత్యకు గురయ్యారు. ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతుపై ఆగ్రహంతో సిర్హాన్ అనే ఓ పాలస్తీనియన్ ఆయన్ను కాల్చి చంపాడు. అందుకు రెండు నెలల క్రితం లూథర్‌కింగ్‌ను కూడా టెనెసీలో జాతి విద్వేషానికి బలయ్యారు. జేమ్స్ ఎర్ల్ రే అనే జాత్యహంకారి ఆయన్ను కాల్చి చంపాడు. ఈ హత్యలకు సంబంధించి పలు డాక్యుమెంట్లు అడపాదడపా వెలుగు చూశాయి. కానీ వేలాది డాక్యుమెంట్లు గోప్యంగానే ఉండిపోయాయి. వాటి విచారణ ఫైళ్లన్నింటినీ బయట పెట్టాలంటూ 1992లో అమెరికా కాంగ్రెస్ చట్టం కూడా చేసింది. ఆ మేరకు కెనెడీ హత్యకు సంబంధించి చాలా డాక్యుమెంట్లను గత పదేళ్లలో ప్రభుత్వాలు బయటపెట్టినా లక్షలాది డాక్యుమెంట్లు ఇంకా గోప్యంగానే ఉండిపోయాయి. ట్రంప్ తన తొలి హయాంలోనే వాటన్నింటినీ బయట పెడతానని హామీ ఇచ్చినా సీఐఏ, ఎఫ్‌బీఐ ఒత్తిళ్ల కారణంగా మిన్నకుండిపోయారని చెబుతారు. ఓస్వాల్డ్ వ్యక్తిగత కక్షతోనే కెనెడీని పొట్టన పెట్టుకున్నట్టు విచారణ కమిషన్ తేల్చినా అది నిజం కాదని అమెరికన్లలో అత్యధికులు నేటికీ చెబుతారు. హత్య వెనక కుట్ర కోణముందంటూ జోరుగా విశ్లేషణలు సాగాయి. ప్రభుత్వ ఏజెంట్లు, మాఫియా, తెర వెనక శక్తుల హస్తముందని ఏళ్ల తరబడి కథనాలు వెలువడ్డాయి.

నువ్వా నేనా!

హస్తినలో ఆప్, బీజేపీ హోరాహోరీ

- పరివర్తన్ నినాదంతో కమలం
- పాతికేళ్లుగా అధికారానికి దూరం
- ప్రజలకు 'అవినీతిరహిత' హామీలు
- అభివృద్ధి, పథకాలపైనే ఆప్ ఆశలు
- భయపెడుతున్న అవినీతి, ప్రజా వ్యతిరేకత

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల సమరం రసకందాయంలో పడింది. కమలం పార్టీ అక్కడ 26 ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో ఏడు సీట్లనూ గెలుస్తూ వస్తున్నా అసెంబ్లీ బరిలో మాత్రం పట్టు చిక్కడమే లేదు. ఈసారి ఎలాగైనా హస్తిన గద్దెపై కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. ఇందుకు పరివర్తన్ (మార్పు) నినాదాన్ని నమ్ముకుంటోంది. పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీపై అవినీతి ఆరోపణలు ఎక్కుపెడుతూ ఓటర్లకు చేరువ కావడానికి ప్రయత్నిస్తోంది. అవినీతిరహిత పాలన కోసం తమనే గెలిపించాలని బీజేపీ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆప్ అంటే ఆపద అంటూ ప్రధాని నరేంద్ర మోదీ కూడా అధికార పార్టీపై ఇప్పటికే యుద్ధ భేరీ మోగించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 53.6 శాతం ఓట్లతో 62 సీట్లు కొల్లగొట్టగా బీజేపీ 39 శాతం ఓట్లతో 8 సీట్లకు పరిమితమైంది. ఇక కాంగ్రెస్ సోదిలో కూడా లేకుండాపోయింది. కేవలం 4.3 శాతం ఓట్లకు పరిమితమైంది. సీట్ల ఖాతాయే తెరవలేక కుదేలైంది.

ద్విముఖమే

ఢిల్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీ మధ్యే ద్విముఖ పోరు సాగుతోంది. రెండు పార్టీలు నువ్వానేనా అన్నట్టు తలపడుతున్నాయి. వాటితో పాటు కాంగ్రెస్ కూడా మొత్తం 70 సీట్లలోనూ బరిలో ఉన్నా దాని పోటీ నామమాత్రమే. ఆ పార్టీ 2013లో ఢిల్లీలో అధికారం కోల్పోయింది. ఈసారి బీజేపీ, ఆప్‌లతోపాటు పోటీపడి మరీ హామీలిచ్చినా కాంగ్రెస్‌కు అవి కలిసొచ్చేది అనుమానమే. న్యూఢిల్లీ నియోజకవర్గంలో మాజీ సీఎం కేజ్రీవాల్‌పై ఇద్దరు మాజీ సీఎంల కుమారులు బరిలో ఉండటం విశేషం. బీజేపీ నుంచి మాజీ సీఎం సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ నుంచి మాజీ సీఎం షీలా దీక్షిత్ కొడుకు సందీప్ దీక్షిత్ బరిలోకి దిగారు. ఈసారి తమకు విజయావకాశాలు అధికంగా ఉన్నాయని బీజేపీ నేతలంటున్నారు. కేజ్రీవాల్‌పై అవినీతి ఆరోపణలు, జనం సొమ్ముతో అద్దాల మేడ కట్టుకోవడం, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణంలో ఆప్ నేతల భాగస్వామ్యం, ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తమకు లాభిస్తాయని అంటున్నారు. ఆప్ నేతలు సైతం ఈ ఎన్నికల్లో తమకు విజయం సులభం కాదని అంగీకరిస్తున్నారు. అయితే కేజ్రీవాల్‌కు జనాదరణ, విశ్వసనీయత, సంక్షేమ పథకాల సక్రమ అమలు, కొత్త హామీలు గట్టెక్కిస్తాయని ఆశిస్తున్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే.

బీజేపీ

బలాలు

- 70 అసెంబ్లీ స్థానాల్లోనూ బూత్ స్థాయిలో సంస్థాగత నిర్మాణముంది. మురికివాడలు, అనధికార కాలనీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. వేలాదిగా చిన్నచిన్న సమావేశాలు నిర్వహించింది.
- జల, వాయు కాలుష్యం, తాగునీటి కొరత, ధ్వంసమైన రోడ్లు, అధ్వాన్న ప్రజా రవాణా తదితరాలను ప్రస్తావిస్తోంది. తామొస్తే మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని చెబుతోంది.
- ఆప్ ఎమ్మెల్యేల పనితీరుపై చార్జిషీట్లు విడుదల చేసి వారి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది.
- ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలూ గెలుచుకోవడం కలిసొస్తుందని బీజేపీ భావిస్తోంది. ఆప్ ఎమ్మెల్యేలున్న 52 అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థుల కంటే బీజేపీ అభ్యర్థులకే ఎక్కువ ఓట్లొచ్చాయి.

బలహీనతలు

- కేజ్రీవాల్‌ను ఢీకొట్టే బలమైన నేత బీజేపీలో లేడు. దాంతో సీఎం అభ్యర్థిని కూడా ప్రకటించలేకపోయింది.
- బీజేపీ హామీలు ఓటర్లను మెప్పించలేకపోతున్నాయి.
- 12 రిజర్వ్‌డ్, 8 మైనార్టీ ప్రభావిత నియోజకవర్గాల్లో బీజేపీ బలంగా లేదు. 2015, 2020 ఎన్నికల్లో వాటిలో పార్టీ నెగ్గలేదు.
- కొన్నిచోట్ల అభ్యర్థుల్లేక కాంగ్రెస్, ఆప్ నుంచి వచ్చినవారికి టికెట్లిచ్చింది.

ఆప్

బలాలు

- మురికివాడలు, అనధికారిక కాలనీలు, మైనార్టీ ప్రభావిత, మధ్య తరగతి ప్రాంతాల్లో తిరుగులేని మద్దతు.
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాదరణ. ప్రభుత్వ స్కూళ్ల ఆధునీకరణ, మొహల్లా క్లినిక్‌లు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.
- మళ్లీ గెలిస్తే మహిళలకు నెలకు రూ.2,100, వృద్ధులకు ఉచిత వైద్య సేవలు, ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల బీమా హామీలపై సానుకూలత కనిపిస్తోంది.

బలహీనతలు

- పదేళ్లకుపైగా అధికారంలో ఉన్నందున ప్రజా వ్యతిరేకత ఉంది. ఇది విజయావకాశాలపై ప్రభావం చూపనుంది.
- కేజ్రీవాల్, సిసోడియా వంటి నేతలపై అవినీతి ఆరోపణలు, జైలుకు వెళ్లడంతో ఆప్ ఇమేజీ మసకబారింది. ముఖ్య నేతలు పార్టీని వీడారు. అంతర్గత పోరు తలనొప్పిగా మారింది.
- 'కేజ్రీవాల్ అద్దాల మేడ' అంశాన్ని బీజేపీ పదేపదే ప్రస్తావిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్తోంది.

\- సాక్షి నేషనల్ డెస్క్

జాన్‌పహాడ్ సైదన్న ఉర్సుకు పోటెత్తిన భక్తులు

గంధం సమర్పించిన మంత్రి ఉత్తమ్

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ సైదన్న ఉర్సుకు శుక్రవారం భక్త జనం పోటెత్తారు. సుమారు లక్షన్నరకు పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నారు. రెండో రోజైన శుక్రవారం గంధోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దర్గా ప్రాంతమంతా కిక్కిరిసింది. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాదు నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంధాన్ని సైదులు బాబాకు.. భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమర్పించారు. అంతకుముందు గంధాన్ని ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై జాన్‌పహాడ్ దర్గా పుర వీధుల్లో ఊరేగించారు. గంధోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


గంధం కలశం ఎత్తుకుని ఊరేగింపు ప్రారంభించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సీఐడీకి కిడ్నీ రాకెట్ కేసు

- ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల పాత్రపై కూడా విచారణ
- ప్రైవేటు ఆసుపత్రుల్లోని అన్నిరకాల సర్జరీలు రికార్డు
- మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు
- కేసు పూర్వాపరాలపై అధికారులతో సమీక్ష




సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని అలకానంద ఆసుపత్రిలో జరిగిన అక్రమ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. కిడ్నీ రాకెట్ కేసుపై ఆయన తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ల కమిటీ ఇచ్చిన ప్రాథమిక నివేదికను పరిశీలించారు. అలకానంద ఆసుపత్రిలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఎటువంటి అనుమతి లేదని మంత్రికి అధికారులు వివరించారు. ఈ కేసును మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని విన్నవించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను సహించేది లేదని మంత్రి దామోదర రాజనర్సింహ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కిడ్నీ రాకెట్ వ్యవహారాన్ని చాలా సీరియస్‌గా పరిగణిస్తున్నామని, దీనితో సంబంధం ఉన్న వాళ్లందరినీ కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఆధారాలను సేకరించాలని, పూర్తిస్థాయి విచారణ కోసం కేసును సీఐడీకి అప్పగించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుకు మంత్రి సూచించారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ వ్యవహారం గురించిన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

అవయవ మార్పిడి అక్రమాల్లో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల పాత్రపై కూడా విచారణ జరుపాలని సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జరుగుతున్న శస్త్ర చికిత్సలపై నిఘా ఉంచాలని కోరారు. గర్భిణుల వివరాలను నమోదు చేస్తున్నట్టుగానే, ఇతర సర్జరీల వివరాలను కూడా నమోదు చేయాలని ఆదేశించారు.

కిడ్నీ రాకెట్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

చైతన్యపురి: సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన డాక్టర్స్ కాలనీలోని అలకానంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ వ్యవహారంలో హాస్పిటల్ నిర్వాహకుడు సుమంత్‌తో పాటు మరో వ్యక్తిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా కిడ్నీ మార్పిడి చేస్తున్నట్లు సమాచారం అందుకున్న జిల్లా వైద్యాధికారులు ఇప్పటికే ఆస్పత్రిని సీజ్ చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసిన సరూర్‌నగర్ పోలీసులు సుమంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా కిడ్నీ రాకెట్ వ్యవహారంలో పలు రాష్ట్రాలకు చెందిన వైద్యులు, బ్రోకర్లు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అమాయకులైన కిడ్నీ దాతలకు రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చి కిడ్నీ అవసరమైన వారికి అమర్చి రూ.50 లక్షలకు పైగా వసూలు చేసినట్లు తేలింది. కిడ్నీ రాకెట్ వెనక పెద్ద ముఠా ఉన్నట్లు సుమంత్, సిబ్బంది సెల్‌ఫోన్‌ల కాల్‌డేటా ఆధారంగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. విచారణలో భాగంగా 10 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆయా రాష్ట్రాల పోలీసుల సహకారం, ప్రత్యేక పోలీసు బృందాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సుమంత్‌తో పాటు, కిడ్నీ రాకెట్ బ్రోకర్‌గా భావిస్తున్న మరో నిందితుడు గోపిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ మీడియాకు తెలిపారు.



8 వారాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన పిటిషనర్‌కు 8 వారాల్లో బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అధికారులు గ్రాట్యుటీ, జీపీఎఫ్ లాంటి బకాయిలు చెల్లించడం లేదని సిద్దిపేట జిల్లా మాజీ ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటేశం వేసిన పిటిషన్‌పై విచారణ జరిపి ఈ ఆదేశాలిచ్చింది.



రైతు ఆత్మహత్యలు కాంగ్రెస్ హత్యలే!

బాధితులను ఆదుకోవడంలోనూ ప్రభుత్వం అలసత్వం

- రుణమాఫీ, రైతు భరోసాపై మోసం చేసిన సర్కారు
- రుణమాఫీ కాలేదనే ఆదిలాబాద్ బ్యాంక్‌లో రైతు ఆత్మహత్య
- రైతులకు భరోసా కల్పించేందుకే బీఆర్‌ఎస్ కమిటీ పర్యటన
- బీఆర్‌ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి
- రైతు కుటుంబాలకు పరామర్శ.. ఆర్థిక సహాయం అందజేత



రేణిగూడలో రైతు జాదవ్ దేవ్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కమిటీ సభ్యులు

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న హత్యలేనని బీఆర్‌ఎస్ పార్టీ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం మోసం చేయటం వల్లనే దిక్కుతోచక అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వంలో స్పందన లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల్లో ధైర్యం నింపేందుకే తాము పర్యటిస్తున్నామని చెప్పారు. కమిటీ తొలి పర్యటన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి శుక్రవారం ప్రారంభమైంది. బేల మండలం రేణిగూడకు చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు ఇటీవల ఆదిలాబాద్ ప్రైవేట్ బ్యాంక్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కమిటీ సభ్యులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆ రైతు కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు.

రైతులతో భేటీ..

నిరంజన్‌రెడ్డితోపాటు కమిటీ సభ్యులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, కోటిరెడ్డి, యాదవరెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ తదితరులు ఆదిలాబాద్‌లోని కిసాన్‌చౌక్‌లో రైతు విగ్రహానికి పూలుజల్లి పర్యటన ప్రారంభించారు. గుడిహత్నూర్ మండలం నేరడిగొండ తండాలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు ఆడే గజానంద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆ రైతు కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడలో రైతులతో నిర్వహించిన సభలో పాల్గొన్నారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు లక్షల రుణమాఫీ అయ్యిందని చెబుతున్న ప్రభుత్వం.. రూ.లక్షా 90 వేలు అప్పు ఉన్న జాదవ్ దేవ్‌రావు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు కష్టాలు పడుతుంటే సీఎం ఫారిన్ టూర్‌లో, మంత్రులు పక్క రాష్ట్రాల టూర్‌లో బిజీగా ఉన్నారని మండిపడ్డారు.

408 మంది రైతుల ఆత్మహత్యలు..

రాష్ట్రంలో 408 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే.. వారి కుటుంబాలకు అండగా నిలవాలనే సోయి కూడా మంత్రులకు లేదని బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లలో 40 మందికి పైగా విద్యార్థులు చనిపోయారని తెలిపారు. ప్రస్తుతం మంత్రులు, వారి కుటుంబాలు తప్పితే ఎవరూ సంతోషంగా లేరని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలు కంటతడి పెడుతున్నాయని అన్నారు. గ్రామసభల్లో ప్రజలే కాకుండా, స్వయంగా కాంగ్రెస్ కార్యకర్తలే తిరుగుబాటు చేస్తుండడం ఈ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. 50 శాతానికిపైగా రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదని, రైతుబంధు వేయలేదని విమర్శించారు.

తల్లిని వేధిస్తున్నాడని తండ్రిని చంపేశాడు

- గంజాయి మత్తులో కుమారుడి ఘాతుకం
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- మంచిర్యాల జిల్లా ఇందారంలో కలకలం



రాజయ్య

జైపూర్: గంజాయికి బానిసై జులాయిగా తిరుగుతున్న ఓ టీనేజీ యువకుడు ఏకంగా కన్నతండ్రినే కడతేర్చాడు. తల్లిని వేధిస్తున్నాడంటూ స్నేహితులతో కలిసి గంజాయి మత్తులో ఇంట్లో నిద్రిస్తున్న తండ్రి గొంతు కోసి చంపాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలో శుక్రవారం జరిగిన ఈ హత్యోదంతం స్థానికంగా కలకలం రేపింది.

తండ్రి ప్రవర్తనలో మార్పు రాలేదని..

పోలీసుల కథనం ప్రకారం.. ఇందారం గ్రామానికి చెందిన అవిడపు రాజయ్య (45), భాగ్యలక్ష్మి దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. కుమార్తె ప్రేమ వివాహం చేసుకొని వెళ్లిపోగా కొడుకు సాయిసిద్ధార్థ (18) తల్లిదండ్రులపైనే ఆధారపడి ఉంటున్నాడు. ఓసారి టెన్త్ ఫెయిలైన అతను మరోసారి పరీక్ష రాసి పాసయ్యాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించే రాజయ్య వివాహేతర సంబంధాలు ఏర్పర్చుకుంటున్నాడని తెలిసి భార్య అతనితో తరచూ గొడవపడేది. అనంతరం తన సోదరులు నివసించే శ్రీరాంపూర్‌కు వెళ్లి ఒకట్రెండు రోజులు ఉండి తిరిగొచ్చేది. ఈ క్రమంలో 10 రోజుల క్రితం ఇదే విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో భాగ్యలక్ష్మి సాయిసిద్ధార్థతో కలిసి అన్నదమ్ముల ఇంటికి వెళ్లింది. తల్లి ఎంత చెప్పినా తండ్రి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో రాజయ్యను చంపాలని నిశ్చయించుకున్న సాయిసిద్ధార్థ.. గురువారం శ్రీరాంపూర్ నుంచి స్నేహితుల ఇంటికి వెళ్తున్నానని తల్లికి చెప్పి వెళ్లాడు. తన స్నేహితులైన జైపూర్ మండలం నర్వలో ఉంటున్న పొట్టాల వినయ్, శ్రీరాంపూర్ అరుణక్కనగర్‌లోని జనంపల్లి సందీప్‌తో కలిసి గంజాయి మత్తులో అర్ధరాత్రి ఆటోలో ఇందారం చేరుకున్నాడు. నిద్రపోతున్న రాజయ్యను మంచం పైనుంచి కింద పడేసి ముగ్గురూ కత్తులతో గొంతు కోసి హతమార్చారు. దీంతో రాజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం జైపూర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి సాయిసిద్ధార్థ లొంగిపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

తాగి దూషిస్తున్నాడని తండ్రిని చంపిన మైనర్!

- గొంతునులిమి చంపి ఆపై చెట్టుకు ఉరేసిన వైనం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో వెలుగుచూసిన దారుణం



దామ్లానాయక్

ఉప్పునుంతల: తాగుడుకు బానిసై ఇంట్లో తరచూ గొడవ పడటమే కాకుండా అందరినీ దూషిస్తున్నాడని కన్నకొడుకే తండ్రిని కొట్టి చంపాడు. ఈ ఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని పూర్యానాయక్‌తండాలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్.ఐ. వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. తండాకు చెందిన రమావత్ దామ్లానాయక్ (45) మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యాపిల్లలతో గొడవపడేవాడు. దాంతోపాటు తాగి అందరినీ దూషిస్తూ గొడవపడేవాడు. దీంతో విసిగిపోయిన అతని పెద్ద కుమారుడు (మైనర్) తండ్రిని చంపాలనే నిర్ణయానికి వచ్చాడు. దామ్లానాయక్ గురువారం ఉదయం తండా సమీపంలోని చెంచుగుండ్ల ప్రాంతంలో ఉన్న పొలం వద్ద వేరుశనగ పంటకు కాపలాగా వెళ్లగా పెద్దనాన్న కొడుకుతో కలిసి దామ్లానాయక్ కొడుకు పొలం వద్దకు వెళ్లాడు. ఇద్దరూ కలిసి దామ్లానాయక్‌ను తాడుతో గొంతునులిమి చంపి సమీపంలోని పొదల్లో చెట్టుకు ఉరేశారు. శుక్రవారం ఉదయం సమీప పొలాల రైతులు దీన్ని గమనించడంతో విషయం బయటపడింది. ఈ ఘటనపై దామ్లానాయక్ భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకం

- దరఖాస్తుల స్వీకరణ షురూ

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక పునరావాస పథకం కింద దివ్యాంగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. రూ.50 వేల గరిష్ఠ రాయితీ ఉన్న ఈ పథకం కోసం ఆసక్తి ఉన్న దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ వికలాంగుల ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల పరిధిలో 711 యూనిట్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ యూనిట్లకు రాయితీ రూపంలో రూ.3.55 కోట్లు రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ భరించనుంది. ఎంపికైన లబ్ధిదారులు బ్యాంకు రుణాలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.



సాక్షి హైదరాబాద్

శనివారం । 25 । జనవరి । 2025



అభివృద్ధికి పెట్టుబడులు కీలకం
రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు కీలకమని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో క్రీడా పోటీల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. -10లో



సాహిత్య సౌరభం..
నగరం సాహితీ పరిమళాలను అద్దుకుంది. టీ-హబ్, సత్వ నాలెడ్జ్ సిటీ వేదికలుగా లిటరరీ ఫెస్ట్‌ను శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
30.0/18.0

వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘాలతో కమ్ముకుని ఉంటుంది. పొగమంచు భారీగా అలుముకుంటుంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

భలే దులియా!



ఒక్క గేదె రూ.4.5 లక్షలు

- నార్సింగిలో పశు సంక్రాంతి
- భారీగా పలికిన ధరలు

మణికొండ: నగర శివారు నార్సింగిలో సంక్రాంతి పండగ తర్వాత నిర్వహించే పశు సంక్రాంతి (పశువుల జాతర)లో శుక్రవారం కొన్ని పాడి గేదెలు రూ.లక్షలు పలికాయి. గతంలో ఉన్న అత్యధిక రేటు రూ. 2.51 లక్షలను అధిగమించాయి. శేరిలింగంపల్లి మండలం నల్లగండ్లకు చెందిన మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి సోదరులు రూ. 4.5 లక్షలకు గుజరాత్‌కు చెందిన దులియా జాతి గేదెను కొనుగోలు చేశారు. వీరికి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, వైస్ చైర్మన్ కె.దశరథ యాదవ్, డైరెక్టర్‌లు సదరు గేదెను అప్పగించారు. వట్టినాగులపల్లికి చెందిన శ్రీశైలం యాదవ్ రూ.10 లక్షలకు నాలుగు దులియా జాతికి చెందిన గేదెలను కొనుగోలు చేశారు. షాబాద్ మండలం, సంకేపల్లిగూడకు చెందిన సాయికృష్ణారెడ్డి రూ.4.10 లక్షలకు రెండు దులియా జాతి గేదెలను కొనుగోలు చేశారు. ఇవి పూటకు 15 లీటర్ల నుంచి 25 లీటర్ల వరకు పాలు ఇస్తాయని రైతులు తెలిపారు. శుక్రవారం దాదాపు కోటి రూపాయల వరకు వ్యాపారం జరిగిందని, మార్కెట్ కమిటీకి రూ.లక్ష ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.



రూ.4.5 లక్షల గేదెను కొనుగోలుదారుకు అప్పగిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు



గుజరాత్ నుంచి పాడి గేదెను తెచ్చి రూ.4.5 లక్షలకు అమ్మిన వ్యాపారి

నగర రవాణా నిధిపై అధ్యయనం

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో త్వరలో నిపుణుల కమిటీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మెరుగైన ప్రజా రవాణా సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనకు అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ ఫండ్ (యూటీఎఫ్) ఏర్పాటుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కసరత్తు చేపట్టింది. ఇందుకోసం వివిధ రకాల సెస్ వసూళ్లపై అధ్యయనం చేసి నివేదికను అందజేసేందుకు త్వరలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేయనుంది. హెచ్ఎండీఏకు అనుబంధ సంస్థ అయిన హుమ్టా కార్యకలాపాల కోసం ఈ నిధులను వినియోగిస్తారు. అవసరమైన చోట జంక్షన్‌ల అభివృద్ధి పుట్‌పాత్‌లు, పేవ్‌మెంట్‌ల ఏర్పాటు, స్కైవాక్‌లు తదితర సదుపాయాలను కల్పించేందుకు అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ నిధిని వినియోగించేందుకు వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం దేశంలో ఏ మెట్రోపాలిటన్ నగరంలోనూ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ ఫండ్ లేదు. హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా యూటీఎఫ్ అవసరం ఉందని హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. నగరంలో చేపట్టే మెట్రోరైల్, ఫ్లైఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్‌లు వంటి అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి అయ్యే వ్యయంలో 0.25 శాతం యూటీఎఫ్ కింద సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. వాహనాలు, పెట్రోల్ బంకులు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, పార్కింగ్ స్థలాలు వంటి వివిధ రకాల మౌలిక సదుపాయాల వినియోగంపైనా యూటీఎఫ్ రాబట్టాలనే ప్రతిపాదన ఉంది.

సీఎంపీ నివేదిక ఆధారంగా అంచనాలు..

నగరంలో వాహనాల వినియోగం, ప్రజారవాణా సదుపాయాలు, వ్యక్తిగత వాహనాల సంఖ్య, భవిష్యత్తులో రీజినల్ రింగ్‌రోడ్డు వరకు హైదరాబాద్ మహానగరం పరిధి విస్తరించనున్న దృష్ట్యా ఇందుకనుగుణంగా ప్రజారవాణా సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన లీ అసోసియేషన్ అందజేసే కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) ఆధారంగా యూటీఎఫ్‌ను నిర్ణయించే అవకాశం ఉంది. మరో రెండు నెలల్లో సీఎంపీ తుది నివేదిక అందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నివేదిక ఆధారంగానే హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్- 2050ని రూపొందించనున్నారు. ఇప్పటి వరకు ఉన్న 5 మాస్టర్‌ప్లాన్‌లను కలిపి మెగా మాస్టర్‌ప్లాన్ ఏర్పాటుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ కోసం ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. బిడ్డింగ్‌లో ఎంపికైన సంస్థ బృహత్ మహా ప్రణాళికను రూపొందించనుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి మాస్టర్‌ప్లాన్ ఏర్పాటు కావచ్చని అధికారుల అంచనా.

అమీన్‌పూర్‌పై హైడ్రా నజర్!

- సమగ్ర సర్వే చేయాలని అధికారుల నిర్ణయం
- రోడ్లు, పార్కులు కబ్జాలపై వరుస ఫిర్యాదులు
- క్షేత్రస్థాయి పర్యటనల్లో ఇప్పటికే కొన్ని నిర్ధారణ

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని జల వనరులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి చేస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అమీన్‌పూర్ మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆ ప్రాంతంలో ఆక్రమణల నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమైంది. దీనికోసం సాంకేతికంగా సమగ్ర సర్వేకు సిద్ధమవుతోంది. తమ కాలనీలోని పార్కులు, రహదారులతో పాటు కొన్ని ప్లాట్లను సమీపంలోని గోల్డెన్ కీ వెంచర్స్ సంబంధీకులు ఆక్రమించారంటూ వెంకటరమణ కాలనీ వాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక పరిశీలన నేపథ్యంలో హైడ్రా అధికారులు సర్వే నంబర్ 152, 153ల్లో ఉన్న పార్కులు, రహదారులు కబ్జా గురైనట్లు నిర్ధారించింది. గోల్డెన్ కీ వెంచర్స్ ఆక్రమణలకు పాల్పడినట్లు ప్రాథమికంగా తేల్చింది. దీనిపై సాంకేతికంగా లోతైన సర్వే చేయించాలని నిర్ణయించిన హైడ్రా అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం అధీనంలోని సర్వే ఆఫ్ ఇండియా, ఏడీ సర్వే సంస్థలతో కలిసి సంయుక్త సర్వేకు యోచిస్తోంది. కేవలం వెంకటరమణ కాలనీతో పాటు సమీపంలోని పలు కాలనీ వాసుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. బహిరంగంగా, పూర్తి పారదర్శకంగా జరిగే ఈ సర్వేలో అందరూ భాగస్వాములు కావాలని ఆయా కాలనీ వాసుల్ని హైడ్రా కోరుతోంది. గోల్డెన్ కీ వెంచర్స్ నిర్వాహకులతో పాటు ఆక్రమణదారులు వారి తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు నమ్మవద్దని హైడ్రా ప్రకటించింది.

రైడ్.. రైట్ రైట్

జేబీఎస్, ప్యారడైజ్ మెట్రో స్టేషన్ల నుంచి సేవలు షురూ

- విమెన్ బైక్ సర్వీసులను ప్రారంభించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

మెట్రో ఫస్ట్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీకి ఎలక్ట్రిక్ వాహనాలు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా ఫస్ట్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మహిళా డ్రైవర్లే నడిపేలా తొలిసారిగా నగరంలో పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బైక్‌లు, ఆటో రిక్షాలను హైదరాబాద్ మెట్రోరైల్ ప్రవేశపెట్టింది. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్అండ్‌టీ మెట్రో రైల్ సీఈఓ కేవీబీ రెడ్డి విమెన్ ఈ- బైక్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం సికింద్రాబాద్, ప్యారడైజ్, జేబీఎస్ తదితర మెట్రో స్టేషన్‌లకు రాకపోకలు సాగించే మహిళా ప్రయాణికులకు ఈ సేవలు లభిస్తాయి. దశలవారీగా అన్ని మెట్రో స్టేషన్‌లకు విస్తరించనున్నారు. మహిళా ప్రయాణికుల భద్రత, సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని మహిళలే నడిపించేలా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. నగరంలో మెట్రో స్టేషన్‌లకు ఫస్ట్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయం అందజేస్తున్న వాటిల్లో 9వ సంస్థగా ఈవీజిప్ సంస్థ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలతో, మహిళా కెప్టెన్‌లతో తన సేవలను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం నగరంలో ప్రతి రోజు సుమారు 5 లక్షల మంది మెట్రోల్లో ప్రయాణం చేస్తుండగా ప్రస్తుతం 1.25 లక్షల మందికి ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సదుపాయం లభిస్తుందన్నారు. మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన విమెన్ ఎలక్ట్రిక్ వాహనాలు ఒక మైలురాయిగా నిలుస్తాయన్నారు. ప్రస్తుతం ఉత్తరం వైపు ఉన్న అల్వాల్, తిరుమలగిరి, మారేడుపల్లి, సుచిత్ర తదితర ప్రాంతాలకు చెందిన మహిళా ప్రయాణికులు ఈ సేవలను వినియోగించుకోవచ్చు. ఉబర్, ఓలా తరహాలోనే మొబైల్ ఫోన్‌లలో 'ఈవీ జిప్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని విమెన్ బైక్, విమెన్ ఆటో రైడ్‌ను బుక్ చేసుకోవచ్చు. సయోధ్య స్వచ్ఛంద సంస్థకు చెందిన సుమారు 50 మంది మహిళా కెప్టెన్‌లు (డ్రైవర్‌లు) ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ డ్రైవింగ్ సదుపాయాన్ని అందజేస్తారు.



ఈ- బైక్ సేవలను ప్రారంభిస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు

ప్రపంచ నగరాలతోనే పోటీ...

అభివృద్ధిలో హైదరాబాద్ ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాలతోనే పోటీపడాలని విజన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తున్నారని, అందుకనుగుణంగా నగరంలో ఇప్పుడున్న 69 కిలోమీటర్ల మెట్రో సదుపాయాన్ని రెండో దశ విస్తరణతో 200 కిలోమీటర్లకు పెంచేందుకు కార్యాచరణ చేపట్టినట్లు ఎన్వీఎస్ తెలిపారు. పాతబస్తీ మెట్రో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రోడ్ల విస్తరణ కోసం 1100 నిర్మాణాలను తొలగించాల్సిన ఉందని, ఇప్పటి వరకు 270 మంది తమ ఆస్తుల అప్పగింతకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని చెప్పారు. వారిలో 170 మందికి సుమారు రూ.80 కోట్ల వరకు చెక్కులు పంపిణీ చేశామన్నారు. కూల్చివేతల పనులు కొనసాగుతున్నాయన్నారు. కేంద్రం అనుమతి లభించిన వెంటనే మెట్రో రెండో దశ పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎల్అండ్‌టీమెట్రో సీఈవో కేవీబీ రెడ్డి మాట్లాడుతూ, త్వరలో రామయదుర్గం, హైటెక్‌సిటీ స్టేషన్‌లకు కూడా మహిళా కెప్టెన్‌ల సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎల్అండ్‌టీ మెట్రో స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీధరన్, ఈవీ జిప్ సంస్థ వ్యవస్థాపకులు సీతారాం, సయోధ్య సంస్థ వ్యవస్థాపకులు మృదుల తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ తీసుకున్నాం



ఈవీ బైక్‌లు నడిపేందుకు సయోధ్య సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నాం. మహిళా ప్రయాణికులు ఇంటి నుంచి మెట్రోకు, తిరిగి తమ కార్యాలయాలకు చేరుకొనేలా వాహనాలు అందుబాటులో ఉంటాయి. స్నేహపూర్వకమైన రవాణా సదుపాయం అందజేస్తాం.
- స్వర్ణలత, అన్నోజిగూడ

ఉపాధి అవకాశం



బండి నడపడం వచ్చు. డ్రైవింగ్‌నే ఒక ఉపాధిగా మలుచుకొనేందుకు ఈ రంగంలోకి వచ్చాను. మహిళా ప్రయాణికులకు మాత్రమే కాబట్టి ఎలాంటి ఇబ్బంది ఉండదు. నిశ్చింతగా డ్రైవింగ్ చేయవచ్చు.
- శైలజ, అంబర్‌పేట్

ఆసక్తి ఉన్నవాళ్లకు శిక్షణనిస్తాం



డ్రైవింగ్ పట్ల ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పించాలనేది మా సంస్థ లక్ష్యం. ప్రస్తుతం ఆటోడ్రైవర్లు, బైక్ డ్రైవర్లు ఉన్నారు. ఆసక్తి ఉన్నవాళ్లకు కారు డ్రైవింగ్‌లో కూడా శిక్షణనిప్పించి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.
- మృదుల, సయోధ్య వ్యవస్థాపకురాలు

హత్య చేసి.. పెట్రోల్ పోసి..

యువతి తలపై బండరాయితో మోది చంపిన దుండగులు

- అత్యాచారానికి ఒడిగట్టి, ఆపై అంతమొందించినట్లు ఆనవాళ్లు
- మేడ్చల్ పరిధి మునీరాబాద్ ఓఆర్ఆర్ కల్వర్టు కింద ఘటన



మృతురాలి చేతిపై కనిపించిన పచ్చబొట్టు

మేడ్చల్‌రూరల్: ఓఆర్ఆర్ కల్వర్టు కింద గుర్తు తెలియని యువతి దారుణ హత్యకు గురైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి మునీరాబాద్ గ్రామ శివార్లలో చోటుచేసుకుంది. నిందితులు యువతి తలపై బండరాయితో మోది.. హత్య చేసి.. మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఆనవాళ్లున్నాయి. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మునీరాబాద్ పరిధిలో ఔటర్ రింగురోడ్డు సర్వీస్ రోడ్డులోని ఓ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో పని చేసే ఓ యువకుడు శుక్రవారం ఉదయం కల్వర్టులో నుంచి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయానికి వెళ్తుండగా ఓ యువతి మృతదేహం కనిపించింది. భయాందోళనకు గురైన యువకుడు ట్రాన్స్‌పోర్టు యజమానికి విషయం చెప్పగా.. అతడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలాన్ని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పరిశీలించారు. 25 ఏళ్ల వయసున్న వివాహిత తలపై బండరాయితో బాది హత్య చేసి.. ఆపై పెట్రోల్ పోసి నిందితులు నిప్పంటించిన ఆనవాళ్లను కనుగొన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తెలిసిన వ్యక్తుల పనేనా?

ఓఆర్ఆర్ కల్వర్టు కింద యువతి దారుణ హత్యకు గురైన యువతి పడి ఉన్న తీరును పరిశీలించిన పోలీసులు.. సదరు యువతి తనకు తెలిసిన వ్యక్తి లేదా వ్యక్తులతోనే ఇక్కడికి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. యువతిని ఏకాంతంగా కలిసిన అనంతరం విభేదాల కారణంగా పక్కనే ఉన్న బండరాయితో బాది హత్య చేశారా? లేదా పథకం ప్రకారమే ఇక్కడికి తీసుకువచ్చి దారుణానికి ఒడిగట్టారా? లేదంటే యువతి మృతదేహాన్ని తీసుకు వచ్చి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు బండరాయితో బాది.. పెట్రోల్ పోసి నిప్పు అంటించి ఉంటారా? నిందితుడు ఒక్కరా లేక ఇద్దరు.. ముగ్గురు ఉంటారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 2019 దిశ కేసు తరహాలో రోడ్డు పక్కన యువతి దారుణ హత్యకు గురి కావడం పోలీసులకు సవాల్‌గా మారింది.

మృతురాలి చేతులపై ముగ్గురి పేర్లతో పచ్చబొట్లు..

హత్యకు గురైన యువతి చేతులపై ముగ్గురి పేర్లతో పచ్చబొట్లు ఉన్నాయి. కుడి చేతిపై శ్రీకాంత్ అని తెలుగులో.. రోహిత్ అనే పేరు ఇంగ్లిష్‌లో.. ఎడమ చేతిపై నరేంద్ర అనే పేరు ఇంగ్లిష్‌లో పచ్చబొట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 25 ఏళ్ల వయసున్న యువతికి కాళ్ల వేళ్లకు ఉన్న మెట్టెల ఆధారంగా వివాహితగా గుర్తించారు. ఇతర పోలీస్‌స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసులు, ఆయా కేసుల్లో చేతిపై పచ్చబొట్లు ఉన్న వివరాల కేసులను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

నెట్‌నెట్ వెంచర్స్‌కు జీహెచ్ఎంసీ నోటీసులు

- తదుపరి చర్యలకు డీసీకి ఆదేశాలు

సాక్షి,సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్‌లో నెట్‌నెట్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మిస్తున్న భారీ భవన నిర్మాణంలో ఉల్లంఘనలున్నందున ఆక్రమణలను వెంటనే కూల్చివేయాలని, అప్పటి వరకు నిర్మాణాన్ని ఆపివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ బిల్డర్‌ను ఆదేశించారు. ఈమేరకు నోటీసు జారీ చేశారు. నోటీసు అందిన 15 రోజుల్లోగా ఈ పనులు పూర్తిచేయాలని, లేని పక్షంలో చట్టం, నిబంధనల మేరకు తగిన చర్యలు (కూల్చివేత/సీజ్ చేయడం) తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత డిప్యూటీ కమిషనర్ చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఎన్నో ఉల్లంఘనలున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా అనుమతి పొందిన ప్లాన్ మేరకు స్టిల్ట్ ఫ్లోర్లు 5 మీటర్ల ఎత్తుతో నిర్మించాల్సి ఉండగా, ఐదు స్టిల్ట్ ఫ్లోర్లను కూడా 4.5 మీటర్ల ఎత్తుతో నిర్మించారని, ఎన్విరాన్‌మెంట్ డెక్ 6 మీటర్లతో నిర్మించాల్సి ఉండగా దాన్ని కూడా 4.5 మీటర్ల ఎత్తుతోనే నిర్మించారని తెలిపారు. స్టిల్ట్ ఫ్లోర్లపై నిర్మించిన ఏడంతస్తుల ఎత్తు అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా ఎత్తు పెంచి నిర్మించారని, గరిష్ఠ అనుమతికి మించి ఎత్తులో నిర్మించారని పేర్కొన్నారు.

ఉల్లంఘనలెన్నో..

ఈ నిర్మాణానికి సంబంధించి ఎంతోకాలంగా వివాదం కొనసాగుతోంది. నందగిరి హిల్స్‌లో దాదాపు 4.7 ఎకరాల్లో తొలుత జీ ప్లస్ 4 అంతస్తులకు (15 మీటర్ల ఎత్తుతో) అనుమతి పొంది.. అనంతరం జూబ్లీహిల్స్ లేఔట్‌లో ఉన్నట్లు చూపించి ఎక్కువ ఎత్తులో నిర్మించారనే ఫిర్యాదులున్నాయి. భవన నిర్మాణంపై విచారణ జరిపిన విజిలెన్స్ విభాగం ఎన్నో ఉల్లంఘనలున్నాయని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు, ఫైరింజిన్ తిరిగేందుకు సైతం స్థలం లేకపోవడాన్ని గుర్తించింది. సంబంధిత బిల్డర్, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు నందగిరిహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిందిగా సొసైటీ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. అన్నీ పరిశీలించిన కమిషనర్ సెట్‌బ్యాక్ ఏరియాలో ర్యాంప్‌ను తొలగించాలని, అన్ని డీవియేషన్లను కూల్చివేయాలని నోటీసులు పంపారు.

కమ్మేసిన పొగ మంచు..



ఉదయం 8.30 గంటలకు గుర్రంగూడలో..

తెల్లవారుజామున కమ్మేస్తున్న పొగమంచుతో వాహనదారులతో పాటు సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున రోడ్లు కనిపించనంతగా పొగమంచు కమ్ముకుంది. ముఖ్య కూడళ్లలో అతి సమీపంలోని వాహనాలు కూడా కనిపించక పోవడంతో పలు జాగ్రత్తలతో చోదకులు ముందుకు కదిలారు. నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కమ్మేసింది. హైదరాబాద్- విజయవాడ హైవేపై హెడ్‌లైట్ల వెలుగుల్లో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదలాయి. నగర శివారులోని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో కిస్మత్‌పూర్ వద్ద పొగమంచుతో కారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొట్టింది. కారు ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. శివారులో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలుగా నమోదయ్యాయి. - సాక్షి, సిటీబ్యూరో





ఉదయం 9 గంటలకు ఎల్బీ నగర్ సాగర్ రోడ్డులో..

నగరంలో నేడు

- ఆకృతి ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో కొనసాగుతున్న ఎలైట్ వెడ్డింగ్ స్పెషల్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో రివీవింగ్ ద రూట్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను మధ్యాహ్నం 12.15 గంటలకు గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నారు. ఈ ప్రదర్శన రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- సాకేత్ హిందూ ధార్మిక సమాజ్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవ్ సాయంత్రం 6.30 గంటల నుంచి సాకేత్ కాలనీలోని క్షిప్ర ప్రసాద గణపతి దేవాలయంలో జరుగుతుంది.
- హైదరాబాద్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో లిటరరీ ఫెస్టివల్ 2025 హైటెక్ సిటీలోని సత్వ నాలెడ్జ్ సిటీలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నకిలీ నోట్ల తయారీ ముఠా గుట్టు రట్టు

- నిందితుడి అరెస్ట్
- రూ. 5 లక్షల నకిలీ నోట్లు, ప్రింటర్, ఇతర వస్తువులు స్వాధీనం



మాట్లాడుతున్న రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

మౌలాలి: నకిలీ నోట్లు తయారు చేస్తున్న ముఠా సభ్యుల్లో ఒకరిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు శుక్రవారం కేసు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా, దివిటిపల్లి గ్రామానికి చెందిన కర్లీ నవీన్‌కుమార్ ఇంజినీరింగ్ డిప్లొమా చేశాడు. అనంతరం గ్రాఫిక్ డిజైనింగ్, వెబ్ డిజైనింగ్, డిజిటల్ మార్కెటింగ్ నేర్చుకున్న అతను సరైన సంపాదన లేకపోవడంతో నకిలీ నోట్లు తయారు చేసి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే కోల్‌కత్తాకు చెందిన వ్యాపారవేత్తతో పరిచయం ఏర్పడటంతో ఇద్దరు నకిలీనోట్లు తయారు చేయడానికి పథకం రూపొందించారు. ఇందులో భాగంగా కలర్ ప్రింటర్ సేకరించిన వారు రూ. 500 నోట్లు ముద్రించారు. తమ ప్రయత్నం ఫలించడంతో గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ. 25 లక్షల నకిలీ నోట్ల తయారీకి ఆర్డర్ తీసుకున్నారు. ఒప్పందంలో భాగంగా నకిలీ నోట్లు ముద్రిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్ఓటీ మహేశ్వరం జోన్, పహాడి షరీఫ్ పోలీసులు అతడి నివాసంపై దాడి చేసి నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారు ముద్రించిన నోట్లు ఇప్పటి వరకు మార్కెట్‌లో చలామణి కాలేదని, దీనిని పసిగట్టిన రాచకొండ పోలీసులు నవీన్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు. అతడికి సహకరించిన వారి వివరాలను ఆరా తీస్తున్నామన్నారు. ఇతడి నుంచి రూ. 5 లక్షలు విలువైన నకిలీ రూ. 500 నోట్లు, ల్యాప్‌టాప్, హెచ్‌పీ లేజర్ ప్రొ ప్లస్ ప్రింటర్ 45, జీఎస్ఎం పేపర్ బండిల్, స్క్రీన్ ప్రింటింగ్ ఫ్రేమ్స్, డెకరేటింగ్ పౌడర్, తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వివరించారు.

బంజారాహిల్స్‌లో కారు చోరీ..

ఖైరతాబాద్‌లో చైన్ స్నాచింగ్..

రెండు జోన్ల సరిహద్దులో ఘటన

- రెండు పీఎస్‌లలో కేసులు నమోదు
- నిందితుడి కోసం ముమ్మర గాలింపు



సీసీ ఫుటేజీలో స్నాచర్ చిత్రం...



చోరీకి గురైన కారు..

బంజారాహిల్స్: చైన్ స్నాచింగ్ చేసేందుకు ఓ వ్యక్తి ఏకంగా కారు చోరీకి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్, ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ బస్తీకి చెందిన అఫ్రోజ్ తన మారుతీ వ్యాన్‌లో పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లేవాడు. గురువారం రాత్రి కారులో సాంకేతిక సమస్య తలెత్తడంతో రిపేరు చేయాలని రోడ్డునెంబర్-12లోని కమాన్‌లో మెకానిక్‌కు కారు అప్పగించి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి వరకు కారుకు మరమ్మతులు చేసిన మెకానిక్ షెడ్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం వ్యాన్ తీసుకెళ్లేందుకు అక్కడికి వచ్చిన అఫ్రోజ్‌కు షెడ్ ఎదుట కారు కనిపించలేదు. దీంతో మెకానిక్‌కు ఫోన్ చేయడంతో తాను కారు అక్కడే పార్కింగ్ చేసి వెళ్లిపోయానని చెప్పిన అతను ఘటనా స్థలానికి పరిగెత్తుకొచ్చాడు. పరిసర ప్రాంతాల్లో గాలించినా కారు కనిపించకపోవడంతో బాధితుడు అఫ్రోజ్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. కారు తాజ్‌కృష్ణా హోటల్ వైపు వెళ్లినట్లుగా గుర్తించారు. కాగా ఉదయం 9.45 గంటల ప్రాంతంలో ఆనంద్‌నగర్ కాలనీలో ఓ మహిళ మెడలో గొలుసు చోరీకి గురైనట్లు ఖైరతాబాద్ పోలీసులకు సమాచారం అందింది. అక్కడి పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించగా మారుతీ వ్యాన్‌లో వచ్చిన ఓ వ్యక్తి కారు దిగి కొంతదూరం నడిచి వెళ్లి రోడ్డుపై వెళుతున్న నర్సమ్మ అనే మహిళ మెడలోని 2.5 తులాల బంగారు గొలుసు లాక్కుని పరారైనట్లుగా గుర్తించారు. దీంతో కంట్రోల్ రూం నుంచి అన్ని ఠాణాలకు సమాచారం అందించారు. బంజారాహిల్స్‌లో చోరీకి గురైన కారు అదేనని గుర్తించారు. దీంతో అటు ఖైరతాబాద్ పోలీసులు, ఇటు బంజారాహిల్స్ పోలీసులు ప్రత్యేక బృందీలను ఏర్పాటు చేసి దొంగ కోసం గాలింపు చేపట్టారు. ఈ విషయాన్ని పసిగట్టిన సదరు దొంగ కారును ఖైరతాబాద్‌లో వదిలేసి సందుల్లో పడి ఉడాయించినట్లుగా తేలింది. అర్ధరాత్రి బంజారాహిల్స్‌లో కారు దొంగిలించిన అతను ఉదయం వరకు అటూ ఇటూ తిరుగుతూ ఆనంద్‌నగర్ కాలనీలో ఒంటరిగా కనిపించిన మహిళను టార్గెట్ చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లుగా పోలీసులు నిర్ధారించారు. స్నాచర్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. వెస్ట్-సెంట్రల్ జోన్ల సరిహద్దులో ఈ ఘటన చోటు చేసుకోవడంతో బంజారాహిల్స్, ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి పెట్టుబడులు కీలకం

- శాంతిభద్రతలపైనే పెట్టుబడులు ఆధారపడి ఉంటాయి
- రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్





విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీజీపీ జితేందర్

గచ్చిబౌలి: రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు కీలకమని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్టుబడులను ఆకర్షించడంలో శాంతిభద్రతలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న సైబరాబాద్ పోలీసులను డీజీపీ అభినందించారు. ఇందుకు సైబరాబాద్ భద్రతా మండలి(ఎస్‌సీఎస్‌సీ), పోలీసులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. పోలీసులు ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలతో కలిసి పనిచేయడంలో అసాధారణ పాత్ర పోషిస్తున్నారన్నారు. విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉన్న పోలీసులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారన్నారు. క్రీడలు వారి ఒత్తిడిని తగ్గించడమే కాకుండా శారీరక దారుఢ్యం, ఓర్పును పెంచుతాయన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ, పలువురు పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

నాలుగు రోజులపాటు సైబరాబాద్ కమిషనరేట్‌లో క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, క్యారమ్స్, జావెలిన్ త్రో, డిస్కస్‌త్రో, 5కె, 800మీటర్లు, 400మీటర్లు, 100 మీటర్లు పరుగు, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో పనిచేసే సిబ్బందిని తొమ్మిది జట్లుగా విభజించి పోటీలను నిర్వహించారు. విజేతలకు డీజీపి ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందజేశారు.

కేసు మూసేసినా ధన దాహం తీరలేదు!

- షాహినాయత్‌గంజ్ మాజీ ఇన్‌స్పెక్టర్ చౌహాన్ వ్యవహారం
- మిస్సింగ్ కేసులో అనుమానితుడి నుంచి డబ్బు డిమాండ్
- రూ.1.5 లక్షలు అడిగి రూ.50 వేలకు ఒప్పందం
- ఏసీబీకి ఆధారాలు అందించిన బాధితుడు, ఇన్‌స్పెక్టర్ అరెస్టు



ఇన్‌స్పెక్టర్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: ఆత్మహత్యగా తేలిన మిస్సింగ్ కేసులో అనుమానితుడి నుంచి లంచం డిమాండ్ చేసిన కేసులో షాహినాయత్‌గంజ్ ఠాణా మాజీ ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆ కేసు క్లోజ్ అయినా ధనదాహం తీరని ఇన్‌స్పెక్టర్ వేధించడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించడం కొసమెరుపు. షాహినాయత్‌గంజ్ ఠాణా పరిధిలో నివసించే ఓ వ్యక్తి అప్పుల బాధతో గత నెల 5న అదృశ్యమయ్యాడు. దీనిపై గత నెల 7న కుటుంబీకుల ఫిర్యాదుతో షాహినాయత్‌గంజ్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు కొలిక్కిరాకుండానే గత నెల 11న అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆ వ్యక్తి మృతదేహం లభించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన అక్కడి పోలీసులు ఆత్మహత్యగా తేల్చారు. అప్పు ఇచ్చిన వారి వేధింపుల కారణంగానే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. ఇలాంటి కేసుల్లో సాధారణంగా పోలీసులు అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణాలో నమోదైన కేసులు షాహినాయత్‌గంజ్ ఠాణాకు బదిలీ చేయించుకుంటారు. అయితే బాలు చౌహాన్ మాత్రం ఆ కేసును అక్కడే ఉంచి.. ఇక్కడ నమోదైన మిస్సింగ్ కేసును గత నెల 19న క్లోజ్ చేశారు. ఆ కేసులో అనుమానితులుగా ఉన్న అప్పు ఇచ్చిన వ్యక్తులను పిలిచి నిందితులుగా చేరుస్తానంటూ బెదిరించాడు. ఓ వ్యక్తిని మాత్రం తీవ్రంగా హెచ్చరించిన బాలు చౌహాన్ అలా కాకుండా ఉండాలంటే తనకు రూ.1.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత నెల 23, 24 తేదీల్లో చౌహాన్ వేధింపులు ఎక్కువ కావడంతో సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సలహా మేరకు ఇన్‌స్పెక్టర్‌ను కలిసి, అతడితో రూ.50 వేలకు బేరసారాలు చేసి, ఆ మొత్తం తతంగాన్ని ఆడియో రికార్డు చేశాడు. ఈ సాక్ష్యాన్ని ఏసీబీ అధికారులకు అందించాడు. దీని ఆధారంగా కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న నగర పోలీసు ఉన్నతాధికారులు బాలు చౌహాన్‌పై ఈ నెల 3న బదిలీ వేటు వేశారు. దర్యాప్తులో లభించిన ఆధారాలను బట్టి ఏసీబీ అధికారులు శుక్రవారం అతడిని అరెస్టు చేశారు.

రిజిస్ట్రేషన్ లేని ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు

28 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రైవేట్ ఆస్పత్రులు క్లినిక్‌లు, వెల్‌నెస్ సెంటర్లు, ఫిజియోథెరపీ సెంటర్లు, డెంటల్ క్లినిక్ లు, ఎక్స్‌రే క్లినిక్, అలోపతి, ఆయుష్ క్లినిక్‌లకు వైద్యారోగ్య శాఖలో రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లపై మొదటి విడతగా రూ.50 వేల జరిమానా విధించి చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు పేషంట్ల వివరాలు, అందించిన చికిత్స,సేవలు, డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది వివరాలు హెచ్ఎమ్ఐఎస్ పోర్టల్‌లో ప్రతి నెలా తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన 28 ప్రైవేట్ ఆస్పత్రులకు షో కాజ్ నోటీసులు జారీ చేసి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు.ప్రైవేట్ ఆస్పత్రుల్లో అర్హత కలిగిన డాక్టర్లు మాత్రమే విధులు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రి అనుమతి రద్దు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కదిరివన్ , అడిషనల్ డీసీపీ డాక్టర్ మనోహర్ ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. వెంకట్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీరంగ్ అబ్కారి , జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తల్లిపై కత్తితో దాడి

అల్వాల్: ఆస్తి విషయంలో గొడవపడి తల్లిపై కొడుకు దాడి చేసిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌లో నివసించే బైకన్ మల్లమ్మ(64)కు ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు సురేష్‌యాదవ్(44) జులాయిగా తిరుగుతుండటంతో భార్య వదిలి వెళ్లిపోవడంతో తల్లి వద్దే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన సురేష్ శుక్రవారం తల్లిని డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో గొడవపడ్డాడు. ఆగ్రహంతో కత్తితో తల్లిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ తల్లిని చిన్న కొడుకు సుధాకర్ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చిన్న కోడలు శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



జలమండలిలో పదోన్నతులు

సాక్షి,సిటీబ్యూరో: జలమండలిలో 110 మంది ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. బోర్డులో పనిచేస్తున్న 68 మంది జీపీఈలను ఎస్‌పీఈలుగా, 22 ఎస్‌పీలను టెక్నికల్ గ్రేడ్ -2గా, 20 మంది జీపీఈలను టెక్నికల్ గేడ్ -2గా పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. తమ యూనియన్ కృషితోనే గత 30 ఏళ్లుగా పదోన్నతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ప్రమోషన్స్ లభించడంపై తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్(టీజేఈయూ) హర్షం వ్యక్తం చేసింది.

ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: హైటెక్స్‌లో శుక్రవారం ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్‌కోర్-ఆల్కమ్ స్టాల్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సందర్శించారు. కంపెనీ రూపొందించిన అత్యాధునిక, వినూత్న ఉత్పత్తులను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ప్రముఖ ఆర్కిటెక్ట్ నిరూప్ రెడ్డి తదితరులతో కలిసి ఆవిష్కరించారు. సంస్థ తయారు చేసిన భారత్‌లో అతిపెద్ద 20 అడుగుల స్లైడింగ్ డోర్‌పై ఎన్‌కోర్ ఉడ్‌క్రాఫ్ట్ ఫౌండర్ అవతు శివ కోటి రెడ్డి మంత్రికి వివరించారు.

జ్ఞాపకశక్తిని పెంచే బైద్యనాథ్ శంఖపుష్పి సిరప్

లక్డీకాపూల్ : విద్యార్థులు ప్రశాంతమైన మానసిక స్థితితో చదువుకోవడానికి, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడానికి బైద్యనాథ్ శంఖపుష్పి సహాయపడుతుందని బైద్యనాథ్ ఆయుర్వేద సంస్థ ఎండి వీడీ రమేష్ శర్మ అన్నారు. ఆయుర్వేద గ్రంథాల్లో వివరించిన సంప్రదాయ పద్ధతుల ప్రకారం శంఖపుష్పి సిరప్‌ను తయారు చేశామని ఇది తలనొప్పి, పరీక్షల సమయంలో చిరాకును తగ్గిస్తుందన్నారు. ఇటీవలి కాలంలో పరీక్షల పేరుతో విద్యార్థులకు వారి కేర్ టేకర్ల నుండి విపరీతమైన ఒత్తిడి ఉంటుందన్నారు. పిల్లలందరికీ ఒకే విధమైన జ్ఞాపక శక్తి ఉండవని, దీంతో కొందరు ఒత్తిడికి లోనవుతారన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు బ్రాహ్మి శంఖ పుష్పి వంటి మూలికలను క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. బైద్యనాథ్ శంఖపుష్పి సిరప్ బ్రహ్మి, శంఖపుష్పి సంపూర్ణ కలయికతో తయారు చేశామని, దీనిని అన్ని వయస్సుల పిల్లలకు ఇవ్వచ్చునని రమేష్ శర్మ తెలిపారు.

మిర్చి తోటలో వ్యక్తి మృతదేహం

- హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి హత్య చేసిన నిందితులు
- మృతుడు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రమేష్‌గా గుర్తింపు



రమేష్ (ఫైల్)

కూసుమంచి: ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, లింగారం తండా సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న మిర్చి తోటలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించగా.. హైదరాబాద్‌కు చెందిన సదరు వ్యక్తిని తీసుకొచ్చి హత్య చేసినట్లు తేలింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మిర్చి తోటలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన రైతు పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై నాగరాజు మృతుడి రెండు చేతులు ప్లాస్టిక్ తాడుతో కట్టేసి ఉండటం, తలపై గాయాలు కనిపించడమే కాక మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో మృతుడు హైదరాబాద్‌కు చెందిన బొల్ల రమేష్(52)గా తేలింది. ఆయన రెండు రాష్ట్రాల్లో పాన్ మసాలా సరఫరా చేసేవాడు. ఈనెల 18న బయటికి వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అక్కడి ఖార్ఖానా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేస్తుండగానే ఓ వ్యక్తి రమేష్‌ను హత్య చేసినట్లు చెబుతూ లొంగిపోయాడు. నలుగురు వ్యక్తులు 18న రాత్రి అతడిని కారులో ఖమ్మం వైపు తీసుకొచ్చి హత్య చేసిన అనంతరం ఖమ్మం -సూర్యాపేట జాతీయ రహదారి పక్కన మిరపతోటలో మృతదేహాన్ని పడవేసినట్లు చెప్పాడు. దీంతో అక్కడి పోలీసులు వచ్చి గాలించినా సరైన ప్రాంతం తెలియక వెనుతిరిగారు. ఇంతలోనే కూసుమంచి పోలీసులు ఇచ్చిన సమాచారం ఆధారంగా రమేష్ కుటుంబీకులతో శుక్రవారం రాత్రి వచ్చి మృతదేహం ఆయనదేనని నిర్ధారించుకున్నారు. డబ్బు కోసమే రమేష్‌ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోవడంతో ఘటనా స్థలంలోనే పంచనామా నిర్వహించి అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

క్లుప్తంగా...

షేక్‌పేట మండల డిప్యూటీ ఐఓఎస్‌గా మల్లయ్య


షేక్‌పేట డిప్యూటీ ఐఓఎస్ మల్లయ్య

బంజారాహిల్స్: విద్యాశాఖ షేక్‌పేట మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఐ ఓఎస్)గా మల్లయ్య నియమితులయ్యారు. షేక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లయ్యను ఖాళీగా ఉన్న ఈ పోస్టులో భర్తీ చేశారు. మొన్నటి వరకు షేక్‌పేట డిప్యూటీ ఐఓఎస్‌గా గతి హైస్కూల్ హెచ్‌ఎం యాదగిరి వ్యవహరించేవారు. వివిధ కారణాలతో ఇటీవల ఆయనను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ పోస్టులో మల్లయ్యను నియమించగా ఆయన శుక్రవారం గతి పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఐఈ 11కెవీ ఫీడర్, ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, డి–మార్ట్, టోయోటో షోరూం, స్కోడా, జెన్ టెక్నాలజీ ఏరియా, ఆంధ్రాబ్యాంక్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం తెలియజేశారు.

దండోరా సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలి

బంజారాహిల్స్: ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు వచ్చే నెల 7వ తేదీన నిర్వహించబోయే దండోరా సాంస్కృతిక ప్రదర్శనలో వెయ్యి గొంతులు– లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకటేశ్వర కాలనీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దొరపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం డప్పులతో ప్రదర్శన నిర్వహించారు. బంజారాహిల్స్‌రోడ్ నెం.5 దేవరకొండ బస్తీ నుంచి సుఖ్‌దేవ్‌నగర్ బస్తీ మీదుగా జీవీకే వన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ డప్పుల ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా సురేష్ మాదిగ మాట్లాడుతూ న్యాయబద్ధమైన వర్గీకరణ అంశాన్ని ప్రభుత్వాలు సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేష్ మాదిగ, నరేష్ మాదిగ, విశ్వనాథ్ మాదిగ, రాము మాదిగ, సుమన్ మాదిగ, ధర్మేష్ మాదిగ, రమేష్ మాదిగ, ప్రభాకర్ మాదిగ పాల్గొన్నారు.

కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు సుముఖత

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ యాడ్ లైఫ్ గల్లీలో గత రెండు రోజుల క్రితం సీసీ రోడ్డు పనులు ప్రారంభం కాగా కొంతమంది లోప్రెషర్ వస్తుందన్న కారణంతో ఎటువంటి అనుమతులు లేకుండా నల్లా కనెక్షన్లు పొందడంతో విజిలెన్స్ అధికారులు దాడులు చేసి అక్రమ కనెక్షన్లను కట్ చేసిన వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో బస్తీవాసులు తమకు లోప్రెషర్ ఉందని మాకు చట్టబద్ధంగానే నీటి కనెక్షన్లు ఇప్పించాలంటూ కార్పొరేటర్ కవితారెడ్డిని కోరడంతో కార్పొరేటర్ శుక్రవారం బంజారాహిల్స్‌లోని తట్టికాన వాటర్ సెక్షన్ మేనేజర్‌ను కలిసి సమస్యను వివరించారు. వెంటనే బస్తీలో అవసరమైన వారికి చట్టబద్ధంగా నీటి కనెక్షన్లు ఇవ్వాల్సిందిగా కోరారు. దీనికి జలమండలి మేనేజర్ సుముఖతం వ్యక్తం చేశారు. నీళ్లు రానివారందరికీ రెండో కనెక్షన్‌ను ఇస్తామని తెలిపారు.

రెనోవా సెంచురీలో న్యూరో సైన్సెస్ ప్రారంభం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని రెనోవా సెంచురీ హాస్పిటల్‌లో 'రెనోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్' (రిన్స్)ను శుక్రవారం ప్రారంభించారు. ప్రముఖ న్యూరోసర్జన్, నిమ్స్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజారెడ్డి చేతుల మీదుగా ఈ న్యూరోబ్లాక్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అత్యాధునిక న్యూరోసైన్స్ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను ప్రపంచంలో చాలా దేశాలు తిరిగి వచ్చానని, వాటన్నింటి కంటే ఉత్తమ సాంకేతికత, పరికరాలను రిన్స్‌లో చూస్తున్నానని వెల్లడించారు. రెనోవా హాస్పిటల్స్ ఎండీ అండ్ సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఇతర ఆసుపత్రులు దృష్టిపెట్టని సేవలపై తాము దృష్టి పెట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా మధ్యస్థాయి మల్టీస్పెషాలిటీ సేవలు, కేన్సర్ చికిత్సలు, నాడి సంబంధిత చికిత్సలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజీ చీఫ్ జీఎంకేమూర్తి, బీకేఎస్ శాస్త్రి, మురళీధర్‌రెడ్డి, టీవీ రామకృష్ణమూర్తి, సయ్యద్ అమీర్ బాషా, లలిత పిడపర్తి, శుభేందు పరిదా, అభినయ్‌కుమార్ గట్టు, ఫణిరాజ్, నాగరాజు రెడ్డిచెర్ల, రవీంద్రనాథ్, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

నత్తనడకన 'అపార్' నమోదు!

- పట్టించుకోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు
- సమావేశాలు నిర్వహిస్తున్నా బేఖాతర్
- ఖైరతాబాద్ జోన్‌లో 10 శాతమే నమోదు


అపార్ నమోదుపై అవగాహన కలిగిస్తున్న సీఆర్పీలు

బంజారాహిల్స్: విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఒకే కార్డులో పొందుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ' (అపార్) నమోదు విద్యా శాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలో నత్తనడకన సాగుతున్నది. 'వన్ నేషన్–వన్ స్టూడెంట్' నినాదంతో ఈ ప్రక్రియను చేపట్టారు. ప్రారంభంలో 2 తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ గతేడాది సెప్టెంబర్ చివరి నుంచి ప్రారంభించారు. ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని గడువు విధించారు. అయితే ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రభుత్వ ప్రాథమిక, 243 స్టేట్ సిలబస్ ప్రైవేటు పాఠశాలలు, 18 సీబీఎస్ఈ పాఠశాలలు, 6 ఐసీఎస్ఈ పాఠశాలలు, 2 ఎయిడెడ్, 2 రెసిడెన్షియల్, ఒక సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల ఉండగా, వీటన్నింటిలో కలిపి 58 వేల మంది విద్యార్థులు చదువుకుంటుండగా అపార్ నమోదు ఇప్పటివరకు 10 శాతం మాత్రమే పూర్తయ్యింది.

విద్యార్థి సమగ్ర సమాచారం..

అపార్ కార్డులో విద్యార్థుల సమగ్ర సమాచారం ఉంటుంది. ఎక్కడ చదివారు..ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి..తదితర వ్యక్తిగత వివరాలు ఉంటాయి. ఉన్నత చదువులు, ప్రాజెక్టులు, స్కాలర్ షిప్పులు, ఇంటర్వ్యూలు, బహుమతులు వంటి వాటికి అపార్ కార్డులోని 12 అంకెల విశిష్ట నెంబర్‌ను ఉపయోగించి దరఖాస్తు చేసుకునేలా దీనిని రూపొందించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ప్రామాణికం కానుంది. అయితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అపార్ నమోదు పట్ల ఆయా పాఠశాలలు తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అపార్ నమోదుపై ఏమాత్రం ఆసక్తి కనబరచడం లేదు. గడిచిన రెండు నెలల నుంచి డీఈఓ, డిప్యూటీ డీఈఓ, డిప్యూటీ ఐఓఎస్‌లు, క్లస్టర్ రీసోర్స్ పర్సన్‌లు, ప్రైవేటు పాఠశాలలకు వెళ్తూ అపార్ నమోదు గురించి వివరిస్తూ ఎలా నమోదు చేయాలో అవగాహన కలిగిస్తున్నారు. మూడు రోజుల క్రితం జూమ్ మీటింగ్ కూడా జరిగింది. ఇంత జరుగుతున్నా నమోదులో మాత్రం పురోగతి కనిపించడం లేదు. ఇంకా 90 శాతం విద్యార్థుల నమోదు జరగాల్సి ఉంది. మరో వారం రోజులు మాత్రమే గడువు ఉండగా వంద శాతం జరుగుతుందనే నమ్మకం లేకుండాపోయింది. మండల కార్యాలయాల్లో ఈ విషయంపై ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నా ఆయా పాఠశాలల యాజమాన్యాలు మాత్రం పట్టించుకున్నట్లు కనిపించడం లేదు.

సమస్యలు అనేకం..

విద్యార్థి ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ, ఆధార్ సంఖ్య ఏవిధంగా ఉంటే యూడైస్‌లో నమోదు చేసిన వివరాలు కూడా అలాగే ఉండాలి. ఒక్క అక్షరం తేడా వచ్చినా అపార్ కార్డు జనరేట్ కావడం లేదు. దీంతో నమోదులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తల్లిదండ్రులు వారి పిల్లలకు సంబంధించిన వివరాలు, అంగీకార పత్రాలను ఉపాధ్యాయులకు సకాలంలో ఇవ్వడం లేదు. ఎంఆర్‌సీల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు చాలా రోజులు సమ్మెలో ఉండడం, ప్రభుత్వ పాఠశాలల్లో ఆపరేటర్లు లేకపోవడం కూడా నమోదు ఆలస్యానికి కారణంగా తెలుస్తోంది. ప్రైవేటు విద్యా సంస్థల్లో దీనిని అసలు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

పైసాపైసా పోగేసి స్థలాలు కొంటే కబ్జా చేస్తారా?

న్యాయం కోసం 400 మందితో రిలే నిరాహార దీక్ష


లేఔట్ సర్వే పేపర్లు చూపుతున్న బాధితులు

పంజగుట్ట: పైసాపైసా పోగేసి ఎంతోకష్టపడి కొనుగోలు చేసిన తమ ప్లాట్లను కొంతమంది రియల్ ఎస్టేట్ సంస్థల వారు హద్దులు మార్చి కబ్జా చేసేందుకు చూస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్పించుకుని తమకు న్యాయం చేయాలని లేనిపక్షంలో 400 మంది బాధితులం తమ కుటుంబ సభ్యులతో పాటు అక్కడే రిలే నిరాహార దీక్ష చేస్తామన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతాజీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఉపేంద్రలు మాట్లాడుతూ ఆర్‌టీసీ ఉద్యోగులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే వారు 1986 నుంచి 88 మధ్యలో సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 126, 130, 135, 136, 137లో చక్రపురికాలనీ, హుడా లేఔట్‌తో, పెద్ద ఆర్‌టీసీ కాలనీ, చిన్న ఆర్టీసీ కాలనీ పేరుతో బ్యాంకుల నుంచి రుణాలు పొంది ప్లాట్లను కొనుగోలు చేశామని తెలిపారు. 2006లో తమ పక్క సర్వే నెంబర్ 133, 134, 156లో 53 ఎకరాల 30 గుంటలు కొనుగోలు చేసిన ఓ నిర్మాణ సంస్థ మేనేజింగ్ పార్ట్నర్ కృష్ణంరాజు తమ లేఔట్‌లోని సర్వే నెంబర్ 130, 135లోని 18 ఎకరాల స్థలంలో ఉన్న 400 ప్లాట్ల సరిహద్దులు తొలగించి ఆక్రమించేందుకు యత్నించారని తెలిపారు. తాము ప్రతిఘటించి న్యాయస్థానాన్ని ఆశ్రయించామని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం సర్వే నిర్వహించి బాధితులను న్యాయం చేయాలని ఆదేశించిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీన సర్వే నిర్వహించేందుకు వచ్చిన సర్వే బృందం ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకు కృష్ణంరాజు అనుకూలంగా సర్వే నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అడ్డుకునేందుకు యత్నిస్తే పోలీసులు తమనే అడ్డుకుంటున్నారని వాపోయారు. ముఖ్యమంత్రి స్పందించి రీ సర్వే చేయించి తమ 400 కుటుంబాలను ఆదుకోవాలని వేడుకున్నారు. శనివారం నుంచి అక్కడే తమ 400 కుటుంబాలు తమ లేఔట్‌లోనే రిలే నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు.

సీఎంకు శుభాకాంక్షలు


సీఎం రేవంత్‌రెడ్డితో కేశవరావు, గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: సింగపూర్, దావోస్ పర్యటనలు విజయవంతంగా ముగించుకుని తిరిగి హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో ప్రభుత్వ సలహాదారు కేశవ్‌రావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు రూ.1,78,950 కోట్ల రికార్డు స్థాయిలో సీఎం పెట్టుబడులు తీసుకురావడంపై మేయర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎంపై నమ్మకంతో రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెట్టిన సంస్థల యజమానులకు, కృషి చేసిన ప్రతిఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- ఇందిరమ్మ ఇండ్ల కోసమే 10,188 దరఖాస్తులు


ప్రజావాణిలో వివిధ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు పెట్టుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు

లక్డీకాపూల్ : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో రికార్డుస్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రులు పెద్ద ఎత్తున స్పష్టమైన హామీలు ఇస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులు అర్జీలు పెట్టుకునేందుకు అత్యధిక సంఖ్యలో ప్రజాభవన్‌కు తరలివస్తున్నారు. వీరిలో ఎక్కువ సంఖ్యలో మహిళా లబ్ధిదారులే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రజావాణికి మొత్తం 12,459 దరఖాస్తులు అందాయి. అందులో చాలా వరకు 10,188 ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఉన్నాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 252, విద్యుత్ శాఖకు సంబంధించి 110, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 51, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 5, ఇతర శాఖలకు సంబంధించి 85 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్. జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించి ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఆర్టిజన్లను పర్మనెంట్ చేయాలి

వెంగళరావునగర్: కొన్నేళ్లుగా విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్లను తక్షణమే పర్మనెంట్ చేయాలని తెలంగాణా విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జెన్‌కో కార్యాలయం ఎదుట శుక్రవారం టీవీజేఏసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు నేతలు మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో ఆర్టిజన్లుగా అనేక మంది ఏళ్ల తరబడి పని చేస్తున్నట్టు చెప్పారు. అనేక ప్రభుత్వాలు మారినప్పటికీ వారిని పట్టించుకునే నాథుడే లేడన్నారు. వారి కష్టాలకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని, ఇందుకోసం వారిని శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్లను పర్మనెంట్ చేసినంత మాత్రాన విద్యుత్‌శాఖకు అదనపు భారంపడే అవకాశం ఉండదని, వారిని ఇప్పటికైనా పర్మనెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ 1535 యూనియన్ అధ్యక్షులు ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్‌లతో పాటుగా యూనియన్ నేతలు, ఆర్టిజన్స్ (కార్మికులు) పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు


సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

ఫిలింనగర్: అధికారం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలు చేస్తుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాడిగారి భోజిరెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకట్‌స్వామిలు విమర్శించారు. జూబ్లీహిల్స్ డివిజన్ రోడ్డునెంబర్–46లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో 'సంవిధాన్ గౌరవ్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను వాడుకుంటుందన్నారు. కేవలం అధికారం కోసం ఎంతకైనా దిగజారేందుకు కాంగ్రెస్ పార్టీ వెనుకాడదన్నారు. రాజ్యాంగంపై, అంబేడ్కర్‌పై ప్రేమ ఉన్నట్లు కపట ప్రేమ నటిస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజూ కూడా అంబేడ్కర్, రాజ్యాంగాన్ని గౌరవించకపోగా ఎన్నో అవమానాలకు గురిచేసిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం ఆనాడు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టించిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ దిగజారుడు పనులు మానుకుంటే మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దంగుల శ్రీనివాస్, కొత్త నీరజ, కస్తూరి మహిపాల్‌రెడ్డి, సీతల అనిల్‌కుమార్, ఉపేంద్ర, రామాంజనేయులు, గురుబ్రహ్మగౌడ్, రాంబాబు, రాముయాదవ్, మహేష్, మంజలి నరసింహ, ఆనంద్‌సాగర్, అంజిరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సందర్శనార్థం ధనుర్బాణాలు


శ్రీరాముడి ధనుర్బాణాలను భక్తి ప్రపత్తులతో తిలకిస్తున్న భక్తులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–18లోని శ్రీసీతారామస్వామి దేవాలయంలో అయోధ్య రామయ్యకు సమర్పించబోయే ధనుర్బాణాలను భక్తుల కోసం అందుబాటులో ఉంచారు. వీటిని దర్శించుకునేందుకు 300 మందికి పైగా భక్తులు విచ్చేయడంతో ఆలయం సందడిగా మారింది. చల్లా శ్రీనివాసశాస్త్రి అనే దాత 13 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో ఈ ధనుర్బాణాలను తయారు చేయించారు. త్వరలో వీటిని అయోధ్య ఆలయానికి అందించనున్నారు. ప్రతిష్ఠాపనకు ఇంకా సమయం ఉండడంతో ఆయన వీటిని భక్తుల సందర్శనార్థం ప్రముఖ ఆలయాలకు తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగా సీతారామస్వామి ఆలయంలో ఈ ధనుర్బాణాలు తీసుకురాగా భక్తులు తండోపతండాలు విచ్చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవాచార్యులు ఈ ధనుర్బాణాలకు రాముడి సన్నిధిలో భక్తి ప్రపత్తులతో భక్తుల నడుమ సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.

కంటైనర్ బోల్తా

- డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలు – ట్రాఫిక్‌కు అంతరాయం


లక్డీకాపూల్ చౌరస్తాలో బోల్తా పడ్డ లారీ

లక్డీకాపూల్: కంటైనర్ లారీ బోల్తా పడటంతో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మూసాపేట్ నుంచి కాటేదాన్ వెళ్తున్న ఓ కంటైనర్ లారీ లక్డీకాపూల్ టర్నింగ్ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో రోడ్డుపై రద్దీ లేకపోవడంతో వాహనదారులకు పెను ప్రమాదం తప్పింది. కంటైనర్ లారీ బోల్తా పడటంతో లక్డీకాపూల్, సెక్రటేరియట్, ఖైరతాబాద్ రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రంగంలోకి దిగిన సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు భారీ క్రేన్ సహాయంతో కంటైనర్‌ను పక్కకు తొలగించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించేందుకు శాయశక్తులా కృషి చేశారు.

ఆయుర్వేద ఆసుపత్రిలో విచారణ బృందం

- ఆకస్మిక రాకతో వైద్యులు, సిబ్బంది అవాక్కు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను శుక్రవారం సాయంత్రం విచారణ బృందం సందర్శించారు. ఆకస్మికంగా విచారణ అధికారులు రావడంతో అటు ఆసుపత్రి, ఇటు కళాశాలల వైద్యులు, సిబ్బంది అవాక్కయ్యారు. కాగా ఆసుపత్రిలో గత పదిరోజుల నుంచి అంతర్గత పోరు జరుగుతుందని ఆసుపత్రి వర్గాల ద్వారా శుక్రవారం వెల్లడైంది. ముఖ్యంగా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం (డైట్) వాటి బిల్లుల వ్యవహారంలో సూపరింటెండెంట్‌కు, సదరు కాంట్రాక్టర్‌తో పాటుగా కొంతమంది పెద్ద మనుషులకు (సీనియర్ ప్రొఫెసర్లు)కు మధ్య సఖ్యత కుదరడం లేదని తెలుస్తోంది. బిల్లుల చెల్లింపులపై సూపరింటెండెంట్ ఒత్తిడిని తట్టుకోలేక విషయాన్ని ఆయుష్‌శాఖ డైరెక్టర్‌కు సమాచారం అందించారని చెబుతున్నారు. దీంతో ఆయుష్ డైరెక్టర్ సూచన మేరకు ఆయుర్వేదిక్ అడిషనల్ పరమేశ్వర్‌నాయక్, యునానీ అడిషనల్ డైరెక్టర్ వసంతరావు, పలువురు ఆయుష్‌శాఖ సిబ్బంది ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్యశాలకు వచ్చి విచారణ కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, హెడ్ నర్సులు, నర్సులు, ఇతర సిబ్బంది, డైట్ కాంట్రాక్టర్, ఆసుపత్రిలోని రోగులతో సీక్రెట్‌గా విచారణ చేస్తున్నారు. ఇదే విషయంపై ఆయా అధికారులను వివరణ తెలుసుకోవడానికి ప్రయత్నించగా పూర్తిస్థాయిలో విచారణ అనంతరం ఆయుష్ డైరెక్టర్ అన్ని విషయాలను తెలియజేస్తారని సంబంధిత విచారణ బృందం తెలిపింది.

దేశ సమగ్రతకు బీజేపీ కృషి

శ్రీనగర్‌కాలనీ: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా బడుగు, బలహీనవర్గాలకు అందించిన హక్కులు చిరస్మరణీయమని, దేశ సమగ్రతను బీజేపీ కృషి చేస్తుందని బీజేపీ పార్టీ అని సీనియర్ మహిళా నేత బంగారు స్రవంతి, శ్రీనగర్‌కాలనీ బీజేపీ అధ్యక్షురాలు గారపాటి అనంతలక్ష్మి అన్నారు. ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్ నగర్‌లో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రతిపక్ష పార్టీల చౌకబారు, ఓటు బ్యాంకు రాజకీయాలు బీజేపీ చేయదని, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ దేశ అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బంగారు ప్రశాంత్, కుంబాల గంగరాజు, అట్లూరి రామకృష్ణ, శాంతికుమార్, హరీష్‌యాదవ్, నరేందర్‌యాదవ్, శ్రీనివాస్ ఉమేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: గ్యాస్ట్రో సమస్యలతో ఆపరేషన్ చేయించుకున్న మస్రత్ మినాజ్ వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నుంచి రూ.60 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు చెక్కును కార్పొరేటర్ విజయారెడ్డి బాధితుడికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్‌యాదవ్, ధనరాజ్ రాథోడ్, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో గత 20 ఏళ్లకుపైగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు – ఒప్పంద అధ్యాపకుల పాత్ర' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో సరళీకరణ ప్రారంభమైన తరువాత విశ్వవిద్యాలయాకు ముఖ్యంగా రెండు సమస్యలు మొదలయ్యాయని తెలిపారు. అందులో ఒక్కటి విశ్వవిద్యాలయాల్లో నియామకాలను నిలిపివేశారని, రెండోది నిధులను ఆపివేశారని ఆయన పేర్కొన్నారు. నిధులు, నియామకాలు లేకపోవడంతో విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం చేపటాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల్లో భద్రతతో కూడిన ఉద్యోగం, సమాన పనికి సమాన వేతం ఇస్తే విద్యావ్యవస్థ మరింత బలపడుతుందన్నారు.


28న గాయకుల ఎంపిక

పంజగుట్ట: చారిత్రాత్మికంగా 243 చరణాలతో రచించిన 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యాన్ని 243 గాయకులతో ఆలపించనున్న నేపథ్యంలో గాయనీ, గాయకులను ఈ నెల 28వ తేదీన రవీంద్రభారతిలో ఎంపిక చేయనున్నట్లు గేయ రచయిత, ప్రముఖ కవి, ప్రజా గాయకుడు, సంగీత దర్శకు లు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పల్లె మాధుర్యాన్ని ప్రస్తుత తరానికి, రాబోయే తరానికి వివరించేందుకే ఈ 243 చరణాలు ఉన్న గేయాన్ని రచించినట్లు తెలిపారు. దీన్ని 243 గాయకులచే పాడించేందుకు ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో తిరిగి పల్లెల్లోని గాయకులను కొంతమందిని ఎంపికచేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు తాము గుర్తించని గాయకులు 28వ తేదీన రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొని వారి ప్రతిభ చూపించవచ్చునని తెలిపారు.



హైదరాబాద్ నగరం ఒక్కసారిగా సాహితీ పరిమళాలను అద్దుకుంది. భారత్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన సాహితీ ప్రముఖులు నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో వాలిపోయారు. నగరంలోని టీ-హబ్, సత్వ నాలెడ్జ్ సిటీ వేదికలుగా భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ ఫెస్ట్ శుక్రవారం ఉదయం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. శని, ఆదివారాల్లోనూ కొనసాగనున్న ఈ సాహితీ పండుగలో సాహిత్యం, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరించిపోతున్న భారతీయ భాషలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ప్రత్యేక సదస్సులు, వర్క్‌షాప్స్, కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు కార్యక్రమాల్లో భాగంగా సాహితీ ప్రముఖులతో ప్రత్యక్ష చర్చా కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించారు. ప్రారంభ ప్లీనరీలో ఏ లైఫ్ ఆఫ్ సినిమా పై సినీ ప్రముఖులు షభానా అజ్మీ, సాహితీవేత్త అమితా దేశాయ్‌తో చర్చించారు. అనంతరకార్యక్రమంలో అంతరించిపోతున్న సింధీ భాషపై ప్రముఖులు నందితా భవానీ, రితా కొఠారీ, సోనీ వాధ్వా చర్చించారు. అంతేకాకుండా ప్రత్యేకంగా కావ్యధార, స్టేజ్ టాక్స్, ఆర్ట్ వర్క్‌షాప్స్, నన్హానుక్కడ్ కార్యక్రమాలు, పరిశోధనా రంగ ప్రముఖులతో సైన్స్ అండ్ ది సిటీ సెషన్స్, రచయితలకు సంబంధించిన మీట్‌పై చర్చ నిర్వహించారు. ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్న కళా ప్రదర్శనలు, నగరంలోని కొండరాళ్ల సంరక్షణపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో







సాహిత్య సౌరభం..

హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్ ప్రారంభం

ఆకట్టుకున్న వర్క్‌షాపులు, కళాప్రదర్శనలు

టీ-హబ్, సత్వ నాలెడ్జ్ సిటీ వేదికగా ఏర్పాట్లు

హాజరైన ప్రముఖులు, రచయితలు, సినీ స్టార్స్

ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సక్సెస్ కోసమే సినిమా..

వ్యాపారాంశంగా మారింది :

సినీ ప్రముఖుడు అమోల్ పాలేకర్

మూస కథలకు విభిన్నంగా తీయడం ఇష్టం: ఇంద్రగంటి

సంస్కృతి, కట్టుబాట్లు, వ్యక్తిగత స్వేచ్ఛను హరించకూడదు : సినీతార హుమా ఖురేషి



సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం సినిమా వాణిజ్యపరమైన అంశమని, ఈ కారణం చేత సక్సెస్ కోసమే కమర్షియల్ హంగులతో నిర్మిస్తున్నారని ప్రముఖ భారతీయ నటులు, దర్శకులు అమోల్ పాలేకర్ అన్నారు. డిజిటల్ టెక్నాలజీ యుగంలో సినిమా దర్శకుడు ఇతర సినిమా బృందం కన్నా సాంకేతికత పైనే ఎక్కువ ఆధారపడుతోందన్నారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్‌లో భాగంగా ప్లీనరీలో అమోల్ పాలేకర్ తన సతీమణి సంధ్య గోఖలేతో కలిసి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రముఖ టాలీవుడ్ దర్శకులు మోహనక్రిష్ణ ఇంద్రగంటితో తాను రాసిన నూతన పుస్తకం 'వ్యూ ఫైండర్' పై చర్చించారు. 'నా వరకూ సినిమా అంటే అందరిలా కాకుండా విభిన్నంగా తీయడమే నచ్చుతుందన్నారు. మెయిన్ స్ట్రీంలో సినిమా రంగానికి నియమాలు, నిబంధనలు, పరిమితులు వంటి సంస్కృతిలో ఇమడలేకపోయానన్నారు. ఎంత పెద్ద విజయం సాధించినా, నిర్మించగలిగినా ఆ క్రెడిట్ మొదట రచయితకే చెల్లుతుంది. ప్రస్తుత సినిమా వందల కోట్ల అంశంగా మారింది. ఒక పెద్ద నిర్మాత నాతో ఇలాంటి సినిమాలే తీయాలని సంప్రదించాడు, అలాంటి పది సినిమాల్లో 9 రిజక్ట్ చేసేవాడిని' అని అన్నారు. 'ఒక సినిమా షూట్‌లో భాగంగా తోటి నటి స్మితను నిజంగా కొట్టాల్సి వచ్చింది, దర్శకుడి ప్రోద్బలంతో ఆ సీన్ బాగా పండించడానికి ఇష్టం లేకున్నా కొట్టాల్సి వచ్చింది. ఆ సీన్‌లో స్మిత మంచి నటన కనబర్చింది. అనంతరం క్షమాపణ కోరినా, నేను కొట్టడం వల్లే మరింత వాస్తవంగా నటించగలిగానని ఆమె చెప్పడంతో ఆశ్చర్యపోయాను' అన్నారు. '70లలో అద్భుతమైన మధ్య తరగతి సినిమాల ప్రస్తావన రావడంతో.. నాటి జీవితాలకు, ప్రస్తుత జీవన శైలికి తేడా ఉందని, ఇప్పుడు అలాంటి కథలను ఊహించలేం. కానీ ఈ మధ్య అలాంటి కథే 'సత్యం సుందరం' నన్నెంతో హత్తుకుంది. నా సినీ మిత్రుడు ఉత్పల్ దత్ ఎంత మంచివాడో నాకే తెలుసు, కానీ దేశంలోనే మొట్టమొదటి సెడేటివ్ కేసుతో అరెస్టు అయ్యాడు' అని గుర్తు చేసుకున్నారు.

యాన్ యాక్సిడెంటల్ సూపర్ హీరో 2లోనే క్లైమాక్స్..

అనంతరం ప్రముఖ సినీతార హుమా ఖురేషి ముఖ్య అతిథిగా సాహితీవేత్త కిన్నెర మూర్తితో చర్చించారు. ఈ సందర్భంగా హుమా ఖురేషి రాసిన యాన్ యాక్సిడెంటల్ సూపర్ హీరో పుస్తకంలోని కొన్ని అంశాలను చదివి వివరించారు. ఈ పుస్తకం క్లైమాక్స్ త్వరలో రానున్న రెండో పుస్తకంలో ఉంటుందన్నారు. సినిమా ఎంపికలో కథే ప్రామాణికంగా చేస్తానని, యాక్షన్ కామెడీ వంటి చిత్రం చేయడం ఇష్టమని వెల్లడించారు.

కార్టూన్ స్పెషల్..

ఈ ఫెస్ట్‌లో భాగంగా ప్రముఖ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య ఆధ్వర్యంలోని అబ్స్యూస్ యాంగిల్ కార్టూన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీపీ ఆచార్య మాట్లాడుతూ.. ఇది నగర ఖ్యాతిని మరింత పెంచుతుందని, ఈ తరం ఆలోచనా విధానానికి స్ఫూర్తి నింపే వ్యక్తులు హాజరుకావడం సంతోషమన్నారు. తన కార్టూన్ పుస్తకంలో బ్యూరోకాట్ల ప్రయాణాన్ని, ఆలోచనా విధానాన్ని కార్టూన్ల రూపంలో తెలిపానన్నారు. ఫొటోలతో ప్రత్యేక చిత్ర ప్రదర్శనను ఏరాష్టు చేశారు. పుస్తకావిష్కరణలో ప్రముఖ రచయిత డా.దినేష్ శర్మ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.ఎస్ఎన్ మోహంతి పాల్గొన్నారు.



నాస్తికులుగా బతకడం కష్టం..

'నా భార్యను కలవక ముందు జీవితం, ఆ తరువాతి జీవితం అనేంత ప్రభావం చూపించింది. సతీమణి సంధ్యను కలువక ముందు ఐదేళ్లకు ఒక సినిమా తీస్తే, ఆమెను కలిశాక ఏడాదికో సినిమా తీయగలిగాను. తన పుస్తకం వ్యూ ఫైండర్ మా ఇద్దరి ప్రయాణం క్లైమాక్స్ వంటిది' అని మోహన క్రిష్ణ ఇంద్రగంటితో చమత్కరించారు. 'నా చివరి ఎనిమిది సినిమాలకూ నా భార్యే రైటర్. మేమిద్దరమూ నాస్తికులమే, సామాజికంగా నాస్తికులుగా సాగడం అంత సులువు కాదు' అన్నారు.. 'నేను సినిమా రంగానికి చెందిన వ్యక్తిని కాదు, 2000 సంవత్సరంలో అమోల్ పాలేకర్ సినిమాకు మొదటి సారి పనిచేశాను' అని సంధ్య తెలిపారు.





హైటెక్స్.. పెటెక్స్..

ఒకే చోట మూడు ఎగ్జిబిషన్లు

200లకు పైగా రకాల పిల్లులు

70 రకాల అలంకార చేపలు

హైటెక్స్ ఎగ్జిబిషన్ కేంద్రంలో 31 నుంచి ఫిబ్రవరి 2 వరకూ ఈవెంట్స్

ఫిబ్రవరి 1న కిడ్స్ రన్



సాక్షి, సిటీ బ్యూరో: దేశంలోనే అతిపెద్ద పెట్ ఎక్స్‌పో నిర్వహణకు హైదరాబాద్ వేదికగా నిలవనుంది. జనవరి 31 నుండి ఫిబ్రవరి 2 వరకూ మూడు రోజుల పాటు పెటెక్స్, తొలి కిడ్స్ బిజినెస్ కార్నివాల్, కిడ్స్ ఫెయిర్‌లను ఏకకాలంలో హైటెక్స్‌లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన అంశాలను హైటెక్స్ వాణిజ్య ఉన్నతాధికారి టీజీ శ్రీకాంత్ శుక్రవారం వివరించారు. కార్నివెల్ మద్దతుతో పెటెక్స్ భారత్, టర్కీ, చెక్ రిపబ్లిక్, సింగపూర్, జపాన్, జర్మనీ తదితర దేశాలకు చెందిన 60కిపైగా ఎగ్జిబిటర్లు ఉన్నారన్నారు. పెంపుడు జంతు ప్రేమికులు, ఔత్సాహికులను ఒక చోట చేర్చుతుందన్నారు. ఈ ప్రదర్శనలో 70కిపైగా అలంకారప్రాయమైన చేపల జాతులు ఉంటాని తెలిపారు. వివిధ బ్రీడ్‌ల గుర్రాలు, పక్షులు, కుక్కల ఫ్యాషన్ షో, కే-9 స్కూల్ కుక్కల ప్రదర్శన, స్కూపీ స్క్రబ్ వారి ఉచిత బేసిక్ గ్రూమింగ్ వంటివి ప్రదర్శించనున్నారు. కిడ్స్ బిజినెస్ కార్నివాల్ తొలి ఎడిషన్‌లో 85 మంది ఔత్సాహిక విద్యార్థులు ఉన్నారన్నారు. పలు ఉత్పత్తులు, ఆవిష్కరణలను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించనున్నారని తెలిపారు. క్యాట్ ఛాంపియన్‌షిప్‌ను ఇండియన్ క్యాట్ క్లబ్ నిర్వహిస్తోంది. 200 రకాల పిల్లులు, అందులోనూ కొన్ని అరుదైన జాతులను సందర్శించొచ్చని పేర్కొన్నారు.

మొదటిసారి కిడ్స్ కార్నివాల్..

మొట్టమొదటిసారి కిడ్స్ బిజినెస్ కార్నివాల్ నిర్వహించనున్నామని, పిల్లల్లోని వ్యవస్థాపక స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఈ ఎక్స్‌పో వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యాపార ప్రణాళిక, పోటీ, ఉత్పత్తుల ప్రదర్శన మొదలైనవి ఇందులో ఉంటాయని వివరించారు. ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ ప్రాజెక్టులు, పెబుల్ ఆర్ట్, అయస్కాంత బుక్ మార్క్స్, విద్యార్థులు రాసిన పుస్తకాలు, 85 మంది విద్యార్థులు తయారు చేసిన హాండీ క్రాఫ్ట్స్ మొదలైనవి ఎక్స్‌పోలో చూడొచ్చని తెలిపారు.

కిడ్స్ రన్..

ఫిబ్రవరి 1న సాయంత్రం 5 గంటలకు హైటెక్స్‌లో 4కిలో మీటర్లు, 2-కే, 1-కే వంటి మూడు విభిన్న కేటగిరీల్లో కిడ్స్ రన్ నిర్వహించనున్నారు. ఐదేళ్ల నుంచి 13 ఏళ్ల వయసు పిల్లలు ఇందులో పాల్గొన వచ్చన్నారు.

పది రెట్లు ఎక్కువగా..

పెంపుడు జంతువుల దత్తత ప్రక్రియ భారత్ కంటే పాశ్చాత్య దేశాల్లో పది రెట్లు ఎక్కువని నిర్వాహకులు చెబుతున్నారు. 12 రాష్ట్రాలు, ఐదు దేశాల ప్రదర్శనకారులు ఈ మూడు ఎక్స్‌పోలో పాల్గొంటారని, సుమారు 25 వేలకు పైగా సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. దేశంలో పెట్ కేర్ పరిశ్రమ ప్రారంభ దశలో ఉందని, క్రమంగా పురోగమిస్తోందని, పెంపుడు జంతువుల దత్తత క్రమంగా పెరుగుతోందన్నారు.





సౌత్ దివా కేలండర్ విడుదల..

సాక్షి, సిటీ బ్యూరో: అందాల తారాల ఛాయాచిత్రాలతో మై సౌత్ దివా పేరిట భారతి సిమెంట్స్, మీడియా 9 సంస్థలు సంయుక్తంగా కేలండర్ రూపొందించాయి. ఈ కేలండర్‌ని ఫిల్మ్ నగర్‌లోని రామానాయుడు స్టూడియోలో శుక్రవారం ఆవిష్కరించారు. శ్రియా శరన్, కేథరిన్ త్రెసా, కాజల్ అగర్వాల్ తదితరులు ఈ క్యాలెండర్ భామలుగా తళుక్కుమన్నారు. అందంతో పాటు స్థానిక సంస్కృతికి కూడా ఈ కేలండర్ పట్టం కట్టిందని క్యూరేటర్ ఫొటో గ్రాఫర్ మనోజ్ కుమార్ కటోకర్ తెలిపారు. కేలండర్‌లో మెరిసిన రియా సచ్‌దేవా, పాలక్ అగర్వాల్ తదితర టాలీవుడ్ తారలు, సినీ దర్శకులు కరుణా కుమార్, భారతి సిమెంట్స్ ఎండీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



లక్డీకాపూల్ : నగరంలో ఆకృతి ఎలైట్ వెడ్డింగ్ స్పెషల్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ అందుబాటులోకి వచ్చింది. హోటల్ తాజ్ కృష్ణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను శశి నేహత మోడల్ సోనీతో కలిసి ప్రారంభించారు. ఈ నెల 26 వరకూ ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేడే బూమ్ బాక్స్ ఫెస్ట్..

సాక్షి, సిటీబ్యూరో: సమకాలీన హిప్-హాప్ బీట్స్‌తో బాలీవుడ్‌లో ప్రసిద్ధి చెందిన పాటల్ని మిశ్రమంగా చేసి సంగీత విందు అందించే మ్యూజిక్ ఫెస్టివల్ 'సీగ్రమ్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్' శనివారం నగరంలో సందడి చేయనుంది. ఈ బూమ్ బాక్స్ ఫెస్ట్‌లో గాయకుడు అర్మాన్ మాలిక్, అమిత్ త్రివేది, నికితా గాంధీ, నీతీ మోహన్, ప్రముఖ రాపర్లతో పాటు స్థానిక కళాకారులు పాల్గొని సంగీత స్వరాలతో అలరించనున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ జాతీయ స్థాయి కార్యక్రమం హైదరాబాద్, ముంబయి, గురుగ్రామ్, గౌహతిలో జరుగనుందని, గేమింగ్ కూడా ఇందులో భాగంగా ఉంటుందని వివరించారు.

ఓపెన్ ప్లాట్, అపార్ట్‌మెంట్, కమర్షియల్ స్పేస్, రిటైల్.. ఇలా రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సాధనాలు అనేకం. కానీ, ఓపెన్ ప్లాట్లలో ఇన్వెస్ట్‌మెంట్స్‌తోనే అధిక రాబడి వస్తుందని హౌసింగ్.కామ్ సర్వే తెలిపింది. 2015 నుంచి దేశంలోని 8 ప్రధాన నగరాలలో ప్రతి సంవత్సరం స్థలాల ధరలలో 7 శాతం వృద్ధి నమోదవుతుంటే.. అపార్ట్‌మెంట్లలో మాత్రం 2 శాతమే పెరుగుదల కనిపిస్తోందని పేర్కొంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాల్లోని నివాస ప్లాట్లకే ఎక్కువ డిమాండ్ ఉందని వెల్లడించింది. – సాక్షి, సిటీబ్యూరో

అధిక రాబడికి ప్లాటే బెటర్

హైదరాబాద్, చెన్నై, బెంగళూరులోని నివాస స్థలాలకు డిమాండ్

ప్లాట్ల ధరలు ఏటా 2 శాతం, ఫ్లాట్ల ధరలు 7 శాతం వృద్ధి

పెద్ద నగరాలలో స్థలాల కొరత ఎక్కువగా ఉండటం, విపరీతమైన పోటీ నేపథ్యంలో ఉన్న కొద్ది స్థలాల ధరలు ఎక్కువగా ఉన్నాయని హౌసింగ్.కామ్ గ్రూప్ సీఈఓ ధ్రువ్ అగర్వాలా తెలిపారు. అందుకే ప్రధాన నగరాలలో పరిమిత స్థాయిలోని స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఓపెన్ ప్లాట్లకు, ఇండిపెండెంగ్ గృహాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో పెద్ద నగరాల్లోని శివారు ప్రాంతాలలో బడా డెవలపర్లు ఓపెన్ ప్లాట్ వెంచర్లు, వ్యక్తిగత గృహాల ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారని, దీంతో డిమాండ్ పునఃప్రారంభమైందని చెప్పారు.

కరోనాతో పెరిగిన డిమాండ్..

ఢిల్లీ–ఎన్‌సీఆర్, పుణే, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తా, అహ్మదాబాద్ ఎనిమిది ప్రధాన నగరాల్లో సాధారణంగా కొనుగోలుదారులు ఓపెన్ ప్లాట్ల కంటే ఫ్లాట్లు కొనుగోలు చేయడానికే ఇష్టపడతారు. ఎందుకంటే భద్రతతో పాటు పవర్ బ్యాకప్, కార్ పార్కింగ్, క్లబ్‌హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్, గార్డెన్ వంటి కామన్ వసతులు ఉంటాయని అపార్ట్‌మెంట్ కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు. కానీ, కరోనా నేపథ్యంలో కామన్ వసతులు వినియోగం, అపార్ట్‌మెంట్లలో ఎక్కువ జనాభా వంటివి శ్రేయస్కరం కాదనే అభిప్రాయం ఏర్పడింది. దీంతో సొంతంగా స్థలం కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకోవడమో లేక వ్యక్తిగత గృహాలను కొనుగోలు చేసేందుకే కొనుగోలుదారులు మొగ్గు చూపుతున్నారు.

ఇతర దక్షిణాది నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోని ఓపెన్ ప్లాట్లకే డిమాండ్ ఎక్కువగా ఉంది. 2018–24 మధ్య కాలంలో నగరంలోని స్థలాలలో గరిష్టంగా 21 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదవుతుంది. శంకర్‌పల్లి, పటాన్‌చెరు, తుక్కుగూడ, మహేశ్వరం, షాద్‌నగర్ ప్రాంతాల్లోని స్థలాలకు డిమాండ్, ధరల పెరుగుదల ఎక్కువగా ఉందని తెలిపింది. కాగా.. చెన్నైలో ప్లాట్లలో వార్షిక వృద్ధి రేటు 18 శాతం, బెంగళూరులో 13 శాతం ఉంది. చెన్నైలో అంబత్తూరు, అవడి, ఒరిగడం, శ్రీపెరంబుదూర్, తైయూర్ ప్రాంతాలలో, బెంగళూరులో నీలమంగళ, దేవనహళ్లి, చిక్కబల్లాపూర్, హోస్కోట్, కొంబల్‌గోడు ప్రాంతాల్లోని ప్లాట్లకు ఆదరణ ఎక్కువగా ఉంది.

హైదరాబాద్‌లో ప్లాట్లకే డిమాండ్ ఎక్కువ

- 2018–24 మధ్య ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ప్లాట్ల వార్షిక వృద్ధి రేటు 15 శాతంగా ఉంది. సోహ్నా, గుర్గావ్‌లో భూముల ధరలు ఏటా 6 శాతం పెరుగుతున్నాయి. సెక్టార్ 99, ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, సెక్టార్ 95ఏ, సెక్టార్ 70ఏ, సెక్టార్ 63లలోని నివాస స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

13–21 శాతం పెరిగిన ధరలు..

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలతో పాటూ గుర్గావ్‌లోని కొన్ని ప్రధాన ప్రాంతాలలోని నివాస స్థలాలకు డిమాండ్ పెరుగుతుందని హౌసింగ్.కామ్ రీసెర్చ్ హెడ్ అంకితా సూద్ తెలిపారు. 2018 నుంచి ఆయా నగరాలలోని ఓపెన్ ప్లాట్లలో రెండంకెల వృద్ధి నమోదవుతుందని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలలో ఈ నగరాల్లో భూ ముల ధరలు 13–21 శాతం మేర పెరిగాయని చెప్పారు. ఇదే నగరాల్లోని అపార్ట్‌మెంట్ల ధరలలో మాత్రం 2–6 శాతం మేర వృద్ధి ఉందని తెలిపారు. కరోనా నేపథ్యంలో కొనుగోలుదారుల అభిరుచుల్లో వచ్చిన మార్పులు, పాలసీలతో రాబోయే త్రైమాసికంలో ఈ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు.





ఆధునికత, విలాసవంతమైన జీవనశైలికి యువ గృహ కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. లగ్జరీ కాదు.. అంతకుమించి కోరుకుంటున్నారు. దీంతో 4 వేల నుంచి 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారు. ఇవి విశాలంగా ఉంటున్నాయే తప్ప సేవలపరంగా యువ కస్టమర్లలో అసంతృప్తి ఉంది. వీరిని సంతృప్తి పరిచేలా యువ డెవలపర్లు బ్రాండెడ్ హౌసింగ్‌లను నిర్మిస్తున్నారు. అగ్రశ్రేణి ఆతిథ్య సంస్థలతో కలిసి బ్రాండెడ్ రెసిడెన్సీ ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారు. ఇప్పటివరకు ముంబై, బెంగళూరు, గుర్గావ్ వంటి నగరాలకే పరిమితమైన ఈ తరహా ప్రాజెక్ట్‌లు హైదరాబాద్‌లోనూ నిర్మితమవుతున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో

డిజైనర్ హోమ్స్

విలాసవంతమైన గృహాల్లో కొత్త ట్రెండ్

నగరంలో ఫైవ్ స్టార్, బ్రాండెడ్ రెసిడెన్సీలు

- వీటిలో నివాసం.. స్టేటస్ సింబల్‌గా భావిస్తున్న యువ కస్టమర్లు
- ఈ ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకు హెచ్‌ఎన్‌ఐ, ప్రవాసుల ఆసక్తి
- సేవల కోసం ఆతిథ్య సంస్థలతో డెవలపర్ల ఒప్పందాలు
- ప్రైవసీ, భద్రతతో పాటు గ్రీనరీ, ఓపెన్ స్పేస్‌కు ప్రాధాన్యం
- కోకాపేట, పుప్పాలగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో ఈ తరహా నిర్మాణాలు



మారియట్, తాజ్, లీలా, ఇంటర్‌కాంటినెంటల్ వంటి అగ్రశ్రేణి ఆతిథ్య సంస్థలతో కలిసి విలాసవంతమైన అపార్ట్‌మెంట్లను నిర్మించడమే ఈ రెసిడెన్సీల ప్రత్యేకత. డిజైనింగ్, ఆర్కిటెక్చర్, ఎలివేషన్స్, విస్తీర్ణం, వసతులు, సేవలు.. అన్నీ టాప్ క్లాస్‌గా ఉంటాయి. బ్రాండెడ్ రెసిడెన్సీ అంటే కేవలం ప్రాపర్టీని కొనుగోలు చేయడం కాదు.. అంతర్జాతీయ జీవనశైలి అనుభూతిని పొందడం.

బ్రాండెడ్ రెసిడెన్సీలు అంటే?

స్టార్ హోటల్ సేవలు, అపార్ట్‌మెంట్ కలిపి ఉండే మిశ్రమ వినియోగ ప్రాజెక్ట్‌లనే బ్రాండెడ్ రెసిడెన్సీలు అంటారు. ఇందులో లేఔట్ స్థలంలో నివాసాల కోసం ప్రత్యేకంగా ఒక టవర్ ఉంటుంది. పక్కనే మరో టవర్‌లో హోటల్ ఉంటుంది. నివాసితులకు సేవలన్నీ ఆతిథ్య సంస్థలే అందిస్తాయి. కొన్ని ప్రాజెక్ట్‌లలో దిగువ అంతస్తుల్లో హోటల్, ఎగువ అంతస్తులో నివాస యూనిట్లు ఉంటాయి. నివాసితులకు ప్రత్యేక యాప్ ఉంటుంది. దాంట్లో నుంచి హోటల్‌లోని ఫుడ్, స్పా, సెలూన్ వంటి ఆర్డర్ చేయవచ్చు. వాళ్లే అపార్ట్‌మెంట్‌కు వచ్చి సర్వీస్ చేస్తారు. బ్రాండెడ్ గృహాల నిర్వహణ మొత్తం ఆతిథ్య సంస్థల ఆపరేటర్లే చూసుకుంటారు.

హెచ్‌ఎన్‌ఐ, ప్రవాసులు కస్టమర్లు..

కొనుగోలుదారులకు అంతర్జాతీయ జీవనశైలి, డెవలపర్లకు అధిక రాబడి అందించే ప్రీమియం బ్రాండెడ్ గృహాలకు ఆదరణ



పెరిగింది. ఫైవ్, సెవెన్ స్టార్ హోటళ్లు బ్రాండెడ్ రెసిడెన్సీల విభాగంలోకి ఎంట్రీ ఇచ్చాయి. దీంతో హెచ్‌ఎన్‌ఐలు(హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్), ప్రవాసులు, బిజినెస్ టైకూన్లు, సినీ, క్రీడా సెలబ్రిటీలు డిజైనర్ హోమ్స్‌కు ఆసక్తి చూపిస్తున్నారు. బ్రాండెడ్ రెసిడెన్సీ కస్టమర్లు రెండు, లేదా మూడో గృహ కొనుగోలుదారులై ఉంటారు. దీంతో వీరికి ఆధునిక వసతులే అధిక ప్రాధాన్యత. ఎవరెక్కువ, వినూత్న, విలాసవంతమైన వసతులు అందిస్తారో అందులో కొనుగోలు చేస్తారు.



ఎక్కడ వస్తున్నాయంటే..

దేశంలోని విలాసవంతమైన మార్కెట్‌లో హైదరాబాద్ వాటా 10 శాతంగా ఉంది. మన దేశంలో బ్రాండెడ్ హౌసెస్ 2,900 యూనిట్లు ఉండగా.. గ్లోబల్ మార్కెట్‌లో 3 శాతం వాటాగా నమోదైంది. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు ఉన్న ప్రాంతాల్లోనే ఈ తరహా ప్రాజెక్ట్‌లకు డిమాండ్ ఉంటుంది. కోకాపేట, నియోపొలిస్, హైటెక్‌సిటీ, రాయదుర్గం, నానక్‌రాంగూడ, పుప్పాలగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రీమియం ప్రాంతాల్లో ఈ తరహా నిర్మాణాలు వస్తున్నాయి. శ్రీఆదిత్య హోమ్స్, బ్రిగేడ్ వంటి పలు నిర్మాణ సంస్థలు బ్రాండెడ్ రెసిడెన్సీలను నిర్మిస్తున్నాయి. వీటి ధరలు రూ.6–8 కోట్ల నుంచి ప్రారంభమవుతాయి.

ప్రైవసీ, భద్రత..

కరోనా తర్వాత విలాసవంతమైన ఇళ్ల అమ్మకాలు పెరుగుతూ ఉన్నాయి. మిగతా విభాగంలోని ఇళ్లపై ప్రభావం పడినా.. అత్యంత లగ్జరీ ఆవాసాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ఐటీ, ఫార్మా, తయారీ రంగంతో పాటు కాస్మోపాలిటన్ కల్చర్‌తో నగరంలో లగ్జరీకి మించి జీవనశైలి కోరుకుంటున్నారు. సెవెన్ స్టార్ హోటల్‌లో మాదిరి గ్రాండ్ లాంజ్, డబుల్ హైట్ బాల్కనీ, హోమ్ ఆటోమేషన్, స్కై వ్యూ, స్పా, స్కై లాంజ్, మినీ థియేటర్, రూఫ్‌టాప్ డైనింగ్, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్, ప్రైవసీ, భద్రత అన్నీ ఉంటాయి.

ఎక్కువ గ్రీనరీ, ఓపెన్ స్పేస్..

ఆర్కిటెక్చర్, ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ డిజైన్, పర్యావరణహితంగా ఉండేలా అంతర్జాతీయ డిజైనర్లతో తోడ్పాటు అందిస్తారు. ఈ ప్రాజెక్ట్‌లలో విశాలమైన బాల్కనీ, గ్రీనరీ, ఓపెన్ స్పేస్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. దీంతో సాధారణ గృహాలతో పోలిస్తే రెసిడెన్సీలలో 5–7 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఇంట్లోకి గాలి, వెలుతురు ధారాళంగా వస్తాయి. వేర్వేరుగా ఎంట్రీ అండ్ ఎగ్జిట్ ద్వారాలు, ప్రతి అపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక మార్గం ఉంటుంది. అపార్ట్‌మెంట్ ఫేసింగ్ ఎదురెదురుగా ఉండదు. దీంతో పూర్తిగా ప్రైవసీ ఉంటుంది. ఒకేరకమైన అభిరుచులు, జీవనశైలి కోరుకునే నివాసితులు ఒకే గేటెడ్ కమ్యూనిటీలో ఉండటంతో వీరి మధ్య సామాజిక సంబంధాలు బలపడతాయి.



నీళ్లు ఎత్తు నుంచి పల్లం వైపునకు ప్రవహించినట్లే.. రోడ్లు, విద్యుత్, రవాణా వంటి మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్న చోటుకే అభివృద్ధి విస్తరిస్తుంది. ఐటీ ఆఫీస్ స్పేస్, నివాస, వాణిజ్య సముదాయాలతో కిక్కిరిసిపోయిన పశ్చిమ హైదరాబాద్ అభివృద్ధి క్రమంగా దక్షిణ హైదరాబాద్ మార్గంలో శరవేగంగా విస్తరిస్తోంది. విమానాశ్రయంతో పాటు ఔటర్ మీదుగా వెస్ట్‌తో సౌత్ అనుసంధానమై ఉండటం ఈ ప్రాంతం మెయిన్ అడ్వాంటేజ్. దీనికి తోడు ప్రభుత్వం కూడా ఏఐ, ఫ్యూచర్ సిటీలను దక్షిణ హైదరాబాద్‌లోనే అభివృద్ధి చేయనుంది. పుష్కలంగా భూముల లభ్యత, అందుబాటు ధర, మెరుగైన రవాణా, మౌలిక వసతులు ఉండటంతో దక్షిణ ప్రాంతంలో రియల్ మార్కెట్ అభివృద్ధి చెందే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని శ్రీఆదిత్య హోమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదిత్యరెడ్డి అన్నారు. 'సాక్షి రియల్టీ' ఇంటర్వ్యూలోని మరిన్ని అంశాలివీ.. – సాక్షి, సిటీబ్యూరో



ఆదిత్య రెడ్డి

వెస్ట్ టు సౌత్!

దక్షిణ హైదరాబాద్‌కు రియల్ అభివృద్ధి విస్తరణ

- కరోనా తర్వాత పెరిగిన ఇంటి అవసరం
- సిటీ వ్యూ, ఆహ్లాద వాతావరణంతో బాల్కనీ కల్చర్
- ట్రిపుల్–ఆర్‌లో గిడ్డంగులు, పారిశ్రామిక అభివృద్ధి
- ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెరుగుదల
- 'సాక్షి రియల్టీ'తో శ్రీఆదిత్య హోమ్స్ ఈడీ ఆదిత్య రెడ్డి

నగరం నాలుగు వైపులా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రధాన నగరంలో మూసీ సుందరీకరణ, శివార్లలో ఫ్యూచర్ సిటీ, మెట్రో రెండో దశ విస్తరణ వంటి బృహత్తర ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుట్టింది. ఆయా ప్రాజెక్ట్‌లతో గృహ కొనుగోలుదారుల భావోద్వేగాలు మారుతాయి. జనసాంద్రత, రద్దీ ప్రాంతాల్లో ఉండే బదులు ప్రశాంతత కోసం దూర ప్రాంతాలను ఎంచుకుంటారు. ఇదే సమయంలో మెట్రో విస్తరణతో కనెక్టివిటీ పెరగడంతో పాటు ఆయా మార్గాలలో రియల్ ఎస్టేట్ అవకాశాలు ఏర్పడతాయి. ఉదాహరణకు ఓల్డ్‌సిటీ, చాంద్రయాణగుట్ట మీదుగా శంషాబాద్‌కు మెట్రో అనుసంధానంతో ఆయా ప్రాంతాల్లో కూడా గేటెడ్ కమ్యూనిటీలు జోరుగా వస్తాయి. దీంతో బడ్జెట్ హోమ్స్‌తో సామాన్యుడి సొంతింటి కల మరింత చేరువవుతుంది.

ట్రిపుల్ ఆర్‌తో ఉద్యోగ అవకాశాలు

హైదరాబాద్ అభివృద్ధి దశను మార్చేసిన ఔటర్ రింగ్ రోడ్డుకు అవతల 30 కి.మీ. దూరంలో రీజినల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్)ను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఔటర్ లోపల ప్రాంతం ఇప్పటికే రద్దీ అయిపోయింది. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు, ట్రిపుల్ ఆర్ నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఇలా వేర్వేరు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలు, మాస్టర్ ప్లాన్లను చేపట్టాలి. ట్రిపుల్ ఆర్‌తో నగరంతోనే కాదు రాష్ట్రంలోని ఇతర జిల్లాలూ అనుసంధానమై ఉంటాయి. కనెక్టివిటీ పెరిగి రవాణా మెరుగవుతుంది. దీంతో ప్రధాన నగరంపై ఒత్తిడి తగ్గడంతో పాటు శివారు, పట్టణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయి. ట్రిపుల్ ఆర్ ప్రాంతాల్లో కేవలం నివాస, వాణిజ్య సముదాయాలే కాదు గిడ్డంగులు, పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుంది. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

సిటీ వ్యూతో బాల్కనీ కల్చర్..

లగ్జరీ హౌసింగ్ అంటే కనిష్టంగా 2,500 చ.అ. విస్తీర్ణం ఉండాలి. అయితే విస్తీర్ణం మాత్రమే లగ్జరీని నిర్వచించలేదు. బెంగళూరు, ముంబైలలో 3 వేల చ.అ. ఫ్లాట్లనే ఉబర్ లగ్జరీ అపార్ట్‌మెంట్‌గా పరిగణిస్తారు. కానీ, మన దగ్గర 6, 8, 10 వేల చ.అ.ల్లో కూడా అపార్ట్‌మెంట్లు కూడా నిర్మిస్తున్నారు. అయినా కూడా ఇతర మెట్రోలతో పోలిస్తే మన దగ్గరే ధరలు తక్కువగా ఉంటాయి. ఉదాహరణకు.. హైదరాబాద్‌లో 5–10 వేల చ.అ. ఫ్లాట్ రూ.6–12 కోట్లలో ఉంటే.. బెంగళూరు, ముంబై నగరాల్లో 3 వేల చ.అ. ఫ్లాటే రూ.12 కోట్లు ఉంటుంది. పుష్కలమైన స్థలం, వాస్తు, కాస్మోపాలిటన్ కల్చర్, ఆహ్లాదకరమైన వాతావరణం, జీవనశైలి బాగుండటం వల్లే హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాజెక్ట్‌లు వస్తున్నాయి. మన నగరంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది కాబట్టి విశాలమైన, డబుల్ హైట్ బాల్కనీలను వాడుతుంటారు. అదే ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో వాతావరణం పొల్యూషన్ కాబట్టి బాల్కనీలు అంతగా ఇష్టపడరు.

ఇంటి అవసరం పెరిగింది

గతంలో ఇండిపెండెంట్ హౌస్‌లు ఎక్కువగా ఉండేవి. అందుకే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అబిడ్స్ వంటి పాత నగరంలో ఈ తరహా ఇళ్లే ఎక్కువగా కనిపిస్తాయి. కానీ, ఇప్పుడు గేటెడ్ కమ్యూనిటీలు, లగ్జరీ కమ్యూనిటీ లివింగ్‌ల ప్రాధాన్యం పెరిగింది. దీంతో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట వంటి ఖరీదైన ప్రాంతాల్లో నివాసానికి ఆసక్తి చూపిస్తున్నారు. కరోనా తర్వాత ఇంటి ప్రాముఖ్యత, అవసరం తెలిసొచ్చింది. వర్క్ ఫ్రం హోమ్‌తో 50–60 శాతం సమయం ఇంట్లోనే గడపాల్సిన పరిస్థితి. ఇప్పుడున్న పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారు. బయటకు వెళ్లి ఆడుకోవాలంటే ట్రాఫిక్ ఇబ్బందులు, భద్రత ఉండదు. అదే గేటెడ్ కమ్యూనిటీల్లో ఇబ్బందులు ఉండవు. కమ్యూనిటీ లివింగ్‌లలో గృహిణులు, పిల్లలకు రక్షణ ఉండటంతో పాటు ఒకే తరహా అభిరుచులు ఉన్నవాళ్లు ఒకే కమ్యూనిటీలో ఉంటారు. అలాగే ఒకే ప్రాంతంలో అన్ని వసతులు అందుబాటులో ఉంటాయి. దీంతో టెన్షన్ ఉండదు. చోరీలు, ప్రమాదాల వంటి భయం ఉండదు. సీసీటీవీ కెమెరాలు, 24/7 సెక్యూరిటీ సిబ్బందితో భద్రత ఉంటుంది. నిరంతరం నిర్వహణతో కమ్యూనిటీ పరిశుభ్రంగా, హైజీన్‌గా ఉంటుంది. థర్డ్ పార్టీ మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా వంద శాతం పవర్ బ్యాకప్, నిరంతరం నీటి సరఫరా ఉంటుంది.

కల్యాణలక్ష్మి డబ్బునుంచి పంట రుణం కోత

బ్యాంకు సిబ్బంది నిర్వాకం
ఆందోళనలో బాధితురాలు


పెందురు సోమ్‌బాయి

సిరికొండ: నిరుపేద ఆడపిల్లల పెళ్లికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తుండగా, ఈ పథకం కింద వచ్చిన డబ్బు నుంచి బ్యాంకు అధికారులు పంట రుణాన్ని జమచేసుకున్నారు. దీంతో ఓ తల్లి తీవ్ర ఆందోళనకు గురవుతోంది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని లచ్చింపూర్(బీ) గ్రామానికి చెందిన గిరిజన మహిళ పెందురు సోమ్‌బాయికి ఆరుగురు కూతుళ్లు ఉన్నారు. రెండో కూతురుకు గత వేసవిలో వివాహం చేసింది. కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోగా గతవారం ప్రభుత్వం ద్వారా రూ.1,00,116 చెక్కు అందుకుంది. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఈ నెల 17న వోచర్ రాసి ఇచ్చింది. ఈ డబ్బులు డ్రా చేసుకోవడానికి శుక్రవారం బ్యాంకుకు వెళ్లింది. అయితే బ్యాంకు ఖాతాలో రూ.40 వేలు మాత్రమే జమ అయ్యాయి. ఈ విషయమై బ్యాంకు మేనేజర్‌ను అడిగితే.. ఆమె పంట రుణం రూ.1.60 లక్షలు ఉండగా, వడ్డీ రూ.60 వేలు అయిందని, దీంతో కల్యాణలక్ష్మి డబ్బుల నుంచి వడ్డీ కింద రూ.60 వేలు జమ చేసుకున్నామని చెప్పగా, ఆమె అవాక్కయింది. తనకు వచ్చిన పూర్తి డబ్బులను ఇవ్వాలని ఎంత వేడుకున్నా బ్యాంకు సిబ్బంది కనికరించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చాలని అనుకుంటే, పంట రుణం కింద జమ చేసుకోవడం అన్యాయమని బోరుమంది. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ నరేశ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది.

క్లుప్తంగా...

అంజలి ఇంటిని పరిశీలించిన హౌసింగ్ డీఈఈ



సాక్షి ఎఫెక్ట్

చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడికి చెందిన వేల్పుల అంజలిని ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎంపిక చేయకపోవడంపై 'అద్దె ఇంట్లో ఉన్నందుకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు'శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా హౌసింగ్ డీఈఈ గంగాధర్ చిగురుమామిడిలోని కూలిపోయి ఉన్న అంజలి ఇంటిని పరిశీలించారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ ప్రతులు తీసుకున్నారు. ఇప్పుడు ఎక్కడ ఉంటున్నావని, అంజలి కుటుంబ పరిస్థితిపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పకుండా న్యాయం చేస్తామని డీఈఈ హామీ ఇచ్చారు.

కడుపు మంట తగ్గేందుకు ఈనో ప్యాకెట్లిస్తాం

ఎమ్మెల్సీ బల్మూరి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, తెస్తున్న పెట్టుబడులను బీఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల కడుపు మంట తగ్గేందుకు 'డైజెస్ట్ ద గ్రోత్'పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లకు కొరియర్‌లో ఈనో ప్యాకెట్లు పంపుతున్నామని చెప్పారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. దావోస్ వేదికగా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులను జీర్ణించుకోలేక ఆ పార్టీ నేతల్లో కడుపు మంట పెరుగుతోందన్నారు. ఆ కడుపు మంట తగ్గి.. జీర్ణశక్తి పెరిగేందుకు ఈనో ప్యాకెట్లు పంపుతున్నట్టు ఎద్దేవా చేశారు. ఏడాదిలోనే రూ.1.79 లక్షల కోట్ల పెట్టుబడులను దావోస్ వేదిక ద్వారా సాధించిన సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబులకు తెలంగాణ యువత పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

కేటీఆర్‌పై ఎఫ్‌ఐఆర్ కొట్టివేసిన హైకోర్టు

మాగంటి, సలావుద్దీన్, ఇనాయత్ అలీపై కూడా..

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా చార్మినార్ వద్ద ప్రెస్‌మీట్ నిర్వహించారన్న ఆరోపణలపై దాఖలైన కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు హైకోర్టులో ఊరట దక్కింది. ఆయనతోపాటు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, బీఆర్‌ఎస్ నేతలు సలావుద్దీన్, ఇనాయత్ అలీ, ఆశిష్‌కుమార్, శ్రీకాంత్‌లపై దాఖలైన ఎఫ్‌ఐఆర్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పోలీసులు కేసు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ కేటీఆర్ సహా ఇతరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఎంపీ ఎన్నికల సమయంలో కేటీఆర్ తదితరులు.. రాష్ట్ర ప్రభుత్వ లోగోలో చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగించాలన్న సర్కారు చర్యలపై మీడియాతో మాట్లాడారన్నారు. ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని, సాక్షులుగా పోలీసులు తప్ప ఎవరూ లేకున్నా.. కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సాహిత్యం, కళలతో సమాజ పురోగతి

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- ప్రజల స్నేహాభిమానాలు, కవిత్వానికి హైదరాబాద్ ప్రతీక
- 'సిటీ ఆఫ్ డిస్కవరీ'గా నిలిచినందునే వేగంగా అభివృద్ధి.. త్వరలో ఈశాన్య భారతం–హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: సమాజం పురోగతి సాధించాలంటే సాహిత్యం, కళల అవసరం ఎంతైనా ఉందని గవర్నర్ డాక్టర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఇవి చిరస్థాయిగా నిలిచిపోతాయని, సాహిత్యం, పుస్తకాలనేవి అంతర్థానం కావని తాను బలంగా విశ్వసిస్తున్నా నని చెప్పారు. అచ్చయిన పుస్తకం ద్వారా సాహిత్యం ఓ రిజర్వాయర్‌గా నిలిచి అవసరానికి అక్కరకు వస్తుందని భావిస్తున్నట్టు తెలిపారు. సాహిత్యం, కళలు అనేవి లేకుండా జీవితం పరిపూర్ణం కాదన్నారు. డిజిటల్ పద్ధతిలో, ఆడియో బుక్ లేదా స్మార్ట్‌ఫోన్‌లో అయినా పుస్తకాలు చదవడం మంచిదేనని పేర్కొన్నారు. తనకు మాత్రం సంప్రదాయ పద్ధతుల్లో పుస్తకాన్ని చేతబూని చదవడాన్ని మించిన అనుభూతి మరొకటి లేదన్నారు. పుస్తకం చదవడం ద్వారా నేరుగా రచయితతో సంభాషిస్తున్నట్టు ఉంటుందని చెప్పారు. శుక్రవారం సత్వ నాలెడ్జి సిటీలో 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్–2025'ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

కళలు, సంస్కృతి, సాహిత్యాల సంగమం

'పెద్ద పెద్ద భవనాలు, కట్టడాలకే కాదు ప్రజల స్నేహాభిమానాలు, కవిత్వానికి హైదరాబాద్ ప్రతీక. 'సిటీ ఆఫ్ డిస్కవరీ'గా నిలిచినందునే నగరం అభివృద్ధి చెందుతోంది. హైదరాబాదీలు సాహిత్యం, కవిత్వంతో మమేకమై ఉన్నారు. కళలు, సంస్కృతి, సాహిత్యాల సంగమంగా హైదరాబాద్ సాహిత్యోత్సవం (లిటరరీ ఫెస్టివల్) నిలుస్తోంది. త్రిపురకు చెందిన నాకు.. తాత, తల్లి చిత్రకారులు కావడంతో కళలు, సాహిత్యంపై అభిమానం పెరిగింది. కళలు, సాహిత్యం అనేవి సృజనాత్మక స్ఫూర్తితో జీవితానికి పరిపూర్ణతను అందిస్తాయి. పుస్తకం ద్వారా మనల్ని మనం తెలుసుకోవడంతో పాటు ప్రపంచాన్ని కూడా కనుక్కోవచ్చు. ఇటీవలి కాలంలో పుస్తకాల పఠనం తగ్గిపోయిందని, తమ పుస్తకాలు అమ్ముడుపోవడం లేదంటూ హైదరాబాద్ బుక్ ఫెయిర్ సందర్భంగా రచయితలు వాపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వివాహ వార్షికోత్సవాలు, పిల్లల పుట్టినరోజులు, ఇలా వివిధ సందర్భాల్లో పుస్తకాలను బహుమతులుగా ఇవ్వాచ్చునని సూచించా. 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్'స్ఫూర్తితో త్వరలో రాజ్‌భవన్‌లో 'ఈశాన్య భారత్–హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్'నిర్వహిస్తాం..'అని గవర్నర్ తెలిపారు.

ఆ విషయంలో పెద్దలదే బాధ్యత: షబానా అజ్మీ

సీనియర్ నటి షబానా అజ్మీ మాట్లాడుతూ..'స్మార్ట్‌ఫోన్లు, టాబ్‌లు, ఇతర డిజిటల్ పరికరాలకు పిల్లలు అతుక్కుపోతున్నారు. అయితే వారు పుస్తకాలు చదివే అలవాటు మరవడానికి పెద్దలదే బాధ్యత అని నేను నమ్ముతా. పెద్దవారు పుస్తకాలను చదివే అలవాటును మరిచిపోతే ఇక పిల్లలేం చేస్తారు. పెద్దలు నాటకాలు చూడడానికి, సాహిత్య సభలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు, కళా ఉత్సవాలకు వెళ్లకపోతే ఇక పిల్లలకేం అలవడుతుంది..'అని వ్యాఖ్యానించారు. పుస్తకమనేది భాషను పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. 'హైదరాబాద్ అంటే నాకెంతో అభిమానం. ఇక్కడ ప్రగతిశీల రచయితల సమావేశంలోనే నా తల్లిని నా తండ్రి ఖైఫీ అజ్మీ కలుసుకున్నారు. మఖ్దూం మొహియుద్దిన్, సర్వర్ దండా, పుష్పమిత్ర ఇతర ప్రగతిశీల, విప్లవ కవులకు కేంద్రంగా హైదరాబాద్ నిలిచింది..'అని పేర్కొన్నారు. ఫెస్టివల్ కమిటీ చైర్‌గా పరిశ్రమలు, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అమితాదేశాయ్, డాక్టర్ టి.విజయ్‌కుమార్, డాక్టర్ కిన్నెర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సాగర సంగమం'గుర్తు చేసుకున్న లిథువేనియా రాయబారి

తాను భారతీయ సినిమాలు చూస్తూ పెరిగినట్లు గౌరవ అతిథి, లిథువేనియా రాయబారి డయానా మికెవిసీన్ చెప్పా రు. భారతీయ భాషలకు పెద్ద అభిమానినని, సంస్కృతం, హిందీ నేర్చుకుంటున్నానని తెలిపారు. 1999లో విద్యార్థినిగా, 2023లో మరోసారి హైదరాబాద్‌ను సందర్శించానన్నా రు. నయా భారత్‌కు చిహ్నంగా ఈ నగరం నిలుస్తోందంటూ ప్రశంసించారు. తాను వృత్తిగతంగా రాయబారినైనా చాలా పుస్తకాలు చదువుతానన్నారు.భారత్‌పై పుస్తకం రాయాలని అనుకుంటున్నట్టు తెలిపారు. 'సాగర సంగమం'సినిమాను అందులోని 'మౌనమేలనోయి..'పాటను డయానా గుర్తుచేసుకోగా ఆహూతులు చప్పట్లతో హర్షం వెలిబుచ్చారు.

ఆందోళనకరంగా దేశంలో పరిణామాలు

- చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి
- నిజమైన ప్రజాస్వామ్యంలో అన్నింటినీ అనుమతించాలి
- హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్ చర్చాగోష్టిలో షబానా అజ్మీ


మాట్లాడుతున్న షబానా అజ్మీ

సాక్షి, హైదరాబాద్: 'ప్రస్తుతం దేశంలో సంభవిస్తున్న పరిణామాలు ఆందోళనకరంగా కనిపిస్తున్నాయి. చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పాఠ్యాంశాల నుంచి కొన్ని అధ్యాయాలను తొలగిస్తున్నారు. దీనిని ప్రజలు చూస్తూ ఉండిపోతున్నారు. ఇది విచారించవలసిన విషయం. భారత రాజ్యాంగం అనేది ఎంతో ముఖ్యమైనది.. ప్రధానమైనది. అధికారంలో ఉన్న వారు రాజ్యాంగ రక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. భారత దేశం సెక్యులరిజం, బహుళత్వం అనే పునాదులపై నిలుస్తోంది..'అని పద్మభూషణ్, సీనియర్ నటి షబానా అజ్మీ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభ ప్లీనరీ 'ఏ లైఫ్ ఇన్ సినిమా'కార్యక్రమంలో షబానా అజ్మీతో ఫెస్టివల్ డైరెక్టర్ అమితా దేశాయ్ చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు షబానా జవాబిచ్చారు. హింసను ప్రోత్సహించే విధంగా కేరళ స్టోరీ, కశ్మీర్ ఫైల్స్ వంటి బాలీవుడ్ సినిమాలు వస్తున్నాయి కదా.. వాటిపై మీ స్పందన ఏమిటని ఒక కాలేజీ విద్యార్థిని వేసిన ప్రశ్నకు షబానా పైవిధంగా స్పందించారు. 'మనదేశంలో లెఫ్ట్, రైట్ శక్తుల మధ్య పోరాటం సాగుతూనే ఉంది. ఈ రెండింటి సిద్ధాంతాలు పూర్తిగా భిన్నం. నిజమైన ప్రజాస్వామ్యంలో అన్నింటినీ అనుమతించాలి. ఉద్రిక్తతలు రెచ్చ గొట్టని సినిమాలకు సెన్సార్ సర్టిఫికెట్లు ఇవ్వాలి. నేడు కేవలం పదిమంది ఒక సినిమాకు అభ్యంతరం చెబుతున్నారు. అభ్యంతరం మంచిదే కాని అది హింసకు దారితీయడం ఆమోదయోగ్యం కాదు..'అని షబానా వివరించారు.

కమ్యూనిస్టుల మధ్య నా బాల్యం గడిచింది

'నేను హైదరాబాద్‌లోనే పుట్టాను. ప్రగతిశీల రచయితగా నా తండ్రి ఖైఫీ అజ్మీ ఇక్కడ అజ్ఞాతంలో గడిపారు. కమ్యూనిస్టుపార్టీ నాయకుల మధ్యలోనే నా బాల్యం గడిచింది. చిన్నప్పుడు ప్రతి వేసవిలో హైదరాబాద్‌కు వచ్చేదాన్ని. నగర సంస్కృతి, ప్రగతిశీల సాహిత్యం, చుట్టంతా మేధావులతో నిండిన వాతావరణం నన్నెంతో ప్రభావితం చేసింది. నా తొలి సినిమా 'అంకుర్'షూటింగ్ సందర్భంగా ఇక్కడే ఓ గ్రామ (నేటి ఎల్లారెడ్డిగూడ) వాతావరణంలోకి తొలిసారిగా అడుగుపెట్టా. అక్కడి నుంచి స్టీఫెన్ స్పీల్‌బర్గ్ చిత్రంలోనటించే వరకు నా నట జీవితం కొనసాగింది..'అని షబానా వివరించారు. ముంబయి మురికివాడల్లోని పేదలకు రాజకీయవేత్త శరద్‌పవార్ సహకారంతో ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు కృషి చేశానన్నారు. తన తండ్రి ఖైఫీ అజ్మీ ప్రారంభించిన 'మిజ్వా'ద్వారా ఇప్పటికీ కార్యక్రమాలు చేపడుతున్నానని చెప్పారు. ఈ సందర్భంగా షబానా సినీ జీవిత ప్రయాణాన్ని వివరిస్తూ 3 నిమిషాల లఘు చిత్రాన్ని నిర్వాహకులు ప్రదర్శించారు.

సురక్షితం ఏ'ఐ రాస్తే'

▶ మొదటి పేజీ తరువాయి

జరగకుండా, ప్రాణాలు పోకుండా కాపాడవచ్చు. సరిగ్గా ఈ పనే చేస్తుంది ఐరాస్తే. ఒక ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించేందుకు మూడేళ్లు ఆగాల్సిన పనిలేకుండా ఏఐ సహకారంతో ముందుగానే గుర్తిస్తుంది.

మూడు రహదారులపై అధ్యయనం..

ఐరాస్తేను రాష్ట్రంలోని మూడు ప్రధాన రహదారులపై ప్రయోగించి చూశారు. 2023, ఏప్రిల్ నుంచి 2024, మార్చి వరకు టీఎస్ ఆర్టీసీకి చెందిన 200 బస్సుల్లో అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ (ఏడీఏఎస్) పరికరాలు, 10 డ్రైవర్ మానిటరింగ్ సిస్టమ్ (డీఎంఎస్) యూనిట్లను ఏర్పాటు చేసి పరీక్షించారు. మొత్తం 691 కిలోమీటర్ల మేర రోడ్లను అధ్యయనం చేశారు. 2022 నుంచి 2024 వరకు 5,606 ఎఫ్‌ఐఆర్‌లు, రోడ్డు ప్రమాద రికార్డులతో సహా క్రాష్ నివేదికలు, ఏడీఏఎస్ హెచ్చరికలు, బ్లాక్ స్పాట్‌లపై నిర్వహించిన భద్రతా ఆడిట్లను పరిశీలించి ఒక్కో రహదారిపై 20 చొప్పున గ్రే స్పాట్లను ఐ రాస్తే గుర్తించింది. 15 గ్రే స్పాట్‌ల్లో పరిష్కార చర్యలను సూచిస్తూ జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు నివేదికలు సమర్పించారు.

బారియర్స్‌తో సరిదిద్దవచ్చు..

కొన్ని గ్రే స్పాట్లకు స్వల్ప పరిష్కారాలు సరిపోతాయి. బారియర్స్, సైన్‌బోర్డులు, టీ–ఇంటర్ సెక్షన్ హెచ్చరిక సంకేతాలతో వాటిని సరిదిద్దవచ్చు. మరికొన్నింటికి ఆకృతి మార్పులు అవసరం. ఇప్పటివరకు మూడు గ్రే స్పాట్స్ సరిదిద్దే చర్యలకు ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను ఆహ్వానించింది. మిగిలిన ప్రదేశాలలో పని జరుగుతోంది. – పృథ్వీ, ఐ–రాస్తే ఆపరేషన్స్ మేనేజర్

600 మందికి ఏబీసీలో శిక్షణ

ప్రమాదాలు జరిగినప్పుడు తొలి స్పందన కోసం ఐరాస్తే 600 మంది స్థానికులకు యాక్టివ్ బ్లీడింగ్ కంట్రోల్ (ఏబీసీ)లో శిక్షణ ఇచ్చింది. వీరు 8 నెలల్లో 10 మంది ప్రాణాలు కాపాడారు. ఈ ఇంటిగ్రేటెడ్ నివారణ విధానం బ్లాక్ స్పాట్స్ ఏర్పడుతున్నప్పుడు వాటిని అంచనా వేయగలదు. ఈ ప్రాజెక్టు విస్తరణకు రాజస్తాన్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నాం.
– గోవింద్ కృష్ణన్, ఐ–రాస్తే ప్రోగ్రామ్ మేనేజర్, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్

20 లక్షల పీఎంఏవైై ఇళ్లు ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

సిటీ (స్కిల్ యూనివర్సిటీ–40 కి.మీ.) వరకు మెట్రో విస్తరణను ప్రతిపాదించామని తెలిపారు. ఇందులో మొదటి 5 కారిడార్ల (76.4 కి.మీ.) డీపీఆర్‌లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు వ్యయమవుతుందని చెప్పారు. డీపీఆర్‌లను ఆమోదించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యం (జేవీ) కింద నిధులు కేటాయించాలని కోరారు.

మూసీ ప్రక్షాళనకు చేయూతనివ్వండి

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కిలోమీటర్ల కాల్వలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని కోరారు. హైదరాబాద్‌తోపాటు సమీపంలోని 27 పురపాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్ల వ్యయ అంచనాతో సమగ్ర ప్లాన్ తయారు చేశామని వివరించారు. వరంగల్ నగరంలో రూ.4,170 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పీఎం కుసుమ్ కింద లక్ష సౌర పంపులు, కుసుమ్ –సీ ఎఫ్‌ఎల్‌ఎస్ కాంపొనెంట్ కింద 2,500 మెగావాట్లు కేటాయించాలని కోరారు.

విద్యుత్ రుణాలపై వడ్డీ రేటు తగ్గించండి

విద్యుత్ సరఫరా, నెట్‌వర్క్ బలోపేతానికి రూ.488 కోట్ల అంచనా వ్యయంతో 9 ప్రాజెక్టు నివేదికలను కేంద్రానికి సమర్పించామని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీఎస్ఎస్)లో తెలంగాణ డిస్కమ్‌లను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్, గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ ఇచ్చిన రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించాలని కోరారు. ఆర్‌పీపీవో లక్ష్యాలను చేరుకోలేకపోయినందుకు విధించే జరిమానాలు మాఫీ చేయాలని విన్నవించారు. పునరుత్పాదక విద్యుత్ నిర్వహణ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ఎంపీ ఈటల రాజేందర్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి,హర్కర వేణుగోపాల్, శ్రీనివాసరాజు, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు.

పెట్టుబడులపై సీఎంకు ఖట్టర్ అభినందనలు..

తెలంగాణ రాష్ట్రానికి రూ.1.78 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించినందుకు సీఎంను కేంద్ర మంత్రి ఖట్టర్ అభినందించారు. ప్రధానమంత్రి మోదీ దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలని భావిస్తున్నారన్నారు.

రివైజ్డ్ డిజైన్లు ఇవ్వకనే బరాజ్‌కు నష్టం!

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు ఎల్ అండ్ టీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంవీ రామకృష్ణరాజు వెల్లడి
- 2019లోనే మేడిగడ్డ బరాజ్‌కు తీవ్ర నష్టం.. సీసీ బ్లాకులు కొట్టుకుపోయాయి
- బరాజ్‌లో లోపాలను సరిదిద్దేందుకు నీటిపారుదల శాఖ రివైజ్డ్ డిజైన్లు ఇవ్వలేదు
- తర్వాతి నాలుగేళ్లలో సమస్య తీవ్రత పెరిగి బరాజ్ కుంగిపోయిందని వివరణ
- డిజైన్‌లో లోపాలున్నట్టు ఐఐటీ రూర్కీ తేల్చిందన్న ఉపాధ్యక్షుడు ఎస్.సురేశ్‌కుమార్


విచారణకు హాజరయ్యేందుకు వెళుతున్న రామకృష్ణరాజు

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్‌ను తొలిసారి 2019లో నీళ్లతో నింపారని, అదే ఏడాది బరాజ్‌కు నష్టం జరిగిందని నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ'ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంవీ రామకృష్ణరాజు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు వెల్లడించారు. బరాజ్ దిగువన సీసీ బ్లాకులు కొట్టుకుపోయి అప్రాన్ పూర్తిగా ధ్వంసమైనట్టు గుర్తించి, నీటిపారుదల శాఖకు నివేదించామని వివరించారు. బరాజ్‌లో లోపాలను సరిదిద్దేందుకు రివైజ్డ్ డిజైన్లు, డ్రాయింగ్స్‌ను నీటిపారుదల శాఖ అందించలేదని, దీంతో సమస్య పెరిగి 2023 అక్టోబర్ 21న 7వ బ్లాక్ కుంగిపోయిందని పేర్కొన్నారు. ముందే రివైజ్డ్ డిజైన్లు ఇచ్చి ఉంటే బరాజ్‌ను రక్షించుకోవడానికి అవకాశం ఉండేదని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంపై ఏర్పాటైన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ శుక్రవారం మేడిగడ్డ బరాజ్ నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ'ప్రతినిధులకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది.

డిజైన్లతో మాకు సంబంధం ఉండదు..

''మేడిగడ్డ, ఇతర బరాజ్‌లలో 2019లో ఒకే తరహా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. నీటి పారుదల శాఖ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ఇంజనీర్ల ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ లేబొరేటరీస్ (టీఎస్ఈఆర్ఎల్)తో మళ్లీ మోడల్ స్టడీస్ నిర్వహించాలని క్షేత్రస్థాయిలోని ఈఈ పైఅధికారులకు లేఖ రాశారు. 2020 జూన్‌లో సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణులు, సీడీఓ ఇంజనీర్లు బరాజ్‌లను పరిశీలించారు. బరాజ్ రక్షణ కోసం ఎనర్జీ డిస్సిపేషన్ పనుల డిజైన్లను రూపొందించాలని 2020 ఫిబ్రవరిలో నీటిపారుదల శాఖ ఈఎన్సీ.. సీడీఓ సీఈను ఆదేశించారు. టీఎస్ఈఆర్ఎల్ నిర్వహించిన 2డీ మోడల్ స్టడీస్ ఆధారంగా.. బరాజ్ దిగువన తగిన రీతిలో ఎనర్జీ డిస్సిపేషన్ ఏర్పాట్లు చేసేందుకు డిజైన్లను అందించాలని 2021 మార్చిలో కోరారు. రిటైర్డ్ ఈఎన్సీలతో కూడిన నిపుణుల కమిటీ 2022 మార్చిలో బరాజ్‌లను సందర్శించి షూటింగ్ వెలాసిటీని తగ్గించాలని సూచించింది. కానీ రివైజ్డ్ డిజైన్లు అందించకపోవడంతో బరాజ్ కుంగింది''అని కమిషన్‌కు ఎంవీ రామకృష్ణరాజు వివరించారు. పీస్ రేటు కాంట్రాక్టు విధానంలో పనులు దక్కించుకున్న తమకు డిజైన్ల తయారీతో సంబంధం ఉండదని తెలిపారు. గడువులోగా పూర్తి చేయాలని ఒత్తిడి ఉన్నా నాణ్యతలో రాజీపడలేదని పేర్కొన్నారు. విజిలెన్స్ విభాగం బరాజ్ నుంచి 90 కాంక్రీట్ నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తే.. ప్రమాణాలకు మించిన నాణ్యత ఉన్నట్టు తేలిందని వివరించారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో లోపాలపై కమిషన్‌కు అఫిడవిట్ దాఖలు చేసిన 'ఎల్ అండ్ టీ'మాజీ ఉన్నతాధికారి అమర్ పాల్ సింగ్ వ్యవహారంపై స్పందించేందుకు ఎంవీ రామకృష్ణరాజు నిరాకరించారు.

మరో ఇద్దరు ప్రతినిధుల క్రాస్ ఎగ్జామినేషన్లో..

- బరాజ్ గేట్ల నుంచి వరద సెకనుకు 6 మీటర్ల వేగం (షూటింగ్ వెలాసిటీ)తో దిగువన నేలను తాకుతుందనే అంచనాలతో నీటి పారుదల శాఖ (సీడీఓ) డిజైన్లను రూపొందించగా.. వాస్తవ వేగం సెకనుకు 16 మీటర్లుగా ఉందని, డిజైన్లలో లోపాలున్నాయని ఐఐటీ రూర్కీ అధ్యయనంలో తేలిందని 'ఎల్ అండ్ టీ'హైడల్ ప్రాజెక్టు విభాగం ఉపాధ్యక్షుడు ఎస్.సురేశ్‌కుమార్ కమిషన్‌కు వివరించారు.
- ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ రామరాజు బరాజ్‌ను సందర్శించి 2022 వర్షాకాలానికి ముందే షూటింగ్ వెలాసిటీని తగ్గించే ఏర్పాట్లు చేయాలని, లేకుంటే బరాజ్ దెబ్బతింటుందని హెచ్చరించారని కమిషన్‌కు 'ఎల్ అండ్ టీ'డీజీఎం రజనీష్ పి.చౌహాన్ తెలిపారు. 7వ బ్లాక్‌కు మరమ్మతులు సాధ్యం కాదని, పూర్తిగా పునర్నిర్మించక తప్పదని పేర్కొన్నట్టు తెలిసింది.


తన వంశానికి చెందిన ధీరేంద్ర కృష్ణదేబ్ బర్మన్ ఫొటోను ఆసక్తిగా చూస్తున్న గవర్నర్. చిత్రంలో ఆర్పీఓ జొన్నలగడ్డ స్నేహజ

'రాజ్యాంగ' ఎగ్జిబిషన్‌లో గవర్నర్ భావోద్వేగం!

ప్రదర్శనలో తమ రాజవంశ పూర్వీకుడి పేరు, ఫొటో చూసి ఉద్వేగానికి లోనైన జిష్ణుదేవ్‌వర్మ

సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాటి రాజ్యాంగ పుస్తక లేఖనలో పాలుపంచుకున్న లేఖరులు, చిత్రకారుల విశేషాలతో కూడిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం సికింద్రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో ప్రారంభించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం, విదేశాంగ మంత్రిత్వశాఖ హైదరాబాద్ విభాగ సచివాలయం ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశాయి. ఈ ప్రదర్శనలోని ఫొటోలను తిలకించే క్రమంలో ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఫొటోల ప్రాముఖ్యతను ఆర్పీఓ జొన్నలగడ్డ స్నేహజ గవర్నర్‌కు వివరిస్తుండగా ఓ చిత్రపటాన్ని చూసి జిష్ణుదేవ్‌వర్మ ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ఫొటోలో తమ పూర్వీకుడైన ధీరేంద్ర కృష్ణదేబ్ బర్మన్ పేరుతోపాటు ఆయన ఫొటో కనిపించడంతో ఉద్వేగం చెందారు. 'ఆయన మా రాజవంశ పూర్వీకుడే'అంటూ స్నేహజతోపాటు అక్కడ ఉన్న వారందరికీ చూపించారు. ఆ చిత్రపటం పక్కన నిలబడి ప్రత్యేకంగా ఫొటో దిగడంతోపాటు వీడియో తీయించుకున్నారు. ఎగ్జిబిషన్ ఏర్పాటు ఆలోచన బాగుందని ఆర్పీఓ సిబ్బందిని మెచ్చుకున్నారు. ఫొటోల్లోని చిత్రకారులు, లేఖరుల వంశీయుల్ని గుర్తించే ప్రయత్నం చేయాలని.. వారిని ఎగ్జిబిషన్‌కు ఆహ్వానించాలని ఆర్పీఓ స్నేహజకు సూచించారు.

ఎవరీ ధీరేంద్ర?: త్రిపుర రాజవంశానికి చెందిన ధీరేంద్ర కృష్ణదేబ్ బర్మన్ 1903లో పుట్టారు. ప్రముఖ చిత్రకారుల్లో ఒకరైన ఆయన రవీంద్రనాథ్ ఠాగూర్ ఏర్పాటు చేసిన శాంతినికేతన్‌లో విద్యనభ్యసించారు. శాంతినికేతన్‌లోని బ్రహ్మచార్య ఆశ్రమంలో, ఆపై కళాభవన్‌లో తర్ఫీదు పొందారు. 1919–28 మధ్య నందలాల్ బోస్ ఆధ్వర్యంలోని మొదటి బ్యాచ్ విద్యార్థుల్లో ధీరేంద్ర ఒకరు. లక్నో ఆర్ట్స్ కాలేజీలోనూ విద్యనభ్యసించిన ఆయన కుడ్య చిత్రకారుడు. దేశ రాజ్యాంగ రూపకల్పన కోసం 1946 డిసెంబర్ 6న ఏర్పాటైన భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పడింది. పరిషత్ ఆహ్వానం మేరకు రాజ్యాంగ రచనలో చిత్రకారులుగా పనిచేసిన 18 మందిలో ధీరేంద్ర కూడా ఒకరిగా వ్యవహరించారు. కాగా, రాజ్యాంగ రూపకర్తల స్ఫూర్తిని నేటి తరానికి, సామాన్య ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్పీఓ స్నేహజ చెప్పారు. అయితే ఈ ప్రదర్శన తిలకించడానికి కేవలం పాస్‌పోర్టు దరఖాస్తుదారులకే అవకాశం ఉందన్నారు.

పోయింది అధికారమే.. ప్రజాభిమానం కాదు



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలతోనే కోటలు కడుతుండు
- ఏడాదిలో రూ.1.40 లక్షల కోట్లు అప్పు చేసిండ్రు
- రుణమాఫీపై కాంగ్రెసోళ్లది వింత ధోరణి
- సిరిసిల్లలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల టౌన్: 'మనకు అధికారమే పోయింది.. ప్రజాభిమానం కాదు. ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై పోరాడాలి'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటం చేతగాని కాంగ్రెస్‌పై ఏడాదిగా ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలతోనే కోటలు కడుతున్నారని, చేతల్లో ఏమీ లేదని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీపై సీఎం ఒకటి చెబితే.. మంత్రి దామోదర రాజనర్సింహ మరోటి చెబుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేతగాక సీఎం గాలిమోటర్లలో వస్తూ.. గాలిమాటలు చెప్పి పోతున్నారని మండిపడ్డారు. వార్డు, గ్రామసభల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేలా బీఆర్‌ఎస్ పోరాటాలు చేస్తుందని ప్రకటించారు. ఏడాది పాలనలో రూ.1.40 లక్షల కోట్లు అప్పు చేశారని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి, జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు కరీంనగర్ మేయర్ సునీల్‌రావు గుడ్‌బై

నేడు కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిక



సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు బీఆర్‌ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. శనివారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరనున్నట్లు సునీల్‌రావు ప్రకటించారు. ఆయనతోపాటు మరో పదిమంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కూడా బీజేపీలో చేరుతారని తెలుస్తోంది. ఏడాది కాలంగా సునీల్‌రావు పార్టీ మారతారనే చర్చ జరుగుతున్నప్పటికీ ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా సందిగ్ధంలో ఉండిపోయారు. కాగా, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం ఈనెల 28తో ముగుస్తోంది. పార్టీ మార్పుపై సునీల్‌రావును 'సాక్షి'సంప్రదించగా.. ఈ విషయం వాస్తమేనని తెలిపారు.

కౌశిక్‌రెడ్డిపై టమాటాలు, కోడిగుడ్లతో దాడి

కమలాపూర్‌లో రణరంగంగా గ్రామసభ


ఝాన్సీ, కౌశిక్‌రెడ్డిల పరస్పర విమర్శలు

కమలాపూర్: గ్రామసభలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కొందరు టమాటాలు, కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో శుక్రవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా ఎంత ఇస్తున్నారంటూ వ్యవసాయ అధికారిని ప్రశ్నించారు. దీంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు వంటివి ఏవీ ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 6.50 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిందని, మీరు 1,440 మందికి ఇళ్లు ఇస్తున్నారా? వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేశారా? అంటూ కౌశిక్‌రెడ్డి వేదికపైనే మాటల యుద్ధానికి దిగారు. ఆ తర్వాత వేదిక నుంచి కిందకు దిగి కుర్చీలో కూర్చుని ఉండగానే కాంగ్రెస్ శ్రేణుల వైపు నుంచి కౌశిక్‌రెడ్డిపైకి కొందరు టమాటాలు, కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. దీనికి ప్రతిగా బీఆర్‌ఎస్ శ్రేణులు వారిపైకి కుర్చీలు విసిరాయి. దీంతో గ్రామసభలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను వారించి గ్రామసభను కొనసాగించాలన్న అధికారుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మళ్లీ వేదికపైకి వెళ్లారు. ఆ తర్వాత అధికారులు ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా చదివి వినిపిస్తుండగా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరైతే కమలాపూర్‌లో 1,440 మంది అర్హులున్నారని, వారికి 20 ఇళ్లకంటే ఎక్కువ రావని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇవ్వడం లేదని, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలు, అబద్ధాలకు నిరసనగా తాను వాకౌట్ చేస్తున్నానని చెప్పి కౌశిక్‌రెడ్డి గ్రామసభ నుంచి వెళ్లిపోగా, ఆయన కాన్వాయ్‌పై కొందరు చెప్పులు విసిరారు.

క్లుప్తంగా...

హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు స్వరూప్‌పై వేటు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు, మాజీ క్రికెటర్ ఆర్‌ఏ స్వరూప్‌పై హెచ్‌సీఏ ఎథిక్స్ ఆఫీసర్ అండ్ అంబుడ్స్‌మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య వేటు వేశారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) నుంచి హైదరాబాద్ పురుష క్రికెటర్ల తరఫున హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ ప్రతినిధిగా ఉన్న స్వరూప్.. ఇకపై హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సమావేశాలకు దూరంగా ఉండాలని అందులో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఏకసభ్య కమిటీ గతంలో రద్దు చేసిన 57 క్రికెట్ క్లబ్‌ల్లోని రెండింట్లో స్వరూప్ కార్యవర్గ సభ్యుడిగా ఉండటంతో విరుద్ధ ప్రయోజనాల నిబంధనల ప్రకారం స్వరూప్‌పై అంబుడ్స్‌మన్ చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి హెచ్‌సీఏకు సంబంధించిన ఎలాంటి కార్యక్రమాల్లోనూ స్వరూప్ పాల్గొనకుండా చూడాలని ఆదేశించారు. ఐసీఏ నుంచి మరో ప్లేయర్‌ను హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు నామినేట్ చేయాలని అంబుడ్స్‌మన్ ఆదేశాలు జారీ చేశారు.

ఉద్దానంలో చలపతి అంత్యక్రియలు



చలపతి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఆయన అత్తమామలు

పలాస: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత రామచంద్రా రెడ్డి ప్రతాపరెడ్డి అలియాస్ చలపతి అలియాస్ సుధన్న భౌతికకాయానికి శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతమైన బొడ్డపాడులో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. చలపతి భౌతిక కాయాన్ని రాయ్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, బొడ్డపాడు గ్రామానికి అమరుల బంధుమిత్రుల కమిటీ తరఫున ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు. బొడ్డపాడులో అతని అత్త పోతనపల్లి సాయమ్మ చేత, అలాగే విశాఖపట్నానికి చెందిన మామ లక్ష్మణరావు చేత పూల మాల వేయించి నివాళులర్పించారు. అనంతరం చలపతి మృతదేహాన్ని గ్రామంలో ఊరేగిస్తూ శ్మశానానికి తీసుకెళ్లి అక్కడ అమరుల బంధుమిత్రుల కమిటీ ప్రతినిధులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు సంయుక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. ప్రజాకళామండలి సభ్యులు తమ పాటలతో అమర వీరుల త్యాగాలను కీర్తించారు.

పది వేల ఏళ్లయినా పదిలం

- వెలుగు చూసిన చివరి మధ్య రాతియుగం నాటి రాతి చిత్రాలు



సాక్షి, హైదరాబాద్: అంతు చిక్కని గీతలు.. మనుగడలో లేని వింత ఆకృతి జంతువులు.. ఖగోళాన్ని తలపించే చిత్రాలు.. ఆ గుట్ట నిండా రకరకాల బొమ్మలు.. వెరసి అదో విచిత్ర కాన్వాస్. కానీ ఆ చిత్రాలేవీ ఇటీవలి కాలంలో గీసినవి కావు. వాటి వయసు 10 వేల ఏళ్ల కంటే ఎక్కువే. కొంత వెలిసిపోయినా.. వేల ఏళ్ల వాతావరణ మార్పులను తట్టుకుని చాలా వరకు ఇప్పటికీ నిలిచి ఉండటం విశేషం. తెలంగాణలో వెలుగు చూసిన ఆదిమానవుల చిత్రాల్లో అతి పాతవాటి జాబితాలో ఉండే ఈ అరుదైన చిత్రాలు తాజాగా బహిర్గతమయ్యాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు బుర్ర సంతోష్.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగసానిపల్లిలో వీటిని గుర్తించారు. గుట్టలోని రెండు ప్రాంతాల్లో మూడు గుండ్లపై ఈ చిత్రాలున్నట్టు బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఇక్కడ అన్నీ ఒకే కాలంలో గీసినవేనని రాతి చిత్రాల నిపుణుడు బండి మురళీధర్‌రెడ్డి వెల్లడించారు. 'ఇవన్నీ అలనాటి విలువైన బొమ్మలే. వాటిని మరింత నిశితంగా పరిశీలిస్తే వివరాలు వెల్లడయ్యే వీలుంది. విభిన్న ఆకృతులద్దిన పెద్దబొమ్మ, చేప, మచ్చల జంతువులు, పెద్ద సూర్యుడు, ఎముక, డైనోసార్, కంగారూలను పోలిన జంతువుల ఆకృతులు, మానవ రూపం, వజ్రాకార డిజైన్, జిగ్ జాగ్ గీతల చిత్రాలున్నాయి' అని ఆయన వివరించారు.

'ఎన్నికల' వజ్రోత్సవం

నేడు ఈసీ 75 ఏళ్ల వేడుకలు | పాల్గొననున్న రాష్ట్రపతి ముర్ము

- పదేళ్లుగా పెరుగుతున్న సవాళ్లు
- సన్నగిల్లుతున్న ఈసీ విశ్వసనీయత
- ఈవీఎంల పనితీరు మీదే సందేహాలు
- చివరి గంటల్లో అనూహ్య పోలింగ్
- మాజీ సారథులే అవాక్కవుతున్న వైనం
- పోలైన ఓట్ల కంటే లెక్కిస్తున్నవి ఎక్కువ
- అన్నింటికీ మౌనమే ఈసీ సమాధానం



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక ప్రక్రియగా నిలిచే లోక్‌సభ ఎన్నికలు. అందుకు ఏ మాత్రమూ తగ్గని పలు పెద్ద రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు. సుమారు 100 కోట్ల ఓటర్లు. లక్షల్లో పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది. వేలాది మంది అభ్యర్థులు. ఇంతటి భారీ ప్రజాస్వామిక క్రతువు సజావుగా జరిగేలా చూసే గురుతర బాధ్యతను మోస్తూ వస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. 1950 జనవరి 25న ఏర్పాటైన ఈసీ శనివారం 76 ఏట అడుగు పెడుతోంది. ఈ క్రమంలో బాలారిష్టాలను దాటి 'ఇంతింతై' అన్నట్టుగా ఎదిగి, నేడు అత్యాధునిక పద్ధతుల ద్వారా ఎన్నికల ప్రక్రియను దేశవ్యాప్తంగా ఆసాంతమూ డేగకళ్లతో పర్యవేక్షించగల స్థాయికి చేరుకుంది. ఆ క్రమంలో ఎన్నో మెరుపులు మెరిపించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈసీ నిష్పాక్షికంగా వ్యవహరిస్తే ఎంతటి అద్భుతాలు సాధ్యమో ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా టి.ఎన్.శేషన్ ఆచరణలో చూపించారు. అభ్యర్థుల ఆస్తుల వెల్లడి మొదలుకుని ప్రచార వ్యయ నియంత్రణ దాకా నిబంధనలన్నింటినీ కట్టుదిట్టంగా అమలు చేసి ఔరా అనిపించుకున్నారు. ఈసీ అధికారాలు ఎంతటివో పార్టీలు, నేతలతో పాటు సామాన్య ప్రజలకు కూడా తెలిసొచ్చేలా చేశారు. అలాంటి చరిత్ర ఉన్న ఈసీ పనితీరుపై కొన్నేళ్లుగా ఎన్నెన్నో ప్రశ్నలు! పారదర్శకత లోపిస్తున్న తీరుపై ప్రజలు మొదలుకుని ప్రతిపక్షాల దాకా అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి! మొత్తంగా ఈసీ వ్యవహార శైలిపైనే ఆరోపణల మరకలు. ఈ పరిణామాలు ప్రజలను, ప్రజాస్వామ్యవాదులను ఆందోళనపరుస్తున్నాయి. ముఖ్యంగా ఎన్నికల ప్రక్రియకు గుండెకాయ వంటి ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) విశ్వసనీయతపైనే నానాటికీ సందేహాలు పెరుగుతున్నాయి. వాటికి మద్దతుగా సహేతుక వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఈవీఎంల పనితీరును మేధావులు మొదలుకుని సాధారణ ప్రజల దాకా అందరూ ప్రశ్నిస్తున్నారు. ఇక చివరి గంటల్లో పోలింగ్ శాతంలో అనూహ్యంగా నమోదవుతున్న భారీ పెరుగుదలను స్వయానా ఈసీ మాజీ సారథులే ప్రశ్నిస్తున్న పరిస్థితి! వీటన్నింటినీ మించి పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు ఎక్కువగా ఉంటున్న వైనం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా వందల స్థానాల్లో ఇదే పరిస్థితంటూ పలు గణాంకాలు వెల్లువెత్తాయి. ఇలాంటి సందేహాలు, ప్రశ్నలు ప్రజాస్వామిక ప్రక్రియనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వాటిని నివృత్తి చేయాల్సిన అరకొర వివరణలతో సరిపెట్టడం, ప్రధాన సందేహాలపై మౌనాన్ని ఆశ్రయిస్తుండటం అనుమానాలను మరింతగా పెంచుతోంది. ప్రభుత్వ పెద్దల చేతిలో ఈసీ కీలుబొమ్మగా మారుతోందని విపక్షాలు ఆరోపించడం పరిపాటిగా మారింది. చివరికి ఎన్నికల కమిషనర్ల నియామకం కూడా తరచూ వివాదాస్పదంగా మారుతోంది. వాటిని సవాలు చేస్తూ పలు పార్టీలు సుప్రీంకోర్టు దాకా వెళ్తున్న పరిస్థితి!

ఈసీ 76వ వార్షికోత్సవ వేడుక శనివారం హస్తినలో జరగనుంది. కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొంటారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎక్సలెన్స్ అవార్డులు అందజేస్తారు. 'ఇండియా వోట్స్–2024' పేరిట ఇటీవలి లోక్‌సభ ఎన్నికలపై ఈసీ రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను, ఆ ఎన్నికలకు సంబంధించిన మానవాసక్తి కథనాల కూర్పు 'బిలీఫ్ ఇన్ ద బ్యాలెట్'ను విడుదల చేస్తారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియపై 'ఇండియా డిసైడ్స్' పేరిట వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ రూపొందించిన డాక్యుమెంటరీని కూడా ఈ సందర్భంగా ప్రదర్శించనున్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లలో అవగాహనను పెంచేలా పలు కార్యక్రమాలను ఈసీ ప్రకటించనుంది.

..అలా మొదలైంది

ఎన్నికల సంఘం ఉనికిలోకి వచ్చిన రెండేళ్లకే 1952 తొలి సాధారణ ఎన్నికల రూపంలో అతి పెద్ద సవాలును ఎదుర్కొంది. ఉన్నది ఒక్క ఎన్నికల కమిషనర్, చాలీచాలని సిబ్బంది. వనరులు, వసతులు అంతంతమాత్రం. ఓటర్లలో మెజారిటీ అక్షరజ్ఞానం కూడా లేనివారే. వారందరినీ చేరుకోవడం, ఓటేసేలా చూడటమే అతి పెద్ద సవాలుగా మారిన పరిస్థితి! అన్ని ప్రతికూలతల మధ్య కూడా తొలి ఎన్నికలను ఈసీ విజయవంతంగా నిర్వహించి ఔరా అనిపించుకుంది. రవాణా సదుపాయాలే లేని అతి మారుమూల ప్రాంతాలకు కూడా సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని చేర్చి ప్రక్రియ వీలైనంత సమగ్రంగా జరిగేలా చూసింది. అందుకోసం ఎన్నో కష్టనష్టాలకోర్చింది. దాంతో తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ దేశ విదేశాల్లో పాపులరయ్యారు. ఎన్నో దేశాలు తమ ఎన్నికల ప్రక్రియను గాడిన పెట్టేందుకు ఆయన సేవలను వాడుకున్నాయి. తర్వాత ఈసీ క్రమక్రమంగా ఎదుగుతూ వచ్చింది. ప్రపంచంలోకెల్లా అతి బృహత్తరమైన ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆద్యంతం శాంతియుతంగా నిర్వహించడంలో తిరుగులేని రికార్డు సొంతం చేసుకుంది. 1989లో ఎన్నికల కమిషనర్ల సంఖ్యను మూడుకు పెరిగింది.

ఓటర్ల జాబితాతోనూ చెలగాటం

ఎన్నికల ప్రక్రియకు అతి కీలకమైన ఓటర్ల జాబితాతో ప్రభుత్వాలు, పాలక పెద్దలు చెలగాటమాడుతున్న తీరు కూడా ఈసీ పనితీరుపై మచ్చగా మారుతోంది. తమకు అనువైన చోట్ల ఇష్టారాజ్యంగా ఓటర్లను చేరుస్తున్నారని, లేనిచోట్ల భారీగా పేర్లను తొలగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఆరోపణలు పదేపదే వినిపించాయి. ఇక తాజాగా జరుగుతున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనైతే ఈ రచ్చ కనీవినీ ఎరగని స్థాయికి పెరిగింది. రాజ్యాంగ నిర్మాతల్లో ఒకరైన అంబేడ్కర్ ఈ విపరిణామాన్ని ముందే ఊహించారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభాల్లో ఎన్నికల జాబితాను ఒకటిగా ఆయన అభివర్ణించారు. "జాతి, సంస్కృతి, భాష తదితరాలపరంగా తమవారు కారని భావించిన వారిని ఓటర్ల జాబితా నుంచి తప్పించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించే అవకాశముంది. ఇలాంటి పెడపోకడలకు చెక్ పెట్టేందుకే ఎన్నికల సంఘానికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తున్నాం" అని కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటును ప్రతిపాదిస్తూ 1949 జూన్‌లో రాజ్యాంగ అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో అంబేడ్కర్ స్పష్టం చేశారు. నేటి పరిస్థితులు చూస్తే నాటి భయాలే నిజమవుతున్నాయని ఆయన ఆవేదన చెందేవారేమో.

పదేళ్లలో తెలంగాణలో రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం

- నాలుగేళ్లల్లో ప్రతి ఇంటికి నల్లా నీరు
- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్



విద్యార్థినులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ఖట్టర్. చిత్రంలో బండి, పొంగులేటి, పొన్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గత పది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. స్మార్ట్ సిటీ కింద కరీంనగర్‌లో పూర్తయిన పలు ప్రాజెక్టులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో 24 గంటల తాగునీటి సరఫరా, మల్టీపర్పస్ పార్క్, అంబేడ్కర్ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్స్, కుమార్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో ఈ–క్లాస్‌రూమ్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం హౌసింగ్ బోర్డుకాలనీలో జరిగిన పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా దేశంలోని 74 శాతం గృహాలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని, ఫలితంగా డయేరియా సంబంధిత మరణాలు మూడు లక్షలు తగ్గాయని ఖట్టర్ తెలిపారు. భవిష్యత్‌లో ఈ మరణాల సంఖ్య మరింత తగ్గుతుందన్నారు. తెలంగాణలో 38 లక్షల 30 వేల ఇళ్లకు నల్లా కనెక్షన్లు అందించామన్నారు. హర్ ఘర్ నల్ సే జల్ పథకం కింద మరో నాలుగేళ్లలో దేశంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని కుళాయి ద్వారా అందించడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పుడు కరీంనగర్‌లో 24/7 నీటి సరఫరాను ప్రారంభించడం సంతోషకరమన్నారు. కరీంనగర్, వరంగల్ నగరాలకు రూ.1,116 కోట్లు నిధులు విడుదల చేశామన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే 24 గంటలు తాగునీరు సరఫరా చేసే నగరం లేదని, కరీంనగర్ ఆ కీర్తిని సొంతం చేసుకోవడం గర్వకారణమని చెప్పారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం నుంచి గతంలో 0.7 శాతం మాత్రమే ఇళ్లు వచ్చాయని, రాష్ట్ర వాటా ప్రకారం 8 శాతం రావాలన్నారు. హైదరాబాద్‌లో చేపడుతున్న మూసీ ప్రక్షాళనకు, మెట్రో రైలు మరో 75 కిలోమీటర్లు పొడిగించేందుకు కేంద్రం సహకరించాలని కోరారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోందని కేంద్రం సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొన్నారు.

వాటీజ్ దిస్...వేర్ ఈజ్ సీపీ?

కలెక్టర్‌పై 'పొంగులేటి' మండిపాటు

'వాటీజ్ దిస్ నాన్సెన్స్...వేర్ ఈజ్ సీపీ...వేర్ ఈజ్ ఏసీపీ...కామన్‌సెన్స్ లేదు..ఇదేం పద్ధతి' అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలో 24/7 నీటి సరఫరాను ప్రారంభిస్తున్న క్రమంలో గన్‌మెన్‌లు కొందరు పదేపదే పొంగులేటిని తోసివేయడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటనలో ఏర్పాట్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేం పద్ధతంటూ కలెక్టర్‌పై మండిపడ్డారు. సీపీ ఎక్కడా, ఏసీపీ ఎక్కడా అంటూ నిలదీశారు. అయితే వారెవరు అక్కడ లేకపోవడంతో ఆయన మరింత ఆగ్రహానికి గురయ్యారు.

డీఎంఈగా నరేంద్రకుమార్

- అకడమిక్ డీఎంఈగా శివరామ్‌ప్రసాద్
- ఎట్టకేలకు వైద్యవిద్యలో ఇన్‌చార్జ్‌ల పాలనకు తెర



డీఎంఈ నరేంద్ర కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు వైద్యవిద్యలో ఇన్‌చార్జ్‌ల పాలనకు తెరపడింది. 11ఏళ్ల తర్వాత రెగ్యులర్ వైద్యవిద్య సంచాలకులు (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)ను ప్రభుత్వం నియమించింది. డీఎంఈగా డాక్టర్ ఏ.నరేంద్రకుమార్‌ను నియమిస్తూ ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.అకడమిక్ డీఎంఈగా డాక్టర్ శివరాంప్రసాద్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. కాగా శుక్రవారం సాయంత్రం డీఎంఈగా నరేంద్రకుమార్ కోఠిలోని కార్యా లయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఇదీ నరేంద్రకుమార్ ప్రస్థానం

డాక్టర్ నరేంద్రకుమార్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో తొలుత నిలోఫర్ ఆస్పత్రిలో సేవలందించారు. అనంతరం గాంధీ, ఉస్మానియా, చెస్ట్, ఎంజీఎం బోధనాస్పత్రుల్లో పనిజేశారు. 2021లో అడిషనల్ డీఎంఈగా పదోన్నతి వచ్చి, వనపర్తి బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. దక్షిణాది టాప్ డాక్టర్స్ జాబితాను 2023లో ఇండియా టుడే విడుదల చేయగా, అందులో ఒకే ఒక్క ప్రభుత్వ వైద్యుడిగా డాక్టర్ నరేంద్రకుమార్ స్థానం సంపాదించారు.

హరిహరనాథ శర్మ, లక్ష్మణరావులతో ప్రమాణం చేయిస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



హైకోర్టు న్యాయమూర్తులుగా హరిహరనాథ శర్మ, లక్ష్మణరావు ప్రమాణం

- ప్రమాణం చేయించిన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులు శుక్రవారం ప్రమాణం చేశారు. మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరి చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. అంతకు ముందు హైకోర్టు రిజిస్ట్రార్.. వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీ చేసిన ఉత్తర్వులను చదవి వినిపించారు. అనంతరం సీజే వారి చేత ప్రమాణం చేయించారు. ఆ తర్వాత సీజే వారికి విడి విడిగా రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, ప్రమాణం చేసిన న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ ఇవన సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, హైకోర్టు రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రమాణం అనంతరం వీరు సింగిల్ జడ్జీలుగా కేసులను విచారించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, శ్రేయోభిలాషులు వీరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరి నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది.

రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా

వైఎస్సార్‌సీపీ రాజ్యసభా పక్ష నేత వి.విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: రాజకీయాల నుంచి తాను తప్పుకుంటున్నానని వైఎస్సార్‌సీపీ రాజ్యసభా పక్ష నేత వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యత్వానికి శనివారం రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరడం లేదని.. వేరే పదవులో, ప్రయోజనాలో లేక డబ్బులో ఆశించి రాజీనామా చేయడం లేదన్నారు. ఈ నిర్ణయం పూర్తిగా తన వ్యక్తి గతమని, ఎలాంటి ఒత్తిళ్లు లేవని.. ఎవరూ ప్రభావితం చేయలేదని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా నన్ను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉన్నాను. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన వైఎస్ జగన్‌కు, నన్ను ఇంతటి ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన భారతమ్మకు సదా కృతజ్ఞుడిని. జగన్‌కు మంచి జరగాలని కోరుకుంటున్నా. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేశా. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశా. దాదాపు తొమ్మిది సంవత్సరాలు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనో ధైర్యాన్నిచ్చి తెలుగు రాష్ట్రాల్లో నాకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు. టీడీపీతో రాజకీయంగా విభేదించా. చంద్రబాబు కుటుంబంతో నాకు వ్యక్తిగతంగా విభేదాలు లేవు. పవన్ కళ్యాణ్‌తో చిరకాల స్నేహం ఉంది. నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన నా రాష్ట్ర ప్రజలకు, మిత్రులకు, సహచరులకు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నా' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

వి.విజయ సాయిరెడ్డి రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని, రాజ్యసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించడం బాధాకరమని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. తాను ప్రలోభాలకు లొంగలేదని సాయి రెడ్డి పేర్కొన్నప్పటికీ... వైఎస్సార్‌సీపీ బలంతో గెలిచి ఇంకా మూడున్నరేళ్ల పదవీ కాలం ఉండ గానే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయా లని నిర్ణయించుకోవడం పరోక్షంగా కూటమి పార్టీలకు లబ్ధి చేకూరుస్తుంది కదా? అని ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే... ఆయన రాజీనామా చేసిన స్థానంలో మళ్లీ పోటీ చేసి గెలిచేంత సంఖ్యా బలం ప్రస్తుతం వైఎస్సార్ సీపీకి లేదు. అంటే దీని అర్థం.. బీజేపీ, టీడీపీ పార్టీలకు చెందిన వారు ఎంపీలుగా ఎన్నికయ్యేందుకు ఈ చర్య పరోక్షంగా ఉపకరిస్తుందని విశ్లేషిస్తున్నారు. అధికారం కోల్పోయి కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ గొంతుకను మరింత బలంగా వినిపిస్తూ ప్రజల తరఫున పో రాడాల్సిన తరుణంలో ఇలా రాజకీయాల నుంచి తప్పుకోనున్నట్లు ప్రకటించడం.. రాజ్యసభ సభ్య త్వానికి రాజీనామా చేయాలని విజయసాయిరెడ్డి నిర్ణయించుకోవటాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు తప్పుబడుతున్నాయి.

కావాలని తప్పు చేస్తే సస్పెన్షన్, డిస్మిస్

ఉద్యోగులకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: 'కొందరు ఉద్యోగులు మానవత్వం, విచక్షణ లేకుండా పనిచేస్తున్నారు. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వంపై రుద్దితే చర్యలు తీసుకుంటాం. ఏదైనా పొరపాటు దొర్లితే సరిదిద్దుకోవాలి. ఉద్దేశపూర్వకంగా తప్పు చేస్తే మాత్రం విచారణ చేపట్టి సస్పెన్షన్‌తోపాటు అవసరమైతే సర్వీస్ నుంచి తొలగిస్తాం' అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలు, సర్వీస్ అంశాలపై శుక్రవారం ఏర్పాటు చేసిన తొలి ఆన్‌లైన్ గ్రీవెన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో సీతక్క పాల్గొన్నారు. వాస్తవానికి సచివాలయం నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నప్పటికీ ములుగులో గవర్నర్ పర్యటన నేపథ్యంలో అక్కడకు బయలుదేరిన సీతక్క తన ప్రయాణంలోనే ఉద్యోగుల సర్వీస్ సమస్యలు విన్నారు. ఉద్యోగులు వ్యక్తిగతంగా సచివాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. తన శాఖ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలను తక్షణం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆచరణ సాధ్యంకాని అంశాలను అక్కడిక్కడే మంత్రి, అధికారులు తిరస్కరించారు.

పునర్జన్మ నిజమేనా?

- నిజమేనని బలంగా నమ్ముతున్న కొన్ని మతాలు
- ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా పలు పరిశోధనలు
- మానసిక వైద్యుల సదస్సులో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి



రామసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న మానసిక వైద్యుల సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్: మనిషికి పునర్జన్మ ఉంటుందా? ఉండదా? అనే విషయంపై ఎన్ని పరిశోధనలు జరిగినా ఇప్పటికీ ఏదీ నిర్ధారణ కాలేదని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. దీనిపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. ఇక్కడి హెచ్ఐసీసీలో జరుగుతున్న నాలుగు రోజుల జాతీయ మానసిక వైద్యుల సదస్సులో మూడవ రోజైన శుక్రవారం ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు వివిధ దేశాల నుంచి కూడా దాదాపు 4,500 మంది మానసిక వైద్యులు పాల్గొన్న ఈ సదస్సులో 'పూర్వ జన్మ– పునర్జన్మ' అనే అంశంపై ఆయన పలు అంశాలు వెల్లడించారు. 'ప్రపంచంలో 2,650 మందిపై పూర్వజన్మ–పునర్జన్మ సంబంధిత అంశాలపై పరిశోధనలు జరిగాయి. వీటిలో దాదాపు 500 పరిశోధనలు మన దేశంలోనే జరిగాయి. పునర్జన్మ ఉందని నమ్మే మతాల్లో హిందూ, జైన, బౌద్ధ మతాలుండటంతో ఎక్కువ పరిశోధనలు ఆసియా దేశాల్లోనే జరిగాయి' అని వివరించారు. ఈ సందర్భంగా అమెరికాలోని వర్జీనియా యూనివర్సిటీకి చెందిన మానసిక వైద్య నిపుణుడు అయాన్ స్టీవెన్‌సన్ రచనల్లో పేర్కొన్న అంశాలను డాక్టర్ రామసుబ్బారెడ్డి ప్రస్తావించారు. ''శరీరం, మెదడు నశించిపోయి మట్టిలో కలిసిపోతాయి కానీ.. మెదడులోని ప్రోటాన్స్, ఆటమ్స్‌కి మరణం లేదు. అవి స్పృహతో విశ్వంలో తిరుగుతూ మరో వ్యక్తిలోకి ప్రవేశిస్తాయి. సాధారణంగా 3– 10 ఏళ్ల వయసున్న పిల్లలు గత జన్మ జ్ఞాపకాలను చెబుతున్నారు'' అని స్టీవెన్‌సన్ తేల్చినట్లు వెల్లడించారు. పూర్వజన్మపై జనం నమ్మకాలను అడ్డం పెట్టుకుని వీటిని కొందరు స్వప్రయోజనాలకోసం వాడుకుంటున్నారని చెప్పారు. పూర్వజన్మ–పునర్జన్మ అంటూ ఉంది అనే అంశం పూర్తిగా నిర్ధారణ కాలేదని, యువ మానసిక వైద్యులు ఈ విషయమై మరిన్ని పరిశోధనలు జరపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జాతీయ మానసిక వైద్యుల సంఘం సభ్యులు డాక్టర్ రామసుబ్బారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డా.సవిత మల్హోత్రా, పూర్వపు అధ్యక్షులు డా.లక్ష్మీకాంత్ రాఠీ, ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు కమిటీ!

- ప్రభుత్వానికి రాష్ట్ర విద్యా కమిషన్ సిఫారసులు
- పాఠశాలల్లో కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలి
- స్కూళ్లను కేటగిరీలుగా విభజించి ఫీజులు నిర్ధారించాలి



విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాకు నివేదిక ఇస్తున్న ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల విషయమై తెలంగాణ విద్యా కమిషన్ పలు కీలక సిఫారసులు చేసింది. రాష్ట్రంలోని సాంకేతిక విద్యా కళాశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రస్తుతం ఉన్న ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) మాదిరిగానే పాఠశాలల్లోనూ ఫీజుల నియంత్రణకు కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే వసూలు చేసేలా చూడాలని సిఫారసు చేసింది. కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు శుక్రవారం ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాకు నివేదిక సమర్పించారు.

ప్రత్యేక శిక్షణ ఇచ్చే పక్షంలోనే అదనపు ఫీజులు

ఫీజుల నియంత్రణకు రాష్ట్ర స్థాయి కమిటీతో పాటు, ప్రతి జిల్లాలో కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. రాష్ట్రంలో పాఠశాలల స్థాయి ఆధారంగా ఫీజులు ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.20 లక్షల వరకు ఉన్నట్లుగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తమకు అందిన ఫిర్యాదులను కమిషన్ తన నివేదికలో పొందుపరిచింది. ఆప్షనల్‌గా విద్యార్థులకు ఈత, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చే పక్షంలోనే అదనపు ఫీజులకు అనుమతించాలని లేని పక్షంలో ఒక్క ట్యూషన్ ఫీజు మాత్రమే ఉండాలని స్పష్టం చేసింది. స్కూళ్లను కేటగిరీల వారీగా విభజించి ఫీజులను నిర్ధారించాలని పేర్కొంది. పాఠశాలలు వ్యాపార కేంద్రాలుగా మారకుండా చూసే విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించింది.

పుస్తకాలు, డ్రెస్‌ల అమ్మకాలు నిషేధించాలి

పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు, షూ, టై లాంటివి అమ్మడాన్ని నిషేధించాలని, తమకు ఇష్టమైన చోట వాటిని కొనుగోలు చేసే అవకాశం విద్యార్థులకు కల్పించాలని సిఫారసు చేసింది. పాఠశాలల్లో మౌలిక వసతులైన లైబ్రరీ, ప్రయోగశాలలు, కంప్యూటర్లు, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం, బోధనా సిబ్బంది విద్యార్హతలు, ఉపాధ్యాయుల సంఖ్య, వారికి చెల్లిస్తున్న వేతనాలు, ఉన్న క్రీడా సౌకర్యాలు, పాఠశాల నిర్వహణ వ్యయం తదితరాలను పరిగణనలోకి తీసుకుని ఫీజులు నిర్ధారించాలని స్పష్టం చేసింది.

పాఠశాలలు పూర్తిగా దోపిడీ చేస్తున్నాయన్న కమిషన్!

కలెక్టర్, జిల్లా విద్యాధికారి, ఆడిటర్ తదితరులతో ఏర్పాటయ్యే కమిటీ నిర్ధారించే ఫీజులు అధికంగా ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తే రాష్ట్ర స్థాయి కమిటీకి అప్పీల్ చేసే సౌకర్యం ఉండాలని కమిషన్ సూచించింది. ఒకవేళ రాష్ట్రంలో మరో కమిటీ ఎందుకు అని ప్రభుత్వం భావించినట్లైతే..పూర్తి చట్టబద్ధతతో విద్యా కమిషన్‌కు ఆ బాధ్యతను అప్పగించాలని సూచించినట్లు తెలిసింది. మొత్తం ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను పూర్తిగా దోపిడీ చేస్తున్నాయన్న అభిప్రాయాన్ని కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై వివిధ వర్గాలతో చర్చలు జరిపిన తర్వాత కమిషన్ ఈ అభిప్రాయానికి వచ్చింది. చైర్మన్ ఆకునూరి మురళితో పాటు సభ్యులు, ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న, శివారెడ్డిలు నివేదికను సమర్పించారు.

టైమ్స్ 100లో ఐఐఎస్‌సీ బెంగళూరు

- హయ్యర్ ఎడ్యుకేషన్ సబ్జెక్టు ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం
- కంప్యూటర్ సైన్స్ విభాగంలో 96వ ర్యాంకు
- టైమ్స్ జాబితాలో 100లోపు నిలిచిన మొదటి భారతీయ విద్యా సంస్థ
- 4 సబ్జెక్టుల్లో 250 ర్యాంకుల శ్రేణిలో చోటు.. ఓవరాల్ కేటగిరీలో ఎంఐటీకి మొదటి ర్యాంకు
- 500 ర్యాంకు లోపు స్థానం దక్కించుకోలేకపోయిన ఐఐటీలు


సాక్షి, ఎడ్యుకేషన్: ప్రతిష్టాత్మక టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి భారత్‌కు చెందిన ఒక విద్యా సంస్థ టాప్–100లో చోటు సాధించింది. కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్– బెంగళూరు (ఐఐఎస్‌సీ) 96వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఇంజనీరింగ్ విభాగంలో సైతం 99వ ర్యాంకులో నిలిచింది. దేశంలో సాంకేతిక విద్యకు ప్రధాన కేంద్రాలుగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లు ఈ జాబితాలో అత్యంత వెనుకబడిపోవటం గమనార్హం. ఒక్క ఐఐటీ కూడా 500 లోపు ర్యాంకు సాధించలేకపోయాయి. వీటికంటే దేశంలోని సంప్రదాయ యూనివర్సిటీలు మంచి ప్రతిభ చూపాయి. ప్రపంచవ్యాప్తంగా 11,000 వేల సాంకేతిక, ఉన్నత విద్యా సంస్థల్లో బోధన, పరిశోధన ప్రమాణాలు, ఇతర అంశాల ఆధారంగా 2024 సంవత్సరానికి గత ఏడాది అక్టోబర్‌లో ఓవరాల్ ర్యాంకులు కేటాయించగా, తాజాగా సబ్జెక్టు వారీగా ర్యాంకులు ప్రకటించారు. మొత్తం 11 సబ్జెక్టుల్లో ర్యాంకులను వెల్లడించారు. ఓవరాల్ కేటగిరీలో అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) మొదటి స్థానం దక్కించుకుంది. ఐఐఎస్‌సీ బెంగళూరు 250 లోపు ర్యాంకుల శ్రేణిలో నాలుగు సబ్జెక్టుల్లో ర్యాంకులు సొంతం చేసుకుంది. కంప్యూటర్ సైన్స్‌లో 96, ఇంజనీరింగ్‌లో 99, లైఫ్ సైన్సెస్‌లో 201–250 ర్యాంకుల శ్రేణి, ఫిజికల్ సైన్స్‌లో 201–250 శ్రేణిలో స్థానం సంపాదించింది. సబ్జెక్టువారీ ర్యాంకుల్లో భారత్‌లోని తొలితరం ఐఐటీలుగా పిలిచే ఖరగ్‌పూర్, కాన్పూర్, ఢిల్లీ, ముంబై, రూర్కీ, చెన్నై విద్యా సంస్థలకు అసలు స్థానమే దక్కకపోవటం గమనార్హం.

ర్యాంకుల ప్రామాణికతపై భిన్నాభిప్రాయాలు

టైమ్స్ ర్యాంకుల నిర్ధారణకు ప్రామాణికంగా తీసుకునే అంశాల విషయంలో ఎప్పటి నుంచో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ముఖ్యంగా ఇంటర్నేషనల్ స్టూడెంట్స్, ఫ్యాకల్టీ వంటి ప్రామాణికాలు మన విద్యా సంస్థల పరిస్థితికి సరితూగేలా లేవని విద్యావేత్తలు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు అమెరికా, బ్రిటన్‌లను తమ గమ్యస్థానాలుగా ఎంచుకుంటున్నారని.. దీంతో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య మన విద్యా సంస్థల్లో తక్కువ ఉంటోందని చెబుతున్నారు. ఈ కారణంగానే భారతీయ విద్యా సంస్థలు ర్యాంకుల్లో వెనుకంజలో ఉంటున్నాయని అంటున్నారు.

5 అంశాలు ప్రామాణికంగా..

ఉన్నత విద్యా సంస్థలకు ర్యాంకులు కేటాయించేందుకు టైమ్స్ సంస్థ 5 అంశాలను ప్రామాణికంగా తీసుకుంది. టీచింగ్, పరిశోధన వాతావరణం, పరిశోధన నాణ్యత, ఇండస్ట్రీ ఔట్‌లుక్, ఇంటర్నేషనల్ ఔట్‌లుక్ అనే అంశాలను పరిశీలించి ర్యాంకులు కేటాయించారు. ప్లేస్‌మెంట్స్ (ఉద్యోగాలు), ఫ్యాకల్టీ రిసెర్చ్, ఇండస్ట్రీ కొలాబరేషన్ తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు.



టైమ్స్ జాబితాలో సబ్జెక్టులవారీగా మొదటి ర్యాంకు సాధించిన సంస్థలు

సబ్జెక్టు	విద్యా సంస్థ
కంప్యూటర్ సైన్స్	యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్
ఫిజికల్ సైన్సెస్	కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
లైఫ్ సైన్సెస్, ఇంజనీరింగ్, మెడికల్ అండ్ హెల్త్	హార్వర్డ్ యూనివర్సిటీ
సైకాలజీ, న్యాయ శాస్త్రం	స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ
బిజినెస్ ఎకనామిక్స్, ఆర్ట్స్ & హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్	మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
ఎడ్యుకేషన్ స్టడీస్	యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా

టైమ్స్ జాబితాలో చోటు సాధించిన భారతీయ సంస్థలు

సబ్జెక్టు	విద్యా సంస్థ	ర్యాంకుల శ్రేణి
మెడికల్ అండ్ హెల్త్	సవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్స్	201–300
సైకాలజీ	యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ	401–500
న్యాయ శాస్త్రం	ఢిల్లీ యూనివర్సిటీ	301+
బిజినెస్ అండ్ ఎకనామిక్స్	అమిటీ యూనివర్సిటీ	401–500
ఎడ్యుకేషన్ స్టడీస్	ఢిల్లీ యూనివర్సిటీ	501–600
ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్	ఢిల్లీ యూనివర్సిటీ	401–500
సోషల్ సైన్సెస్	లవ్‌లీ ప్రొఫెషనల్ వర్సిటీ	251–300

టైమ్స్ జాబితాలో ఐఐటీల ర్యాంకులు

ఇంజనీరింగ్ విభాగం	
గువాహటి, ఇండోర్‌లు	501-600
పాట్నా	601-800
గాంధీనగర్, మండి, రోపార్	801-1000

కంప్యూటర్ సైన్స్ విభాగం	
ఐఐటీ–ఇండోర్	401-500
ఐఐటీ–పాట్నా	501-600
ఐఐటీ–గాంధీనగర్	601 - 800
ఐఐటీ - గువాహటి	801-1000

క్లుప్తంగా...

'సివిల్ అసిస్టెంట్ ఇంజనీర్' జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. సెప్టెంబర్ 12, 2022లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ అండ్ డ్రిల్లింగ్ సూపర్‌వైజర్ ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగాలకు 2023, అక్టోబర్ 18, 19 తేదీల్లో అర్హత పరీక్షలను నిర్వహించిన టీజీపీఎస్సీ.. ప్రాథమిక జాబితా విడుదల చేసిన అనంతరం మూడు విడతల్లో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టింది. తాజాగా ఉద్యోగాలకు అర్హత సాధించిన 650 మంది అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించి పూర్తివివరాలు తెలుసుకోవాలని సూచించారు.

ఓయూ పీహెచ్‌డీ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025 ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణను వాయిదా వేశారు. ఈనెల 24 నుంచి ప్రారంభం కావాల్సిన దరఖాస్తుల స్వీకరణ పలు సాంకేతిక కారణాల వలన వాయిదా వేస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు చెప్పారు.

ఫిజిక్స్, కెమిస్ట్రీ ఈజీ

మ్యాథ్స్ మూడోరోజూ కష్టంగానే.. • ముగిసిన జేఈఈ మెయిన్ తొలిదఫా షెడ్యూల్

వెబ్‌సైట్‌లో తదుపరి పరీక్షల అడ్మిట్ కార్డులు • ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవాలంటున్న నిపుణులు

సాక్షి, ఎడ్యుకేషన్: జేఈఈ–మెయిన్ తొలి దఫా షెడ్యూల్ శుక్రవారం ముగిసింది. మూడోరోజు పేపర్ల సరళిని పరిశీలిస్తే.. మొదటి షిఫ్ట్‌లో మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ క్లిష్టంగా ఉండడమే కాకుండా ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నాయి. ఫిజిక్స్‌లో ఫార్ములా ఆధారిత ప్రశ్నలు అడిగినప్పటికీ.. మొత్తం సులువుగా ఉండడంతో విద్యార్థులు కాసింత ఉపశమనం చెందారు. కెమిస్ట్రీ కూడా సులభంగానే ఉంది. మ్యాథమెటిక్స్‌లో 3డి, వెక్టార్స్, ఏరియాస్, సీక్వెన్స్, సిరీస్, కానిక్స్, ఇంటిగ్రల్ కాలిక్యులస్‌ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ అంశాలకు ప్రాధాన్యం లభించింది.

ఎందులోంచి ఎన్ని ప్రశ్నలు..

తొలి సెషన్‌లో ఫిజిక్స్‌లో మోడ్రన్ ఫిజిక్స్ నుంచి 3 ప్రశ్నలు, రే, వేవ్ ఆప్టిక్స్ నుంచి 2 ప్రశ్నలు.. హీట్ అండ్ థర్మో డైనమిక్స్ నుంచి 2 ప్రశ్నలు, ఎలక్ట్రిసిటీ నుంచి 2 ప్రశ్నలు అడిగారు. మిగతా టాపిక్స్ నుంచి ఒక్కో ప్రశ్న అడిగారు. మ్యాథమెటిక్స్‌లో వెక్టార్స్, 3డి, సిరీస్, ఏరియా, మ్యాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్, సెట్స్ రిలేషన్, కానిక్స్, డిఫరెన్షియల్ ఈక్వేషన్, డెఫినిట్ ఇన్‌డెఫినిట్ ఇంటిగ్రేషన్‌ల నుంచి 2 ప్రశ్నల చొప్పున అడిగారు. కెమిస్ట్రీలో కెమికల్ బాండింగ్; పిరియాడిక్ క్లాసిఫికేషన్; డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్, పి బ్లాక్ ఎలిమెంట్స్, ఆల్డిహైడ్స్ - ఫినాల్–కార్బాక్సిలిక్ యాసిడ్; కోఆర్డినేట్ కాంపౌండ్‌ల నుంచి 2 ప్రశ్నల చొప్పున, బేసిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 3 ప్రశ్నలు అడిగారు.



ఉదయంతో పోల్చితే రెండో షిఫ్ట్ క్లిష్టంగా..

ఉదయం షిఫ్ట్‌తో పోల్చితే రెండో షిఫ్ట్ క్లిష్టంగా ఉంది. మ్యాథమెటిక్స్ ఓ మోస్తరు క్లిష్టతతో సుదీర్ఘ ప్రశ్నలతో ఉండగా, ఫిజిక్స్ కూడా క్లిష్టంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. కెమిస్ట్రీ ఓ మాదిరి క్లిష్టతతో ఉంది. కెమిస్ట్రీలో అత్యధిక ప్రశ్నలు ఆర్గానిక్ కెమిస్ట్రీ, కెమికల్ బాండింగ్, కోఆర్డినేట్ కాంపౌండ్స్, బేసిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, పి–బ్లాక్ ఎలిమెంట్స్ నుంచి అడిగారు. మ్యాథమెటిక్స్‌లో ఉదయం మాదిరిగానే టాపిక్స్ ఉన్నాయి. మొత్తం మీద 22 నుంచి 24వ తేదీ వరకు ఆరు షిఫ్ట్‌లలో నిర్వహించిన పరీక్షల్లో ఆరో షిఫ్ట్ ప్రశ్నపత్రం కష్టంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. మొత్తం ఆరు షిఫ్ట్‌లలో మూడు సబ్జెక్ట్‌లలోనూ సిలబస్ పరిధిలో లేనివి మూడు ప్రశ్నలు చొప్పున అడిగారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలి

ఈ నెల 28, 29 తేదీల్లో పరీక్షలకు హాజరవనున్న విద్యార్థులు.. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లోని బేసిక్ కాన్సెప్ట్స్, ఫార్ములాలను అధ్యయనం చేయాలి. అలాగే గత ప్రశ్న పత్రాలు ముఖ్యంగా గత నాలుగేళ్ల ప్రశ్న పత్రాలను సాధన చేయాలి. ఇప్పటివరకు వచ్చిన ప్రశ్నలు చూస్తే.. యావరేజ్ స్టూడెంట్స్ 40, 45 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే విధంగా ఉన్నాయి. దీంతో ఎన్ఐటీ లేదా ట్రిపుల్ ఐటీల్లో సీటు పొందే అవకాశం ఉంది. 100 నుంచి 105 మార్కులు పొందితే అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించే అవకాశం ఉంది. గత ఏడాది జనరల్ కటాఫ్ 93 శాతంగా ఉంది. అంటే క్లిష్టమైన, సులభమైన పేపర్ల మధ్య 40 నుంచి 60 మార్కుల వ్యత్యాసం ఉంటుందని గుర్తించాలి.

– ఎంఎన్ రావు (జేఈఈ–మెయిన్, అడ్వాన్స్‌డ్ ఫ్యాకల్టీ)

వెబ్‌సైట్‌లో అడ్మిట్ కార్డులు: ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న పరీక్షలు, అదే విధంగా 30వ తేదీన నిర్వహించనున్న పేపర్–2ఎ (బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్); పేపర్–2బి (బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్) పరీక్షల అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

పరీక్ష ఫీజులు తీసుకోండి

ఇంటర్ బోర్డు అధికారులకు హైకోర్టు ఆదేశం

- ప్రైవేట్ జూనియర్ కాలేజీల పిటిషన్‌పై విచారణ
- టీజీబీఐఈ విధించిన జరిమానా చెల్లించాల్సిందే
- ఫీజుపై అదనపు రూ.2,500కు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలి
- ఆ మేరకు విద్యార్థుల దరఖాస్తులను ప్రాసెస్ చేయాలి



సాక్షి, హైదరాబాద్: ఆలస్య రుసుము కోసం పట్టుబట్టకుండా విద్యార్థుల ఫీజుల చెల్లింపునకు అంగీకరించాలని తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ (టీజీబీఐఈ)ను హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని ఈ నెల 25లోగా చెల్లించాలని పిటిషనర్ కళాశాలకు స్పష్టం చేసింది. ఇంటర్ బోర్డు విధించిన జరిమానాను పిటిషనర్ కళాశాలలు చెల్లించాలని తేల్చిచెప్పింది. ఇక ఆలస్య రుసుము చెల్లింపు విషయానికొస్తే, ఈ నెల 28లోగా ప్రతి విద్యార్థికి రూ.2,500 చొప్పున జాతీయ బ్యాంక్ నుంచి పిటిషనర్ కళాశాలలు గ్యారంటీ అందించాలని చెప్పింది. ఈ బ్యాంక్ గ్యారంటీ అందిన తర్వాత విద్యార్థుల దరఖాస్తులను ప్రాసెస్ చేసి.. పిటిషనర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2025 మార్చిలో జరిగే తుది పరీక్షకు హాజరయ్యేందుకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని కాలేజీలకు రూ.లక్ష జరిమానా విధిస్తూ ఇంటర్‌బోర్డు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పరీక్షలతో పాటు ఇతర విద్యా కార్యకలాపాలను సజావుగా నిర్వహించడానికి అనుమతించాలని.. పరీక్ష ఫీజుల చెల్లింపునకు కళాశాలలకు వెంటనే లాగిన్ అనుమతి మంజూరు చేయాలని కోరింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది.

జరిమానా, పరీక్ష ఫీజుతో ముడిపెట్టొద్దు

ఫైర్ ఎన్‌ఓసీ పొందాలనే నిబంధన నుంచి ఒక ఏడాది మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా, అధికారులు జరిమానా విధిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పరీక్ష ఫీజు చెల్లింపునకు అనుమతించి, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. కళాశాలలపై అధికారులు విధించిన జరిమానాకు, ఆలస్య రుసుముతో పరీక్ష రుసుము చెల్లింపునకు ఎలాంటి సంబంధం లేదని ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి అన్నారు. జరిమానాను, పరీక్ష ఫీజుతో ముడిపెట్టి కోర్టు ద్వారా ఉపశమనం పొందాలని పిటిషనర్ ప్రయత్నిస్తున్నారన్నారు. కాగా జరిమానా చెల్లించడానికి సిద్ధమని, సకాలంలో పరీక్ష రుసుము చెల్లించనందుకు ప్రతి విద్యార్థి చెల్లించాల్సిన రూ.2,500 ఆలస్య రుసుమును మాఫీ చేయాలని మాత్రమే పిటిషనర్ కళాశాలలు కోరాయి.

లక్ష మంది విద్యార్థులకు ఊరట

కోర్టు తీర్పుతో దాదాపు లక్ష మంది విద్యార్థులకు ఊరట కలిగిందని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరీ సతీశ్ పేర్కొన్నారు. శనివారంతో పరీక్ష ఫీజు గడువు ముగుస్తున్నందున తప్పని పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు.

ఏటా రూ.15 వేల కోట్లపైనే!

▶ మొదటి పేజీ తరువాయి

రూ.60 వేల కోట్లకు పైగా చెల్లించాలి. ఇవి రిజర్వు బ్యాంకు ద్వారా బహిరంగ మార్కెట్‌లో తీసుకున్న రుణాలకు అసలు, వడ్డీ మాత్రమేనని.. ఇవి కాకుండా కేంద్ర ప్రభుత్వం, ఇతర సంస్థలు, కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపు అదనమని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి.

గడువు తీరిన నాటి నుంచి..

వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక రూపాల్లో అప్పులు తీసుకుంటుంది. అందులో ప్రధానమైనవి ఆర్బీఐ ద్వారా సేకరించే రుణాలు. ఆర్థిక శాఖ వర్గాల ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉండే సెక్యూరిటీ బాండ్లను ఆర్బీఐ వేదికగా బహిరంగ మార్కెట్‌లో వేలానికి పెట్టి ఈ నిధులను సమకూర్చుకుంటుంది. ఇన్ని కోట్ల విలువైన బాండ్లను వేలం వేస్తున్నామని, ఇన్ని సంవత్సరాల కాలపరిమితిలో, ఇంత వడ్డీ చెల్లించి రుణం తీరుస్తామని ఆర్బీఐకి ఇండెంట్ పెడుతుంది. ఆర్బీఐ వేలంలో పాల్గొన్న సంస్థలు.. ఆ బాండ్లను స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వాలకు రుణాలిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలు బాండ్ల కాలపరిమితి ముగిసిన కొద్దీ అసలు, వడ్డీ కలిపి చెల్లించి బాండ్లను విడిపించుకుంటాయి. మళ్లీ అవసరాన్ని బట్టి అవే బాండ్లను వేలానికి పెట్టి నిధులు తెచ్చుకుంటాయి.

ఈ ఏడాది ఎప్పుడెంత కట్టాలంటే..! (రూ.కోట్లలో)

తేదీ		చెల్లించాల్సిన మొత్తం
జనవరి,	28	800
ఫిబ్రవరి,	25	1,000
మార్చి,	11	1,000
మార్చి,	31	1,000
ఏప్రిల్,	29	1,000
మే,	13	2,348.2
మే,	27	1,000
జూలై,	15	1,500
జూలై,	29	1,000
సెప్టెంబర్,	9	1,200
సెప్టెంబర్,	12	500
అక్టోబర్,	6	1,300
అక్టోబర్,	14	1,201.8
డిసెంబర్,	8	800
డిసెంబర్,	23	500

కోల్ కారిడార్‌కు లైన్‌క్లియర్!

▶ మొదటి పేజీ తరువాయి

నిడివితో ఉండే ఈ కారిడార్ నిర్మాణానికి రూ.3997 కోట్లు ఖర్చవుతుందని డీపీఆర్‌లో పొందుపరిచారు. 1999లో తొలుత ఈ లైన్‌కు ప్రతిపాదించగా, తిరిగి 2013లో మరోసారి రూ.1112 కోట్ల నిర్మాణ అంచనాతో ప్రతిపాదనను పునరుద్ధరించారు. చివరకు గతేడాది అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

రైళ్ల ట్రాఫిక్ సాంద్రత 140 శాతంగా ఉండటంతో..

ప్రస్తుతం రామగుండం నుంచి మణుగూరుకు వరంగల్–మహబూబాబాద్–డోర్నకల్–కారేపల్లి–పాండురంగాపురం మీదుగా రైల్వేలైన్ ఉంది. ఈ మార్గంలో మణుగూరు వెళ్లాలంటే 287 కి.మీ. ప్రయాణించాలి. ఈ మార్గంలో డోర్నకల్ జంక్షన్ వరకు విజయవాడ, విశాఖపట్నం మార్గం కావటంతో ప్రయాణికుల రైళ్లు అధికంగా తిరుగుతాయి. రామగుండం నుంచి బొగ్గులోడుతో గూడ్సు రైళ్లు అధికంగా తిరుగుతాయి. దీంతో ఈ మార్గంలో రైళ్ల ట్రాఫిక్ సాంద్రత 140 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో రామగుండం–మణుగూరు మధ్య నేరుగా ప్రత్యామ్నాయ రైలు మార్గం అవసరమని నిర్ణయించారు. కొత్త మార్గంలో ప్రయాణిస్తే 80 కి.మీ. నిడివి తగ్గుతుంది. దీంతో సమయంతోపాటు ఇంధనం కూడా ఆదా అవుతుంది. అన్నింటికి మించి రైలు ట్రాఫిక్ రద్దీ బాగా తగ్గి ఇటు ప్రయాణికుల రైళ్లు, అటు సరుకు రవాణా రైళ్లు వేగంగా గమ్యం చేరతాయి.

కోల్‌మైన్స్ టూ పవర్‌ప్లాంట్స్..

రామగుండం నుంచి పెద్ద ఎత్తున బొగ్గు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు సరఫరా అవుతుంది. ప్రస్తుతం సరైన రైలు మార్గం లేక రోడ్డు ద్వారా తరలిస్తున్నారు. రోడ్లు పాడవటంతోపాటు ఖర్చు కూడా అధికంగా ఉంటోంది. రైల్వేలైన్ అందుబాటులో ఉంటే..మణుగూరులో ఉన్న భద్రాద్రి పవర్‌ప్లాంట్‌కు బొగ్గు తరలింపు సులభవుతుంది. దీంతోపాటు కాకతీయ, పాల్వంచ పవర్‌ప్లాంట్లకు దగ్గరి దారి అవుతుంది. ఇక కొత్తగూడెం నుంచి ఒడిశాలోని మల్కన్‌గిరికి కొత్తలైన్ నిర్మిస్తోంది. అక్కడి పారిశ్రామిక వాడతో ఈ కొత్త మార్గం అనుసంధానం కానుంది. వెరసి పారిశ్రామిక పురోగతికి కూడా ఇది దోహదం చేయనుంది.

పర్యాటక ప్రాంతాల అనుసంధానం..

పర్యాటకులు అధికంగా వచ్చే ప్రాంతాలతో కొత్త మార్గం నిర్మించనున్నారు. కాళేశ్వరం, రామప్ప, మేడారం, కోట గుళ్లు, లక్నవరం, బొగత జలపాతం ప్రాంతాల మీదుగా సాగుతుంది. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులకు ఇది ఎంతో వీలుగా ఉంటుంది. పర్యాటకంగా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ఇవన్నీ అటవీ ప్రాంతాలు కావటంతో సరైన రవాణా వ్యవస్థ లేదు. లక్షల మంది వచ్చే మేడారం జాతర సందర్భంలో భక్తులు ఆ ప్రాంతానికి చేరేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైలుమార్గం అందుబాటులోకి వస్తే, ప్రత్యేక రైళ్లు నడపటం ద్వారా లక్షల మందిని సులభంగా తరలించే వీలు కలుగుతుంది.

గిరిజన ప్రాంత ప్రయాణికులకు..

గిరిజన ప్రాంతాలకు సరైన రైలు మార్గం లేదన్న వెలితి కూడా దీనితో తీరుతుంది. రాఘవాపురం, మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి లాంటి ప్రాంతాలవాసులకు ఈ రైలు మార్గం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కొత్త మార్గంలో దాదాపు 13 వరకు స్టేషన్లు ఉండే అవకాశముంది. ఉత్తర భారత్ వైపు వెళ్లే రైళ్లను ఎక్కువగా నడిపేందుకు ఇది ప్రత్యామ్నాయ లింకు మార్గంగా ఉపయోగపడుతుంది. ఢిల్లీ, ముంబయి లాంటి ప్రాంతాల ప్రయాణ సమయాన్ని ఇది తగ్గిస్తుంది.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలి

- ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలి
- పౌర హక్కుల సంఘాల డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న హరగోపాల్

సాక్షి, హైదరాబాద్/సుల్తాన్‌బజార్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల నేతలు డిమాండ్ చేశారు. దేశ సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగిస్తున్న హత్యాకాండను ఆపాలన్నారు. ఏడాదికాలంలో జరిగిన ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరహక్కుల సంఘం, మానవ హక్కుల వేదిక, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ, పౌర హక్కుల పరిరక్షణ కమిటీ, పౌర హక్కుల పర్యవేక్షణ కమిటీ ప్రతినిధులు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, జయ వింధ్యాల తదితరులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో 650 పోలీసు క్యాంపులను ఏర్పాటుచేసి, 7 లక్షల మంది పోలీసు బలగాలను, వందలాది డ్రోన్లను, పెద్ద సంఖ్యలో హెలికాప్టర్లను ఉపయోగిస్తూ ఆదివాసీల హననానికి యుద్ధం కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం కన్నా, ఉద్యమాల అణచివేతే పరిష్కారంగా భావిస్తున్నాయన్నారు. తేదీలు నిర్ణయించి మరీ.. బలగాలను రంగంలోకి దించి దాడులు చేస్తున్న ఈ ప్రభుత్వాలను ప్రజాస్వామ్య ప్రభుత్వాలుగా భావించలేమన్నారు. ఇటీవలి ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలుగానే పరిగణించాలన్నారు. ఆపరేషన్ కగార్ హత్యాకాండను అడ్డుకోవడానికి తమవంతుగా బాధ్యతగా ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు కలసి రావాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు.

పెన్షన్.. టెన్షన్!

▶ మొదటి పేజీ తరువాయి

కోసం మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అధికారులు చెబుతున్నా... తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరుతూ దరఖాస్తులు ఇస్తున్నారు. పింఛన్ల సొమ్ము పెంచుతామన్న కాంగ్రెస్ సర్కారు హామీని అమల్లోకి తెచ్చేలోగా.. ముందు కొత్త పింఛన్లను మంజూరు చేసి పాత పింఛన్ మొత్తమైనా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

2022 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ పోర్టల్ మూత

కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకునే ఆసరా పోర్టల్ 2022 ఆగస్టు నుంచి అందుబాటులో లేకుండా పోయింది. గత ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ సర్కారు అధికారంలో వచ్చిన 13 నెలలు కలిపి.. సుమారు మూడున్నరేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులు, ఇతర రూపాల్లో వచ్చిన వినతులు కలిపి.. కొత్త పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఆరు లక్షల వరకు ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దరఖాస్తు చేసుకున్న అందరికీ కాకపోయినా.. అర్హతలు, మార్గదర్శకాలకు అనుగుణంగా వడపోస్తే కనీసం 3 లక్షల మందికైనా కొత్త పింఛన్లు ఇవ్వాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నాయి. ఇందులో వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో పాటు ఇతర కేటగిరీల వాళ్లు కూడా గణనీయంగా ఉన్నట్టు చెబుతున్నాయి.

పాత మొత్తమైనా ఇవ్వాలంటూ..

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు (ప్రస్తుతం రూ.4 వేలు), వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఇతర కేటగిరీల పింఛన్ రూ.4 వేలకు (ప్రస్తుతం రూ.2 వేలు) పెంచుతామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం అన్ని కేటగిరీలు కలిపి 43.72 లక్షల మంది పింఛన్లు పొందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 13 నెలలు దాటినా పింఛన్ల పెంపు హామీ అమల్లోకి రాలేదు. నిజానికి 2024–25 బడ్జెట్‌లో పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.14,628 కోట్లు కేటాయించింది. కానీ పెంపు అమలుచేస్తే ఖజానాపై గణనీయంగా భారం పడుతుందన్న ఉద్దేశంతో.. ప్రభుత్వం ఈ అంశాన్ని ప్రస్తుతానికి పక్కన పెట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనితో పింఛను మొత్తాన్ని ఇప్పటికిప్పుడు పెంచకపోయినా.. కనీసం కొత్త పింఛన్లు మంజూరు చేస్తే ఆసరాగా ఉంటుందని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీల వారు కోరుతున్నారు.

ప్రస్తుతం పింఛన్ లబ్ధిదారుల సంఖ్య

కేటగిరీ	లబ్ధిదారుల సంఖ్య
వృద్ధులు	15,81,630
వితంతువులు	15,54,525
దివ్యాంగులు	5,05,836
బీడీ కార్మికులు	4,24,292
ఒంటరి మహిళలు	1,42,252
గీత కార్మికులు	65,196
నేత కార్మికులు	37,051
ఎయిడ్స్ రోగులు	35,670
బోదకాలు బాధితులు	17,995
డయాలసిస్ పేషెంట్లు	4,337
బీడీ టేకేదార్లు	4,000
మొత్తం	43,72,784

ఇంటి పెద్ద లేడు.. వితంతు పింఛన్ ఇస్తే కాస్త ఆసరా



నా భర్త ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటివరకు మంజూరు కాలేదు. ఎన్నిసార్లు అధికారులను సంప్రదించినా స్పందన రావడం లేదు. ఇంటికి పెద్ద దిక్కయిన భర్త మృతితో బతుకు కష్టంగా మారింది. ఎలాంటి ఆధారం లేక కూలి పనులు చేస్తూ ఇద్దరు పిల్లల్ని పోషించుకుంటున్న. వెంటనే పింఛన్ మంజూరు చేయాలి.

– కావలి సుష్మ , బొల్లారం గ్రామం, దేవరకద్ర మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

భర్త చనిపోయాడు.. పింఛన్ వస్తేనే జీవితానికి ఆసరా



నా భర్త చనిపోయి మూడేళ్లయింది. అప్పటి నుంచి ఎన్నోసార్లు వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. మొదట్లో పింఛన్లు ఇవ్వడం లేదని అధికారులు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కొందరికి ఇచ్చినా నాకు రాలేదు. గతేడాది ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను. ఇటీవల కులగణనలో కూడా ఆప్షన్ ఇచ్చిన. ఇప్పుడు గ్రామసభలో దరఖాస్తు చేశాను. త్వరగా పింఛన్ ఇస్తే జీవితానికి ఆసరా అవుతుంది.

– కాసగాని సురాంబా, ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రం, సూర్యాపేట జిల్లా

దివ్యాంగ పింఛన్ వస్తే.. వైద్య ఖర్చుల భారం తగ్గుతుంది



మూడేళ్లకుపైగా దివ్యాంగుల పింఛన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాను. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా దరఖాస్తు ఇచ్చినా, రాజకీయ నాయకులను వేడుకున్నా ఫలితం లేదు. గత ఏడాది ప్రజాపాలనలో కూడా దరఖాస్తు చేసుకున్నాను. పాత పింఛన్ సొమ్ము రూ.4 వేలు ఇచ్చినా సరే.. నా వైద్య ఖర్చుల భారం తగ్గుతుంది.

– అబ్దుల్ మాజిద్ ఖాన్, తిమ్మాపూర్, కరీంనగర్

ఒంటరి బతుకు.. పింఛన్‌తో ఆదుకోవాలి

నాకు 70 ఏళ్లు. నాలుగేళ్ల క్రితం భార్య చనిపోయింది. గుంట భూమి లేదు. ఎలాంటి జీవనాధారం లేదు. ఇద్దరు కొడుకులు బతుకుదెరువు కోసం హైదరాబాద్ వలస వెళ్లారు. ఒంటరిగా ఉంటున్నా. వృద్ధాప్య పింఛన్ కోసం పదేళ్లలో ఎన్నో సార్లు దరఖాస్తు చేసినా రాలేదు. ఇప్పుడు గ్రామసభలో పింఛన్ కోసం దరఖాస్తు ఇచ్చాను. పింఛన్ వస్తే ఉన్నంతకాలం బతుకు వెళ్లదీసుకుంటా..



– తాటికోల్ సాయి గొండ, తగ్గెల్లి గ్రామం, సాలూర మండలం, నిజామాబాద్ జిల్లా

15 YEARS OF CELEBRATING CREATIVITY 2010–2025
LITERATURE • CULTURE • ART
సాక్షి ఫ్యామిలీ
18
హైదరాబాద్
శనివారం ॥ 25-1-2025





షబానా ఆజ్మీ

తారలు.. అక్షరాలు తళుక్కుమన్నాయి

సాహిత్యాభిమానులు క్యూ కట్టారు. వేదికల మీద రచయితలు, రచయిత్రులు, నటీనటులు తమ మాటల మూటలు విప్పారు. పుస్తకాలు మేమున్నామంటూ ఆకర్షణీయమైన అట్టలతో పాఠకుల్ని కేకేశాయి. హైదరాబాద్‌లో శుక్రవారం మొదలైన హైదరాబాద్ లిటరేచర్ ఫెస్టివల్ నగరానికి కొత్త శోభను తెచ్చింది. ఈ సందర్భంగా తారలేమన్నారో అక్షరాలు ఎలా మెరిశాయో ఇక్కడ చదవండి.

ప్రపంచమే ఒక రంగస్థలం



అమల్ అల్లానా

భారతదేశం గొప్ప లౌకికదేశమని కొనియాడారు అమల్ అల్లానా. దేశవిభజన సమయంలో అమల్ తల్లి రోషన్ నిండు గర్భిణి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నెల రోజులకు పుట్టింది అమల్. ఆమె తండ్రి ఇబ్రహీమ్ అల్కాజీ గుర్తింపు పొందిన డైరెక్టర్. సౌదీ అరేబియా, కువైట్ మూలాలున్న కుటుంబం ఆయనది. విభజన సమయంలో ఇబ్రహీం సోదరులంతా పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. ఇబ్రహీమ్ మాత్రం ఇండియాలో కొనసాగారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు అమల్. తల్లి కుటుంబం గుజరాత్‌కు చెందినది కావడం కూడా తాము ఇండియాలో ఉండిపోవడానికి అదో కారణమంటూ తాను చూసిన ఇండియా గమనాన్ని విశ్లేషించారు. 'అరవైల నాటి ఇండియాని చూశాను, 90ల నాటికి వచ్చిన మార్పులకు ప్రత్యక్ష సాక్షిని. అలాగే 2025కి సాధించిన పురోగతిని ఆస్వాదిస్తున్నాను. కొత్త బాధ్యతలను భుజానికెత్తుకుంటూ పాత బ్యాగేజ్‌ని తగ్గించుకుంటూ ముందుకుపోవడమే అభివృద్ధి' అన్నారు అమల్.

అవి గోల్డెన్ డేస్!

రంగస్థల దర్శకత్వం, కాస్ట్యూమ్ డిజైనింగ్, సీన్ డిజైనింగ్‌లో నైపుణ్యం సాధించిన అమల్ అల్లానా ఢిల్లీలోని 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'కు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆమె తల్లి రోషన్ అల్కాజీ రచనలు 'ఏన్షియెంట్ ఇండియన్ కాస్ట్యూమ్, మిడివల్ ఇండియన్ కాస్ట్యూమ్' లను పరిష్కరించారు. ఇటీవల తండ్రి జీవితాన్ని 'ఇబ్రహీం అల్కాజీ: హోల్డింగ్ టైమ్ క్యాప్టివ్' పేరుతో అక్షరబద్ధం చేశారు. ఈ రచనలోని విషయాలను ప్రస్తావించడం అంటే నా తండ్రిని గుర్తు చేసుకోవడమే అంటూ 'మేము ముంబయిలోని ఒక ఆరు అంతస్థుల భవనంలో నివసించేవాళ్లం. ఆ టెర్రస్‌ని చూసిన మా తండ్రి అక్కడ 80 మంది వీక్షించే రంగస్థల వేదికను ఏర్పాటు చేశారు. అప్పుడు నాటకాన్ని చూడడానికి ప్రేక్షకులు ఐదంతస్థులు మెట్లెక్కి వచ్చేవారు. అవి రంగస్థలానికి గోల్డెన్ డేస్. ఇప్పుడు రంగస్థలానికి వన్నె తగ్గిన మాట నిజమే కానీ, రంగస్థలం అంతరించిపోవడం అనేది జరగదు. ఎందుకంటే ప్రపంచ దేశాల సంస్కృతి అంతా రంగస్థలం చుట్టూనే పరిభ్రమించింది' అన్నారు అమల్ అల్లానా.

ఫెమినిస్ట్ అయితే తప్పేంటి?

షబానా ఆజ్మీ తెలుగింటి ఆడపడచు. ఆమె పుట్టిల్లు హైదరాబాద్. తొలిసారి కెమెరా ముందుకు వచ్చిందీ ఇక్కడే! ఆ జ్ఞాపకాలతోపాటు నేటి సినిమా.. ఆ రంగంలో పెరుగుతున్న అమ్మాయిల పాత్ర గురించీ ముచ్చటించారు. అవి ఆమె మాటల్లోనే..

'నేను హైదరాబాద్‌లోనే పుట్టినా ఇక్కడ గడిపింది తక్కువే! నాన్న (కైఫీ ఆజ్మీ) పోయెట్ మాత్రమే కాదు కమ్యూనిస్ట్ పార్టీ మెంబర్ కూడా. ఆయన అండర్ గ్రౌండ్ జీవితం వల్లే నా తొమ్మిదో ఏట అమ్మ నన్ను తీసుకుని ముంబైకి వెళ్లింది. సమ్మర్‌కి మాత్రం వచ్చేవాళ్లం. అమ్మ (షౌకత్ ఆజ్మీ) రంగస్థల నటి. దాంతో హైదరాబాద్‌లోని మా ఇంట్లో సాహిత్యం, నాటకం, సామాజిక స్పృహ కలగలసిన ఒక ప్రోగ్రెసివ్ వాతావరణం ఉండేది. ఆ నేపథ్యంలో పెరిగాన్నేను. దాంతో యాక్టివిజం కూడా నాకు వారసత్వంగా అబ్బింది. ఆ గుణం వల్లే ముంబైలోని మురికివాడల నిర్వాసితుల కోసం పోరాడాను. పొట్ట చేతపట్టుకుని సిటీకి వచ్చేవాళ్లకు పని దొరుకుతుందేమో కానీ సొంత జాగా దొరకదు. దానికోసం వాళ్ల తరఫున నిలబడ్డాను. మహిళల హక్కుల కోసమూ ముందుంటాను. కొంతమంది ఫెమినిస్ట్ అని చెప్పుకోవడం పట్ల నామోషీ ఫీలవుతున్నట్లనిపిస్తోంది 'నేనేం ఫెమినిస్ట్‌ను కాను' అని చెప్పుకుంటున్న వాళ్ల తీరును చూస్తే!

'అంకురం'తో సొంతూరు పర్యటన

నా మొదటి సినిమా శ్యామ్ బెనెగల్ తీసిన 'అంకురం' షూటింగ్ హైదరాబాద్ (ఎల్లారెడ్డి గూడ)లోనే జరిగింది. బాల్యం తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు రావడం అప్పుడే! అంతా కొత్తగా అనిపించింది. అంకురంలో నాది పనమ్మాయి పాత్ర. దానికి తగ్గట్టు నన్ను మలచడానికి శ్యామ్ బెనెగల్ నన్ను.. చీర కట్టుకుని మేమున్న ఇంటి పరిసరాల చుట్టూ తిరిగి రమ్మన్నాడు. మనుషులను, కల్చర్‌ను అబ్జర్వ్ చేయడానికి. ఓ మూడు రోజులు అదే ప్రాక్టీస్! మాకు భోజనాలు ఏర్పాటు చేసిన చోట కూడా వాళ్లంతా టేబుల్ మీద తింటుంటే.. నన్నో మూలన, కింద కూర్చొని తినమనేవాడు. ఒకరోజు నేనలా తింటుంటే.. కొంతమంది కాలేజ్ స్టూడెంట్స్ నా దగ్గరకు వచ్చి 'ఇక్కడేదో సినిమా షూటింగ్ అవుతోందట కదా! హీరోయిన్ ఏది' అనడిగారు. 'బయటకు వెళ్లింద'ని చెప్పాను. 'నువ్వెవరు?' అనడిగారు. 'ఆయాను' అన్నాను. దీన్నంతా దూరం నుంచి గమనించిన శ్యామ్ బెనెగల్.. ఆ స్టూడెంట్స్ వెళ్లిపోగానే నన్ను పిలిచి, 'నువ్విక ఈ ప్రాక్టీస్ ఆపేయొచ్చ'ని చెప్పారు. అలా ఉండేది ప్యార్లల్ మూవీస్‌లో పాత్రల ప్రిపరేషన్! హాలీవుడ్‌లో కూడా నటించాను (Madame Sousatzka, City of joy) కదా! వాళ్ల తీరు వేరు. పేపర్ మీద రాసుకున్నది రాసుకున్నట్టుగా జరగాలి. అది ఏ కాస్త కింద మీదైనా కంగారుపడిపోతారు. మళ్లీ అంకుర్ జ్ఞాపకాలకొస్తే.. నాకు కాస్ట్యూమ్స్‌ను కుట్టించడానికి ఓ దర్జీని పిలిపించారు. అతను టేప్ లేకుండా జస్ట్ అలా వచ్చి నన్నోసారి పై నుంచి కిందకు.. కింద నుంచి పైకి చూసి వెళ్లిపోయాడంతే! తర్వాత రెండు రోజులకు పర్‌ఫెక్ట్ సైజ్‌తో కాస్ట్యూమ్స్‌ను రెడీ చేసిచ్చాడు.

> **“సినిమా ఇండస్ట్రీలో మహిళా టెక్నీషియన్స్ పెరిగారు. వాళ్లలో స్క్రిప్ట్ రచయితలు, దర్శకులు కూడా ఉండటంతో సున్నితమైన అంశాలు తెరమీదకు వస్తున్నాయి. నటనలో కూడా నేటి అమ్మాయిలు చాలా తెలివైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కాకపోతే ఐటమ్ సాంగ్స్‌తోనే పేచీ. అవి పెట్టినా కాస్త అర్థవంతంగా ప్రెజెంట్ చేయొచ్చు కదా!”**

పారలల్ మూవీస్‌కి... ఫార్ములా మూవీస్‌కి మధ్య వ్యత్యాసం

ప్యార్లల్ మూవీస్‌లో స్త్రీ పాత్రలకు ఔచిత్యం, వ్యక్తిత్వం ఉండేవి. అదంతా సీరియస్ వ్యవహారం. ఫార్ములా మూవీస్‌కి వినోదమే ప్రధానం. ఆర్ట్ మూవీస్ నుంచి కమర్షియల్ మూవీస్‌కి వెళ్తున్న కొత్తలో భలే ఇబ్బంది పడ్డాను. ముఖ్యంగా డాన్స్ విషయంలో! ప్యార్లల్ మూవీ మూవ్‌మెంట్‌ను ఇప్పుడు ఓటీటీ రీప్లేస్ చేస్తోంది. అన్నిరకాల సినిమాలతో ప్రేక్షకులకు చాయిస్ ఉండాలి. ఈ మధ్య కొన్ని వర్గాల వాళ్లు తమ ఐడియాలజీస్‌ను ప్రమోట్ చేసుకోవడానికి సినిమాను ఉపయోగించుకుంటున్నారనే ఆందోళనలు వినిపిస్తున్నాయి. ప్రేక్షకుల విచక్షణ చాలా గొప్పది. కాబట్టి ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

పురుషులను ఎడ్యుకేట్ చేయాలి

అన్ని రంగాల్లో అమ్మాయిలు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా వివక్ష వీడట్లేదు. దానికి సినిమా రంగమూ అతీతం కాదు. ప్రతిచోట స్త్రీలకు భద్రత ఉండాలి! వివక్షను రూపుమాపడానికి పురుషులను ఎడ్యుకేట్ చేయాలి. అది ఇంటి నుంచే మొదలవ్వాలి. తల్లిదండ్రులే ఆ ప్రయత్నానికి నాంది పలకాలి. ఈ విషయం మీద మా అబ్బాయి (యాక్టర్, స్క్రిప్ట్ రైటర్, డైరెక్టర్ ఫర్హాన్ అఖ్తర్) 'మర్ద్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి మగపిల్లల్లో అవేర్‌నెస్ కల్పిస్తున్నాడు!' అంటూ చెప్పుకొచ్చింది నటి షబానా ఆజ్మీ.



హుమా ఖురేషీ

గర్ల్‌ఫ్రెండ్సే కారణం..

'స్త్రీకి స్త్రీ శత్రువు కాదు. ఇలాంటి తప్పుడు భావజాలాన్ని ప్రచారం చేసి పబ్బం గడుపుకుంటోంది పురుషాధిపత్య సమాజం. దాని మాయలో పడకూడదు. స్త్రీకి స్త్రీయే నేస్తం. నేనీ రోజు ఈ స్థాయికి చేరానంటే కారణం నా చుట్టూ ఉన్న స్త్రీమూర్తులు.. గర్ల్ ఫ్రెండ్సే! అందుకే సిస్టర్‌హుడ్‌ను పెంపొందించుకోవాలి. అలాగే తిండి, కట్టు, బొట్టు లాంటివన్నీ వ్యక్తిగత విషయాలు. మన సౌకర్యం, అభిరుచిని బట్టి నిర్ణయించుకునేవి తప్ప సమాజమో, ప్రభుత్వాలో నిర్ణయించేవి కావు!'

– హుమా ఖురేషీ

– సరస్వతి రమ

భాగమతి ప్రేమకథ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది



మౌపియా బసు

బెంగాల్‌కు చెందిన మౌపియా బసు జర్నలిస్టు, రచయిత. చారిత్రక పరిశోధనల ఆధారంగా కథనాలను వెలువరించే మౌపియా నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌కు వచ్చారు.'అనార్కలి అండ్ సలీం: ఏ రీటెల్లింగ్ ఆఫ్ ముఘల్ ఈ ఆజమ్, 'ద క్వీన్స్ లాస్ట్ సెల్యూట్: ద స్టోరీ ఆఫ్ ద రాణీ ఆఫ్ ఝాన్సీ అండ్ ద 1857 మ్యూటినీ, ఖోక, కమల్‌సుందరి' రచనలు చేసిన మౌపియాకు హైదరాబాద్ నగరం కొత్త సందేహాలను రేకెత్తించింది. నగరంలో ఎక్కడికెళ్లినా ఆమెకు వినిపించిన భాగ్యనగర్ అనే పేరు మీద పరిశోధన మొదలుపెట్టారు. తాను తెలుసుకున్న విషయాలను 'భాగమతి : వై హైదరాబాదీస్ లాస్ట్ క్వీన్ ఈజ్ ద సోల్ ఆఫ్ ద సిటీ' పేరుతో ప్రచురించారు.

హైదరాబాద్‌వాసుల్లో పరిపూర్ణమైన మతసామరస్యాన్ని, బ్రదర్‌హుడ్‌ను చూశానన్నారు మౌపియ. 'ఈ నగరంలో నివసించే వాళ్లు తమను తాము మతం, కులం, ప్రాంతం, భాషల ఆధారంగా పరిచయం చేసుకోరు. 'హైదరాబాదీని' అని గర్వంగా చెప్పుకుంటారు. హైదరాబాద్‌లో మాత్రమే వినిపించే డయలక్ట్ కూడా వీనులవిందుగా ఉంటుంది. హైదరాబాద్ మీద సామాన్యుల్లో ఉన్న అనేక అపోహలను నా పర్యటన తుడిచేసింది. ఓల్డ్‌సిటీకి వెళ్లవద్దనే హెచ్చరికలను పట్టించుకోకుండా రంజాన్ మాసంలో వెళ్లాను. ఆత్మీయతకు అర్థాన్ని తెలుసుకున్నాను. అక్కడి వాళ్లను పలకరించినప్పుడు వారి నోటి వెంట కూడా భాగమతి మాట వినిపించింది. ఒక ప్రేమ కథ రెండు మతాలను కలిపి ఉంచుతోంది. ఆ ప్రేమకథ నాలుగు వందల ఏళ్లుగా జనం నాలుకల మీద సజీవంగా ఉంది. అయితే నాకు సమాధానం దొరకని ప్రశ్న ఏమిటంటే... గోల్కొండను పాలించిన కుటుంబాల సమాధులున్నాయి, మహళ్లు, ప్యాలెస్‌లున్నాయి. కానీ భాగమతి ఊహాచిత్రం తప్ప అధికారిక డాక్యుమెంట్ కానీ, శిల్పం వంటి ఆధారం కానీ లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. హైదరాబాద్ అధికారిక రికార్డుల్లో ఎక్కడా ఆమె పేరు కనిపించదు. కానీ ఇక్కడ పర్యటించిన యాత్రికుల రచనల్లో ఉంది. డచ్, బ్రిటిష్ వ్యాపారుల రికార్డుల్లో భాగ్‌నగర్ పేరు ఉంది. సినిమా, రంగస్థలం, కవిత్వం, పెయింటింగ్‌లుల్లో భాగమతి కనిపిస్తోంది. ఆమెకు సంబంధించిన భౌతిక ఆధారం ఒక్కటీ లభించకపోవడానికి కారణం ఉద్దేశపూర్వకంగా తుడిచేయడం జరిగిందా అనేది సమాధానం లేని ప్రశ్నగానే ఉంది' ఈ చారిత్రకాంశం తరతరాలుగా ఒకరి నుంచి ఒకరికి మౌఖికంగా కొనసాగుతోంది' అని వివరించారు మౌపియా బసు.

> **“ఆమె శిల్పం లేదు. ఆమె రూపాన్ని చిత్రపటంగా అయినా ఎవరూ చూడలేదు. ఆమె సమాధి ఎక్కడో తెలీదు. కానీ ఇన్ని వందల ఏళ్లుగా ఆమె పేరును తలవడం మానలేదు హైదరాబాదీలు.”**

– వాకా మంజులారెడ్డి

చిత్‌చోర్ ఏమన్నాడు

'గోరి తేరా గావ్ బడా ప్యారా' అంటూ అమోల్ పాలేకర్ హైదరాబాద్ వచ్చేశాడు

మరాఠీ న్యూవేవ్ సినిమా పయనీర్, నటుడు, దర్శకుడు, థియేటర్ పర్సనాలిటీ, చిత్రకారుడు అమోల్ పాలేకర్... మారిన సినిమా తీరు, మరాఠీ రంగస్థలం గురించి మాట్లాడుతూ.. 'సినిమా థియేటర్ ఉనికి కోల్పోయింది. ఓటీటీ వచ్చింది. సెల్‌ఫోన్‌లో ప్రపంచం కనబడుతోంది. ఈ మార్పంతా ఓ పద్ధతి ప్రకారం జరిగింది. అది ప్యార్లల్ మూవీ మూవ్‌మెంట్‌నూ కంట్రోల్ చేసింది. సొంత ప్రయోజనాల కోసం పాలక వర్గాలకు కొమ్ముకాసే వాళ్లు సినిమా రంగంలోనూ ఉంటారు. ఏటికి ఎదురీదే వాళ్లు కొద్దిమందే! వాళ్లు మైనారిటీ వర్గంగా మిగిలిపోయి ప్రభావం చూపించలేకపోతారు. వీటన్నిటి క్రమంలో ఊరటను.. సంతోషాన్నిస్తున్నది రంగస్థలమే! అది తన శోభను కోల్పోలేదు. ముఖ్యంగా మరాఠీ రంగస్థలం. యంగ్ జనరేషన్‌తో కళకళలాడుతోంది. అది ఒక్క ముంబై, పుణెలోనే కాదు మహారాష్ట్ర అంతటా ఎక్స్‌పెరిమెంట్స్‌తో వైబ్రెంట్‌గా ఉంది' అని చెప్పారు.



అమోల్ పాలేకర్

జానపద కళాకారిణి, సంగీత దర్శకురాలు, రచయిత్రి వింజమూరి అనసూయాదేవి జీవితం ఎంతటి స్ఫూర్తిమంతమైనదో డాక్యుమెంటరీగా తీసి, 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్'లో ప్రదర్శించారు ఆమె కుమార్తె సీతారత్నాకర్. 'అసమాన అనసూయ' ను తెరపై చూసిన నాటి తరమే కాదు, నేటి నవతరమూ కళ్లప్పగించి చూస్తూనే ఉంది. ఈ సందర్భంగా తల్లి తన జీవితంలో నింపిన స్ఫూర్తిని సీతారత్నాకర్ పంచుకున్నారు.

కోలో కోలోయన్న కోలో..

మారుమూల పల్లెల్లో దాగి ఉన్న జానపద గేయాలకు సభా గాన మర్యాద కలిగించి సంగీత జగత్తులో ఉన్నత స్థానాన్ని కలిగించిన తొలి గాయని వింజమూరి అనసూయాదేవి. జానపద గేయాలకు కర్నాటక బాణీలో స్వర రచన చేసిన తొలి స్వరకర్త. విశ్వ విద్యాలయాలలో శాస్త్రీయ సంగీతాన్ని పాఠ్యాంశంగా చేర్పించిన అసమాన గాయని. దక్షిణ భారతదేశంలో తొలి మహిళా సంగీత దర్శకురాలు. ఆమె ఒక అద్భుతం. ఆమెను తలుచుకుంటున్నారు కుమార్తె సీతారత్నాకర్.

పాట పాడింది... బాధ్యతలూ నెరవేర్చింది

అమ్మానాన్నలకు మేం ఐదుగురం సంతానం. అమ్మకు సంగీతం అంటే ప్రాణం. స్కూల్ లేని రోజుల్లో అమ్మ తనతోపాటు మమ్మల్నీ కచేరీలకు తీసుకెళ్లేది. ఎక్కడకు వెళ్లినా తల్లిగా తన బాధ్యతలను నెరవేరుస్తూనే కళను కూడా సాకారం చేసుకున్నారు. నేనూ, మా అక్క భరతనాట్యం నేర్చుకొని దేశ విదేశాలలో ప్రదర్శనలు ఇచ్చాం. అక్కకు పెళ్లయ్యి అమెరికా వెళ్లడం, నాకు పెళ్లవడంతో నృత్యం ఆగిపోయింది. దూరదర్శన్‌లో ఉద్యోగం వచ్చింది. మేం మొదటి నుంచి చెన్నైలో ఉండేవాళ్లం. అలా చెన్నై, ఢిల్లీ దూరదర్శన్‌లో 37 ఏళ్లు వర్క్ చేశాను. ఎంతో మంది కళాకారులను, యాక్టివిస్టులను దూరదర్శన్‌కి పరిచయం చేశాను. అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు నలుగురూ అమెరికాలో స్థిరపడ్డారు.

అమ్మ ఇండియాలో ఉన్నప్పుడు ఎక్కువ సమయం తనతో గడిపే అవకాశం లభించేంది. అమ్మకు జానపద గేయాల గురించి తెలుసు కాబట్టి కాకినాడకు తీసుకెళ్లి, అక్కడి పల్లె పాటల మీద ఓ కార్యక్రమాన్ని చేశాం. అదొక మధురానుభూతి నాకు. నేను చేసిన ప్రోగ్రామ్స్ చూసేది. సూచనలు ఇచ్చేది. 'ఇంకా ఏదైనా చేయాలి' అంటూ గాయనిగా స్వరాలను కూర్చుతూనే ఉండేది. రచనలు చేస్తూనే ఉండేది. భావగీతాలు, జానపద గేయాలు ఈ రెండు పుస్తకాలు ఆమె 90 సంవత్సరాలు నిండిన సందర్భంగా విడుదలయ్యాయి. ఆ తర్వాత జానపద సంగీతంపై ఏడు పుస్తకాలను విడుదల చేశారు. ఇవి కాకుండా నేనూ–నా రచనలు, గతానికి స్వాగతం అనే పుస్తకాలు, 95వ పుట్టిన రోజు సందర్భంగా 'అసమాన అనసూయ' అనే పుస్తకాన్ని విడుదల చేశారు.



వింజమూరి అనసూయాదేవి

యజ్ఞంలా అనిపించింది...

నిరంతర కృషియే అమ్మను అసమానంగా ఈ రోజు నిలబెట్టింది. అమ్మ మరణించాక ఆమెకు సంబంధించిన ఫుటేజ్ అంతా ఒకసారి చూడటం మొదలుపెట్టాను. మరి కొంత మా వాళ్ల నుంచి సేకరించాను. అదంతా చూడటానికే నాకు రోజుల సమయం పట్టింది. ఆవిడ వీడియోలు చూస్తున్నప్పుడు 'నా పాటలు ఆగిపోకూడదు...' వంటి మాటలు విన్నాను. దీంతో అమ్మకు సంబంధించిన డాక్యుమెంటరీ ఎలాగైనా తీసుకురావాలని ప్రయత్నించాను. ఎక్కడ నుంచి మొదలుపెట్టాలి.. అని చాలా ఆలోచించేదాన్ని. ఫుటేజీలో ఆమె దినచర్యతోపాటు, జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలన్నీ చేర్చుకుంటూ, ప్రముఖుల సభా విశేషాలు, పుస్తక ప్రారంభోత్సవాలు, కుటుంబ సభ్యుల నుంచి కామెంట్స్ జత చేసి ఒక రూపం తీసుకువచ్చాను. ఈ సమయంలో అమ్మ నా వెంటే ఉంటూ నాకు సూచనలు చేస్తున్నట్టు అనిపించేది. డాక్యుమెంటరీ పూర్తవ్వడానికి మూడేళ్ల సమయం పట్టింది. అమ్మ ఘనత అలనాటి వారికే తెలుసు అనుకున్నాను. కానీ, నేటి తరం కూడా అమ్మ డాక్యుమెంటరీ చూడటం, ఆమె గొప్పతనం గురించి ప్రస్తావిస్తుంటే చెప్పలేనంత ఆనందం కలుగుతుంది' అంటూ తన తల్లితో తనకున్న అనుబంధాన్ని తెలిపారు సీతా రత్నాకర్.

ఒక చేయి హార్మోనియంపైనే...

నా వర్క్ నేను చేస్తూనే అమ్మకు సంబంధించిన అన్ని వీడియో ఫుటేజీలు, ఫొటోలు, ఆమె పాడుతున్నప్పుడు తీసిన వీడియోలు, మా దగ్గర ఉన్నవి, సేకరించినవి ఒక ల్యాప్‌టాప్‌లో వేసి స్టోర్ చేశాను. అయితే, డాక్యుమెంటరీగా తీయాలనే ఆలోచన మొదట రాలేదు. నాన్నగారు మరణించాక అమ్మ అమెరికాలోనే ఎక్కువకాలం. అక్కడ ఎన్ని వసతులు ఉన్నా ఆమె మనసంతా ఇండియాలోనే ఉండేది. అక్కడ ఉన్నా ఆమె కళాసాధన వీడలేదు. ఉదయం లేచిన దగ్గర్నుంచి, ఆమె పడుకునేవరకు హార్మోనియం ఆమెతోనే ఉండేది.



సీతారత్నాకర్

– నిర్మలారెడ్డి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	330	76,190
నిఫ్టీ ▽	113	23,092

విదేశీ సూచీలు (శుక్ర రాత్రి 11.30 గంటలకు)		
నాస్డాక్	20,041	▽ 12
డోజోన్స్	44,510	▽ 55
ఎఫ్టీఎస్ఈ 100	8,502	▽ 63
డాక్స్	21,395	▽ 17
షాంఘై	3,230	△ 22
నికాయ్	39,932	▽ 27

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	80,348	△ 309
బంగారం (22 క్యారట్)	80,026	△ 307
వెండి (కేజీ)	91,211	△ 578

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.20	108.00
€	యూరో	ఒకటి	88.77	91.39
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.62	55.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.19	55.39
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.95	65.62
SAR	సౌదీ రియాల్	పదింటికి	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	22.19	23.74
¥	చైనా యువాన్	పదింటికి	11.01	12.83

సందడిగా 'బడ్జెట్ హల్వా'



న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ఆర్థిక శాఖ కార్యాలయం 'నార్త్‌బ్లాక్'లో శుక్రవారం బడ్జెట్ ముందరి సంప్రదాయ 'హల్వా' కార్యక్రమం సందడిగా సాగింది. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆ శాఖ పరిధిలోని ఉన్నతాధికారులు ఇందులో పాల్గొని సంప్రదాయ హల్వా రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి సీతారామన్ అక్కడి ఏర్పాట్లను ఒక్కసారి పరిశీలించారు. బడ్జెట్ తయారీలో పాలుపంచుకున్న అధికారులు, సిబ్బందికి హల్వా తయారు చేసి పంపిణీ చేయడం ఎప్పటి నుంచో ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం అనంతరం బడ్జెట్ ప్రతులను నార్త్ బ్లాక్ భవనంలోని బేస్‌మెంట్‌లో ముద్రించనున్నారు. 2025–26 బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టనుండడం తెలిసిందే. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం ముగిసే వరకు అధికారులు నార్త్ బ్లాక్‌లోనే ఉండిపోవాల్సి వస్తుంది. బయటి ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధం ఉండదు. బడ్జెట్ గోప్యత దృష్ట్యా ఈ విధానం పాటిస్తున్నారు.

ఉపాధికి చేయూత కావాలి

- ఇందుకు నైపుణ్య కల్పన, శిక్షణ అవసరం
- ఇన్‌ఫ్రా, ఆతిథ్యం, స్టార్టప్, ఎడ్‌టెక్
- ఈ రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం ఇవ్వాలి
- బడ్జెట్ 2025పై పరిశ్రమ వర్గాల డిమాండ్లు

బలమైన ఆర్థిక వృద్ధికి ఉపాధి కల్పన ఎంతో అవసరం. ఇందుకు వీలుగా మౌలిక రంగం, ఆతిథ్యం, స్టార్టప్‌లు, ఎడ్‌టెక్, ఎంఎస్ఎంఈ రంగాలకు కావాల్సిన పెట్టుబడులు సమకూర్చడంతోపాటు, ప్రోత్సాహకాలు కల్పించాలని, నైపుణ్యాభివృద్ధి, శిక్షణపై దృష్టి పెట్టాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఈ మేరకు చర్యలు అవసరమని తెలిపాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

పర్యాటకం-ఆతిథ్యం



ఉపాధి కల్పనలో, ఆర్థిక వ్యవస్థకు చేయూతలో ఆతిథ్య పరిశ్రమ ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నట్టు నూర్‌మహల్ గ్రూప్ సీఎండీ మన్‌బీర్ చౌదరి చెప్పారు. 2047 నాటికి జీడీపీలో 3 ట్రిలియన్ డాలర్ల పర్యాటకం లక్ష్యాన్ని చేరుకునేందుకు వీలుగా, ఆతిథ్య పరిశ్రమకు బడ్జెట్ 2025లో ప్రోత్సాహకాలకు చోటు కల్పించాలని కోరారు. ఈ రంగానికి పరిశ్రమ హోదా డిమాండ్ ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్నట్టు తెలిపారు. ఈ హోదా కల్పిస్తే ఆతిథ్య పరిశ్రమకు రుణ సదుపాయాలు మెరుగుపడతాయన్నారు.



స్టార్టప్‌లు



స్టార్టప్‌లు, వెంచర్ స్టూడియోల అవసరాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని టీ9ఎల్ క్యాబ్ వ్యవస్థాపకుడు గౌరవ్ గగ్గర్ కోరారు. స్టార్టప్‌లకు ఏంజెల్ ట్యాక్స్ తొలగించడాన్ని గొప్ప చర్యగా అభవర్ణించారు. దీనివల్ల పెట్టుబడులు రాక పెరుగుతుందన్నారు. పరిశ్రమకు నిధుల సమస్య ప్రధానంగా ఉందని, బడ్జెట్‌లో ఈ దిశగా మరిన్ని చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. దేశంలో స్టార్టప్ ఎకోసిస్టమ్ (వ్యవస్థ)కు వెంచర్ స్టూడియోలు ఊతంగా నిలుస్తున్నట్టు చెప్పారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సరళతరం చేయడంతోపాటు, మరింత మెరుగ్గా రుణాలు అందేలా చూడాలని కోరారు. పరిశోధన, అభివృద్ధిపై పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్టార్టప్‌లకు నిధులు సమకూర్చే వెంచర్ క్యాపిటలిస్టులకు పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించాలని గౌరవ్ గగ్గర్ డిమాండ్ చేశారు. దీనివల్ల దేశ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఎంతో ఊతమిచ్చినట్టు అవుతుందన్నారు.

ఎడ్‌టెక్



డేటా సైన్స్, పునరుత్పాదక ఇంధనం, కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సిల్వర్‌లైన్ ప్రెస్టీజ్ స్కూల్ వైస్ చైర్మన్, విద్యా రంగ విధానాల నిపుణుడు నమన్ జైన్ సూచించారు. నైపుణ్య అభివృద్ధి, శిక్షణపై మరిన్ని పెట్టుబడులు స్థిరమైన వృద్ధికి కీలకమన్నారు. సరిపడా నైపుణ్యాలు లేకపోవడం వల్లే ప్రస్తుతం నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. భారత్ 7–8 శాతం వృద్ధి రేటును సాధించేందుకు ఉపాధి కల్పనను పెంచాలని ఇటీవలే మెకిన్సే అధ్యయనం సూచించడాన్ని వెర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ సీఈవో గగన్ అరోరా గుర్తు చేశారు. 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఇండిగో లాభం నేలచూపు

క్యూ3లో రూ. 2,450 కోట్లు



న్యూఢిల్లీ: విమానయాన రంగ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 2,450 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా కరెన్సీ ఆటుపోట్లు లాభాలను దెబ్బతీశాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,998 కోట్లు ఆర్జించింది. అయితే ఇండిగో బ్రాండ్ విమాన సర్వీసుల కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం రూ. 20,062 కోట్ల నుంచి రూ. 22,993 కోట్లకు ఎగసింది. కాగా.. ఇంధన వ్యయాలు తగ్గడానికితోడు ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో రూ. 3,850 కోట్ల లాభం ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది. ఈ కాలంలో 3.11 కోట్లమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసినట్లు వెల్లడించింది.

బీఎస్ఈలో ఇండిగో షేరు 0.6 శాతం బలపడి రూ. 4,163 వద్ద ముగిసింది.

నష్టాల్లోనే ముగింపు

ఇంట్రాడేలో తీవ్ర ఒడిదుడుకులు



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 330 పాయింట్లు పతనమై 76,190 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 113 పాయింట్లు కోల్పోయి 23,092 వద్ద నిలిచింది. స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 894 పాయింట్లు పరిధిలో 76,092 వద్ద కనిష్టాన్ని, 76,985 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 23,347–23,050 శ్రేణిలో ట్రేడైంది. ఐటీ మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా రియల్టీ, ఇంధన, ఫార్మా, ఆటో షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 2.23%, 1.60 శాతం చొప్పున క్షీణించాయి. కీలక వడ్డీరేట్లు, క్రూడాయిల్ ధరలు తగ్గించాలంటూ ట్రంప్ ఫెడరల్ రిజర్వ్, చమురు ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్)ను కోరడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- డాలర్ మారకంలో రూపాయి విలువ 22 పైసలు బలపడి 86.22 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రూపాయికి ఆర్‌బీఐ టానిక్ | డీఎల్ఎఫ్ లాభం హై జంప్

గ్రో ఐపీవో @ 8,600 కోట్లు

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల ఎంపిక

ముంబై: రిటైల్ స్టాక్ బ్రోకర్, ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ గ్రో పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు వీలుగా 5 ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థలను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో కొటక్ మహీంద్రా క్యాపిటల్, జేపీ మోర్గాన్, యాక్సిస్ క్యాపిటల్, సిటీ, మోతీలాల్ ఓస్వాల్ ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ కేలండర్ ఏడాది(2025)లో పబ్లిక్ ఇష్యూ చేపట్టడం ద్వారా బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8,600 కోట్లు) సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలియజేశాయి. కంపెనీ ఇంతక్రితం 2021 అక్టోబర్‌లో సిరీస్–ఈ రౌండ్ ద్వారా 25.1 కోట్ల డాలర్లు(సుమారు రూ. 2,000 కోట్లు) సమీకరించింది. కాగా.. బిలియన్‌బ్రెయిన్స్ గేరేజ్ వెంచర్స్ ప్రమోట్ చేసిన గ్రోలో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లకు పెట్టుబడులున్న విషయం విదితమే.



ఎస్ఎంఈ రుణాలపై మరింత ఫోకస్

తెలుగు రాష్ట్రాల్లో క్యాథలిక్ సిరియన్ బ్యాంక్ విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ రంగ క్యాథలిక్ సిరియన్ బ్యాంక్ (సీఎస్‌బీ) తెలుగు రాష్ట్రాల్లోని చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎస్ఎంఈ) రుణాలపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఈ విభాగం కోసం రెండు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఆరు శాఖలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఎంఈ, ట్రాన్సాక్షన్ బ్యాంకింగ్ గ్రూప్ హెడ్ శ్యామ్ మణి తెలిపారు. ఎస్ఎంఈలకు రుణాల అవకాశాలపై అవగాహన కల్పించేందుకు శుక్రవారమిక్కడ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. టర్బో, శుభమంగళ్ వంటి ఉత్పత్తులతో చిన్న సంస్థలకు సత్వరం రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు.



సెప్టెంబర్ ఆఖరు నాటికి బ్యాంకు మొత్తం రుణాల్లో ఎస్ఎంఈ పోర్ట్‌ఫోలియో సుమారు 13%గా, దాదాపు రూ. 3,400 కోట్ల స్థాయిలో ఉందని శ్యామ్ తెలిపారు. ఇందులో తెలుగు రాష్ట్రాల వాటా 12 శాతమని, ఇది సుమారు 28% వృద్ధి చెందవచ్చని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎంఈ రుణాల విషయంలో హైదరాబాద్‌లో ఫార్మా బల్క్ డ్రగ్స్ విభాగంపై, ఆంధ్రప్రదేశ్‌లో తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాలపైనా ప్రధానంగా ఫోకస్ చేస్తున్నట్లు శ్యామ్ చెప్పారు. దేశీ ఫార్మా మార్కెట్ విలువ సుమారు రూ. 4.1 లక్షల కోట్లు కాగా.. హైదరాబాద్ వాటా సుమారు రూ. 44,000 కోట్లుగా ఉందని చెప్పారు. ఇందులో ఎస్ఎంఈల వాటా దాదాపు రూ.15,000 కోట్లుగా అంచనా వేశారు.



ఒలివియా-జాన్ పీర్స్ జోడీకి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్

ఆరంభ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 'మిక్స్‌డ్ డబుల్స్' ఫైనల్ కాస్తా ఆస్ట్రేలియన్ల సమరంగా మారింది. కోర్టులో ఇవతల... అవతల... నలుగురూ ఆస్ట్రేలియన్లే ట్రోఫీ కోసం 'ఏస్'లు దూశారు. చివరకు ఒలివియా గడెస్కీ-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జోడీ విజేతగా నిలిస్తే... సహచర ద్వయం కింబర్లీ బిరెల్-జాన్ ప్యాట్రిక్ స్మిత్ రన్నరప్‌తో తృప్తి పడింది. ఇరు జోడీలు 'వైల్డ్‌కార్డ్' ఎంట్రీతోనే సొంతగడ్డపై గ్రాండ్‌స్లామ్ ఆడటం గమనార్హం. మొత్తానికి 58 ఏళ్ల తర్వాత అంతా ఆస్ట్రేలియన్లే తలపడిన తుది పోరులో పీర్స్-ఒలివియా జోడీ 3-6, 6-4, 10-6తో స్మిత్-బిరెల్ జంటపై గెలిచింది. ఒలివియా-పీర్స్ జంటకు 1,75,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 95 లక్షల 36 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 22 ఏళ్ల ఒలివియాకిదే తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్. 36 ఏళ్ల పీర్స్ ఖాతాలో ఆస్ట్రేలియన్ ఓపెన్ (2017) పురుషుల డబుల్స్ టైటిల్, 2022లో యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ ఉన్నాయి.

పైచేయి కోసం 'రెండో' పోరాటం

జోరు మీదున్న టీమిండియా
- పుంజుకునే పనిలో ఇంగ్లండ్
- ఇరుజట్ల మధ్య నేడు రెండో టి20
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఇంగ్లండ్‌తో బోణీ అదిరింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో టీమిండియా సత్తా చాటుకుంది. ఇక సిరీస్‌లో పైచేయే మిగిలింది. వరుస మ్యాచ్‌ల విజయాలతో ప్రత్యర్థిని దెబ్బతీయాలని ఆతిథ్య భారత్ చూస్తోంది. తద్వారా సిరీస్ ఫలితం కోసం ఆఖరి పోరు (ఐదో టి20) దాకా లాక్కెళ్లడం ఎందుకని భావిస్తోంది. అయితే ఇది టి20 ఫార్మాట్. ఇందులో సొంతగడ్డ అనుకూలతలు, పర్యాటక జట్టుకు ప్రతికూలతలంటూ ఉండవు. ఒక్క ఓవర్ మార్చేస్తుంది. ఇక మెరుపు ఇన్నింగ్స్ తేల్చేస్తుంది. అలాంటి స్పీడ్ గేమ్‌లో మనదే ఆధిపత్యమనుకొని ఆదమరిస్తే అంతే సంగతి! ఐసీసీ ర్యాంకింగ్‌తో సంబంధం లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లోనే ఆస్ట్రేలియా, భారత్, ఇంగ్లండ్ జట్లు ఎప్పుడైనా సరే టాప్-3 జట్లే! కాబట్టి బట్లర్ బృందాన్ని ఏమాత్రం తక్కువ అంచనా వేసినా భారత్ మూల్యం చెల్లించుకోక తప్పదు. పైగా ఐపీఎల్‌లో హార్డ్ హిట్టర్‌గా ఇక్కడి పిచ్‌లపై కెప్టెన్ బట్లర్‌కు చక్కని అవగాహన ఉంది. ఆ సంగతి సూర్యకుమార్ బృందం మర్చిపోకూడదు. ఈ నేపథ్యంలో నేడు జరిగే రెండో టి20లో భారత్, ఇంగ్లండ్ జట్లు హోరాహోరీగా తలపడనున్నాయి.



అర్ష్‌దీప్, సూర్య, వరుణ్

చెన్నై: కోల్‌కతాలో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ బోల్తా పడింది. అలాగని ఒక్క మ్యాచ్‌తోనే పటిష్టమైన ఇంగ్లండ్‌ను తేలిగ్గా తీసుకోలేం. ఓపెనింగ్‌లో ఫిల్ సాల్ట్, మిడిలార్డర్‌లో హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్‌లు బ్యాట్ ఝుళిపిస్తే భారత బౌలర్లకు కష్టాలు తప్పవు. ఈ ముగ్గురితో పాటు జోస్ బట్లర్‌కు ఇక్కడి పిచ్‌లు కొట్టిన పిండే! అతని విధ్వంసం కొన్ని ఓవర్లపాటే ఉన్నా ఆ ప్రభావం ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను గణనీయంగా మార్చేస్తుంది. బౌలింగ్‌లో పేస్ ఆల్‌రౌండర్ జోఫ్రా ఆర్చర్ మెరుగ్గా బౌలింగ్ చేశాడు. అట్కిన్సన్, మార్క్‌వుడ్‌లతో పార్ట్‌టైమ్ బౌలర్‌గా లివింగ్‌స్టోన్ కూడా బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. గత మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన జట్టు వెనుకబడదు. కచ్చితంగా ఈ మ్యాచ్ గెలిచేందుకు, 1–1తో సమం చేసేందుకు బట్లర్ బృందం గట్టి పోరాటమే చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



బట్లర్

షమీ ఆడేనా?

భారత వెటరన్ సీమర్ షమీ గాయాల తర్వాత దేశవాళీ క్రికెట్‌లో బరిలోకి దిగాడు. ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. అయితే అంతర్జాతీయ పోటీలకు మాత్రం నిరీక్షణ తప్పడం లేదు. 'ఈడెన్'లో ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగిన భారత బృందం స్పిన్‌కు స్వర్గధామమైన 'చెపాక్'లోనూ అదే ఎత్తుగడను కొనసాగిస్తే సీనియర్ పేసర్ దగాట్‌కే పరిమితం కావొచ్చు. ఒకవేళ ఐదు మ్యాచ్‌ల సుదీర్ఘ సిరీస్‌లో అతన్ని దించాలనుకుంటే మాత్రం 'ఈడెన్'లో ప్రభావం చూపలేకపోయిన స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ని పక్కనబెట్టే అవకాశమైతే ఉంది. ఈ మార్పు మినహా గత జట్టే యథాతథంగా కొనసాగుతుంది. ఓపెనర్లు సంజూ సామ్సన్, అభిషేక్ శర్మ మంచి ఆరంభమే ఇచ్చారు. తక్కువ లక్ష్యమే కావడంతో మిగతా వారు పెద్దగా రాణించే చాన్స్ రాలేదు. సంజూ కూడా అభిషేక్‌లాగే భారీ ఇన్నింగ్స్ ఆడితే భారత బ్యాటింగ్ ఆర్డర్‌కు ఏ ఢోకా ఉండదు. నితీశ్ రెడ్డి, అక్షర్ పటేల్ దాకా అంతా దంచేసే వాళ్లే ఉన్నారు. ఓవర్‌కు పది పైచిలుకు పరుగులిచ్చినా హార్దిక్ పాండ్యా రెండు వికెట్లతో సత్తా చాటాడు. అర్ష్‌దీప్ సింగ్ ఈ ఫార్మాట్‌లో తన ప్రాధాన్యం పెంచుకునే ప్రదర్శన చేస్తున్నాడు. స్పిన్‌తో వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఇంగ్లండ్ బలగాన్ని తిప్పేస్తుండటంతో బౌలింగ్ దళం కూడా దీటుగానే ఉంది.

2 చెన్నైలో ఇప్పటి వరకు భారత జట్టు రెండు టి20లు ఆడింది. ఒక మ్యాచ్‌లో గెలిచి (2018లో వెస్టిండీస్‌పై ఆరు వికెట్ల తేడాతో)... మరో మ్యాచ్‌లో (2012లో న్యూజిలాండ్ చేతిలో ఒక పరుగు తేడాతో) ఓడిపోయింది.

పిచ్, వాతావరణం

గత ఈడెన్ పిచ్ సీమర్లకు, స్పిన్నర్లకు సమాన అవకాశమిచ్చింది. కానీ ఇక్కడి చెపాక్ వికెట్ అలా కాదు. ఇది ఎప్పట్నుంచో స్పిన్ ఫ్రెండ్లీ పిచ్. వరుణ్, అక్షర్‌లతో పాటు రవి బిష్ణోయ్‌కు కలిసొచ్చే వేదికని చెప్పొచ్చు. మంచు ప్రభావం తప్ప వాన ముప్పయితే లేదు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అయ్యో... జొకోవిచ్



జ్వెరెవ్

జొకోవిచ్

సినెర్

గాయంతో సెమీఫైనల్ నుంచి వైదొలిగిన సెర్బియా దిగ్గజం
- 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో నిరాశ
- తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో జ్వెరెవ్
- ఆదివారం డిఫెండింగ్ చాంపియన్ సినెర్‌తో తుది పోరు

మెల్‌బోర్న్: ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెల్చుకొని కొత్త చరిత్ర సృష్టించాలని ఆశించిన సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్‌కు నిరాశ ఎదురైంది. క్వార్టర్ ఫైనల్లో ప్రమాదకర ప్రత్యర్థి, స్పెయిన్ స్టార్ అల్‌కరాజ్‌పై జొకోవిచ్ నెగ్గడంతో అతనికి ఈసారి ఎదురులేదని అందరూ భావించారు. కానీ ఊహించనిరీతిలో జొకోవిచ్ ప్రస్థానం సెమీఫైనల్లోనే ముగిసింది. జర్మనీ ప్లేయర్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో జొకోవిచ్ మధ్యలోనే వైదొలిగాడు. 81 నిమిషాలపాటు జరిగిన తొలి సెట్‌ను 10 సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన జొకోవిచ్ 6–7 (5/7)తో చేజార్చుకున్నాడు. ఈ సెట్ పూర్తి కాగానే జొకోవిచ్ తల అడ్డంగా ఊపుతూ జ్వెరెవ్ దగ్గరకు వెళ్లి ఇక ఆడలేనంటూ తెలిపాడు. జొకోవిచ్ వైదొలగడంతో... జ్వెరెవ్ తన కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో అడుగు పెట్టాడు. ఇంతకుముందు జ్వెరెవ్ 2024 ఫ్రెంచ్ ఓపెన్‌లో, 2020 యూఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నాడు. తొడ కండరాల గాయంతోనే సెమీఫైనల్ ఆడినట్లు తెలిపిన జొకోవిచ్... ఆట కొనసాగుతున్నకొద్దీ నొప్పి భరించలేనంత ఎక్కువ కావడంతో తప్పనిసరిగా వైదొలగాల్సి వచ్చిందని మీడియా సమావేశంలో వివరించాడు.

ఏకపక్షంగా జరిగిన రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) 7–6 (7/2), 6–2, 6–2తో 21వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా)పై గెలిచి వరుసగా రెండో ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2 గంటల 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సినెర్ ఎనిమిది ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ జ్వెరెవ్‌తో సినెర్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో జ్వెరెవ్ 4–2తో సినెర్‌పై ఆధిక్యంలో ఉన్నాడు.

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్ (మధ్యాహ్నం 2 గంటల నుంచి)



ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం నేడు డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా (బెలారస్), మాడిసన్ కీస్ (అమెరికా) తలపడనున్నారు. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ ఫైనల్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం సోనీ స్పోర్ట్స్ చానెల్‌లో ఉంది. ముఖాముఖి పోరులో సబలెంకా 4-1తో కీస్‌పై ఆధిక్యంలో ఉంది.



లింగ సమానత్వంపై అవగాహన

విద్యార్థులతో ఉమెన్‌సేఫ్టీ వింగ్ వాక్‌థాన్



సాక్షి, హైదరాబాద్: లింగ సమానత్వంపై అవగాహన పెంచడం ద్వారా మహిళలు, చిన్నారులపై నేరాలు అరికట్టే లక్ష్యంతో మహిళా భద్రత విభాగం మరో కీలక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో జెండర్ సెన్సిటైజేషన్ పైలెట్ ప్రాజెక్టులు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జెడ్పీహెచ్ఎస్ ఉప్పల్, జెడ్పీహెచ్ఎస్ నాగోల్, జెడ్పీహెచ్ఎస్ రామాంతపూర్ పాఠశాలల విద్యార్థులతో వాక్‌థాన్ నిర్వహించినట్టు మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ తెలిపారు.


మత్తుపదార్థాల ధ్వంసానికి ఆదేశాలు

ఇప్పటివరకు 3558 కేజీల ఎన్‌డీపీఎస్ గంజాయి, డ్రగ్స్ కాల్చివేత



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మత్తుపదార్థాలను ధ్వంసం చేయాలని ఎక్సైజ్‌శాఖ అధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. జనవరి 10 నుంచి మత్తుపదార్థాల ధ్వంసానికి తెలంగాణ ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ ఎక్సైజ్‌శాఖ పరిధిలో పది డివిజన్లలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 308 కేసుల్లో పట్టుబడిన 3558 కేజీల ఎన్‌డీపీఎస్ గంజాయి, డ్రగ్స్‌ను తగులబెట్టారు. వీటి విలువ రూ.14.60 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంకా మిగిలిన 10,596 కేజీల గంజాయి, ఇతర మత్తుపదార్థాలను ధ్వంసం చేయాల్సి ఉంది. వీటి ధ్వంసాన్ని త్వరగా పూర్తి చేయాలని కమలాసన్‌రెడ్డి శుక్రవారం మరోమారు అధికారులను ఆదేశించారు.

ఇంట్లోనే మాంసం ముక్క, రక్తపు మరకలు!



గురుమూర్తి

‘భార్యను చంపి, ఉడకబెట్టిన’ కేసులో ఆధారాలు గుర్తించిన పోలీసులు

- నిందితుడు గురుమూర్తి ఇంట్లో అడుగడుగునా జల్లెడ పట్టిన క్లూస్ టీమ్
- కమర్షియల్ గ్యాస్ స్టవ్‌పై చిన్న మాంసం ముద్ద, వెంట్రుకలు గుర్తింపు
- నిర్ధారణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు శాంపిల్స్..
- ఆధారాల సేకరణ కోసం బ్లూ-రేస్ టెక్నాలజీ వినియోగించాం: రాచకొండ సీపీ

సాక్షి, హైదరాబాద్/ మీర్‌పేట: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జిల్లెలగూడ మహిళ హత్యకేసులో రాచకొండ పోలీసులు ఆధారాలను గుర్తించారు. ‘భార్యను చంపి, ముక్కలుగా చేసి, ఉడకబెట్టిన’కేసుకు సంబంధించి ఇంట్లోనే చిన్న మాంసం ముద్ద, రక్తపు మరకలు, వెంట్రుకలను గుర్తించారు. ఈ ఆధారాలను విశ్లేషించేందుకు ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపినట్టు పోలీసులు తెలిపారు.

ఇల్లంతా జల్లెడపట్టి..

మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడలో ఉంటున్న ప్రకాశం జిల్లా జేపీ చెరువుకు చెందిన పుట్ట గురుమూర్తి తన భార్య వెంకట మాధవి (35)ని పాశవికంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. పోలీసుల విచారణలో భార్యను తానే హత్య చేసినట్టు నిందితుడు ఒప్పుకున్నా.. దానికి సంబంధించి తొలుత ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీనితో క్లూస్ టీమ్ బ్లూ-రేస్ సాంకేతిక పరిజ్ఞానంతో గురుమూర్తి ఇంట్లో అడుగడుగునా జల్లెడ పట్టింది. ఈ క్రమంలో సింగిల్ బర్నర్ ఉండే కమర్షియల్ గ్యాస్ స్టవ్ మీద మాంసం ముద్ద, రక్తపు మరకలు, వెంట్రుకలను గుర్తించారు. వాటిని పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆధారాలు లభించడంతో ఇప్పటివరకు మిస్సింగ్ కేసుగా ఉన్న దీనిని హత్య కేసుగా మార్చినట్టు రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబు తెలిపారు. ఆధారాల విశ్లేషణ కోసం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌ల నిపుణుల సలహాలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే గురుమూర్తి ఇద్దరు పిల్లలు, అత్త సుబ్బమ్మ వాంగ్మూలాలను నమోదు చేసినట్టు తెలిపారు.

మంగళసూత్రం విసిరి కొట్టిందని..

ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు గురుమూర్తిని శుక్రవారం మరోసారి విచారించారు. భార్యతో గొడవకు కారణాలేమిటని ఆరా తీయడంతో కొత్త అంశాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. పోలీసు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... మరదలితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో గురుమూర్తిని భార్య, ఆమె తల్లిదండ్రులు దూరం పెట్టడం మొదలుపెట్టారు. ఊర్లో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. మరో మహిళతో అక్రమ సంబంధంపై మాధవి నిలదీయడంతో గొడవలు జరిగేవి. తాజాగా సంక్రాంతి పండుగకు ఊరు వెళ్లే విషయంలో గొడవ జరిగింది. మాధవి మంగళసూత్రం తీసి గురుమూర్తి ముఖంపై విసిరి కొట్టడంతో అతను ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యాడు. ఆమె తలను గోడకేసి కొట్టడంతో తల వెనుక భాగంలో బలమైన దెబ్బతగిలి అక్కడికక్కడే మృతిచెందింది. తొలుత స్పృహ తప్పి పడిపోయిందని భావించిన గురుమూర్తి.. కొంత సేపటి తర్వాత చనిపోయిందని గుర్తించాడు. ఆధారాలు దొరక్కుండా శరీరాన్ని ముక్కలు చేసి, సింగిల్ బర్నర్ కమర్షియల్ స్టవ్ మీద కాల్చాడు. తర్వాత రోకలి బండతో పొడిగా చేసి, డ్రైనేజీలో, జిల్లెలగూడ చెరువులో పడేశాడు.

కడిగేసినా ఆధారాలు దొరుకుతాయి

ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు ఆధారాల కోసం బ్లూ-రేస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. నీలి రంగు, యూవీ (అల్ట్రా వయొలెట్) కాంతితో కూడిన ప్రత్యేకమైన లైట్లతో... నేరం జరిగిన ప్రదేశాలను నిపుణులు పరిశీలిస్తారు. నేరస్తులు ఘటన జరిగిన ప్రదేశాన్ని కడిగేసినా కూడా.. వేలి ముద్రలు, రక్తపు మరకలు, ఇతర శరీర ద్రవాలను, అత్యంత సూక్ష్మమైన మాంసపు ముద్దలను కూడా గుర్తించేందుకు అవకాశం ఉంటుంది. ఇంతకుముందు 2018లో ఉప్పల్‌లో క్షుద్రపూజల నేపథ్యంలో దంపతులు ఓ పాపను బలిచ్చి, ఆనవాళ్లు దొరకకుండా పసుపు, రసాయనాలతో కడగగా.. బండల మధ్య రంధ్రాల్లో రక్తపు నమూనాలను బ్లూ-రేస్ టెక్నాలజీతోనే పోలీసులు గుర్తించారు. తాజాగా ఇదే తరహాలో జిల్లెలగూడ ఘటనలో మాంసం ముద్ద, రక్తపు మరకలను గుర్తించినట్టు పోలీసులు చెబుతున్నారు.

పన్ను రేట్లు తగ్గించాలి.. మినహాయింపులు పెంచాలి

ప్రీ-బడ్జెట్ సర్వేలో పన్ను చెల్లింపుదారుల అభిప్రాయమిది

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆదాయపన్ను (ఐటీ) చెల్లింపుదారులు ఏం కోరుకుంటున్నారనే అంశంపై లండన్‌కు చెందిన గ్రాంట్ థోర్నటన్ అనే సంస్థ ప్రీ-బడ్జెట్ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 57 శాతం మంది తక్కువ పన్ను రేట్లు, ఎక్కువ మినహాయింపులు కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇక 72% మంది తాము కొత్త వ్యక్తిగత ఆదాయ పన్ను విధానాన్ని ఎంపిక చేసుకున్నట్లు చెప్పారు. కొత్త పన్ను విధానంలోనూ తక్కువ పన్ను రేట్లు, మరిన్ని మినహాయింపులను ఆశిస్తున్నట్లు చెప్పారు.

- సాక్షి, సెంట్రల్ డెస్క్

వ్యక్తిగత ట్యాక్స్ సర్వే ఇలా..



వ్యక్తిగత పన్ను ఊరట

- 57% తక్కువ పన్ను రేట్లు కావాలన్న వారు.
- 25% ఎక్కువ పన్ను మినహాయింపులు ఇవ్వాలన్న వారు.
- 11% కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ పెంచాలన్న వారు.

కొత్త వర్సెస్ పాత పన్ను విధానంపై..

- 46% తక్కువ పన్ను రేట్లు ఉంటే కొత్త పన్ను విధానం మరింత ఆకర్షణీయంగా ఉంటుందన్న వారు .
- 63% పాత పన్ను విధానంలో డిడక్షన్ లిమిట్స్ పెంచాలన్న వారు.

పన్ను చెల్లింపులపై..

- 56% ఐటీ రిటర్నుల ఫైలింగ్‌కు ఆదాయ పరిమితిని పెంచాలన్న వారు..
- 38% విదేశీ బ్యాంకుల ద్వారా పన్ను చెల్లింపుల అవకాశం ఉండాలని కోరుకున్న ఎన్ఆర్ఐలు..

పన్ను ప్రోత్సాహకాలపై..

- 53% నేషనల్ పెన్షన్ స్కీంలో సరళమైన విత్‌డ్రాయల్ నిబంధనలు ఉండాలని కోరిన వారు
- ఈవీ వాహన రుణాలపై డిడక్షన్లను తిరిగి ప్రవేశపెట్టాలని పన్ను చెల్లింపుదారులు కోరుకుంటున్నారు.

ద.మ.రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్‌గా మురళీకృష్ణ



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్‌గా పీవీ మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీర్స్ 1990 బ్యాచ్‌కు చెందిన ఆయన వివిధ జోన్లలో పలు కీలక పోస్టుల్లో పనిచేశారు. చెన్నై ఐఐటీ, హైదరాబాద్ ఐఎస్‌బీల్లో మురళీకృష్ణ చదువుకున్నారు. 1994లో బెంగళూరు డివిజన్‌లోని దావణగెరెలో అసిస్టెంట్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్‌గా రైల్వేలో చేరారు. 2007 నుంచి 2012 మధ్య సికింద్రాబాద్‌లోని రైల్ టెల్ కార్పొరేషన్‌లో జీఎం ప్రాజెక్ట్స్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే దక్షిణ మధ్య రైల్వేలో 2 వేల కిలోమీటర్ల నిడివితో ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ఏర్పాటైంది. సికింద్రాబాద్‌లో రైల్ టెల్ డేటా సెంటర్ రూపకల్పనలో ఆయన కీలకంగా వ్యవహరించారు. సికింద్రాబాద్‌లోని ఇరిసెట్‌లో ఆయన 2012 నుంచి నాలుగేళ్లపాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. అక్కడ సిగ్నల్ ల్యాబ్ ఏర్పాటులో మురళీకృష్ణ కీలకంగా వ్యవహరించారు.

దిల్‌రాజు వాంగ్మూలం నమోదు చేసిన అధికారులు

వరుసగా నాలుగో రోజు కొనసాగిన ఐటీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్‌రాజు ఇల్లు, కార్యాలయాలపై వరుసగా నాలుగో రోజూ ఆదాయపన్నుశాఖ అధికారుల సోదాలు కొనసాగాయి. మంగళవారం నుంచి పలువురు టాలీవుడ్ నిర్మాతలు, నిర్మాణ సంస్థలకు చెందిన వ్యక్తులు, ఫైనాన్షియర్ల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల బృందాలు తనిఖీలు చేస్తున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ సుకుమార్ సహా పలువురి ఇళ్లలోనూ గురువారం వరకు సోదాలు జరిగాయి. దిల్ రాజు ఇంట్లో మాత్రం ఐటీ సోదాలు శుక్రవారంతో ముగిశాయి. 5 రోజుల సెర్చ్ వారెంట్‌తో ప్రారంభించిన సోదాలకు సంబంధించి శుక్రవారం దిల్ రాజు వాంగ్మూలం నమోదు చేశారు. ఈ క్రమంలో ఐటీ అధికారులు దిల్ రాజును శ్రీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ ఆఫీస్‌కు తీసుకెళ్లారు. ఆయన సమక్షంలోనే డాక్యుమెంట్లను పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సహా ఇటీవల నిర్మించిన సినిమాల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. డాకు మహారాజ్ సినిమాకు దిల్‌రాజు డిస్ట్రిబ్యూటర్‌గా ఉండటంతో ఆ సినిమా కలెక్షన్లపైనా కొన్ని వివరాలు తీసుకున్నట్టు సమాచారం. అనంతరం పలు డాక్యుమెంట్లు, బ్యాంకు లావాదేవీలు, సినిమాలకు ఖర్చు చేసిన సొమ్ము, వచ్చిన లాభాలు వంటి అంశాలపై ఐటీ అధికారులు దిల్ రాజుతోపాటు ఎస్‌వీసీ ఆడిటర్, అకౌంటెంట్ వాంగ్మూలాలను నమోదు చేసినట్లు తెలిసింది. ఆదాయ పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసాలకు సంబంధించి వివరణ కోరినట్లు సమాచారం.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

‘ఓటు’.. ఎందుకీ తడబాటు?

- ప్రతీ ఎన్నికలో 80 శాతం చేరని పోలింగ్
- ఓటు నమోదు, పోలింగ్ శాతాల మధ్య భారీ తేడా
- తెలంగాణలో మూడు పర్యాయాలు ఎన్నికలు
- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకూ భారీ తేడా
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

సాక్షి ప్రతినిధి, వరంగల్:

భారత రాజ్యాంగంలోని 326 ఆర్టికల్ ప్రకారం 18 ఏళ్లు నిండిన జాతీయ పౌరులకు వయోజన ఓటుహక్కు కల్పించారు. కుల, మత, లింగ, ప్రాంత, ధనిక, పేద, వివక్ష లేకుండా అక్షరాస్యులకు నిరక్షరాస్యులకు సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించి.. ప్రపంచ రాజకీయ చరిత్రలో గొప్ప విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. అభివృద్ధి చెందిన దేశాల కంటే ముందే మనదేశంలో వయోజన ఓటింగ్ హక్కు కల్పించి, ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసింది. అయితే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ.. అవినీతిని పారదోలే వజ్రాయుధం.. రాజ్యాంగం ప్రసాదించిన హక్కు.. ఇలా ఎన్ని విశ్లేషణలు జోడించినా.. ఓటు వేస్తున్న వారి సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లేందుకు వీలుగా.. వరసలో నిలబడి ఓటు వేయడానికి ఇంకా చాలామంది ఆసక్తి చూపడం లేదు. ఓటు వేసే విషయంలో గ్రామీణ ఓటర్లు మొగ్గు చూపుతున్నా.. పట్టణ, నగర ఓటర్లే తడబడుతున్నారు. ఓటర్ల నమోదు పెరుగుతున్నా.. ఓటింగ్ శాతం మాత్రం పెరగడం లేదు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు భారీ వ్యత్యాసం..

తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో భారీ వ్యత్యాసం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసినంతమంది కూడా పార్లమెంట్ ఎన్నికలకు ముందుకు రాలేదు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 2,81,65,885 మంది ఓటర్లకు 1,94,43,411 మంది (69.0శాతం) ఓటు వేయగా.. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 2,81,75,651 ఓట్లకు 1,94,31,99 (68.97 శాతం) ఓట్లు పోలయ్యాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 2,56,94,443 ఓట్లకు, 2,04,70,749 (79.67 శాతం) ఓట్లు పోలవగా, ఆ తర్వాత 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 2,80,65,876 ఓట్లకు 1,86,42,895 (66.4 శాతం) ఓట్లు పోలయ్యాయి. అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 3,26,02,799 ఓటర్లకు 2,32,67,914 మంది ఓటర్లు (71.37 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా, 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల నాటికి ఓటు న మోదు పెరిగినా 5.11 శాతం తగ్గింది. మొత్తం 3,32,16,348 మంది ఓటర్లకు 2,20,08,373 మంది (66.26 శాతం) ఓట్లేశారు.



ప్రతీ పౌరుడు ఓటు హక్కును ప్రాథమిక బాధ్యతగా స్వీకరించాలి. మొత్తం ఓటర్లలో కనీసం 90 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకోవాలి. 90 శాతం ఓటింగ్ జరిగితే దేశం ఎప్పుడూ అభివృద్ధి పథంలో పురోగమిస్తుంది.

– అబ్దుల్ కలాం, మాజీ రాష్ట్రపతి

ఓటు హక్కుపై అవగాహన

ఓటు హక్కు వినియోగంపై ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌కు తోడు పౌరసమాజం, యువత మహిళా సంఘాలు, స్వచ్ఛంద సామాజిక సేవా సంస్థలు చైతన్యం కలిగించాలి. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ఓటుహక్కు చాలా కీలకం. ఓటు హక్కు వినియోగం మీద అందరినీ మరింత చైతన్య పరచాల్సిన బాధ్యత పౌరసమాజంపై ఉంది. ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా సమర్థులైన అభ్యర్థులకు ఓటు వేసేలా చూడాలి.

– డాక్టర్ కేశవులు, చైర్మన్, తెలంగాణ యాంటీ కరప్షన్ ఫోరం

తెలంగాణలో మూడు ఎన్నికలు.. 80 శాతం చేరని వైనం..

1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 45 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించారు. 2019 నాటికి 17వ లోకసభ ఎన్నికల్లో 66.4 శాతం మంది ఓటు వేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడు పర్యాయాలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఏటా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల ఓటు నమోదు కోసం జిల్లాల అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎన్నికల సమయంలోనూ ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు చేపడుతోంది. కానీ.. ఈ ఎన్నికల్లో మొత్తం ఓట్లు.. పోలైన ఓట్లు.. ఓటింగ్ శాతాలు పరిశీలిస్తే 80 శాతం చేరుకున్న దాఖలాలు లేవు. కేంద్ర ఎన్నికల సంఘం నివేదికల ప్రకారం.. తెలంగాణ ఏర్పడిన తొలి శాసనసభ (2014) ఎన్నికల్లో 2,81,65,885 మంది ఓటర్లకు 1,94,43,411 మంది (69.0 శాతం) ఓటు వేశారు. 2018లో 79.67 శాతం ఓట్లు పోల్ కాగా, 2023లో 71.37 శాతంగా నమోదైంది.

2025 జనవరి 6న ప్రకటించిన ఓటర్ల లెక్క ఇదీ..

మొత్తం ఓటర్లు: 3,35,27,925
మహిళలు : 1,68,67,735
పురుషులు: 1,66,41,489
ట్రాన్స్‌జెండర్లు: 2,829
సర్వీసు ఓటర్లు : 15,872

అసెంబ్లీ ఎన్నికలు.. ఓటర్లు, పోలింగ్ వివరాలు..

2014లో..
మొత్తం ఓటర్లు: 2,81,65,885
పోలైన ఓట్లు: 1,94,43,411
పోలింగ్ శాతం: 69.0%

2018లో..
మొత్తం ఓటర్లు: 2,56,94,443
పోలైన ఓట్లు: 2,04,70,749
ఓటింగ్: 79.67%

2023లో..
మొత్తం ఓటర్లు: 3,26,02,799
పోలైన ఓట్లు: 2,32,67,914
పోలింగ్ శాతం: 71.37%

పార్లమెంట్ ఎన్నికలు.. ఓటర్లు, పోలింగ్ వివరాలు...

2014లో..
ఓటర్లు: 2,81,75,651
పోలైన ఓట్లు: 1,94,31,997
ఓటింగ్: 68.97%

2019లో..
మొత్తం ఓటర్లు: 2,80,65,876
పోలైన ఓట్లు: 1,86,42,895
పోలింగ్ శాతం: 66.4%

2024లో..
మొత్తం ఓటర్లు: 3,32,16,348
పోలైన ఓట్లు: 2,20,08,373
పోలింగ్ శాతం: 66.26%

22 భారతీయ భాషల్లో ‘ఇంద్రధనుస్సులు’

నేటిరాత్రి ఆకాశవాణి అన్ని కేంద్రాల్లో కవిత ప్రసారం



ఏనుగు నర్సింహారెడ్డి

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన సుప్రసిద్ధ తెలుగు కవి, రచయిత డాక్టర్ ఏనుగు నర్సింహ్మారెడ్డి రాసిన ‘ఇంద్రధనుస్సులు’ కవిత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి నిర్వహిస్తున్న జాతీయ కవి సమ్మేళనానికి ఎంపికైంది. ఈ కవిత 22 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ఈ నెల 25వ తేదీ రాత్రి 10 గంటలకు అన్ని ఆకాశవాణి కేంద్రాలలో.. 22 భారతీయ భాషల్లో ప్రసారం కానుంది. స్త్రీల వ్యక్తిత్వాన్ని ఇంద్రధనుస్సుతో పోల్చిన ఈ కవిత.. భారతీయ భాషలన్నింటిలోకి అనువాదమై ప్రసారం కావడం వల్ల.. ఏనుగు నర్సింహ్మారెడ్డి తెలుగు కవితా సొబగు ఇతర భాషలకు చేరనుంది. ఈయన ఇప్పటి వరకు 9 కవితా సంపుటాలు, 5 విమర్శ గ్రంథాలను, రెండు అనువాదాలు, రెవెన్యూ శాఖలో రావలసిన సంస్కరణల గురించి ఒక పుస్తకాన్ని ప్రచురించారు. వచన కవిత్వాన్ని తనదైన విలక్షణమైన ముద్రతో రాయడం ఏనుగు నర్సింహ్మారెడ్డి ప్రత్యేకత. ఆయన అడిషనల్ కలెక్టర్ హోదాలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఏనుగు నర్సింహ్మారెడ్డి రాసిన కవిత

ఇంద్రధనుస్సులు..

ఆమెలోని మెరుపు నీకు నచ్చదు.
ఆమెపోయే మెళికలు నాకు గిట్టవు
ఆవిడ నవ్వత ఇతనికి పడదు
ఈవిడ తళుకు అతనికి కోపకారణం
ఆ పాప చమక్కు అతనికి అజీర్తి
ఈ మెరుపులపట్టీ వేగం ఇతనికి అసహనం
చుట్టూ తిరిగే ప్రేమపై చిరాకు
ఈమె చురుకు వీళ్లకు అరికాలి మంట
నిజమే వాళ్లలో కొన్ని ఇంద్రధనుస్సులు
మనలోని ఎండాకాలపు నింగికి నచ్చవు
నిత్యాహంకారపు నీలాకాశమా
నిజంపూల హారాన్ని కొంచెం నికరంగా గమనించు.
మన తూటామాటా చూపువక్రత
నడత మడత కోపం లోపం
అహం అసహనం
ఏదీ వాళ్లలో ఎవరికి నచ్చదు.
అసలే నచ్చని వాటిని నచ్చీ
ఎలా నవ్వొచ్చో
జీవితపు రంగుల్ని పణంగా పెట్టి చూపిస్తరు వాళ్ళు
చూడు మరి వాళ్ళు మరి వాళ్ళు ఎలా చూసారో
అలా చూడుమరి.

అంతా ఆన్‌లైన్

- ఎస్సీ, ఎస్టీల ఉపకార వేతనాలు, ఫీజు పథకాల్లో సంస్కరణలు
- దరఖాస్తు.. పరిశీలన..ఆమోదం.. నిధుల మంజూరంతా డిజిటలైజేషన్‌లో
- ఒక్క దరఖాస్తును ప్రింట్ తీసే అవసరం లేకుండా మార్పులు
- కాలేజీల డిజిటల్ కిట్‌లు..ఈపాస్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల దరఖాస్తులు ఇలా..

సంవత్సరం	ఎస్సీ	ఎస్టీ		
ఫ్రెషర్స్	రెన్యూవల్	ఫ్రెషర్స్	రెన్యూవల్	
2023-24	87,213	1,26,125	54,559-	76,320
2024-25	62,450	98,600	32,300	52,144 (జనవరి 10వరకు)

నోట్: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మార్చి 31వరకు కొనసాగుతుంది.

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల్లో భారీ సంస్కరణలు చోటు చేసుకున్నాయి. దరఖాస్తు ప్రక్రియలో ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖలు మాన్యువల్ విధానానికి స్వస్తి పలికాయి. ఇకపై ఏ విద్యార్థి కూడా దరఖాస్తు పత్రాన్ని ప్రింట్‌అవుట్ తీసుకొని సమర్పించాల్సిన పని లేదు. ఈపాస్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయడంతోపాటు సంబంధిత ధ్రువపత్రాలను స్కాన్ చేసిన అప్‌లోడ్ చేస్తే చాలు. దశలవారీగా ఆన్‌లైన్‌లో పరిశీలన, ఆమోదం, నిధులు కూడా నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమయ్యేలా సంక్షేమ శాఖలు ఈపాస్ పోర్టల్‌ను సాంకేతికంగా అభివృద్ధి చేశాయి.

స్టేషనరీ ఖర్చులకు చెక్

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదట్నుంచి ఆన్‌లైన్ పద్ధతిలోనే కొనసాగేది. అయితే విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు జత చేసిన ధ్రువపత్రాలన్నీ ప్రింట్ తీసుకొని వాటిని కాలేజీలో సమర్పించేవారు. అలా కాలేజీలో మాన్యువల్‌గా సమర్పించిన ప్రింట్‌అవుట్స్‌ను కాలేజీ ప్రిన్సిపల్ పరిశీలించి, ఆయన యూజర్ లాగిన్ ద్వారా ఆమోదించడం , వాటిని తిరిగి ప్రింట్ తీసుకొని సంతకాలు చేయడం జరిగేది. ఆ తర్వాత సంతకాలు చేసిన పత్రాలను సంబంధిత సంక్షేమ శాఖలకు పంపడం ... అక్కడ వాటిని సంక్షేమాధికారి యూజర్ లాగిన్ ద్వారా ఆమోదించడం... తిరిగి బిల్లులు రూపొందించి, ప్రింట్‌అవుట్స్ తీసుకొని ట్రెజరీల్లో సమర్పించేవారు. ఇలా ప్రతి దశలో ఆన్‌లైన్‌లో ఆమోదించి ప్రింట్ తీసుకోవడం సుదీర్ఘ ప్రక్రియ కావడంతోపాటు స్టేషనరీ ఖర్చులు తడిసి మోపెడయ్యేవి. ఒక్కో దరఖాస్తును సగటున మూడుసార్లు ప్రింట్ తీయాల్సిన పరిస్థితి ఉండేది. ఒక్కో దరఖాస్తులో సగటున 10 పేజీలుంటాయి. పరిశీలన పూర్తయిన ప్రతిసారి ఇలా ప్రింట్‌అవుట్ తీసి మరో దశకు ఫైలు బదిలీ చేసే పరిస్థితితో స్టేషనరీ, ప్రింటర్ నిర్వహణ భారీగా ఉండేది. తాజా విధానంతో ఈ ఖర్చులు ఉండవు. ఇకపై ఆన్‌లైన్ దరఖాస్తులను నేరుగా వెబ్‌సైట్‌లోనే ఆమోదించడం... అక్కడే డిజిటల్ సంతకాలు చేయడం... ఆ ఫైళ్లను ఆన్‌లైన్ పద్ధతిలోనే దశల వారీగా సంబంధిత అధికారులకు పంపే విధానాన్ని అభివృద్ధి చేశారు. ఆన్‌లైన్‌లోనే సంతకాలు పెట్టే విధంగా డిజిటల్ కీలను కళాశాల యాజమాన్యాలకు అందుబాటులోకి తెచ్చారు. సంక్షేమాధికారులు సైతం డిజిటల్ కీలనే వినియోగించాలని ఆదేశించారు. ఈ మేరకు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు.

కేంద్రం నిబంధనలతో... ఎస్సీ అభివృద్ధి శాఖకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు భరిస్తుండగా, గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో నిధులు ఇస్తున్నాయి. ఈ పథకాలకు సంబంధించి ముందుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే... కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేస్తుంది. ఈ క్రమంలో లబ్ధిదారు ఖాతాకే నేరుగా నిధులు చెల్లిస్తారు. ఈ నిబంధన కేంద్ర ప్రభుత్వం కఠినంగా అమలు చేయడంతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలు ఆన్‌లైన్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాయి. ఈ విధానాన్ని 2024–25 వార్షిక సంవత్సరం నుంచే పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించగా... ఇటీవల ఈపాస్ వెబ్‌సైట్‌లో ఈమేరకు మార్పులు చేశారు.

వేలం ఓకే.. విక్రయాల ఖరారు వద్దు

కేపీహెచ్‌బీ ఖాళీ స్థలాల ఆక్షన్‌పై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కేపీహెచ్‌బీలోని ఖాళీ స్థలాల వేలం ప్రక్రియను కొనసాగించవచ్చని, విక్రయాలను మాత్రం ఖరారు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణ ఈనెల 30కి వాయిదా వేసింది. ఈనెల 10న వేలం కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కేపీహెచ్‌బీ ఫేజ్ 15 కాలనీవాసుల తరఫున శ్రీవెంకటరమణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చింతలపాటి వెంకటరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్ కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది రూపేందర్ వాదనలు వినిపిస్తూ.. కేపీహెచ్‌బీ లేఅవుట్‌లో గ్రీనరీ కోసం నిర్దేశించిన స్థలాలతోపాటు 30 గజాల విస్తీర్ణంలోని స్థలాన్ని కూడా ప్రభుత్వం వేలం వేస్తోందని చెప్పారు. 2011, మార్చి 29న జారీ చేసిన జీవో 6 ప్రకారం ఖాళీ స్థలాల్లోకి వెళ్లే దారి లేని వాటిని పక్కనున్న స్థలాల యజమానులే కొనుగోలు చేయాలని తెలిపారు. జీవో 6 ప్రకారం వంద గజాల స్థలాల కంటే తక్కువున్న వాటిని పొరుగున ఉన్న వాళ్లే మార్కెట్ ధరకు వేలం లేకుండా సంబంధిత మున్సిపాలిటీ నుంచి ఎన్‌వోసీ తీసుకుని కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పుడు ఈ స్థలాలను వేలం వేసేస్తే రోడ్డు విస్తరణ కష్టం అవుతుందని చెప్పారు. అంతేకాదు, వేలం నిర్వహించబోయే ప్లాట్ల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి నిర్వహించే వేలాన్ని నిలుపుదల చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఆదేశిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు మధ్యంతర ఉత్తర్వులను సవరించారు. వేలం ప్రక్రియను అడ్డుకోవద్దని, రహదారుల విస్తరించే ప్రాంతానికి వేలం వేసే స్థలాలకు సంబంధంలేదని ఏజీ తెలిపారు. చట్ట ప్రకారమే వేలం నిర్వహించాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందన్నారు. వేలంపాట నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయని.. కేపీహెచ్‌బీ లేఅవుట్ ప్రకారం 54.29 ఎకరాలు ఉందని, చట్ట నిబంధనల ప్రకారం 10 శాతం భూమిని గ్రీనరీకి వదిలేసింది, లేనిదీ విచారిస్తామని వెల్లడించారు. దీంతో తెలంగాణ హౌసింగ్ బోర్డు ముఖ్య కార్యదర్శి, పట్టణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ తదితర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

స్నేక్.. సేఫ్

గత ఏడాదిలో 13,028 పాములను కాపాడిన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్‌సొసైటీ

అందులో సగం నాగుపాములే...



సాక్షి, హైదరాబాద్: జనావాసాలు..బహిరంగ ప్రాంతాల్లోకి వచ్చే పాములను కాపాడి వాటిని సురక్షిత ప్రాంతాలకు చేర్చడంలో ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ (ఎఫ్ఓఎస్) కీలకంగా పనిచేస్తోంది. 2024 ఏడాదిలో హైదరాబాద్ సహా తెలంగాణవ్యాప్తంగా ఈ సొసైటీ సభ్యులు మొత్తం 13,028 పాములను రక్షించారు. వీటిలో 6,186 వరకు నాగుపాములే ఉన్నట్టు ఎఫ్ఓఎస్ తెలిపింది. పాములను రక్షించేందుకు వాటిని పట్టుకునే క్రమంలో కాటు వేయడం సహజం. అయితే పాముకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకు న్నట్టు సొసైటీ సభ్యులు తెలిపారు. ఎఫ్ఓఎస్‌ను ఏర్పాటు చేసిన తర్వాత 2015లో 3,389 పాములను రక్షించగా..2024 నాటికి ఆ సంఖ్య 13,028కి చేరినట్టు వారు పేర్కొన్నారు. గత దశాబ్దంలో ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ ద్వారా దాదాపు 75,000 పాములను రక్షించి, పునరావాసం కల్పించారు. పాముల రెస్క్యూ డేటా ఆధారంగా చూస్తే 2024లో నాగుపాములు 47.5% , జెర్రిపోతులు 24% ఉన్నాయి.

నగరాభివృద్ధిలో జనావాసాల్లోకి...

నగర శివారు ప్రాంతాల్లోనూ భారీగా నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో అప్పటి వరకు నివసించే సర్పాలు..విధిలేక వీధుల్లోకి..జనావాసాల్లోకి వస్తున్నాయి. దీంతో అవి కొన్నిసార్లు రోడ్లపైన వెళ్లే వాహనాల కిందపడి మృతి చెందడం లేదంటే నివాస ప్రాంతాల్లో జనం వాటిని కొట్టి చంపడం జరుగుతోందని ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యులు చెబుతున్నారు. పొలాల్లో మితిమీరిన ఎరువులు, రసాయనాల వాడకం సైతం పాములకు పెనుముప్పుగా మారినట్టు వారు తెలిపారు. అయితే, పట్టణ ప్రాంతాల్లో క్రమంగా అవగాహన పెరగడంతో పాముల సంచారానికి సంబంధించిన సమాచారాన్ని తమకు అందిస్తున్నారని, దీంతో కొంత వరకు వాటిని కాపాడుతున్నామన్నారు.

2024లో ఎఫ్ఓఎస్ సభ్యులు గుర్తించిన పాములు ఇలా..

నాగుపాములు:	6,186
జెర్రిపోతులు (ఇండియన్ ర్యాట్ స్నేక్):	3,120
నీటిపాము (చెకర్డ్ కీల్‌బ్యాక్):	1,386
చెట్లపై ఉండే పాము (కామన్ బ్రాంజ్ బ్యాక్ ట్రీ స్నేక్):	422
కొండచిలువ (ఇండియన్ రాక్ పైథాన్):	112



పాముల రెస్క్యూపై ఉచితంగా శిక్షణ ఇస్తాం



పర్యావరణ సమతుల్యత కాపాడడంలో ప్రతి జీవి కీలకమే. పాములు ఉండడం వల్ల ఎలుకల సంఖ్య అదుపులో ఉంచడంతోపాటు ఎన్నోరకాల మేలు ఉంది. అందుకే పాముల పరిరక్షణకు 1995లో నలుగురు సభ్యులతో సైనిక్‌పురిలో రాజ్‌కుమార్ కానూరి ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ స్థాపించారు. ఇప్పుడు 150 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారికి మేం పాముల రెస్క్యూపై ఆరునెలల ఉచిత శిక్షణ ఇస్తాం. పాముకాటుకు గురైతే ఏం చేయాలి? ఎలాంటి వైద్యచికిత్స విధానాలు పాటించాలి? పాముల గురించి ఇతర సమాచారం సైతం మా సంస్థ వెబ్‌సైట్‌లో పెట్టాం. పాములను గమనిస్తే వాటిని రెస్క్యూ చేసేందుకు మా నంబర్ 8374233366కు కాల్ చేయొచ్చు.

– అవినాశ్, జనరల్ సెక్రటరీ, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ



ఉషోదయాన..తుషార సోయగం

మంచు బిందువులు పూరేకులపై నిలిచి ఉదయ భానుడి లేలేత కిరణాలు స్పర్శకు ఇలా మెరిసిపోతున్నాయి. విజయవాడ భవానీపురంలోని వీఎంసీ మున్సిపల్ నర్సరీలో ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వైద్యం.. దైన్యం

అనారోగ్యం బారిన పడి అనంతపురం సర్వజనాసుపత్రికి వచ్చిన రోగులు అక్కడి పరిస్థితులతో మరింత నీరసించిపోతున్నారు. ఆస్పత్రికి వచ్చిన ఓ వృద్ధుడు ఓపీ వద్ద భారీ క్యూలో నిల్చోలేక ఇలా రోడ్డుపై పడుకున్నాడు. -సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



డంపింగ్ యార్డ్ కాదు.. బస్టాండే

నిత్యం ప్రయాణికులు రాకపోకలతో రద్దీగా ఉండే కడప పాతబస్టాండ్ ప్రాంగణాన్ని కొందరు ఇలా డంపింగ్ యార్డ్‌గా మార్చేశారు. ప్రయాణికులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

గిరిజన సమస్యలు పరిష్కరించండి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. తాను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన సందర్భంగా క్షేత్రస్థాయిలో గుర్తించిన అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను శుక్రవారం రాత్రి కలిసి వినతిపత్రం ఇచ్చినట్టు శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనుల ఆర్థిక, సామాజిక అంతరాలను తొలగించేలా అవసరమైన అధ్యయనం చేయడతోపాటు ప్రజాభిప్రాయం సేకరించేలా కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, మంచినీరు, విద్యుత్ వంటి మౌళిక వసతులు కల్పించాలన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరుద్యోగులు బలి

డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల వల్ల నిరుద్యోగులు బలైపోతున్నారని, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) పేర్కొన్నారు. ఈ విషయమై డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు వై.రాము, జి.రామన్న శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆ పోస్టులకు ఫీజుల ఈవెంట్స్ నిర్వహిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం ఇప్పుడు వయో పరిమితి పేరుతో అభ్యర్థులను తిరస్కరించడం దారుణమని తెలిపారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు సకాలంలో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత సాధించిన ప్రతి ఒక్కరిని ఫిజికల్ ఈవెంట్స్‌కు అనుమతించాలని డిమాండ్ చేశారు.

చైతన్య, నారాయణ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

సాక్షి, అమరావతి: విద్యార్థులను ఫీజుల కోసం తీవ్ర వేధింపులకు గురిచేస్తున్న చైతన్య, నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని చైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో జరుగుతున్న వరుస ఘటనలపై వెంటనే విద్యాశాఖ, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న క్యాంపస్‌లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురంలోని నారాయణ కాలేజీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. భవిష్యత్తులో కార్పొరేట్ కళాశాలలు ఫీజుల విషయంలో విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి చేయకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

మీనాక్షమ్మ గుడిలా నూకాలమ్మ ఆలయం



మూడు వైపులా రాజగోపురాలు

- 200 ఏళ్ల భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పునర్నిర్మాణం
- రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు
- ఉగాది నాటికి భక్తులకు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళిక

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: కొలిచిన వారికి కొంగు బంగారమై, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా.. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవతగా విరాజిల్లుతున్న అనకాపల్లి నూకాలమ్మ ఆలయాన్ని తమిళనాడులోని మధుర మీనాక్షి దేవాలయం తరహాలో అభివృద్ధి చేస్తున్నారు. మూడు వైపులా రాజగోపురాలు నిర్మించడంతో పాటు రానున్న 200 సంవత్సరాల భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆలయానికి తూర్పు వైపున మాత్రమే రాజగోపురం ఉండగా... మిగిలిన మూడువైపులా రాజగోపురాలను నిర్మిస్తున్నారు. అదేవిధంగా గర్భగుడిని కూడా విస్తరిస్తున్నారు. మొత్తం రూ. 8 కోట్లతో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులు వచ్చే నెలలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అన్ని పనులూ పూర్తయితే ఉగాది నుంచి భక్తులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఆలయ పునర్నిర్మాణ పనులను 2023 అక్టోబర్ నెలలో అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు.

శతాబ్దాల చరిత్ర...!

అనకాపల్లిలోని నూకాంబికా అమ్మవారి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. ఉత్తరాంధ్రలోని పురాతన దేవాలయాల్లో ఇది కూడా ఒకటి. ఈ ఆలయంలో నూకాంబిక దేవి ఉంటుంది. ఈ ప్రాంతాన్ని పాలించిన రాజు కాకర్లపూడి అప్పలరాజు పాయకారావు ఈ ఆలయాన్ని తమ కుటుంబ దేవత అయిన కాకతాంబిక కోసం నిర్మించారు. ఆ తర్వాత ఈ దేవతను నూకాంబిక లేదా నూకలమ్మ అని పిలుస్తున్నారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకష్ణ దేవరాయలు ఈ ఆలయాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాచీన వైభవాన్ని పరిరక్షించడంలో భాగంగా గత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించింది. ఏటా ఉగాది అనంతరం మార్చి లేదా ఏప్రిల్ నెలలో అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి దాదాపు 30 లక్షల నుంచి 40 లక్షల మంది భక్తులు తరలి వస్తారు. ఆలయంలో నెల రోజుల పాటు జాతర జరుగుతుంది. ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో రానున్న 200 సంవత్సరాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

అభివృద్ధి పనులు ఇలా...!

గతంలో కాకతీయుల కాలంలో ఆలయ అభివృద్ధి పనులు జరుగగా ఇన్నాళ్ల తరువాత గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టింది. అమ్మవారి ఆలయం మొదటి భాగంలో గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి తీసుకొచ్చిన నల్లరాయితో గర్భాలయం 14x14 అడుగుల నుంచి 17.11x17.11 అడుగులకు విస్తరించనున్నారు. అంతరాలయాన్ని సైతం భారీగా విస్తరిస్తున్నారు. చూడగానే మధుర మీనాక్షి అమ్మవారి ఆలయం గుర్తుకు వచ్చేలా ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నారు.



* రామగిరి మండలం గరిమేకపల్లికి చెందిన 29 ఏళ్ల నిరుద్యోగి ఉద్యోగాల వేటలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో 'పార్ట్‌టైమ్ ఉద్యోగం' పేరుతో వచ్చిన ఆన్‌లైన్ లింక్ క్లిక్ చేశాడు. ఫార్మాలిటీ ప్రకారం పదే పదే నగదు చెల్లింపులు చేస్తూ మొత్తం రూ.80 వేలు కోల్పోయాడు. నెల రోజులుగా ఈ తతంగం జరుగుతూనే ఉంది. అప్రూవల్ వస్తుందని.. రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్.. ఇలా పలు కారణాలతో డబ్బులు తీసుకున్నారు. నెల రోజులు గడిచినా ఉద్యోగం మాత్రం రాలేదు. తర్వాత అంతకు ముందు టచ్‌లోకి వచ్చిన సెల్‌ఫోన్ నంబర్లన్నీ స్విచాఫ్ వచ్చాయి. దీంతో మోసపోయినట్లు తెలుసుకుని లబోదిబోమంటున్నాడు.
* ధర్మవరం మండలం రేగాటిపల్లికి చెందిన ఓ బీటెక్ విద్యార్థిని ఇంటి వద్దనే ఉద్యోగం చేయాలనే ఉద్దేశంతో సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగం వెతుకుతూ.. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కింది. ఫొటోలు, మార్కుల జాబితాలు పంపింది. ఆ తర్వాత రూ.20 వేలు అడ్వాన్స్‌గా కూడా ఇచ్చింది. అయితే ఆ తర్వాత ఉద్యోగం ఇస్తున్నట్లు చెప్పారు. కేవలం రెండు నెలల పాటు నెలకు రూ.15 వేలు చొప్పున జీతం ఇచ్చారు. ఆ తర్వాత ప్రమోషన్ ఇస్తామని మరో రూ.50 వేలు తీసుకుని ఫోన్ స్విచాఫ్ చేసుకున్నారు.

పార్ట్‌టైమ్ చీటింగ్ !

- ఉద్యోగాల పేరుతో సైబర్ వల
- వివిధ చార్జీల పేరు డబ్బు వసూళ్లు
- లింక్‌లను క్లిక్ చేస్తే అంతే సంగతులు
- బాధితుల్లో చదువుకునే వారే ఎక్కువ

పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారు. ఇటీవల కాలంలో నిరుద్యోగులు పెరగడంతో వారిని లక్ష్యంగా చేసుకుంటూ నిండాముంచుతున్నారు. ఇంట్లో కూర్చొని ఉద్యోగం చేయొచ్చు.. పార్ట్ టైమ్ జాబ్ అయినా మంచి జీతం వస్తుందని నమ్మిస్తూ నట్టేట ముంచుతున్నారు.



సాక్షి, పుట్టపర్తి: కష్టపడకుండా డబ్బులు రావు. అలా వచ్చినా నిలబడవు.. ఈ విషయం తెలియక చాలా మంది సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి అప్పులు చేసి మరీ డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అమాయకులనే లక్ష్యంగా చేసుకుని గూగుల్ లింక్ క్లిక్ చేస్తే ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని నమ్మిస్తూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో లెక్కలేనన్ని లింక్‌లు నిత్యం వస్తుంటాయి. ఏ ఒక్క లింక్ క్లిక్ చేసినా.. ఆ తర్వాత ఫోన్ మన చేతిలో ఉన్నా.. ఆపరేటింగ్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుంది. ఆ తర్వాత బ్యాంకు ఖాతాలు, ఫోన్ పే, గూగుల్ పే తదితర నగదు లావాదేవీల యాప్‌ల ద్వారా నగదు కాజేస్తున్నారు. పలు కోణాల్లో ప్రజలను టార్గెట్ చేస్తూ బ్యాంకు ఖాతాల్లో నగదు దోచేస్తున్నారు. రోజుకో చోట సైబర్ నేరం బయట పడుతున్నా.. బలి అవుతున్న వారి సంఖ్య మాత్రం తగ్గడం లేదు. తెలిసీ తెలియక సామాజిక మాధ్యమాలను వినియోగించడం తెలీక కొందరు బలి అవుతుండగా.. డబ్బుపై అత్యాశతో ఇంకొందరు సైబర్ నేరగాళ్లకు చిక్కుతున్నారు. ఆఖరికి కేటుగాళ్ల బారిన పడిన తర్వాత పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే వారిలో కూడా కొందరు బయటికి చెప్పకుండా నష్టపోయినట్లు తెలుసుకుని మౌనంగా ఉండిపోతున్నారు.

అప్రమత్తత అవసరం



సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఉద్యోగ ప్రకటనలు చూసి ఎవరూ మోసపోవద్దు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయి. ఎలాంటి పరిస్థితుల్లోనూ లింక్‌లను క్లిక్ చేయకూడదు. చదువుకున్న వారే ఎక్కువగా మోసపోతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఉద్యోగ ప్రకటనలు, రీచార్జ్ ఆఫర్లు తదితర వాటిని ఎవరూ నమ్మొద్దు.

- వి.రత్న, ఎస్పీ, సత్యసాయి జిల్లా

నత్తనడకన ఎంఎస్ఎంఈ సర్వే

- ఫిబ్రవరి ఒకటో తేదీకి సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యం
- అన్నమయ్య జిల్లా మినహా ఎక్కడా 50 శాతం దాటని సర్వే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను పటిష్టం చేయడానికి చేపట్టిన సర్వే నత్తనడకన సాగుతోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఆఫ్ ఎంఎస్ఎంఈ ప్రోగ్రాం (ర్యాంప్) కింద గత ఏడాది ఫిబ్రవరిలో ఈ సర్వే ప్రారంభించింది. ఎన్నికల కోడ్ కారణంగా అప్పట్లో ఆగిపోయిన సర్వేను కూటమి ప్రభుత్వం నవంబర్ 29న ప్రారంభించి... ఫిబ్రవరి ఒకటో తేదీకి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇప్పటి వరకు ఒక్క అన్నమయ్య జిల్లాలో మాత్రమే 73.94 శాతం సర్వే పూర్తయింది. మిగిలిన ఏ జిల్లాలో కూడా కనీసం 50 శాతం మార్కును చేరుకోలేకపోయింది. పార్వతీపురం మన్యం, పల్నాడు, ఏలూరు, తిరుపతి జిల్లాల్లో కనీసం 20 శాతం సర్వేను కూడా పూర్తి చేయలేదు. అయినా కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. ఉద్యం పోర్టల్ ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో 13.88 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉండగా, వాటిలో ఇప్పటి వరకు 5.13 లక్షల యూనిట్ల సర్వే మాత్రమే పూర్తయింది. ఈ సర్వే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అప్పగించినా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నత్తనడకన సాగుతోంది. ఇదే సమయంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం వేరే సర్వే పనులు అప్పగించడంతో ఎంఎస్ఎంఈ సర్వే మరుగున పడిపోయింది. తక్షణమే మున్సిపల్ కమిషనర్లు, కలెక్టర్లు తగిన చర్య తీసుకోవాలని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పూర్తయిన సర్వేలో కనీసం 5 శాతం యూనిట్లను క్రాస్ వెరిఫికేషన్ చేయాల్సిందిగా కోరారు.

ఉద్యోగాలు భర్తీ చేయండి.. లేదంటే గద్దె దిగండి

ఏఐవైఎఫ్ మహాసభలో వక్తల డిమాండ్

శ్రీకాళహస్తి: దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేసి యువతకు ఉపాధి కల్పించాలని లేనిపక్షంలో గద్దె దిగాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కాకపోవడంతో నిరుద్యోగం రికార్డుస్థాయిలో పెరుగుతుందోన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల మూసివేసే నిర్ణయాన్ని విరమించుకుని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి దేశ అభివృద్ధిలో వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. అనేకసార్లు జరిగిన మంత్రి వర్గ సమావేశాల్లో ఎందుకు వాటిపై చర్చించడం లేదని ప్రశ్నించారు. ఇక రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ చేసి ప్రభుత్వ ఉద్యోగాల్లో 26 జిల్లాల యువతకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల ముందు ఎన్డీయే కూటమి ఉద్యోగాల భర్తీ చేస్తామని చెప్పి ఇంతవరకు ఎందుకు అమలు చేయాలేదన్నారు. వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి కత్తి రవి, సీపీఐ నాయకుడు జనమాల గురవయ్య, బండి చలపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యువత అన్నింటా ముందుండాలి

ఏబీవీపీ జాతీయ కార్యదర్శి వీరేంద్ర

విశాఖ విద్య: యువత అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి వీరేంద్ర సోలంకే అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ యువత క్రమశిక్షణతో మెలిగి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఆట పాటలు పాఠ్యాంశాల్లో భాగం

సమగ్ర శిక్షా రాష్ట్ర డైరెక్టర్ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఆట, పాటలను పాఠ్యాంశాల్లో భాగం చేస్తున్నామని సమగ్ర శిక్షా రాష్ట్ర డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా అండర్-14 టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలను విద్యా ప్రణాళికలో భాగం చేసేందుకు కృషి చేస్తున్నట్టు వివరించారు. క్రీడలకు ప్రభుత్వం రూ.7.5 కోట్లు కేటాయించిందన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 56,225 మంది స్వామివారిని దర్శించుకోగా 19,588 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.95 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తిరుమల నంబి సన్నిధిలో మలయప్ప స్వామి

తిరుమల: తిరుమలలో 25 రోజుల పాటు అధ్యయనోత్సవాలు పూర్తయిన సందర్భంగా మరుసటి రోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామి వారు శుక్రవారం సాయంత్రం దక్షిణ మాడ వీధిలో తిరుమల నంబి సన్నిధిని దర్శించుకున్నారు. సహస్ర దీపాలంకార సేవ అనంతరం సన్నిధిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పలువురు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే ఆలయం శుద్ధి చేసి విశేషంగా ముస్తాబు చేశారు. రాహుకాల సమయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి కల్యాణాన్ని నిర్వహించారు.

రత్నగిరిపై వసతి గదుల నిబంధనలు కఠినతరం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో వసతి గదుల కేటాయింపు నిబంధనలను కఠినతరం చేశారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. సత్రాల్లో వసతి గదులు కేటాయించే సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (సీఆర్‌ఓ) సిబ్బంది ఈ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యా సమాచారం

విద్యతోనే మహిళా సాధికారిత

పలమనేరు : విద్యతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాధ తెలిపారు. మహిళా సాధికారితపై చిత్తూరు జిల్లా పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ రాధ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో మహిళలు మరింత ముందుకెళ్లాలని, అలాగే విద్యార్థినులు సైతం సరికొత్త ఆలోచనలతో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

పాలిటెక్నిక్‌తో పక్కాగా ఉపాధి



కుప్పంరూరల్: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి కాగానే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని చిత్తూరు జిల్లా కుప్పం పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బాలికల పాఠశాలలో పాలిటెక్నిక్ కోర్సులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక రంగంలో పరిశ్రమలను అనుసంధానం చేస్తూ కోర్సులను బోధిస్తున్నామన్నారు. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని వెల్లడించారు. కుప్పం కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్, స్టడీ మెటీరియల్ సైతం అందిస్తున్నట్లు వివరించారు.

థాయ్‌లాండ్ వర్సిటీతో ఎంఓయూ



తిరుపతి సిటీ: థాయ్‌లాండ్ మేజో యూనివర్సిటీతో పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల అంతర్జాతీయ స్థాయి పరిశోధనల కోసం పలు అంశాలపై ఎంఓయూ కుదుర్చుకుంది. శుక్రవారం ఎస్పీడబ్ల్యూ కళాశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో థాయ్‌లాండ్ వర్సిటీలకు చెందిన అధ్యాపకులు పద్మావతి కళాశాల అధ్యాపక బృందంతో పరిశోధన, నైపుణ్యాభివృద్ధిపై చర్చించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ టీ. నారాయణమ్మ మాట్లాడుతూ థాయ్‌లాండ్ మేజో యూనివర్సిటీతో ఎంఓయూ కుదుర్చుకోవడం వల్ల పరిశోధనాభివృద్ధిని పెంపొందించుకోవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



పదేళ్లకే నాటక రచన...

● వండర్ కిడ్



నాటకం అంటే డైలాగ్ రాయాలి. అది పెద్దవాళ్ల పని అనుకుంటున్నారా? కాదు అని నిరూపించింది క్రిషానా. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన క్రిషానా రావత్ మాత్రం పదేళ్ల వయసులో నాటకం రాసి అందర్నీ ఆశ్చర్యపరిచింది. చిన్ననాటి నుంచి కథలు వినడం, పుస్తకాలు చదవడమంటే క్రిషానాకు చాలా ఇష్టం. ప్రతి రాత్రి వాళ్ల అమ్మ తనకో కథ చదివి వినిపించేది. అలా కథల మీద ఆసక్తి పెంచుకున్న క్రిషానా 2018లో తన 10 ఏళ్ల వయసులో 'The Lost Key' అనే నాటకం రాసింది. కథేంటి? టింకిల్ అనే పాపను కొన్ని మానవాతీత శక్తులు మరో లోకానికి తీసుకెళ్తాయి. ఆ లోకంలో బంధింపబడ్డ ఓ యక్షిణిని కాపాడే క్రమంలో పోగొట్టుకుపోయిన తాళం చెవిని వెతకడం ఈ కథ. 120 నిమిషాల ఈ నాటకం రాసేందుకు క్రిషానాకు నాలుగు నెలలు పట్టింది. ఇందులోని ప్రతి పాత్రకు ప్రత్యేకమైన రూపం, బట్టలు, మాట తీరు ఉండేలా చూసుకుంది. ఆ లోకాన్ని ప్రత్యేకంగా రూపొందించింది. నాటకంలో 40 మంది పాత్రధారులుండగా, ఐదు లొకేషన్లు మార్చేలా నాటకాన్ని తయారుచేసింది. అందులో ప్రధాన పాత్రను తానే పోషించడం విశేషం.

2018 ఏప్రిల్ 21న ఆ నాటకం ప్రదర్శితమైంది. చిన్నారులతోపాటు పెద్దలనూ ఈ నాటకం ఎంతో ఆకట్టుకుంది. అతి చిన్నవయస్కురాలైన నాటక రచయితగా క్రిషానా గిన్నిస్ ప్రపంచ రికార్డు అందుకుంది. జె.కె.రౌలింగ్ రాసిన 'హ్యారీపోటర్' సిరీస్ తనకెంతో ఇష్టమని చెప్పే క్రిషానా 'The Lost Key' సీక్వెల్ రాసేందుకు సిద్ధమవుతోంది. సినిమాలు తక్కువగా చూస్తానని, ఎక్కువగా పుస్తకాలు చదవడమే తనకు ఇష్టమని చెప్తోంది.

● సినిమా చూద్దామా?

లెట్స్ ఫైండ్ ది ట్రెజర్!!



పిల్లలూ మీరింత వరకూ ఎన్నో నిధుల వేట సినిమాలు చూసే ఉంటారు. కాని ఇప్పుడు మనం చెప్పుకోబోయే సినిమా అలాంటి వాటిలో చాలా డిఫరెంట్. దాని పేరు 'బారోజ్'. ఈ సినిమాను డైరెక్ట్ చేసింది మళయాళ హీరో మోహన్‌లాల్. చెప్పాలంటే ఇది 400 సంవత్సరాల క్రిందట జరిగిన స్టోరీ. బారోజ్ అనే అతని కథ ఇది. ఇతను డా గామా ట్రెజర్ ని కాపాడే గార్డ్. ఈ ట్రెజర్‌కి బారోజ్ గార్డ్ రక్షణతో పాటు ఎన్నో పవర్స్ ఉంటాయి. అలాగే బారోజ్ అనే అతనికి కూడా సూపర్ పవర్స్ ఉంటాయి. డా గామా ట్రెజర్‌ని రాబరీ చేయడానికి చాలా మంది చాలా రకాలుగా ట్రై చేస్తూ ఉంటారు. వాళ్ళందరినీ బారోజ్ తన పవర్స్‌తో ఫైట్ చేస్తుంటాడు. అలాగే ఆ ట్రెజర్‌కి ఎల్లప్పుడూ ఇన్విజిబుల్‌గా గార్డ్ చేస్తుంటాడు. మరి మూవీ మొత్తం బారోజ్ ఆ ట్రెజర్‌ని గార్డ్ చేయగలుగుతాడా లేక ఎవరైనా వచ్చి ట్రెజర్‌ని రాబరీ చేస్తారా అనేది తెలియాలంటే మాత్రం మీరు హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న బారోజ్‌ని చూడాల్సిందే. ఈ మూవీ మొత్తం సూపర్ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది. ఇంకెందుకు లేటు... చూసి నిధిని సాధించండి మరి.

- ఇంటూరు హరికృష్ణ

కత్తిరించు తమాషా చూడు!







పేపర్, కత్తెర, గమ్ ఉంటే చాలు కాగితాలు తమాషా బొమ్మల రూపు దాలుస్తాయి. దీనిని 'పేపర్ ఆర్ట్' అంటారు. ఇది ఒకసారి అలవాటైతే బోలెడంత ఫన్. సీజన్ బాగలేనప్పుడు, బయటకు వెళ్లి ఆడే ఓపిక లేనప్పుడు హాయిగా ఇంట్లోనే ఈ ఫన్‌ను ఎంజాయ్ చేయొచ్చు. రంగు రంగుల కాగితాలను కట్ చేసి, మడిచి, ముక్కు కళ్లు అంటించి అందమైన రూపాలు ఇవ్వొచ్చు. ఇందుకు యూట్యూబ్‌లో బోలెడన్ని వీడియోలు కూడా హెల్ప్ చేస్తాయి. మీ అన్న, అక్క, చెల్లితో కూచుని ట్రై చేయండి. అమ్మతో కూచుని కూడా తయారు చేస్తే మంచి కాలక్షేపం.

● యునెస్కో

నీళ్ల మీదే ఉంటారు తింటారు చదువుతారు







మనం పేపర్లలో కాలువ దాటడానికి ఇబ్బంది పడే స్కూల్ పిల్లల్ని చూసి బాధ పడుతుంటాం. కాని ఈ ఊరు వాళ్లు, వాళ్ల పిల్లలు, పెద్దలు అందరూ నీటి మీదే ఉంటారు. నీటి మీదే బతుకుతారు. నీటి మీదే చదువుకుంటారు. ఈ ఊరు పశ్చిమ ఆఫ్రికాలోని 'బెనిన్' దేశంలో ఉంది. దీని పేరు 'గాన్వె'. ఇక్కడ 'టొఫినో' తెగ మనుషులు జీవిస్తుంటారు. వీళ్లు 300 ఏళ్ల క్రితం ఈ పెద్ద జలాశయం మధ్యలో ఇళ్లు కట్టుకొని జీవించడం మొదలెట్టారు. ఎందుకంటే ఆ రోజుల్లో యూరోపియన్లు దాడి చేసి ఎత్తుకెళ్లి యూరప్‌లో బానిసలుగా అమ్మేసేవారు. వారి దాడుల నుంచి రక్షించుకోవాలని నీళ్ల మధ్యలోకి వెళ్లిపోయారు. అంటే దూరం నుంచి శత్రువులు వచ్చినా తెలిసిపోతుంది. వారి పై ఎదురుదాడి చేయడం కూడా సులభం. అలా అలవాటై ఇప్పుడు ఎత్తుకు వెళ్లే వారు లేకపోయినా అలాగే జీవిస్తూ ఉన్నారు. ఈ ఊరి వాళ్లంతా చేపలు పట్టి అమ్ముకుని బతుకుతారు. ప్రతి పనికీ పడవ తీయాల్సిందే. పిల్లలు కూడా పడవల మీద వెళ్లి చదువుకుంటారు. చాలా పేద ఊరు ఇది. దీని ప్రత్యేకత రీత్యా యునెస్కో ఈ ఊరిని గుర్తించి కాపాడటానికి ముందుకు వచ్చింది.

● పాడుదాం గేయం

జాతీయ పతాకం



అదిగో అదిగో జాతీయ పతాకం
భారతీయుల గౌరవ సంకేతం
అదిగో అదిగో మువ్వెన్నెల పతాకం
భరతమాతకు త్రివర్ణ తిలకం


కాషాయ వర్ణం.. త్యాగధనుల చిహ్నం
నెత్తురోడ్చి సాధించిన స్వాత్రంత్య ఫలం
వేవేల వీరపోరుల పోరాట నినాదం
దాస్య సంకెళ్ల విముక్తికి అదే శ్రీకారం

శ్వేత వర్ణం.. శాంతికి ప్రతిరూపం
భారతీయ ఐక్య గానానికి రాగం
కులమతాకతీతమై నిలిచిన బంధం
దేశమాత మేనిపై పరిమళ గంధం

హరిత వర్ణం.. సుభిక్షతకు నిలయం
పచ్చని పంటల సంపద జాతికి మోదం
అందరొక్కటై.. పాడిపంటల నిలయమై
వెలిగేదే భారతదేశం.. మన భారతదేశం

● మహనీయులు

రాష్ట్రపతి పదవికి వన్నె తెచ్చిన బాబూ రాజేంద్రప్రసాద్



మనదేశంలో అందరికంటే ఉన్నత స్థానం కలిగిన వ్యక్తి ఎవరో తెలుసా? భారత రాష్ట్రపతి. మన దేశానికి ప్రథమ పౌరుడు ఆయనే. మరి మన దేశానికి మొదటి రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ గురించి మీకు తెలుసా?

ఆయన 1884 డిసెంబర్ 3న బిహార్‌లోని జీరాడి గ్రామంలో జన్మించారు. అమ్మానాన్నలు మహదేవ్ సహాయి, కమలేశ్వరిదేవి. బిహార్‌లో స్థిరపడ్డ ఉత్తరప్రదేశ్‌వాసులు. ధనిక కుటుంబం. కానీ నిరాడంబరంగా జీవించేందుకే ఇష్టపడేవారు. చిన్ననాటి నుంచి రాజేంద్రప్రసాద్ క్రమశిక్షణతో మెలిగేవారు. శ్రద్ధగా చదువుకునేవారు. కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకునే సమయంలో ఆయన నాయకత్వ లక్షణాలకు అక్కడి విద్యార్థులు ఆకర్షితులై, స్టూడెంట్స్ యూనియన్ కార్యదర్శిగా ఆయన్ని గెలిపించారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఆయన న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1917 వరకు న్యాయవాదిగా గడిపారు. ఆ తర్వాత యూనివర్సిటీ 'లా' విభాగంలో అధ్యాపకుడిగా మారారు.

1917లో బిహార్‌కు వచ్చిన మహాత్మాగాంధీ వ్యక్తిత్వానికి రాజేంద్రప్రసాద్ ఆకర్షితులై ఆయనకు అనుచరుడిగా మారారు. అనుయాయిగా మారారు. తనకున్న సౌకర్యాలన్నీ వదిలేసుకుని, నిరాడంబరుడిగా, సంఘ సేవకుడిగా మారారు. మహాత్మాగాంధీ ఇచ్చిన 'సత్యాగ్రహం' పిలుపును అందుకొని బిహార్ ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని చేపట్టారు. ఆ తర్వాత న్యాయవాద వృత్తిని, ఇతర కీలక పదవులను వదిలేసుకున్నారు. తన ఇంట్లోనే జాతీయ కళాశాల ప్రారంభించారు. విద్యార్థులకు అనేక సేవలు అందించారు. త్రిభాషా సూత్రాన్ని ప్రతిపాదించారు. గ్రామీణ విశ్వవిద్యాలయాలు అవసరమని ఆనాడే చెప్పారు. అనంతరం అనేక ఉద్యమాలను ముందుండి నడిపించారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించారు.

ఆపద్ధర్మ ప్రభుత్వంలో 1946లో వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు 'గ్రో మోర్ ఫుడ్' అనే నినాదాన్ని ఇచ్చారు. అనంతరం దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక తొలి రాష్ట్రపతిగా ఆయన ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1950, 1952, 1957లోనూ రాష్ట్రపతిగా ఆయన సేవలందించారు. 1963 ఫిబ్రవరి 28న తన 79వ ఏట మరణించారు. అదే ఏడాది భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' ప్రకటించింది.

● పర్యాయ పదాలు నేర్చుకుందామా?


మీరు అమ్మను 'అమ్మా' అని పిలుస్తారు. తల్లి, జనని, మాతమూర్తి అనే పదాలు కూడా అమ్మకు సమాన అర్థాన్ని ఇస్తాయని తెలుసా? ఒకే అర్థం ఇచ్చే వేర్వేరు పదాలను 'పర్యాయ పదాలు' అంటారు. అలాంటి పర్యాయ పదాలు నేర్చుకుందాం.




ధర - వెల, ఖరీదు, మూల్యం
నిప్పు - అగ్ని, మంట, అనలం
ఆకాశం - నింగి, గగనం, అంబరం
కొండ - గిరి, అద్రి, గుట్ట
గాలి - పవనం, సమీరం, వాయువు
గొంతు - కంఠం, కుత్తుక, పీక
చీకటి - తిమిరం, అంధకారం, ఇరులు
బంగారం - స్వర్ణం, కాంచనం, హేమం
భూమి - ధరణి, పుడమి, నేల
స్నేహం - మైత్రి, చెలిమి, సాంగత్యం

● కథ

పులి–మేక... భలే ఆట





మన పల్లెల్లో మీకు తెలియని ఎన్నో ఆటలు ఆడుతుంటారు. అందులో ఒకటి పులి-మేక ఆట. దీని గురించి ఎప్పుడైనా విన్నారా? పులి అంటే నిజం పులి అని, మేకలంటే నిజంగా మేకల్ని తేవాలని అనుకోవద్దు. ఒక చోట కూర్చుని కాయలు/రాళ్లతో ఆడుకునే ఆట ఇది. 'Tiger and Goats' పేరుతో ఈ ఆటకు కావాల్సిన బోర్డు, కాయిన్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

పులి-మేక ఆటను పల్లెల్లో చాలామంది ఆడుతుంటారు. దీన్నే 'పులి జూదం' అని కూడా అంటారు. ఇది ఆడేందుకు ఇద్దరు ఆటగాళ్లు కావాలి. ఒకరు పులివైపున ఉంటే, మరొకరు మేకల వైపున ఉండాలి. మూడు పులుల స్థానంలో మూడు రాళ్లు, 15 మేకల స్థానంలో 15 రాళ్లు పెట్టి ఆడాలి. ఈ ఆట ఆడేందుకు ప్రత్యేకంగా బండపైనో, అట్ట మీదో పట్టిక గీసుకోవడం తప్పనిసరి.

పట్టికను గీసుకున్న తర్వాత ఒక పులిని కొండ పైన, మిగిలిన రెండు పులులను కొండకు దగ్గరగా ఉంచి ఆట మొదలుపెట్టాలి. మేకలతో ఆడే ఆటగాడు మొదటి మేకను ఖాళీగా ఉన్న గడిలో పెట్టాలి. తరువాత పులులతో ఆడే ఆటగాడు తన పులులలో ఒకదానిని పక్కనే ఉన్న మరో ఖాళీ గడిలోకి జరపాలి. ఇలా ఒకరి తరువాత ఒకరు పావులను జరుపుకుంటూ ఆటను కొనసాగించాలి. పులి పక్కన మేక దాని పక్కన ఖాళీ గడి గనక ఉంటే పులి ఆ మేకను చంపినట్లు అవుతుంది. ఆ రాయిని పట్టిక నుంచి తీసేయాలి. అయితే 15 మేకలు పట్టికలోకి చేరేంతవరకు మేకలను పక్కకు జరపకూడదు. ఒక్కసారి ఒక మేకను మాత్రమే చంపాలి. పులి మేకను ఎటువైపునుంచైనా దూకవచ్చు. అంటే అవతలి గడిలోకి వెళ్లొచ్చు. కానీ ఒక పులి ఇంకొక పులి పైనుంచి దూకకూడదు. అలాగే మేక కూడా పులి మీద నుంచి దూకకూడదు. ఇవి ఆట నిబంధనలు. అన్ని మేకలను పులులు చంపగలిగితే పులులు గెలిచినట్లు. పులులను కదలకుండా మేకలు కట్టడి చేస్తే మేకలు గెలిచినట్లు. చాలా సరదాగా ఉండే ఆటకు ఎంతో ఏకాగ్రత కావాలి. ఏమాత్రం అటు ఇటు అయినా పులి చేతిలో మేక ఓడిపోతుంది. మీ ఇంట్లో తాతయ్య, నానమ్మ, అమ్మమ్మలు ఉంటే వారిని అడిగి ఈ ఆట గురించి మరింత తెలుసుకోండి. మీ స్నేహితులతో కలిసి ఆడండి.

రూపాయికి ఆర్‌బీఐ టానిక్

అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించేందుకు కసరత్తు

విదేశాల్లోని భారతీయ బ్యాంకు శాఖల్లో రూపీ ఖాతాలు తెరిచేందుకు అనుమతి

ట్రేడర్లు, ఇన్వెస్టర్ల లావాదేవీలను సులభతరం చేయడం లక్ష్యం



అంతర్జాతీయంగా రూపాయి వాడకాన్ని ప్రాచుర్యంలోకి తేవడంపై రిజర్వ్ బ్యాంక్ మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా సీమాంతర లావాదేవీలను రూపాయి మారకంలో నిర్వహించేందుకు వీలు కల్పిస్తూ ఒక సర్క్యులర్ జారీ చేసింది. భారతీయ అధీకృత డీలర్ (ఏడీ) బ్యాంకుల విదేశీ శాఖల్లో, ప్రవాస భారతీయులు (ఎన్నారై) రూపీ అకౌంట్లను తెరిచేందుకు అవకాశం కల్పించింది. ట్రేడర్లు, ఇన్వెస్టర్లకు సీమాంతర లావాదేవీలను సులభతరం చేయడానికి తాజా నిబంధనలు ఉపయోగపడగలవని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి గత కొన్నాళ్లుగా దీని వెనుక గణనీయంగానే కసరత్తు జరుగుతోంది. అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా సహా ఇతర దేశాలతో వాణిజ్య లావాదేవీలను రూపాయి మారకంలో సెటిల్ చేసుకునేందుకు వీలుగా, భారతీయ ఏడీ బ్యాంకుల్లో, ప్రత్యేక రూపీ అకౌంట్లను తెరిచేందుకు విదేశీ బ్యాంకులకు 2022లో ఆర్‌బీఐ అనుమతినిచ్చింది. ఆ తర్వాత అంతర్జాతీయ ద్రవ్య నిధి, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ బాస్కెట్‌లో చేర్చడం సహా రూపాయిని అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు అనుసరించతగిన మార్గదర్శ ప్రణాళికను సూచిస్తూ 2023లో ఆర్‌బీఐ కమిటీ ఒక నివేదికను రూపొందించింది. ద్వైపాక్షిక, బహుళ పాక్షిక వాణిజ్య లావాదేవీలను రూపాయి మారకంలోనూ, స్థానిక కరెన్సీల్లోనూ సెటిల్ చేసుకోవచ్చని సిఫార్సు చేసింది. అలాగే, ఎన్నారైలకి రూపాయి మారకం ఖాతాలను తెరిచేందుకు వీలు కల్పించాలని సూచించింది. తాజాగా జారీ చేసిన సర్క్యులర్ వీటన్నింటికి కొనసాగింపుగానే భావించవచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

–సాక్షి, బిజినెస్ డెస్క్

న్యూఢిల్లీ: రూపాయి బలహీనపడటమనేది దేశీ ఎగుమతులకు ఊతమిచ్చేదే అయినప్పటికీ వాస్తవ పరిస్థితులు సంక్లిష్టంగా ఉంటాయని ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ అశ్వని కుమార్ వ్యాఖ్యానించారు. చాలా మటుకు భారతీయ ఎగుమతిదారులు.. ముడివస్తువులు, విడిభాగాల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతుంటారని ఆయన చెప్పారు. రూపాయి గణనీయంగా పడిపోతే ముడివస్తువుల వ్యయాలు పెరిగిపోయి సదరు ఎగుమతిదారులపై భారం పడుతుందని పేర్కొన్నారు. ఫలితంగా కరెన్సీ క్షీణత ప్రయోజనాలు పెద్దగా లభించవని వివరించారు. 'బలహీన రూపాయి ప్రభావమనేది ఎగుమతిదారులందరిపైనా ఒకే తరహాలో ఉండదు. ప్రతికూల ప్రభావాలను తగ్గిస్తూ పతనానికి మూలకారణాలను సరిదిద్దడానికి వ్యూహాత్మకమైన, బహుముఖ విధానం అవసరమవుతుంది' అని ఆయన పేర్కొన్నారు. ఉదాహరణకు రూపాయి రెండు శాతమే క్షీణించినా, పోటీ దేశాల కరెన్సీలు అంతకన్నా ఎక్కువగా 3–5 శాతం పడిపోతే, గ్లోబల్ మార్కెట్లలో భారత ఎగుమతిదారులు పోటీపడే పరిస్థితి ఉండదని కుమార్ తెలిపారు. రూపాయి పతనం వల్ల ముడి వస్తువుల ధరలు, కరెన్సీ మారకం రేటులో ఒడిదుడుకులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, విదేశీ రుణాల భారం మొదలైనవన్నీ కూడా పెరిగిపోతాయని ఆయన చెప్పారు.

రూపాయి పతనం ఎగుమతులకు ఊతం. కానీ...

- సంక్లిష్ట పరిస్థితులు ఉంటాయి
- ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ అశ్వని కుమార్


ఆర్‌బీఐ జోక్యం ఎగుమతులకు ప్రతికూలం



డాలరు బలోపేతం అవుతుండటం వల్ల ఇతర కరెన్సీల్లాగే రూపాయి కూడా పతనమవుతోంది. ఇలాంటప్పుడు రూపాయి మాత్రమే హఠాత్తుగా పతనమైతేనో లేక తీవ్ర ఒడిదుడుకులకు లోనైతేనో తప్ప దాన్ని బలోపేతం చేసేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోవడం శ్రేయస్కరం కాదు. ఒకవేళ జోక్యం చేసుకుంటే భారతీయ ఎగుమతిదార్లకు ప్రతికూలమవుతుంది.

– రఘురామ్ రాజన్, మాజీ గవర్నర్, ఆర్‌బీఐ

రూపాయి అధిక స్థాయిలో ఉంది



రూపాయి విలువ ప్రస్తుతం అధిక స్థాయిలో ఉండటంతో అంతర్జాతీయంగా మన ఎగుమతి సంస్థలు పోటీపడటంపై ప్రతికూల ప్రభావం ఉంటోంది. కాబట్టి ఆర్థిక ఫండమెంటల్స్‌కి తగ్గ స్థాయికి రూపాయిని చేరుకోనివ్వాలి. రూపాయి క్షీణతను కొనసాగనివ్వడం వల్ల ఎగుమతులకు, అలాగే వృద్ధి సాధనకు సహాయకరంగా ఉంటుంది.

– దువ్వూరి సుబ్బారావు, మాజీ గవర్నర్, ఆర్‌బీఐ

బ్యాంకర్లు ఏమంటారంటే..

ఈ నిబంధనల ప్రధాన లక్ష్యం.. అంతర్జాతీయంగా వాణిజ్యంలో రూపాయి వాడకాన్ని ప్రోత్సహించడమే అయినప్పటికీ, రూపాయి నాన్–కన్వర్టబుల్ కరెన్సీ కావడం వల్ల ఎక్కువగా లావాదేవీలు జరగకపోవచ్చని బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి వాణిజ్య లావాదేవీల కోసం.. అది కూడా యూఏఈ, తదితర దేశాల్లో మాత్రమే ఇది అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

రూపాయి మారకంలో సీమాంతర చెల్లింపులు..




ఉదాహరణకు అమెరికాలో ఉంటున్న ఎన్నారై న్యూయార్క్‌లోని ఏడీ బ్యాంకు శాఖలో రూపీ ఖాతా తెరవొచ్చు. ఎగుమతులకి సంబంధించి వచ్చిన ఆదాయాలను జమ చేసుకునేందుకు, దిగుమతి చేసుకున్న వాటికి చెల్లింపులు జరిపేందుకు ఈ ఖాతాలను ఉపయోగించుకోవచ్చు. అంటే.. భారత్‌కి చేసిన ఎగుమతులకు సంబంధించి వచ్చిన నిధులను ఆ అకౌంట్లో రూపాయి మారకంలో ఉంచుకోవచ్చు. భారత్‌లో ఉన్న వ్యక్తికి రూపాయి మారకంలో వ్యాపారపరమైన చెల్లింపులను జరిపేందుకు ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చు.

● క్యూ3 ఫలితాలు

రాణించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా

నికర లాభంలో మెరుగైన వృద్ధి



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిసెంబర్ త్రైమాసికంలో మెరుగైన పనితీరు నమోదు చేసింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 35 శాతం ఎగసి రూ.2,517 కోట్లకు చేరింది. మొండి బకాయిలు తగ్గడం కలిసొచ్చింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,870 కోట్లుగా ఉండడం గమనించొచ్చు. మొత్తం ఆదాయం రూ.16,411 కోట్ల నుంచి రూ.19,957 కోట్లకు దూసుకుపోయింది. వడ్డీ ఆదాయం రూ.15,218 కోట్ల నుంచి రూ.18,210 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.5,463 కోట్ల నుంచి రూ.6,070 కోట్లకు వృద్ధి చెందింది. స్థూల మొండి బాకీలు (ఎన్‌పీఏలు) 3.69 శాతంగా, నికర ఎన్‌పీఏలు 0.85 శాతంగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో స్థూల ఎన్‌పీఏలు 5.35 శాతంగా, నికర ఎన్‌పీఏలు 1.41 శాతంగా ఉండడం గమనార్హం. ప్రొవిజన్ కవరేజీ రేషియో 92.48 శాతానికి మెరుగుపడింది.

డీఎల్ఎఫ్ లాభం హైజంప్

రూ. 1,059 కోట్లు



న్యూఢిల్లీ: రియల్టీ రంగ దిగ్గజం డీఎల్ఎఫ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 61 శాతం జంప్‌చేసి రూ. 1,059 కోట్లకు చేరింది. ప్రధానంగా రికార్డ్ అమ్మకాల బుకింగ్స్ ఇందుకు సహకరించాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 656 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,644 కోట్ల నుంచి రూ. 1,737 కోట్లకు బలపడింది. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 12,093 కోట్ల విలువైన కొత్త బుకింగ్స్ సాధించింది. వీటిలో డీఎల్ఎఫ్ ఫేజ్–5లో భాగంగా గురుగ్రామ్‌లో చేపట్టిన సూపర్ లగ్జరీ ప్రాజెక్ట్ రూ. 11,816 కోట్ల విలువైన కొత్త బుకింగ్స్ సాధించినట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం 420 యూనిట్ల ఈ ప్రాజెక్ట్‌లో 173 యూనిట్లు విక్రయించినట్లు వెల్లడించింది. సగటున రూ. 68 కోట్ల విలువలో డీల్స్ జరిగినట్లు తెలియజేసింది. రానున్న 4–5 ఏళ్లలో రూ. 8,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలియజేసింది. తాజా ప్రాజెక్టుతో కలిపి దాదాపు 50 లక్షల చదరపు అడుగులను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత సమీక్షా కాలం నికర లాభంలో సహచర సంస్థల నుంచి రూ. 618 కోట్లు లభించింది. గతేడాది క్యూ3లో కేవలం రూ. 279 కోట్లు నమోదైంది.

డీఎల్ఎఫ్ షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 695 వద్ద ముగిసింది.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లాభం డౌన్

క్యూ3లో రూ. 719 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 70 శాతం పడిపోయి రూ. 719 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా వ్యయాలు పెరగడం లాభాలను దెబ్బతీసింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,450 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 42,134 కోట్ల నుంచి రూ. 41,525 కోట్లకు బలహీనపడింది. మొత్తం వ్యయాలు మాత్రం రూ. 38,815 కోట్ల నుంచి రూ. 40,250 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో రూ. 3,087 కోట్ల పెట్టుబడులు వెచ్చించినట్లు కంపెనీ తెలియజేసింది. త్రైమాసికవారీగా నిర్వహణ లాభం 3 శాతం పుంజుకుని రూ. 5,579 కోట్లను తాకినట్లు వెల్లడించింది. స్టీల్ ప్రొడక్టుల విక్రయ ధరలు కొంతమేర నీరసించినప్పటికీ ఇందుకు అమ్మకాల పరిమాణం పెరగడం, కోకింగ్ కోల్ ధరలు తగ్గడం సహకరించినట్లు పేర్కొంది. కాగా.. నికర రుణ భారం 2024 డిసెంబర్31కల్లా రూ. 1,884 కోట్లు తగ్గి రూ. 80,921 కోట్లుగా నమోదైంది. ముడిస్టీల్ ఉత్పత్తి 2 శాతం వృద్ధితో 7.03 మిలియన్ టన్నుల(ఎంటీ)ను తాకగా.. స్టీల్ అమ్మకాలు 12 శాతం ఎగసి 6.71 ఎంటీని తాకాయి.

ఎన్ఎస్ఈలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 0.3 శాతం బలపడి రూ. 932 వద్ద ముగిసింది.

డ్రోన్‌ఆచార్య, ఏవీపీఎల్ విలీనం



న్యూఢిల్లీ: డ్రోన్లు, వ్యవసాయ రంగ సాంకేతికతలపై దృష్టిపెట్టిన ఏవీపీఎల్ ఇంటర్నేషనల్‌తో వ్యూహాత్మకంగా విలీనం కానున్నట్లు బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీ డ్రోన్‌ఆచార్య ఏరియల్ ఇన్నోవేషన్స్ తాజాగా వెల్లడించింది. ఇందుకు ఒప్పందంపై సంతకాలు చేసినట్లు తెలియజేసింది. అయితే డీల్ ఫైనాన్షియల్ వివరాలు వెల్లడించలేదు. డ్రోన్ టెక్నాలజీ, కొత్తతరహా ఆవిష్కరణలకు ప్రపంచస్థాయిలో భారత్ మరింత పటిష్టమయ్యే దిశలో విలీనంకానున్నట్లు రెండు సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ఆర్అండ్‌డీ, ఇన్నోవేషన్‌లో డ్రోన్‌ఆచార్యకున్న నైపుణ్యాలు, ఏవీపీఎల్‌కున్న మౌలిక సదుపాయాలు, ప్రతిభా సామర్థ్యాలు దేశీ డ్రోన్ ఎకోసిస్టమ్‌కు బలాన్నివ్వనున్నట్లు తెలియజేశాయి.

బీఎస్ఈలో డ్రోన్‌ఆచార్య షేరు రూ. 110 వద్ద యథాతథంగా ముగిసింది.

పెగాట్రాన్‌లో టాటా ఎలక్ట్రానిక్స్‌కు 60% వాటా



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీలో కార్యకలాపాలను మరింతగా విస్తరించే దిశగా పెగాట్రాన్ టెక్నాలజీ ఇండియాలో నియంత్రణాధికారాలతో 60% వాటాను కొనుగోలు చేసినట్లు టాటా ఎలక్ట్రానిక్స్ (టీఈపీఎల్) వెల్లడించింది. దేశీయంగా ఈ రంగంలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు ఈ డీల్ తోడ్పడుతుందని వివరించింది. కొత్త యాజమాన్యానికి అనుగుణంగా పెగాట్రాన్ బ్రాండింగ్‌ను, వ్యాపార వ్యూహాన్ని తీర్చిదిద్దనున్నట్లు టీఈపీఎల్ ఎండీ రణ్‌ధీర్ ఠాకూర్ తెలిపారు. రెండు సంస్థల కార్యకలాపాలను అనుసంధానించనున్నట్లు వివరించారు. టీఈపీఎల్ గతేడాదే తైవాన్‌కి చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం విస్ట్రాన్ సంస్థ.. భారత కార్యకలాపాలను కొనుగోలు చేయడం తెలిసిందే.

వాహనాల హోల్‌సేల్ విక్రయాల్లో రెండంకెల వృద్ధి



న్యూఢిల్లీ: తయారీ కంపెనీల నుండి డీలర్లకు చేరిన (హోల్‌సేల్) వాహనాల సంఖ్య 2024లో 11.6 శాతం పెరిగి 2,54,98,763 యూనిట్లకు చేరుకుందని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) తెలిపింది. వినియోగదారుల నుంచి సానుకూల సెంటిమెంట్ నేపథ్యంలో ద్విచక్ర వాహనాలకు బలమైన డిమాండ్ ఈ వృద్ధికి దోహదం చేసిందని సియామ్ తెలిపింది. 2023లో హోల్‌సేల్‌గా అమ్ముడైన మొత్తం వాహనాల సంఖ్య 2,28,39,130 యూనిట్లు. '2024 ఆటో పరిశ్రమకు సహేతుకంగా మంచిదే. వినియోగదారుల సానుకూల సెంటిమెంట్, దేశ స్థూల ఆర్థిక స్థిరత్వం అన్ని వాహన విభాగాలలో వృద్ధిని అందించడంలో సహాయపడింది. భారత ప్రభుత్వ స్థిర విధాన పర్యావరణ వ్యవస్థ కొన్నేళ్లుగా కొనసాగడం 2024లో పరిశ్రమకు కలిసి వచ్చింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో ద్వారా సానుకూల సెంటిమెంట్‌తో కొత్త సంవత్సరం ప్రారంభమైంది. ఈ ఊపు 2025లో వృద్ధిని మరింత ముందుకు తీసుకువెళుతుంది' అని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర తెలిపారు.

విభాగాలవారీగా ఇలా..

ద్విచక్ర వాహన విభాగం హోల్‌సేల్‌లో గత ఏడాది 14.5 శాతం దూసుకెళ్లి 1,95,43,093 యూనిట్లు నమోదైంది. స్కూటర్స్ విక్రయాలు 20 శాతం అధికమై 66,75,231 యూనిట్లు, మోటార్‌సైకిల్స్ 12 శాతం ఎగసి 1,23,52,712 యూనిట్లకు చేరుకున్నాయి. ప్యాసింజర్ వెహికిల్స్ 4 శాతం ఎగసి 43 లక్షల యూనిట్లు, త్రీవీలర్స్ 7 శాతం పెరిగి 7.3 లక్షల యూనిట్లను తాకాయి. ప్యాసింజర్ వెహికిల్స్, త్రీవీలర్స్ ఒక ఏడాదిలో ఈ స్థాయిలో హోల్‌సేల్ అమ్మకాలు నమోదు కావడం ఇదే తొలిసారి. వాణిజ్య వాహనాల విక్రయాలు 3 శాతం క్షీణించి 9.5 లక్షల యూనిట్లకు చేరాయి.

పతంజలి 4 టన్నుల 'కారం' వెనక్కి

- ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం వల్లే
- ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలతో చర్య



న్యూఢిల్లీ: పతంజలి ఫుడ్స్ మార్కెట్ నుంచి 4 టన్నుల ఎండు కారాన్ని (చిల్లి పౌడర్) వెనక్కి తీసుకుంది. ఒక బ్యాచ్‌కు చెందిన 200 గ్రాముల రెడ్ చిల్లి పౌడర్‌ను ఉపసంహరిస్తున్నట్లు పతంజలి ఫుడ్స్ సీఈవో సంజీవ్ అస్థానా వెల్లడించారు. ఇది తక్కువ పరిమాణం, తక్కువ విలువకే పరిమితమన్నారు. ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో వీటిని వెనక్కి తీసుకోవాలంటూ భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల మండలి (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆదేశించడం గమనార్హం. ''చిల్లి పౌడర్ నమూనాను పరీక్షించినప్పుడు పురుగు మందుల అవశేషాలు గరిష్ట పరిమితి ప్రమాణాలకు అనుగుణంగా లేనట్టు గుర్తించారు. ఎర్ర కారం పొడి సహా పలు ఆహార ఉత్పత్తులకు పురుగు ముందుల అవశేషాల పరంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ గరిష్ట పరిమితులు విధించింది'' అని అస్థానా తెలిపారు. నియంత్రణపరమైన నిబంధనలకు అనుగుణంగా తాము వెంటనే చర్యలు చేపట్టినట్టు చెప్పారు. పంపిణీదారులను సంప్రదించడంతోపాటు ఇప్పటికే ఈ ఉత్పత్తులను కొనుగోలు చేసిన వారికి ప్రకటనల ద్వారా చేరువ అయ్యే ప్రయత్నం చేసినట్టు వివరించారు. కొనుగోలు చేసిన చోటే సంబంధిత ఉత్పత్తిని వెనక్కి ఇవ్వడం ద్వారా పూర్తి మొత్తాన్ని తిరిగి పొందొచ్చని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు కఠిన నాణ్యత నియంత్రణ ప్రక్రియలు ఉండేలా.. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు అనుగుణంగా ఉత్పత్తుల ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అస్థానా తెలిపారు.

ఏఐలో దూసుకెళ్తున్న చైనా కంపెనీలు

శాంసంగ్ సౌత్‌వెస్ట్ ఏషియా ప్రెసిడెంట్ పార్క్



సాన్‌హోసే (యూఎస్): మొబైల్స్ తయారీలో ఉన్న చైనా కంపెనీలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకుంటున్నాయని శామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఏషియా ప్రెసిడెంట్, సీఈవో జె.బి.పార్క్ తెలిపారు. ఏఐ అవసరాల కోసం వ్యక్తిగత డేటాను పంచుకుంటే చైనీస్ హ్యాండ్‌సెట్ తయారీ సంస్థలతో ముప్పు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. భారత్‌లో ప్రత్యర్థి సంస్థలతో పోటీ ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. 'బలమైన ప్రత్యర్థి లేదా పోటీ లేకపోతే జీవితం చాలా బోరింగ్‌గా ఉంటుంది. సవాళ్లను మేము ఆస్వాదిస్తాం. మొబైల్, ఏఐ సాంకేతికతపై దృష్టి పెట్టడమేగాక మొత్తం వ్యవస్థకు సేవలు అందించే సంస్థగా మారడానికి ప్రయత్నిస్తున్నాం. భారత స్మార్ట్‌ఫోన్ పరిశ్రమకు 2025 పెద్ద సంవత్సరంగా నిలుస్తుందని ఆశిస్తున్నాం. ఇందుకు సామ్‌సంగ్ సిద్ధంగా ఉంది' అని వివరించారు. ప్రస్తుతం 800 డాలర్ల కంటే ఎక్కువ ధర కలిగిన సూపర్–ప్రీమియం స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లో ఆపిల్ నుండి, అలాగే 400–600 డాలర్ల విభాగంలో చైనీస్ హ్యాండ్‌సెట్ తయారీదారుల నుండి సామ్‌సంగ్ పోటీ ఎదుర్కొంటోంది. భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో తీవ్ర పోటీ ఉంటుందని పార్క్ అన్నారు. చిన్న పట్టణాల్లోనూ కంపెనీ తయారీ ప్రీమియం ఫోన్ల వాడకం పెరిగిందని వివరించారు.

పీఈ పెట్టుబడులు 5 శాతం అప్

- 2024లో 56 బిలియన్ డాలర్లు
- ఐవీసీఏ, ఈవై నివేదిక



ముంబై: వరుసగా రెండేళ్ల పాటు తగ్గిన ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు గతేడాది మళ్లీ కొంత మెరుగయ్యాయి. 2024లో 5 శాతం పెరిగి 56 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయితే, అనేక అనిశ్చితులు నెలకొన్న నేపథ్యంలో ఈ ఏడాది పెట్టుబడులకు సవాళ్లు ఎదురుకావచ్చనే అంచనాలు నెలకొన్నాయి. పరిశ్రమ లాబీ గ్రూప్ ఐవీసీఏ, కన్సల్టెన్సీ సంస్థ ఈవై రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 'అమెరికా నూతన ప్రభుత్వం తన పాలసీలను ఇంకా పూర్తిగా వెల్లడించాల్సి ఉంది. ఇవి అంతర్జాతీయంగా వాణిజ్యం, ఎగుమతులు, కరెన్సీ, క్రూడాయిల్ ధరలపై గణనీయంగా ప్రభావం చూపవచ్చు. దీనితో భారత స్థూల ఆర్థిక పరిస్థితులపై కూడా ప్రభావం పడొచ్చు' అని ఈవై పార్ట్‌నర్ వివేక్ సోని తెలిపారు. దేశీయంగా వినియోగం నెమ్మదిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయని, పరిస్థితిని సరిదిద్దేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోగలదని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2024లో పీఈ, వీసీ ఫండ్‌ల ఒప్పందాలు 54 శాతం పెరిగి 1,352గా నమోదయ్యాయి.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- మౌలిక సదుపాయాలు, రియల్టీలో గతేడాది పెట్టుబడులు స్వల్పంగా 3 శాతం క్షీణించాయి. 2023లో 21.5 బిలియన్ డాలర్లుగా ఉండగా 2024లో 20.9 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.
- 2023లో 1 బిలియన్ డాలర్ల విలువ చేసే డీల్స్ 6 నమోదయ్యాయి. వీటి మొత్తం విలువ 9.6 బిలియన్ డాలర్లు. గతేడాది బిలియన్ డాలర్ల ఒప్పందాలు 4 కుదరగా, వీటి మొత్తం విలువ 6.1 బిలియన్ డాలర్లు. ఏటీసీ ఇండియా టవర్ కార్పొరేషన్‌ను బ్రూక్‌ఫీల్డ్‌కి చెందిన డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ 2 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయడం.. గతేడాది నమోదైన అతి పెద్ద డీల్.
- మదుపరుల నిష్క్రమణకు సంబంధించి 26.7 బిలియన్ డాలర్ల విలువ చేసే 282 డీల్స్ నమోదయ్యాయి. 2023లో ఈ పరిమాణం 24.9 బిలియన్ డాలర్లు.
- 2023లో 95 ఫండ్లు 15.9 బి. డాలర్ల నిధులు సమీకరించగా 2024లో ఇది 34 శాతం తగ్గింది.

ఆర్థిక వృద్ధిలో క్లౌడ్, జీసీసీల కీలక పాత్ర

- 2030 నాటికి జీడీపీలో 20 శాతం వాటా
- మైటీ, ఐసీఆర్ఐఈఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో క్లౌడ్ మార్కెట్, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీలు) అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విభాగాలుగా కేంద్ర ప్రభుత్వం నివేదిక స్పష్టం చేసింది. దేశ జీడీపీలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వాటా 2030 నాటికి 20 శాతానికి చేరుకుంటుదని తెలిపింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ (మైటీ), కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ (ఐసీఆర్ఐఈఆర్) సంయుక్త నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. 2022–23 నాటికి జీడీపీలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పరిమాణం రూ.31.64 లక్షల కోట్ల మేర ఉన్నట్టు తెలిపింది. డిజిటల్ ఎకానమీలో సంప్రదాయ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ (ఐసీటీ) ఇకముందూ అతిపెద్ద విభాగంగా కొనసాగుతుందని పేర్కొంది. 2023నాటికి అంతర్జాతీయంగా భారత క్లౌడ్ మార్కెట్ వాటా 1.1–1.2 శాతం మేర ఉంటుందని వివరించింది. ''భారత డిజిటల్ ఎకానమీ చాలా వేగంగా రెట్టింపు కానుంది. 2029–30 నాటికి 20 శాతం వాటాను అందించనుంది. వచ్చే ఆరేళ్లలో సంప్రదాయ వ్యవసాయం, తయారీని మించి డిజిటల్ ఎకానమీ ఎదగనుంది''అని ఈ నివేదిక వెల్లడించింది. 2023లో ఐసీటీ ఎగుమతులు 162 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఐర్లాండ్ 236 బిలియన్ డాలర్ల ఎగుమతుల తర్వాత రెండో పెద్ద ఎగుమతిదారుగా భారత్ నిలవడం గమనార్హం. 2023–24లో 1644 బిలియన్ డిజిటల్ లావాదేవీలు నమోదయ్యాయి.

20 బిలియన్ డాలర్లకు క్లౌడ్ మార్కెట్

''కంపెనీలు జనరేటివ్ ఏఐని అందిపుచ్చుకోవడం పెరుగుతోంది. తద్వారా ఉత్పాదకత, కస్టమర్ అనుభవాన్ని పెంచుకోవడం, కొత్త సేవల ప్రారంభంతో క్లౌడ్ మార్కెట్ ఏటా 24 శాతం చొప్పున పెరుగుతూ 2027 నాటికి 20.3 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది''అని ఈ నివేదిక వెల్లడించింది. జీసీసీలకు భారత్ అంతర్జాతీయ కేంద్రంగా మారిందని, 2022 నాటికి ప్రపంచంలోని జీసీసీల్లో 55 శాతం భారత్‌లోనే ఉన్నట్టు తెలిపింది. పరిశోధన, అభివృద్ధి, ఐటీ సపోర్ట్ సేవలు, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ తదితర సేవల కోసం ఎంఎన్‌సీలు జీసీసీలను ఏర్పాటు చేస్తుంటాయి.



బోర్డు సమావేశాలు

ఐసీఐసీఐ బ్యాంకు, యస్ బ్యాంకు, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు, ఎన్‌టీపీసీ, మాక్రోటెక్ డెవలపర్స్, జేకే సిమెంట్స్, బాలకృష్ణ ఇండస్ట్రీస్, సీడీఎస్ఎల్, రేమాండ్, ట్రాన్స్‌పోర్ట్ కార్ప్, అనుపమ రసాయన్, గో ఫ్యాషన్, ఎన్‌డీటీవీ, జువారీ ఇండస్ట్రీస్.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-1-2025	
విశాఖ	485–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	490–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460–00
వరంగల్	462–00
రిటైల్ ధర	5.20

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDUNILVR	2,380.10	2.52
BRITANNIA	5,100.00	1.74
EICHERMOT	5,190.25	1.45
GRASIM	2,495.00	1.38
ICICIBANK	1,213.70	0.99

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,226.20	-4.9
TRENT	5,499.00	-4.09
M&M	2,799.00	-3.03
ADANIENT	2,314.05	-2.97
BPCL	263.25	-2.95

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,907
ఎన్ఎస్ఈ	87,531
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,23,931
ఎఫ్ఐఐ	- 2,758
డీఐఐ	+ 2,402

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	74.30	$	74.62
బ్రెంట్	78.22	$	78.29

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు నాలుగో పరాజయం



సాక్షి, హైదరాబాద్: ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు నాలుగో ఓటమి ఎదురైంది. బెంగళూరులో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి జట్టు 0-1 గోల్ తేడాతో స్పోర్టింగ్ క్లబ్ బెంగళూరు జట్టు చేతిలో ఓడిపోయింది. ఆట 34వ నిమిషంలో ఆసిఫ్ గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన స్పోర్టింగ్ జట్టు ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖరారు చేసుకుంది. 12 జట్లు పోటీపడుతున్న ఐ-లీగ్‌లో శ్రీనిధి జట్టు 9 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. 3 మ్యాచ్‌ల్లో గెలిచి, 2 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, 4 మ్యాచ్‌ల్లో ఓడిన శ్రీనిధి జట్టు 11 పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. 28న హైదరాబాద్‌లో జరిగే తదుపరి మ్యాచ్‌లో నాంధారి జట్టుతో శ్రీనిధి జట్టు ఆడుతుంది.

విజయాలతో పాక్, నేపాల్ ముగింపు

కౌలాలంపూర్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల అండర్-19 ప్రపంచకప్‌ను పాకిస్తాన్, నేపాల్ జట్లు విజయంతో ముగించాయి. గ్రూప్ 'బి'లో పేలవ ఆటతీరుతో అట్టడుగున నిలిచిన పాకిస్తాన్ శుక్రవారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో సమోవాపై 52 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. అనంతరం సమోవా జట్టు 18.5 ఓవర్లలో 84 పరుగులకు ఆలౌటైంది. పాక్ బౌలర్లలో హానియా 4 వికెట్లు తీసింది. మరో మ్యాచ్‌లో నేపాల్ జట్టు 7 వికెట్లతో మలేసియాపై గెలుపొందింది.



జడేజా

జడేజా మాయ...

రెండో ఇన్నింగ్స్‌లో 38 పరుగులిచ్చి 7 వికెట్లు సొంతం

- మ్యాచ్ మొత్తంలో 12 వికెట్లు పడగొట్టిన భారత స్పిన్నర్
- ఢిల్లీపై 10 వికెట్లతో నెగ్గిన సౌరాష్ట్ర
- శార్దుల్ ఠాకూర్ శతకంతో కోలుకున్న ముంబై
- రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడ్డ రోహిత్, యశస్వి, శ్రేయస్ అయ్యర్

ముంబై: స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మినహా... రంజీ ట్రోఫీ బరిలోకి దిగిన భారత స్టార్ ఆటగాళ్లు ఆకట్టుకోలేకపోయారు. ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా రాజ్‌కోట్ వేదికగా ఢిల్లీతో జరిగిన పోరులో సౌరాష్ట్ర తరఫున బరిలోకి దిగిన జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి అదుర్స్ అనిపించుకున్న జడ్డూ... రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. ఫలితంగా ఒకటిన్న రోజులోనే ముగిసిన పోరులో సౌరాష్ట్ర జట్టు 10 వికెట్ల తేడాతో ఢిల్లీపై విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 163/5తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర 72.2 ఓవర్లలో 271 పరుగులకు ఆలౌటైంది. హార్విక్ (93), అర్పిత్ (62) అర్ధశతకాలతో రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ జట్టు 25.2 ఓవర్లలో 94 పరుగులకు ఆలౌటైంది. టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ (17) మరోసారి విఫలం కాగా... కెప్టెన్ ఆయుశ్ బదోనీ (55 బంతుల్లో 44; 5 ఫోర్లు) కాస్త పోరాడాడు. యశ్ ధుల్ ఒక పరుగు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. ఫలితంగా సౌరాష్ట్ర ముందు 12 పరుగుల లక్ష్యం నిలవగా... ఆ జట్టు 3.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 15 పరుగులు చేసి గెలిచింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 12 వికెట్లు తీయడంతో పాటు 38 పరుగులు చేసిన జడేజాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

తనుశ్-శార్దుల్ సెంచరీ భాగస్వామ్యం

తొలి ఇన్నింగ్స్‌లో పేలవ ప్రదర్శన కనబర్చిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ (28; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఓపెనర్ యశస్వి జైస్వాల్ (26; 4 ఫోర్లు)... రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైన ముంబై ఓపెనర్లు... రెండో ఇన్నింగ్స్‌లో కాస్త పోరాడారు. సాధికారికంగా ఇన్నింగ్స్ ఆరంభించిన ఈ జోడీ తొలి వికెట్‌కు 54 పరుగులు జోడించింది. ఇక కుదురుకున్నట్లే అనుకున్న దశలో రోహిత్ ఔట్ కాగా.. కాసేపటికే జైస్వాల్ అతడిని అనుసరించాడు. కెప్టెన్ అజింక్య రహానే (16), శ్రేయస్ అయ్యర్ (17), శివమ్ దూబే (0) కూడా ఆకట్టుకోలేకపోవడంతో... ముంబై జట్టు ఒకదశలో 101 పరుగులకు 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుపోయింది. ఈ దశలో తొలి ఇన్నింగ్స్ హీరో, పేస్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ (119 బంతుల్లో 113 బ్యాటింగ్; 17 ఫోర్లు) అద్వితీయ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో అపార అనుభవం ఉన్న ప్లేయర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరిన చోట... తనుశ్ కొటియాన్ (119 బంతుల్లో 58 బ్యాటింగ్; 6 ఫోర్లు)తో కలిసి అభేద్యమైన ఎనిమిదో వికెట్‌కు 173 పరుగులు జోడించాడు. దీంతో ముంబై జట్టు ఓవరాల్‌గా 188 పరుగుల ఆధిక్యం సాధించగలిగింది. అంతకుముందు జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 206 పరుగులకు ఆలౌటైంది.



శార్దుల్

స్మరణ్ డబుల్ సెంచరీ

దేశవాళీల్లో పరుగుల వరద పారిస్తున్న కర్ణాటక బ్యాటర్ రవిచంద్రన్ స్మరణ్ (277 బంతుల్లో 203; 25 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో విజృంభించాడు. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా పంజాబ్‌తో పోరులో స్మరణ్ ద్విశతకం సాధించడంతో కర్ణాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 475 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (20), దేవదత్ పడిక్కల్ (27) ఎక్కువసేపు నిలవలేకపోయిన చోట స్మరణ్ చక్కటి ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ స్కోరు అందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకు ఆలౌటైన పంజాబ్... శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 24 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (1), అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (14) అవుట్ కాగా... శుబ్‌మన్ గిల్ (7 బ్యాటింగ్) పోరాడుతున్నాడు. చేతిలో 8 వికెట్లు ఉన్న పంజాబ్... ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకోవాలంటే ఇంకా 396 పరుగులు చేయాల్సి ఉంది.



శశికాంత్ 99 నాటౌట్

- ఆంధ్ర 303 ఆలౌట్
- పుదుచ్చేరి 209/5



పుదుచ్చేరి: ఆంధ్ర ఆల్‌రౌండర్ శశికాంత్ (216 బంతుల్లో 99 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా పుదుచ్చేరితో జరుగుతున్న మ్యాచ్‌లో శశికాంత్ మెరిపించడంతో ఆంధ్ర జట్టు మంచి స్కోరు చేయగలిగింది. ఓవర్‌నైట్ స్కోరు 245/7తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 111.5 ఓవర్లలో 303 పరుగులకు ఆలౌటైంది. శశికాంత్ ఆఖరి వరకు అజేయంగా నిలిచి జట్టుకు మెరుగైన స్కోరు అందించగా... మరో ఎండ్‌లో అతడికి సరైన సహకారం లభించకపోవడంతో శతకం చేజార్చుకున్నాడు. పుదుచ్చేరి బౌలర్లలో అంకిత్ శర్మ 4, అబిన్ మాథ్యూ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పుదుచ్చేరి శుక్రవారం ఆట ముగిసే సమయానికి 63 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. మోహిత్ కాలె (127 బంతుల్లో 60; 5 ఫోర్లు), కెప్టెన్ అరుణ్ కార్తీక్ (95 బంతుల్లో 54 బ్యాటింగ్; 6 ఫోర్లు) అర్ధశతకాలతో రాణించారు. ఒక దశలో 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన పుదుచ్చేరి జట్టును మోహిత్, అరుణ్ ఆదుకున్నారు. ఆంధ్ర బౌలర్లలో పృథ్వీ రాజ్ 4 వికెట్లు పడగొట్టగా... శశికాంత్ ఒక వికెట్ తీశాడు. చేతిలో 5 వికెట్లు ఉన్న పుదుచ్చేరి జట్టు ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 94 పరుగులు వెనుకబడి ఉంది.

స్కోరు వివరాలు

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: అభిషేక్ రెడ్డి (సి) జయ్ పాండే (బి) సాగర్ 15; షేక్ రషీద్ (సి) జయ్ పాండే (బి) అబిన్ మాథ్యూ 105; హనుమ విహారి (సి) జయ్ పాండే (బి) అబిన్ మాథ్యూ 6; కరణ్ షిండే (సి) అరుణ్ కార్తీక్ (బి) అంకిత్ శర్మ 25; రికీ భుయ్ (సి) జయ్ పాండే (బి) అబిన్ మాథ్యూ 4; శ్రీకర్ భరత్ (బి) అంకిత్ శర్మ 19; విజయ్ (స్టంప్డ్) అరుణ్ కార్తీక్ (బి) అంకిత్ శర్మ 1; శశికాంత్ (నాటౌట్) 99; పృథ్వీ రాజ్ (బి) గౌరవ్ యాదవ్ 16; రఫీ (ఎల్బీ) (బి) గౌరవ్ యాదవ్ 0; లలిత్ మోహన్ (బి) అంకిత్ శర్మ 4; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (111.5 ఓవర్లలో ఆలౌట్) 303. వికెట్ల పతనం:** 1-21, 2-28, 3-74, 4-87, 5-106, 6-110, 7-238, 8-270, 9-270, 10-303, **బౌలింగ్:** గౌరవ్ యాదవ్ 22-2-77-2; అబిన్ మాథ్యూ 25-8-53-3; సాగర్ 30-6-63-1; అమన్ ఖాన్ 5-1-25-0; అంకిత్ శర్మ 27.5-5-71-4; ఆకాశ్ 2-0-6-0.

పుదుచ్చేరి తొలి ఇన్నింగ్స్: శ్రీధర్ రాజు (సి) శ్రీకర్ భరత్ (బి) పృథ్వీ రాజ్ 0; జయ్ పాండే (బి) పృథ్వీ రాజ్ 3; పారస్ (సి) శ్రీకర్ భరత్ (బి) పృథ్వీ రాజ్ 39; ఆకాశ్ (సి) శ్రీకర్ భరత్ (బి) శశికాంత్ 7; మోహిత్ కాలె (సి) రషీద్ (బి) పృథ్వీ రాజ్ 60; అరుణ్ కార్తీక్ (బ్యాటింగ్) 54; అమాన్ ఖాన్ (బ్యాటింగ్) 37; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (63 ఓవర్లలో 5 వికెట్లకు) 209. వికెట్ల పతనం:** 1-0, 2-9, 3-20, 4-84, 5-148, **బౌలింగ్:** పృథ్వీ రాజ్ 17-2-50-4; మొహమ్మద్ రఫీ 14-1-41-0; శశికాంత్ 14-0-55-1; లలిత్ మోహన్ 13-2-30-0; విజయ్ 5-0-25-0.



పోరాడి ఓడిన సహజ

బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ100 మహిళల టోర్నీ సింగిల్స్ విభాగంలో భారత కథ ముగిసింది. బరిలో మిగిలిన ఏకైక ప్లేయర్ సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన ప్రపంచ 315వ ర్యాంకర్ సహజ 4-6, 4-6తో ప్రపంచ 155వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ సారా బెజ్లెక్ (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాజయం పాలైంది. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఒక ఏస్ సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయిన భారత రెండో ర్యాంకర్, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ సెమీఫైనల్లో ప్రార్థన తొంబారే (భారత్)-అలిసియా బార్నెట్ (బ్రిటన్) ద్వయం 3-6, 2-6తో అమీనా-ఎలీనా (రష్యా) జోడీ చేతిలో ఓడిపోయింది.

ఐసీసీ టెస్టు జట్టులో బుమ్రా, జడేజా, జైస్వాల్

2024లో ప్రదర్శన ఆధారంగా టీమ్ ప్రకటన



బుమ్రా

దుబాయ్: గతేడాది సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'టెస్టు టీమ్ ఆఫ్ ద ఇయర్-2024'ను ప్రకటించింది. ఇందులో భారత్ నుంచి స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ చోటు దక్కించుకున్నారు. 11 మందితో కూడిన ఈ జట్టుకు ఆ్రస్టేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను సారథిగా ఎంపిక చేయగా... జట్టులో బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్ రూపంలో నలుగురు ఇంగ్లండ్ ఆటగాళ్లకు చోటు దక్కింది. న్యూజిలాండ్ నుంచి కేన్ విలియమ్సన్, మ్యాట్ హెన్రీ ఎంపిక కాగా... శ్రీలంక నుంచి కమిందు మెండిస్ చోటు దక్కించుకున్నాడు. 2024లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన బుమ్రా... టెస్టుల్లో 14.92 సగటుతో 71 వికెట్లు పడగొట్టి ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. కెరీర్‌లో 20కి లోపు సగటుతో 200 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా రికార్డుల్లోకెక్కిన బుమ్రా... ఇటీవల 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో 32 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. జడేజా గతేడాది 527 పరుగులు చేయడంతో పాటు... 48 వికెట్లు పడగొట్టి ఈ జట్టులో చోటు దక్కించుకోగలిగాడు. ఇక ఆసీస్‌తో సిరీస్‌లో ప్రధాన ప్లేయర్లంతా విఫలమైన చోట చక్కటి ప్రదర్శన కనబర్చిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్... గతేడాది 54.74 సగటుతో 1478 పరుగులు చేశాడు. ఈ జాబితాలో ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ (1556) అగ్రస్థానంలో ఉండగా... జైస్వాల్ రెండో 'ప్లేస్'లో నిలిచాడు. 23 ఏళ్ల జైస్వాల్ దక్షిణాఫ్రికా పర్యటనలో పెద్దగా ఆకట్టుకోలేకపోయినా... ఆ తర్వాత బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఆ్రస్టేలియాపై మెరుగైన ప్రదర్శన చేశాడు. గతేడాది విలియమ్సన్ 1013 పరుగులు చేయగా... శ్రీలంక ప్లేయర్ కమిందు మెండిస్ 1049 పరుగులు చేశాడు. ఇక పదేళ్ల తర్వాత ఆ్రస్టేలియాకు 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' అందించిన ఆసీస్ సారథి కమిన్స్ 2024లో 37 వికెట్లు పడగొట్టడంతో పాటు 306 పరుగులు చేశాడు. మరోవైపు ఐసీసీ 'వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్'లో టీమిండియా నుంచి ఒక్క ప్లేయర్‌కూ చోటు దక్కలేదు. గతేడాది భారత జట్టు కేవలం 3 వన్డేలు మాత్రమే ఆడటంతో మన ఆటగాళ్లకు ఈ జట్టులో స్థానం లభించలేదు. వన్డే జట్టుకు శ్రీలంక ప్లేయర్ చరిత అసలంక కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.



జైస్వాల్

ఐసీసీ టెస్టు టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024: కమిన్స్ (కెప్టెన్; ఆ్రస్టేలియా) యశస్వి జైస్వాల్, రవీంద్ర జడేజా, బుమ్రా (భారత్), డకెట్, రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్ (ఇంగ్లండ్), విలియమ్సన్, హెన్రీ (న్యూజిలాండ్), కమిందు మెండిస్ (శ్రీలంక).

ఫైనల్లో సూర్మా క్లబ్

రాంచీ: మహిళల హాకీ ఇండియా లీగ్ తొలి టోర్నమెంట్‌లో జేఎస్‌డబ్ల్యూ సూర్మా హాకీ క్లబ్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సూర్మా క్లబ్ జట్టు 4-2 గోల్స్ తేడాతో ష్రాచి రార్ బెంగాల్ టైగర్స్ జట్టును ఓడించింది. సూర్మా క్లబ్ తరఫున ఎంగెల్‌బెర్ట్ (1, 17వ, 47వ నిమిషాల్లో) మూడు గోల్స్ చేయగా... హినా బానో (9వ నిమిషంలో) ఒక గోల్ సాధించింది. బెంగాల్ టైగర్స్ తరఫున కెప్టెన్ వందన కటారియా (48వ నిమిషంలో), శిల్పి దబాస్ (58వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. నాలుగు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో లీగ్ దశ ముగిశాక సూర్మా క్లబ్ 13 పాయింట్లతో... ఒడిశా వారియర్స్ జట్టు 11 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈనెల 26న జరిగే ఫైనల్లో సూర్మా క్లబ్, ఒడిశా వారియర్స్ టైటిల్ కోసం తలపడతాయి.

ఐసీసీ మహిళల వన్డే జట్టులో స్మృతి, దీప్తి





దుబాయ్: భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన, స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'మహిళల వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్' జట్టులో చోటు దక్కించుకున్నారు. స్మృతి గతేడాది 13 వన్డేలు ఆడి 747 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిలిచింది. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో వరుసగా రెండు శతకాలు బాదిన ఆమె న్యూజిలాండ్‌పై కూడా ఒక సెంచరీ చేసింది. 2024లో 13 వన్డేలాడిన దీప్తి శర్మ 186 పరుగులు చేయడంతో పాటు... 24 వికెట్లు పడగొట్టి ఈ జట్టులో చోటు దక్కించుకుంది. ఈ జట్టుకు దక్షిణాఫ్రికా స్టార్ లౌరా వాల్వర్ట్ సారథిగా ఎంపిక కాగా... ఇంగ్లండ్ నుంచి అమీ జోన్స్, సోఫీ ఎకెల్‌స్టోన్, కేట్ క్రాస్ రూపంలో ముగ్గురు ప్లేయర్లు, ఆ్రస్టేలియా నుంచి ఆష్లే గార్డ్‌నర్, అనాబెల్ సదర్లాండ్ చోటు దక్కించుకున్నారు. సఫారీ ప్లేయర్ మరీనే కాప్‌తో పాటు శ్రీలంక నుంచి చమరి ఆటపట్టు, వెస్టిండీస్ ప్లేయర్ హేలీ మాథ్యూస్ కూడా ఈ టీమ్‌కు ఎంపికయ్యారు.

హైదరాబాద్ 565 ఆలౌట్

- హిమతేజ, నిశాంత్ అర్ధశతకాలు
- రక్షణ్ రెడ్డితో చివరి వికెట్‌కు 114 పరుగులు జోడించిన నిశాంత్



హిమతేజ



నిశాంత్

సాక్షి, హైదరాబాద్: బ్యాటర్లు కలిసికట్టుగా కదంతొక్కడంతో దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 291/2తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 168.5 ఓవర్లలో 565 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (327 బంతుల్లో 177; 19 ఫోర్లు) భారీ సెంచరీతో విజృంభించగా... హిమతేజ (106 బంతుల్లో 76; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), 11వ స్థానంలో వచ్చిన పేస్ బౌలర్ శరణు నిశాంత్ (93 బంతుల్లో 71; 10 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. వరుణ్ గౌడ్ (36) ఫర్వాలేదనిపించగా... కెప్టెన్ చామా మిలింద్ (4), తనయ్ త్యాగరాజన్ (0), రాహుల్ బుద్ధి (10) విఫలమయ్యారు. 451 పరుగుల వద్ద తొమ్మిదో వికెట్ కోల్పోయిన హైదరాబాద్ జట్టు చివరి వికెట్‌కు 114 పరుగులు జోడించడం విశేషం. రక్షణ్ రెడ్డి (135 బంతుల్లో 42 నాటౌట్; 2 ఫోర్లు)తో కలిసి నిశాంత్ ఆఖరి వికెట్‌కు 30 ఓవర్లకుపైగా బ్యాటింగ్ చేశాడు. ఈ జంటను విడదీసేందుకు హిమాచల్ ప్రదేశ్ బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. హిమాచల్ బౌలర్లలో ఆకాశ్ వశిష్ట్ 4, ముకుల్ నేగీ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హిమాచల్ ప్రదేశ్ శుక్రవారం ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో వికెట్ నష్టానికి 33 పరుగులు చేసింది. ప్రశాంత్ చోప్రా (1) పెవిలియన్ చేరగా... శుభమ్ అరోరా (21 బ్యాటింగ్; 3 ఫోర్లు), అంకిత్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 9 వికెట్లు ఉన్న హిమాచల్ ప్రదేశ్ జట్టు... హైదరాబాద్ స్కోరుకు ఇంకా 532 పరుగులు వెనుకబడి ఉంది.

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి) ప్రశాంత్ చోప్రా (బి) దివేశ్ శర్మ 177; అభిరత్ రెడ్డి (బి) ఆకాశ్ వశిష్ట్ 73; రాహుల్ రాధేశ్ (సి) మహాజన్ (బి) అపూర్వ 52; వరుణ్ గౌడ్ (ఎల్బీ) (బి) ఆకాశ్ వశిష్ట్ 36; హిమతేజ (సి) వైభవ్ అరోరా (బి) ఆకాశ్ వశిష్ట్ 76; రాహుల్ బుద్ధి (సి) ప్రశాంత్ చోప్రా (బి) ముకుల్ నేగీ 10; తనయ్ త్యాగరాజన్ (సి) శుభమ్ అరోరా (బి) ముకుల్ నేగీ 0; చామా మిలింద్ (సి) మయాంక్ డాగర్ (బి) ముకుల్ నేగీ 4; అనికేత్ రెడ్డి (బి) 4; రక్షణ్ రెడ్డి (నాటౌట్) 42; శరణు నిశాంత్ (సి) మయాంక్ డాగర్ (బి) ఆకాశ్ వశిష్ట్ 71; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (168.5 ఓవర్లలో ఆలౌట్) 565. వికెట్ల పతనం:** 1-147, 2-258, 3-321, 4-369, 5-382, 6-382, 7-390, 8-399, 9-451, 10-565; **బౌలింగ్:** వైభవ్ అరోరా 24-2-89-0; రిషి ధావన్ 15-4-46-0; మయాంక్ డాగర్ 33-6-97-1; దివేశ్ శర్మ 24-4-83-1; ముకుల్ నేగీ 38-5-98-3; ఆకాశ్ వశిష్ట్ 2775-4-92-4; అపూర్వ్ వాలియా 7-0-44-1.

'బంగారు' గుర్రానికి అనూశ్ బైబై

రేసుగుర్రం 'మన్ని'తో ఏడేళ్ల బంధానికి తెర



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్ చాంపియన్ అనూశ్ అగర్‌వల్లా తనకు అచ్చొచ్చిన రేసుగుర్రానికి గుడ్‌బై చెప్పాడు. 'మన్ని' అని ముద్దుగా పిలుచుకునే గుర్రంతో ఏడేళ్ల బంధానికి భారమైన హృదయంతో వీడ్కోలు పలికాడు. 2023లో హాంగ్జౌ (చైనా)లో జరిగిన ఆసియా క్రీడల్లో అనూశ్ పాలిట 'మన్ని' బంగారు గుర్రం అయ్యింది. ఈక్వెస్ట్రియన్ (గుర్రపుస్వారీ) ఈవెంట్‌లో మన్నిపై స్వారీ చేసిన అనూశ్ స్వర్ణ పతకం సాధించాడు. 'మన్ని'కి రిటైర్మెంట్ ఇవ్వాల్సిన సమయం వచ్చిందని, ఇకపై ఆ రేసుగుర్రంతో బరిలోకి దిగబోనని సోషల్ మీడియాలో ప్రకటించాడు. 'నా తొలి అడుగులన్నీ మన్నితోనే వేశా. తొలి గ్రాండ్‌ప్రి, మొదటి అంతర్జాతీయ గ్రాండ్‌ప్రి, అంతర్జాతీయ పోటీల్లో ప్రథమ స్థానం... ఇలా చెప్పుకుంటూపోతే... పెద్ద పెద్ద అంతర్జాతీయ టోర్నీల్లో నా పోటీ ప్రదర్శనలకు రేసుగుర్రం నేను కన్న కలల్ని సాకారం చేసింది. అన్నింటికి మించి ఓ గుర్రం, రైడర్ ఒకరిపై ఒకరు నమ్మకం పెట్టుకుంటే ఏం జరుగుతుందో తన వేగంతో చాటి చెప్పింది' అని భావోద్వేగంతో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను పోస్ట్ చేశాడు.

పార్ట్‌టైం కొలువులకు రాంరాం

ట్రంప్ బెదిరింపులతో మన విద్యార్థుల్లో ఆందోళన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడు అక్కడి భారతీయ విద్యార్థుల్లో ఆందోళనలు పెంచుతోంది. ఆయన రెండోసారి బాధ్యతలు చేపట్టడానికి వారిలో చాలామంది పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు గుడ్‌బై చెప్పారు. కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టాల భయమే ఇందుకు కారణం. వారిలో చాలామంది ఉన్నత చదువుల కోసం అప్పులు చేసి అమెరికా వచ్చినవాళ్లే. దాంతో తల్లిదండ్రులకు భారంగా కావద్దని పార్ట్‌టైమ్‌గా చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తుంటారు. ఎఫ్–1 వీసాపై ఉన్న విద్యార్థులకు వారానికి 20 గంటల వరకు పని చేయడానికి అనుమతిస్తారు. కానీ చట్టం, వీసా నిబంధనలు అనుమతించని ఉద్యోగాలు కూడా చేస్తుంటారు. కానీ ఇకపై అలాంటివి చేస్తూ పట్టుబడితే నేరుగా డీపోర్టేషనేనని ట్రంప్ హెచ్చరించడంతో మన విద్యార్థులు రిస్క్ తీసుకోవడానికి సిద్ధపడటం లేదు. కొన్ని నెలల పాటు పరిస్థితి చూశాకే పార్ట్‌టైం కొలువులపై నిర్ణయానికి వస్తామంటున్నారు.

ధీమా పోయింది..

ఇప్పటిదాకా ఏదో ఒక ఉద్యోగం చేస్తూ చదువుకోవచ్చనే ధీమా ఉండేదని, ఇప్పుడది కాస్తా పోయిందని మన విద్యార్థులు ఆవేదన చెందుతుందున్నారు. ''రూ.42 లక్షలు అప్పు చేసి మరీ వచ్చా. కాలేజీ కాగానే చిన్న కఫేలో రోజుకు ఆరు గంటలు పని చేసేవాన్ని. గంటకు ఏడు డాలర్ల చొప్పున ఇచ్చేవారు. నెలవారీ ఖర్చులు హాయిగా వెళ్లిపోయేవి. కానీ ఇలా అనధికారికంగా పని చేస్తున్న వారిపై ఇమ్మిగ్రేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలియడంతో గత వారం రాజీనామా చేశా''ఇల్లినాయీ వర్సిటీకి చెందిన ఓ భారతీయ విద్యార్థి చెప్పారు. ''ఇప్పటికే నా పొదుపులో చాలావరకు వాడేశా. రూమ్మేట్స్ నుంచి అప్పు తీసుకుంటున్నా. ఇంకెంతకాలం నెట్టుకురాగలనో తెలియడం లేదు''అని టెక్సాస్‌లో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న మరో విద్యార్థి వాపోయాడు. ఈ అనిశ్చితి విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై బాగా ప్రభావం చూపుతోంది.

అతి పెద్ద విద్యార్థి సమూహం...

అమెరికాలో చదివే విదేశీ విద్యార్థుల్లో మనవాళ్లు అతి పెద్ద సమూహం. ఈ విషయంలో చైనాను కూడా దాటేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (ఐఐఈ) నివేదిక ప్రకారం 2022–23లో 2.69 లక్షల భారత విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. అంతకుముందు ఏడాది కంటే అది ఏకంగా 35% అధికం.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఫొటోలో ఉన్నవి రోబో శునకాలు. వీటిని రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తున్నది ఆర్మీ జవాన్లు. రేపు జరిగే రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొనేందుకు ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌లో భాగంగా శుక్రవారం కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో కనిపించిన దృశ్యమిది.

యుద్ధ గాయాలకు ఉపశమనం

ఉక్రేనియన్లకు ఊరటగా స్టాండప్ కామెడీ
- సంస్కృతిలో భాగంగా మారిన వైనం
- ఆర్థిక సాయమూ అందిస్తున్న కమెడియన్లు

2023 అక్టోబరు 14. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మక రాజప్రాసాదం ఓ అసాధారణ షోకు వేదికైంది. అది స్టాండప్ కామెడీ. ప్రఖ్యాత కమేడియన్ ఆంటోన్ టైమోషెంకో సోలో ప్రదర్శన ఇచ్చారు. ఆ ఘనత సాధించిన తొలి ఉక్రేనియన్‌గా నిలిచారు. దాదాపు మూడేళ్లుగా యుద్ధ విషాదంలో మునిగి తేలుతున్న ఉక్రెయిన్‌కు స్టాండప్ కామెడీ ఇప్పుడు తాత్కాలిక ఉపశమనంగా మారింది. ఒకప్పుడు విలాసవంతమైనవిగా గుర్తింపు పొందిన షోలు ఇప్పుడు ఉక్రెయిన్ సంస్కృతిలో భాగమయ్యాయి. స్టాండప్ కామెడీని సైకోథెరపీ బడ్జెట్ వర్షన్‌గా అభివర్ణిస్తున్నారు టైమోషెంకో. యుద్ధ సమయంలో కామెడీ చేయడం నిజానికి అంత్యక్రియల్లో జోక్ వేయడం వంటిదే. అయినా దేశ ప్రజల ముఖాల్లో మాయమైన నవ్వును తిరిగి తెచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు స్టాండప్ కమెడియన్లు. షెల్టర్ హోమ్స్‌లో, సాయుధ దళాల కోసం, ఔట్‌డోర్ స్టేజీలపై... ఇలా వీలైన చోటల్లా ప్రదర్శనలు ఇస్తున్నారు. రష్యా క్షిపణులు ఉక్రెయిన్ నగరాల్లోకి దూసుకొస్తున్నా ప్రజలను నవ్వించడానికి ప్రయత్నిస్తున్న స్టాండప్ కామిక్స్‌లో 30 ఏళ్ల టైమోషెంకో ఒకరు. క్లిష్ట సమయాలను అధిగమించడానికి, సమాజ భావనను నిర్మించడానికి, మనోధైర్యాన్ని పెంచడానికి ఈ హాస్యం ఉత్తమమైన మార్గం అంటున్నారాయన.

గాయాలను గుర్తు చేయకుండా

భయంకర ఘర్షణ వాతావరణంలో హాస్యం నవ్వించగలుగుతుందా? అంటే అవునంటున్నారు కమెడియన్లు. ప్రమాదాన్ని ఎగతాళి చేయడం వల్ల దాన్ని ఎదుర్కొగల శక్తి వస్తుందంటారు కమెడియన్ హన్నా కొచెహురా. యుద్ధ సమయంలో వేసే జోక్స్ సహజంగానే యుద్ధానికి సంబంధించినవే ఉంటాయి. ఫ్రాంక్ జానర్ లాగా ఉండే స్టాండప్ కామెడీలో కమెడియన్లు తమ సొంత అనుభవాలు, ఆలోచనల్లోంచే మాట్లాడతారు. యుద్ధ సమయంలో జోక్స్ ఐడియాలు ఎక్కడి నుంచి వస్తాయని అడిగితే, ఆకాశంలో రష్యా క్షిపణులను చూడగానే వాటంతటవే పుట్టుకొస్తాయంటూ వ్యంగంగా బదులిస్తారు ఆంటోన్. పట్నంలో ఉన్న కొడుకుతో గ్రామంలో ఉంటున్న అమ్మ ఫోన్‌లో మాట్లాడుతూ, 'బాబూ! ఈ రోజు మన ఇంటిపై నుంచి ఎన్ని రాకెట్లు వెళ్లాయో తెలుసా?'అంటూ బెదిరిపోతుంటుంది. ''భయపడకులేమ్మా! అవన్నీ పట్నంలో ఉన్న నా వైపుకే వచ్చాయి''అంటూ భయాన్ని పోగొడుతుంటాడు కొడుకు. ఇలా ఉంటుంది వారి కామెడీ. అయితే యుద్ధంపై జోక్ చేయడం కత్తిమీద సాము. ఆ క్రమంలో గాయాలను మళ్లీ రేపకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు వీళ్లు. విచారంగా, విషాదంగా అనిపించే విషయాలను కామెడీ చేయరు.

సైన్యానికి సాయంగా..

ఉక్రెయిన్‌లో స్టాండప్ కామెడీకి మరో కోణమూ ఉంది. అది సైన్యానికి సాయం. యూరప్, ఉత్తర అమెరికా, ఆ్రస్టేలియాల్లోనూ వీళ్లు ప్రదర్శనలిస్తున్నారు. వచ్చిన డబ్బును సాయుధ దళాలకు సాయంగా ఇస్తున్నారు. ''యుద్ధ సమయంలో ప్రతిదీ సైన్యానికి ఆచరణాత్మకంగా ఉపయోగపడాలి. దూసుకొస్తున్న క్షిపణుల మధ్య కళ గురించి మాత్రమే మాట్లాడటం మతిలేనితనం. కానీ నాకు తెలిసిన ఏకైక మార్గం కామెడీ. ఆ షోల ద్వారా నిధులు సేకరిస్తున్నా. ఇప్పటిదాకా రకూ రూ.6 కోట్లకు పైగా విరాళాలిచ్చా''అని టైమోషెంకో చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఆంటోన్ టైమో షెంకో

కేజ్రీవాల్‌ను చంపేందుకు కుట్ర: ఆప్

పంజాబ్ పోలీసుల భద్రత ఉపసంహరణపై మండిపాటు

న్యూఢిల్లీ: తమ పార్టీ చీఫ్ కేజ్రీవాల్‌ను అంతం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు కుట్ర పన్నారని ఆప్ ఆరోపించింది. ఢిల్లీ పోలీసులపై తమకు నమ్మకం లేదని తెలిపింది. ఉపసంహరించుకున్న పంజాబ్ పోలీసుల భద్రతను తిరిగి పునరుద్ధరించాలని ఎన్నికల కమిషన్(ఈసీ)ని కోరింది. ఢిల్లీ సీఎం ఆతిశీ, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కేజ్రీవాల్‌పై ఇప్పటి వరకు జరిగిన దాడులు, ఆయన ప్రాణాలకు గల హానిని వివరిస్తూ ఈసీకి లేఖ రాశామన్నారు. కేజ్రీవాల్‌పై దాడులు జరిగిన విషయం తెలిసి కూడా హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు ఆయన భద్రతను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఢిల్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని, కేజ్రీవాల్‌కు రక్షణ లేకుండా చేయడానికే కుట్ర పన్నిందని ఆప్ నేతలు ఆరోపించారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ భద్రతకు తక్షణమే తగు ఏర్పాటు చేయాలని ఈసీని కోరామన్నారు. ఆయన ప్రాణాలకు హాని ఉందని, తీవ్రమైన బెదిరింపులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేజ్రీవాల్‌పై దాడులకు పాల్పడిన వ్యక్తులు బీజేపీకి చెందిన వారేనని తమ విచారణలో తేలిందని కూడా చెప్పారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగుందని ఆరోపించారు. ఇలా ఉండగా, ఢిల్లీ పోలీసులు, ఈసీ నుంచి అందిన సూచనల మేరకే కేజ్రీవాల్‌కు కల్పించిన భద్రతను ఉపసంహరించుకున్నట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. వ్యక్తిగత భద్రత కల్పించడంపైనా రాజకీయాలు చేస్తున్నారంటూ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. తనకు భద్రతగా వచ్చిన పంజాబ్ పోలీసులను వెనక్కి తీసుకోవడంపై ఆయనీ మేరకు స్పందించారు.

అధికారంలోకి వస్తే ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రత్యేక బడ్జెట్

ఢిల్లీలోని పూర్వాంచల్ ప్రజలకు కాంగ్రెస్ హామీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గణనీయ సంఖ్యలో ఉన్న పూర్వాంచల్ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పలు హామీలు ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే పూర్వాంచలీల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఎన్నికల్లో తమ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అఖిలేష్ ప్రసాద్ సింగ్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలోని అత్యాధునిక మౌలిక సదుపాయాలను ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం నాశనం చేసిందని, నగరాన్ని చెత్తకుండీల మార్చేసిందని ఆరోపించారు. ఆరోగ్య రంగంలో రూ.382 కోట్ల అవినీతికి పాల్పడిందని చెప్పారు. ఢిల్లీలో స్థిరపడిన పూర్వాంచల్ ప్రజల సాధికారతకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వలస వచ్చి స్థిరపడిన వారిని పూర్వాంచలీలు అంటారు. మొత్తం ఓటర్లలో వారి వాటా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంది. వివిధ నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను వారు ప్రభావితం చేయగలరు. అందుకే బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు పూర్వాంచలీలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

కులకర్ణి.. మాయీ మమతా నంద్ గిరి!

సన్యాసినిగా మారిన ఒకప్పటి సినిమా నటి



మహాకుంభ్ నగర్: ఒకప్పటి బాలీవుడ్ నటి మమతా కులకర్ణి(52) ప్రాపంచిక సుఖాలను త్యజించి, హిందూ సన్యాసినిగా మారారు. మహాకుంభ్ మేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌లో శుక్రవారం ఆమె కిన్నర్ అఖాడా సాక్షిగా సన్యాసినిగా మారారు. తన పేరును మాయీ మమతా నంద్ గిరిగా మార్చుకున్నారు. అఖాడా నిబంధనల ప్రకారం ఆమె గంగా నది ఒడ్డున స్వయంగా తన పిండ ప్రదానం చేసుకున్నారు. కిన్నర్ అఖాడా మహామండలేశ్వర్ కౌసల్యా నంద గిరి అలియాస్ టినా మా ఈ విషయం ప్రకటించారు. మహామండలేశ్వర్ లక్ష్మీ నారాయణ్ త్రిపాఠీ త్వరలోనే కులకర్ణికి సన్యాసిగా దీక్ష ఇస్తారన్నారు. ఆమె 12 ఏళ్ల అనంతరం మహామండలేశ్వర్ హోదా పొందుతారని చెప్పారు. అతిపెద్దదైన జునా అఖాడాలోని శాఖే కిన్నర్ అఖాడా. గడిచిన రెండేళ్లుగా జునా అఖాడాతో, రెండు మూడు నెలలుగా కిన్నర్ అఖాడాతో మమతా కులకర్ణి సంబంధాలు కొనసాగిస్తున్నారన్నారు. బాలీవుడ్‌లో కరణ్ అర్జున్, దిల్‌బర్, క్రాంతివీర్, కిస్మత్ వంటి సినిమాలతోపాటు పలు దక్షిణాది చిత్రాల్లోనూ నటించిన మమతా కులకర్ణి చాలా కాలంగా చిత్ర పరిశ్రమకు దూరంగా ఉంటున్నారు. తెలుగులో ప్రేమ శిఖరం, దొంగ పోలీస్ చిత్రాల్లో నటించారు.

హమాస్ చెర నుంచి మరో నలుగురికి నేడు స్వేచ్ఛ

టెల్ అవీవ్: ఇజ్రాయెల్‌తో కుదిరిన ఒప్పందంలో భాగంగా మరో నలుగురు బందీలను శనివారం హమాస్ విడుదల చేయనుంది. ఈ నలుగురి పేర్లను శుక్రవారం హమాస్ ప్రకటించింది. ఈ ప్రకటనపై ఇజ్రాయెల్ స్పందించాల్సి ఉంది. బదులుగా ఇజ్రాయెల్ తమ జైళ్లలో ఖైదీలుగా ఉన్న లేదా నిర్బంధంలో ఉన్న వందలాది పాలస్తీనియన్లను విడుదల చేయాల్సి ఉంటుంది. హమాస్ చెరలో కనీసం ఇంకా 90 మంది ఇజ్రాయెలీలు ఉండి ఉంటారనే అంచనాలున్నాయి. కాగా, ఇజ్రాయెల్– హమాస్ మధ్య కుదిరిన ఆరు వారాల కాల్పుల విరమణ ఒప్పందం శుక్రవారం ఆరో రోజుకు చేరుకుంది. ఆదివారం మొదటిసారిగా హమాస్ ముగ్గురు బందీలను విడుదల చేయగా, ఇజ్రాయెల్ 90 మందిని జైళ్ల నుంచి విడిచిపెట్టింది. ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతంపై 2023 అక్టోబర్ 7న జరిపిన మెరుపుదాడిలో హమాస్ 250 మందిని బందీలుగా పట్టుకెళ్లడం తెలిసిందే. వీరిలో సుమారు 100 మందిని అదే ఏడాది నవంబర్‌లో జరిగిన కాల్పుల విరమణ సందర్భంగా విడుదల చేసింది. మిగిలిన వారిలో కనీసం 40 మంది మృతదేహాలు లభ్యం కాగా, మరో 8మందిని ఇజ్రాయెల్ బలగాలు కాపాడాయి.

ఇజ్రాయెల్‌లో రాయబారిగా జేపీ సింగ్

న్యూ ఢిల్లీ: ఇజ్రాయెల్‌లో భారత రాయబారిగా ప్రముఖ దౌత్యవేత్త జితేంద్ర పాల్ సింగ్ శుక్రవారం నియమితులయ్యారు. పశ్చిమాసియాలో ప్రస్తుతమున్న పరిస్థితుల దృష్ట్యా ఈ నియామకానికి ప్రాధాన్యం ఏర్పడింది.2002 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్)అధికారి అయిన సింగ్ ప్రస్తుతం విదేశాంగ శాఖలోని పాకిస్తాన్-అఫ్గానిస్తాన్-ఇరాన్ విభాగంలో సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సింగ్ త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆసియాలో భారత్‌కు ఇజ్రాయెల్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది.



కేజ్రీవాల్

అమూల్యమైన మీ ఓటును రూ.1,100కు అమ్ముకోకండి!

ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: డబ్బు, బహుమతులకు ఆశపడి ఓటును అమ్ముకోవద్దని ఢిల్లీ ప్రజలకు ఆప్ చీఫ్ కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 5న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు గాను బీజేపీ బంగారు గొలుసులు, చీరలు, పాదరక్షలు, నగదును ఓటర్లకు పంచిపెడుతోందని ఆయన ఆరోపించారు. 'అది మీ డబ్బే. ఆ డబ్బును తీసుకోండి. కానీ, మీ ఓటు అమూల్యమైనది. దానిని రూ.1,100లకో, చీరలకో ఆశపడి అమ్ముకోవద్దు. ఇటువంటి తాయిలాల కంటే ప్రజాస్వామ్యం ఎంతో విలువైంది'అంటూ ఆయన శుక్రవారం విడుదల చేసిన వీడియో సందేశంలో ప్రజలను కోరారు. ప్రజలకు ఓటు హక్కును కల్పించేందుకు బీఆర్ అంబేడ్కర్ ఎంతో త్యాగం చేశారన్నారు. 'మన ఓట్లను కొంటున్నారంటే దానర్థం మన ప్రజాస్వామ్యం కథ ముగిసినట్లే. అప్పుడిక ధనవంతులు మాత్రమే పాలిస్తారు. డబ్బులు పంచిపెట్టే వారు తప్ప ఎవరికైనా మీరు ఓటేయండి'అని కేజ్రీవాల్ కోరారు.

కాస్త అమిత్ షాకు చెప్పండి: యోగికి కేజ్రీ సలహా

ఢిల్లీలో రౌడీ ముఠాలను కట్టడి చేసి, శాంతి భద్రతలను మెరుగుపర్చేలా హోం మంత్రి అమిత్‌షాకు తగు సూచనలు చేయాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కేజ్రీవాల్ కోరారు. దేశంలోకి అక్రమంగా చొరబడిన బంగ్లాదేశీలు, రోహింగ్యాలను ఢిల్లీలోని ఓఖ్లా తదితర ప్రాంతాల్లో తిష్ట వేసేందుకు ఆప్ ప్రభుత్వం సహకరిస్తోందంటూ సీఎం యోగి గురువారం చేసిన వ్యాఖ్యలపై మీడియా సమావేశంలో కేజ్రీవాల్ స్పందించారు. 'ఢిల్లీలో శాంతిభద్రతలు దిగజారాయంటూ సీఎం యోగి చాలా మంచి విషయం చెప్పారు. ఆయనతో ఏకీభవిస్తున్నా. ఢిల్లీలో 11 గ్యాంగ్‌స్టర్ ముఠాలు పని చేస్తున్నాయి. ఇవి ఢిల్లీని పంచుకుని అరాచకాలు సాగిస్తున్నాయి. వ్యాపారులను బెదిరించి వసూళ్ల దందా చేస్తున్నాయి. మహిళలు బయటకు రావడానికే భయపడుతున్నారు. చైన్ స్నాచింగ్, హత్యలు, మహిళలు, చిన్నారుల కిడ్నాప్‌లకు అంతే లేకుండా ఉంది. యావత్తూ ఢిల్లీలో అరాచక వాతావరణం నెలకొంది. ఇక్కడి శాంతి భద్రతలకు హోం మంత్రి అమిత్ షాయే బాధ్యుడు. యూపీలో శాంతిభద్రతలను గాడిన పెట్టినట్లు చెబుతున్న సీఎం యోగి, ఇక్కడి పరిస్థితిని కూడా చక్కదిద్దాలని అమిత్ షాను కోరాలి. ఆయనకు తగు సలహాలివ్వాలి'అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, పార్టీలను ముక్కలు చేయడం, రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడం వంటి పనుల్లో అమిత్ షా బిజీగా ఉన్నట్టున్నారంటూ చురకలు అంటించారు.

ద రూల్ ఆఫ్ అఖాడా..!

సొంత పోలీస్‌స్టేషన్, సొంత చట్టాలు	నాగ సాధువులే రక్షక భటులు	నిబంధనలు అతిక్రమిస్తే తగు శిక్షలు	తీవ్ర నేరాలైతే బహిష్కరణ వేటు	అంతర్గత వివాదాలపై కోర్టుకెక్కడం నిషేధం

సాక్షి, న్యూఢిల్లీ: జీవితం మీద అసంతృప్తితో ఈ భవ బంధాలన్నీ వదిలేసి సన్యాసం తీసుకుంటే బాగుంటుంది అని అంటూ ఉంటారు కొందరు. ఏదైనా అనుభవిస్తే కానీ అసలు విషయం తెలియదంటారు మన పెద్దలు. అవును..లోతుగా పరిశీలిస్తే సన్యాసం కూడా అంత సులువైంది కాదని అర్థమవుతుంది. అక్కడా నియమాలు పాటించాలి. సన్యాస అఖాడా (ఆశ్రమం)ల్లోనూ సొంత చట్టాలు ఉంటాయి. వాటిని అమలు చేసేందుకు వారికి ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్లు (కొత్వాలీలు) ఉంటాయి. సభ్యులు ఎవరైనా రూల్స్ అతిక్రమిస్తే కొన్నిసార్లు వింత శిక్షలు, నేరాలు చేస్తే కఠిన శిక్షలు, తీవ్ర నేరాలకు పాల్పడితే అఖాడా నుంచి బహిష్కరణ వేటు తప్పదు. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ప్రస్తుతం మహాకుంభమేళా సమయంలో పుణ్యస్నానాలకు వచ్చిన నాగా సాధువుల జీవన శైలి గురించిన కొన్ని ఆసక్తికర విషయాలు చూద్దాం...

దేశంలో 13 అఖాడాలు

అఖాడా అనేది సంస్కృత పదం. కుస్తీ బరి లేదా చర్చ వేదిక అని అర్థం. సన్యాస దీక్ష తీసుకున్న వారు, సాధువులు, నాగ సాధువులు, సంతులకు ఆశ్రయం ఇస్తాయి. వీటి కేంద్రంగానే వారు సంప్రదాయాలకు అనుగుణంగా దైవాన్ని ఆరాధిస్తారు. 2019 నాటికి దేశ వ్యాప్తంగా మొత్తం 13 అఖాడాలున్నాయి. వీటిలో ఏడింటిని ఆది శంకరాచార్య స్థాపించారు. 13 అఖాడాల్లో ఏడు శైవ అఖాడాలు. ఇక్కడ శివుడిని ఆరాధిస్తారు. మూడు వైష్ణవ అఖాడాలు. వీటినే బైరాగి అఖాడాలనీ అంటారు. వీరు విష్ణుమూర్తిని కొలుస్తారు. మిగతా మూడు ఉదాసిన్ అఖాడాలు. వీరు గురునానక్ పెద్ద కుమారుడు శ్రీచంద్ బోధనలను అనుసరిస్తారు. అలాగే ట్రాన్స్‌జెండర్లకూ ప్రత్యేకంగా కిన్నెర అఖాడా ఉంది. ఆది శంకరాచార్య స్థాపించిన జూనా అఖాడా అతి పెద్దది. కిన్నెర అఖాడా దీని పరిధిలోనే ఉంటుంది.

కొత్వాల్‌దే బాధ్యత

దశానమి సంప్రదాయాన్ని పాటించే అన్ని శైవ అఖాడాలకు సొంత చట్టాలు ఉంటాయి. ప్రత్యేకంగా ఒక్కో అఖాడాకు ఒక పోలీస్‌స్టేషన్ (కొత్వాలీ) ఉంటుంది. అఖాడా నియమ నిబంధనలు అమలు చేయడానికి ప్రత్యేకంగా ఒకరికి కొత్వాల్‌గా బాధ్యతలు అప్పగిస్తారు. అలాగే అంతర్గత భద్రత బాధ్యత కూడా వీరిదే. ఆయన అఖాడాలోని నాగ సాధువులను, ఇతర సాధువులను నియంత్రిస్తాడు. అఖాడా సభ్యుడు ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే శిక్ష తప్పదు. అఖాడాల్లో ఏదైనా అంతర్గత వివాదం తలెత్తిదే దానిపై కోర్టును ఆశ్రయించేందుకు అఖాడాలు అనుమతించవు. అంతా కలిసి సమావేశమై వివాదాన్ని పరిష్కరించుకుంటారు. అఖాడా భద్రత కోసం వేర్వేరు రక్షక భటులు ఉంటారు. నాగ సన్యాసులు మాత్రమే కొత్వాల్ పదవికి అర్హులు.

శిక్షించే అధికారం అతడిదే

అఖాడాలో రూల్స్ అమలు పరిచేందుకు నియమించిన కొత్వాల్‌కు మాత్రమే శిక్షలు కూడా అమలు చేసే బాధ్యత ఉంటుంది. ఆయనకు వెండి పూత కలిగిన ఒక దండాన్ని ఇస్తారు. నిబంధనలు అతిక్రమించిన వారిని కొత్వాల్ వద్దకు తీసుకువస్తారు. విచారణ తర్వాత చిన్న తప్పుకు చిన్న శిక్షలే ఉంటాయి. చేసిన తప్పులు గ్రహించే విధంగా కూడా శిక్షలు విధిస్తారు. కొత్వాల్ సమక్షంలో గంగానదిలో 108 మునకలు వేయడం. అఖాడాలోని ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి వారికి పళ్లు తోముకునేందుకు పళ్లపొడి లేదా పళ్లపుల్ల ఇవ్వడం. ఒక వారం పాటు అఖాడాలో శుచీ శుభ్రత బాధ్యతలు చూసుకోవడం, అఖాడా గురువు వినియోగించే పాత్రలను శుభ్రం చేయడం వంటి శిక్షలు విధిస్తారు. ఆరోపణలు తీవ్రంగా ఉంటే కఠిన శిక్షలు ఉంటాయి. వివాహం, అత్యాచారం, ఆర్థిక నేరం వంటి ఆరోపణలు నిరూపణ అయితే అఖాడా నుంచి బహిష్కరిస్తారు. ఈ శిక్షల్లో ఎక్కువగా జరిమానాలను విధించడం వంటివి ఉండవు. అఖాడాలోని పరిస్థితులను బట్టి కొత్వాల్‌ను కూడా మారుస్తారు.

దీక్షకు ముందే పిండ ప్రదానం

హిందూ మతంలో ఒక వ్యక్తి మరణానంతరం మాత్రమే పిండ ప్రదానం చేస్తారు. కానీ అఖాడాలో సన్యాస దీక్ష తీసుకోవాలంటే ముందుగా తనకు తానే పిండ ప్రదానం చేసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే తన పూర్వీకుల రుణం నుంచి విముక్తి పొందడానికి ఈ విధి తప్పనిసరి. అలాగే ఈ ప్రక్రియతో అతని సామాజిక బాధ్యతలన్నిటితో బంధాలు తెగిపోయినట్లే. దీక్ష తీసుకున్న తర్వాత ఏ వ్యక్తి అయినా సామాజిక జీవితంలోకి తిరిగి రాలేడు.

జైలు నుంచే 'పతంగి' ఆట!

- ఢిల్లీలో ఎంఐఎం ఇద్దరు అభ్యర్థులు జైల్లోనే
- వారి తరఫున విస్తృత ప్రచారం చేస్తున్న అధినేత అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోనూ తన అస్తిత్వాన్ని బలంగా చాటుకోవాలని కృతనిశ్చయంతో ఉన్న ఎంఐఎం పార్టీ ముస్లిం ఓటు బ్యాంకు బలంగా ఉన్న రెండు స్థానాల్లో తన పార్టీ చిహ్నమైన పతంగిని ఎగురవేసేందుకు తీవ్ర కసరత్తులే చేస్తోంది. ఆ పార్టీ పోటీ చేస్తున్న ఓఖ్లా, ముస్తఫాబాద్ నియోజకవర్గాల్లో పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులూ ఢిల్లీ అల్లర్ల కేసులో జైలు నుంచే తమమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా, వారి తరఫున అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నీ తానే ప్రచార బాధ్యతలు మోస్తున్నారు. జైలు నుంచే పార్టీ అభ్యర్థులు తమ వ్యూహాలను అమలు చేస్తుంటే, ప్రచార క్షేత్రంలో ఒవైసీ తన పదునైన మాటలతో ప్రచారం చేస్తున్నారు.

గెలుస్తారా..చీలుస్తారా?

ఓఖ్లా అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తంగా 3.35 లక్షల మంది ఓటర్లుండగా, ఇందులో 1.78 లక్షలు (52.5)శాతం మంది ముస్లింలే ఉన్నారు. ఇక ముస్తఫాబాద్ నియోజకవర్గంలోనూ 2.63 లక్షల ఓటర్లలో 1.03 లక్షలు (40శాతం) ముస్లిం ఓటర్లు. ఈ గణాంకాలను దృష్టిలో పెట్టుకునే ఎంఐఎం ఈ రెండు స్థానాల్లో పోటీకి దిగింది. రెండు నియోజకవర్గాలోనూ 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో ముద్దాయిలుగా ఉన్న అభ్యర్థులను రంగంలోకి దించింది. ఓఖ్లా నుంచి ఆప్ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌ను పోటీలో పెట్టగా, ముస్తఫాబాద్ నుంచి షిఫా ఉర్ రెహ్మాన్ పోటీలో ఉన్నారు. వీరిద్దరు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కి వ్యతిరేకంగా జరిగిన నిరసనల ద్వారా హింసను ప్రేరేపించిన ఆరోపణలతో జైళ్లో ఉన్నారు. కోర్టు నుంచి పెరోల్‌లో బయటకు వచ్చిన ఇద్దరు, నామినేషన్ల అనంతరం తిరిగి జైలుకు వెళ్లారు. అక్కడి నుంచే తమ అనుచరల ద్వారా ప్రచార వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఓఖ్లాలో 2015, 2020 ఎన్నికల్లో ఆప్‌కు చెందిన అమానతుల్లా ఖాన్ 50 వేలకు పైగా భారీ ఆధిక్యంతో గెలుపొందుతూ వస్తున్నారు. అయితే ఇటీవల మనీలాండరింగ్ ఆరోపణలతో ఈడీ అరెస్ట్‌ను ఎదుర్కొని బయటకు వచ్చి తిరిగి పోటీలో ఉన్నారు. ఆయన్ను తట్టుకోవడం ఎంఐఎంకు అంత సులువు కాకున్నా, ఆప్ ఓట్లను చీల్చడంలో ఎంఐఎం కీలకపాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. గడిచిన రెండ్రోజులుగా పార్టీ అధినేత ఒవైసీ ఇక్కడ పర్యటిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇక ముస్తఫాబాద్‌లో సైతం 2015లో బీజేపీ, 2020లో ఆప్ విజయపతాకం ఎగురవేసింది. గత ఎన్నికల్లో ఆప్ తరఫున హాజీ హుస్సేన్ 53 శాతం ఓట్లతో విజయం సాధించారు. ఇక్కడ ఎంఐఎం తరఫున పోటీ చేస్తున్న షిఫా ఉర్ రెహ్మాన్‌కు స్థానికంగా గట్టి పట్టుంది. ఒకవేళ ఆయన 5–8 శాతం ఓట్లను ప్రభావితం చేసినా బీజేపీ గెలుపు అవకాశాలు మెరుగుపడే అవకాశముంది. ఈ స్థానంలో ఓట్ల చీలిక జరిగితే బీజేపీ తిరిగి గెలిచే అవకాశాలున్నాయి. ఇక రెండు స్థానాల్లో ప్రచారం చేస్తున్న ఓవైసీ సైతం ప్రధానంగా ఆప్ అధినేత కేజ్రీవాల్ లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తున్నారు. 'గత ఐదేళ్లుగా తాహిర్ హుస్సేన్, షిఫా ఉర్ రెహ్మాన్ జైలు లోపలే ఉండగా, లిక్కర్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కి ఎలా బెయిల్ వచ్చింది?, మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్‌తో సహా ఆప్ నాయకులందరూ బెయిల్ పొందారు, ఈ ఇద్దరు ఇంకా లోపలే ఎందుకు ఉన్నారు'అని ఓవైసీ ప్రశ్నిస్తున్నారు. లిక్కర్ పాలసీలో అరెస్టయి బెయిల్‌పై బయటికొచ్చిన కేజ్రీవాల్ గెలువగలిగితే, తమ ఇద్దరు అభ్యర్థులు ఎందుకు గెలవరని అడుగుతున్నారు.

సాక్షి ప్లస్
శనివారం। 25-1-2025

ఆర్య సమాజ స్థాపకులు ఎవరు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మత, సాంఘిక సంస్కరణ ఉద్యమాలు

పాశ్చాత్య దేశాల్లో మేధాసంపత్తి, వ్యక్తి వాదం ఆధిక్యంలో ఉన్నప్పుడు భారతీయులకు పశ్చిమ దేశాలతో సాన్నిహిత్యం ఏర్పడింది. తొలి దశలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన భారతీయులు విదేశీ సంస్కృతిపై వ్యామోహంతో వారి వేషధారణ, అలవాట్లు, మత భావాల పట్ల ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలోనే 19వ శతాబ్దంలో భారతీయుల్లో జాతీయ భావం అంకురించింది. రాజా రామ్మోహన్‌రాయ్ తదితరులు మత, సాంఘిక సంస్కరణోద్యమాలు సాగించారు. ఫలితంగా హిందూ సమాజంలో సంస్కరణలొచ్చాయి. ఈ సంస్కర్తల ప్రభావం జాతీయోద్యమంపై ప్రసరించింది.

రాజా రామ్మోహన్‌రాయ్

హిందూ మత సాంస్కృతిక పునరుజ్జీవనానికి రాజా రామ్మోహన్‌రాయ్ (1772–1833) నాంది పలికాడు. ఈయన బెంగాల్‌లోని రాధానగరంలో ఉన్నత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఇతడి తండ్రి రమాకాంత్ రాయ్ జమీందారు. రాయ్ చిన్నతనంలోనే బెంగాలీ, అరబిక్, పర్షియన్, సంస్కృత భాషలను నేర్చుకున్నాడు. తర్వాత ఇంగ్లిష్, ఫ్రెంచ్, లాటిన్, గ్రీకు, హిబ్రూ భాషలపై పట్టు సాధించాడు. హిందూ, ముస్లిం, క్రైస్తవ గ్రంథాలను కూలంకషంగా చదివాడు. రాయ్ 1805లో ఈస్టిండియా కంపెనీలో చేరి తొమ్మిదేళ్లు ఉద్యోగం చేశాడు. కానీ ఉద్యోగంలో సంతృప్తి కలగలేదు. సనాతన హిందూ ఆచారాల్లోని దోషాలు నశించి, సమాజం అభివృద్ధి చెందాలంటే ఆంగ్ల విద్య నేర్చుకోవాలని, తద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడం సాధ్యమవుతుందని భావించాడు.

బ్రహ్మ సమాజ స్థాపన (1828)

రాయ్ 1828లో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. దేవుడొక్కడేనని, ఉపనిషత్తుల్లో పేర్కొన్న మార్గమే మోక్షసాధన అని బోధించాడు. విగ్రహారాధను నిరసించాడు. సర్వమానవ సమానత్వాన్ని బోధించాడు. పరమత సహనం చూపాలని, మానవ కోటిని ఉద్ధరించాలని ప్రబోధించాడు. ఈ మతం హిందూ మతాన్ని వదల్లేకపోయినా పాశ్చాత్య ఉదార వైఖరి అవలంబించిందని మెకనాల్ట్ విశ్లేషించాడు.

సాంఘిక దురాచారాలపై..

మత బోధనలే కాకుండా హిందూ మతంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి రాయ్ నడుం బిగించాడు. 1811లో తన సోదరుడు జగన్ మోహన్ రాయ్ మరణించినప్పుడు ఆయన భార్యను కూడా చితిపై ఉంచి దహనం చేయడం చూసి రాయ్ హృదయం ద్రవించింది. సతీసహగమనం, బాల్యవివాహాలను నిర్మూలించాలని భావించాడు. ఉపన్యాసాలు, పత్రికల ద్వారా తన భావాలను ప్రచారం చేశాడు. విలియం బెంటింగ్ 1829లో సతీసహగమన నిషేధ చట్టాన్ని రూపొందించడంలో రాజా రామ్మోహన్‌రాయ్ కృషి దాగి ఉంది. బాల్యవివాహాలను రద్దు చేయడానికి, కుల వ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ జనోద్ధరణకు నిర్విరామ కృషి చేశాడు.

విద్యాసేవ

ఆంగ్ల విద్యను అభ్యసించనిదే దేశం బాగుపడదని భావించిన రాయ్ ఆంగ్ల విద్యను ప్రోత్సహించాడు. 1830లో అలెగ్జాండర్ డఫ్ ఆంగ్ల పాఠశాలను నెలకొల్పినప్పుడు, మెకాలే ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టినప్పుడు సమర్థించాడు. తన భావాలను ప్రచారం చేయడానికి సంబంధకౌముది అనే బెంగాలీ వార పత్రికను, మీరట్- ఉల్- అక్బర్ అనే పారశీక పత్రికను నడిపాడు. పత్రికా స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డాడు. విలియం బెంటింగ్ రాయ్ ఘనతను గుర్తించి 'రాజా' బిరుదుతో సత్కరించి ఇంగ్లండ్‌కు పంపాడు. 1833లో బ్రిస్టల్ నగరంలో రాయ్ మరణించాడు. అతడి మరణానంతరం దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవచంద్రసేన్ బ్రహ్మ సమాజ ఆశయాలను కొనసాగించారు.

స్వామి దయానంద సరస్వతి

ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి (1824–1883). ఈయన గుజరాత్‌లోని మోర్వి గ్రామంలో జన్మించాడు. ఇతణ్ని హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి మూల పురుషుడిగా పేర్కొంటారు. దయానంద సరస్వతి అసలు పేరు మూల్‌శంకర్ తివారి. ఇతడికి చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఇది వయస్సుతో పాటు పెరగడంతో వివాహాన్ని తిరస్కరించి ఇల్లు వదిలివెళ్లాడు. అనేక పుణ్యక్షేత్రాలు, పుణ్య పురుషులను దర్శించి సన్యాసాశ్రమం స్వీకరించాడు. చివరకు మధురలో విరజానందుడనే గురువు వద్ద వేదాలు అభ్యసించాడు. సత్యార్థ ప్రకాశ్ అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో తన భావాలను ప్రకటించాడు. అవి..

1) దేవుడొక్కడే 2) విగ్రహారాధన పనికిరాదు 3) వేదాలు విజ్ఞాన గనులు. వేదోక్తమయిన హిందూమతం అన్నిటికన్నా మిన్న 4) మోక్షానికి సత్ప్రవర్తన అవసరం 5) జాతి ఐక్యతకు ఏకమతం ఉండాలని భావించాడు. వేరే మతాల్లో చేరిన హిందువులను తిరిగి సొంత మతంలోకి మార్చడానికి శుద్ధి అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ సిద్ధాంతాలే ఆర్య సమాజానికి మూల సూత్రాలయ్యాయి. తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. కులభేదం, అంటరానితనం, బాల్య వివాహాలను ఖండించి స్త్రీ జనోద్ధరణ, వెనుకబడిన జాతుల అభివృద్ధి కోసం కృషి చేశాడు. 1883లో ఆయన మరణించాక స్వామి శ్రద్ధానందుడు, లాలా లజపతిరాయ్, లాలా హంసరాజ్ మొదలైనవారు ఆర్యసమాజాన్ని ప్రచారం చేశారు.

రామకృష్ణ పరమహంస

భారతీయ ఆధ్యాత్మిక తత్వానికి మారో రూపం రామకృష్ణ పరమహంస. ఈయన అసలు పేరు గధాధర్ చటోపధ్యాయ్. 1833లో బెంగాల్‌లోని కామర్పుకూర్ గ్రామంలో జన్మించాడు. ఈయన గొప్ప భక్తుడు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. కలకత్తాలోని దక్షిణేశ్వర్‌లో ఇతడి సోదరుడు రామ్ కుమార్ ఛటర్జీ అర్చకుడిగా పనిచేసేవాడు. దీంతో రామకృష్ణుడు కూడా దక్షిణేశ్వర్‌లో నివసించేవాడు. కొద్ది కాలానికి రామకృష్ణ పరమహంస అక్కడి కాళీమాత ఆలయానికి అర్చకుడయ్యాడు. ఆమెను ధ్యానం చేస్తూ ధ్యాన సమాధిలో మునిగిపోయేవాడు. 'తోతాపురి' అనే యోగి ఆయన సమాధి స్థితిని సరి చేయడంతో రామకృష్ణుడు పరిపూర్ణుడయ్యాడు. తర్వాత..

1) దేవుడొక్కడే, అతడు సర్వాంతర్యామి 2) భగవంతుణ్ని తెలుసుకోవడమే జ్ఞానం 3) అన్ని మతాలు భగవంతుణ్ని చేరే మార్గాలను చూపుతాయి 4) మోక్ష సాధనకు కోర్కెలను విసర్జించాలి 5) మానవ సేవే మాధవసేవ అని బోధించాడు. తన బోధనలను వ్యాప్తం చేసే బాధ్యతను ప్రియ శిష్యుడైన స్వామి వివేకానందుడికి అప్పగించి 1886లో పరమపదించాడు.

ప్రభావం: భారతదేశ సంస్కృతిపై రామకృష్ణ పరమహంస ప్రభావం పరోక్షంగా ఉంది. ఆయన వివేకానందుణ్ని తీర్చిదిద్దాడు. వివేకానందుడు ప్రపంచానికి భారతదేశ గొప్పతనాన్ని చాటాడు. అతడి వల్ల ప్రపంచం భారతదేశ ఔన్నత్యాన్ని గ్రహించింది.

స్వామి వివేకానంద (1863-1902)

19వ శతాబ్దం నాటి సంస్కర్తలందరూ దేశంలో హిందూ మత సంస్కరణకు పూనుకున్నారు. అయితే స్వామి వివేకానంద హిందూ మత ఔన్నత్యాన్ని, భారతీయ మత శాస్త్ర లోతులను ప్రపంచానికి చాటాడు. వివేకానందుడి అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా. ఇతడు 1863లో కలకత్తాలో జన్మించాడు. మొదట బ్రహ్మసమాజం పట్ల ఇతడికి అభిమానం ఏర్పడింది. కానీ కుటుంబంలో వచ్చిన కొన్ని కల్లోలాల కారణంగా భగవంతుడిపై నమ్మకం పోయింది. ఆ సందర్భంలో రామకృష్ణ పరమహంస గురించి తెలుసుకున్నాడు. ఆయనను చూడటానికి వచ్చి 'నీవు భగవంతుణ్ని చూశావా? నాకు చూపిస్తావా? అని ప్రశ్నించాడు. రామకృష్ణుడు చూపిస్తానని తన బొటన వేలితో వివేకానందుణ్ని తాకాడు. దీంతో వివేకానందుడు అనిర్వచనీయమైన అనుభూతి పొందాడు. తర్వాత నాస్తిక భావాన్ని వదిలి రామకృష్ణుడికి శిష్యుడయ్యాడు. సన్యాసిగా, గొప్ప వేదాంతిగా మారాడు. వివేకానందుడు గొప్ప వక్త, మధుర గాయకుడు. రామకృష్ణుడి భావాలను ప్రచారం చేసేందుకు అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల సదస్సుకు హాజరయ్యాడు. తన ఉపన్యాసంతో కొద్ది నిమిషాల్లోనే సభికులను ఆకట్టుకున్నాడు. సభికుల కోరికపై ఉపన్యాసాన్ని కొనసాగించి అద్వైత సిద్ధాంతాన్ని 5 గంటల పాటు వివరించాడు. భారతీయ ఆధ్యాత్మిక తత్వబోధనలను వారికి తెలియజేశాడు. రామకృష్ణుడి బోధనలు ప్రచారం చేయడానికి కలకత్తాలోని బేలూరు వద్ద మఠం నిర్మించాడు. అందులో రామకృష్ణుడి విగ్రహం ప్రతిష్ఠించి 'రామకృష్ణ' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. నేటికీ రామకృష్ణుడి బోధనలను ప్రచారం చేస్తూ సంఘ సేవలో పాలుపంచుకుంటోంది. నిర్వీర్యమవుతున్న భారత జాతిని మేల్కొలుపుతూ వివేకానందుడు అనేక బోధనలు చేశాడు.

వివేకానందుడు ప్రచారం చేసిన సిద్ధాంతాలు

1) సర్వమతాల వేదాంతానికి మూలం హిందూ మతం.
2) హిందూ మతంలో జీవముంది. దాన్ని పునరుద్ధరించడమే మన కర్తవ్యం.
3) పాశ్చాత్యులను అనుసరించడం నాగరికత కాదు. అది దుర్బలుల లక్షణం. నీ సంస్కృతి గొప్పది. దానికి దూరం కావొద్దు.
4) నువ్వు నీ దేశానికి దూరం కావొద్దు.
5) మానవ సేవే మాధవసేవ. కాబట్టి సాటి మనుషులకు సేవ చేయి.
6) భారతదేశం నశిస్తే ప్రపంచంలో ఆధ్యాత్మిక తత్వం నశిస్తుంది.

ఇంకా దేశభక్తికి దృఢ దీక్ష అవసరమని బోధించాడు. ఆకలితో అల్లాడే సాటి భారతీయులను ఆదుకోండని దేశ ప్రజలను కోరాడు. ఇలా అభ్యర్థిస్తూ మైసూరు మహారాజుకు ఒక ఉత్తరం రాశాడు. హిందూ సంస్కృతి వ్యాప్తికి అహోరాత్రాలు కృషి చేసి 1902లో తన 39వ ఏట మరణించాడు.

దివ్యజ్ఞాన సమాజం - అనిబిసెంట్

మేడమ్ బ్లావట్‌స్కీ, కల్నల్ ఆల్‌కాట్ 1875లో అమెరికాలో థియోసోఫికల్ సొసైటీని స్థాపించారు. ఐర్లాండ్‌కు చెందిన అనిబిసెంట్ ఈ సొసైటీ శాఖను 1893లో మన దేశంలో ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనిబిసెంట్ హిందూ మత గ్రంథాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, హిందూ మత గొప్పదనాన్ని తెలుసుకున్నారు. హిందూ సంస్కృతిని కాపాడి ఆ మతాన్ని పునరుద్ధరించాలని నిశ్చయించుకున్నారు. దివ్యజ్ఞాన సమాజం సర్వసమాన సౌభ్రాతృత్వం, పరమత సహనం, సర్వమత సమానత్వాలను ప్రచారం చేసింది. కులవ్యవస్థను ఖండించి సంఘంలోని వెనుకబడిన జాతుల సంక్షేమానికి పాటు పడింది. భారతీయులకు విద్యాబుద్ధులు నేర్పడానికి అనిబిసెంట్ కాశీలో హిందూ కళాశాలను స్థాపించారు. కొద్ది కాలం తర్వాత మదన్‌మోహన్ మాలవ్య ఈ కళాశాలను హిందూ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేశారు.

హోమ్ రూల్ లీగ్

అనిబిసెంట్ సంఘ సేవ చేయడమే కాకుండా భారత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1916 సెప్టెంబర్‌లో మద్రాసులో 'హోమ్‌రూల్ లీగ్' ప్రారంభించారు. 27,000 మందితో దేశమంతా దీని శాఖలు ఏర్పడ్డాయి. వారి సహాయంతో ఆమె దేశమంతా హోమ్‌రూల్ ఉద్యమాన్ని నడిపారు. చాలా పట్టణాల్లో బహిరంగ సభల్లో ఉపన్యాసాలు ఇచ్చి దేశభక్తిని ప్రబోధించారు. ఆమె కృషి వల్ల దేశమంతటా జాతీయభావం బలపడింది. ఆమె విదేశీ వనిత అయినా భారతదేశాన్ని మాతృభూమిగా భావించి గొప్ప సేవ చేశారు. 1917లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను జైల్లో నిర్బంధించింది. అనిబిసెంట్ గొప్ప పండితురాలు. ఆమె తొలి పేరు మిస్ ఉడ్. ఐర్లాండ్‌లో చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలిగా భారత్‌కు వచ్చారు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్

రాజా రామ్మోహన్‌రాయ్ తర్వాత హిందూ సమాజానికి అంతటి సేవ చేసిన మహనీయుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ఇతడి అసలు పేరు ఈశ్వర చంద్రుడు. హిందూ శాస్త్రాల్లో విద్యాసాగర్ అనే పట్టాను పొందడంతో విద్యాసాగర్ అని పేరుతో కలిసిపోయింది. ఈయన 1820లో బెంగాల్‌లో వీరశింఘ అనే గ్రామంలో జన్మించాడు. ధర్మ, వేదాంత, జ్యోతిష శాస్త్రాల్లో గొప్ప పండితుడు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విద్యాశాఖాధికారి అయ్యాడు. కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశాడు. విద్యావ్యాప్తి కోసం విశేష కృషి చేశాడు. విద్యాశాఖాధికారిగా ఉన్న కాలంలో 40 పాఠశాలలను, కలకత్తాలో మెట్రోపాలిటన్ కాలేజీని స్థాపించాడు. స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈయన కృషి వల్ల చాలామంది బెంగాలీ స్త్రీలు విద్యావంతులయ్యారు. సత్పురుషుల చరిత్ర, బెంగాల్ చరిత్ర, సీతావనవాసం అనే గ్రంథాలను రచించాడు. సులభంగా సంస్కృతం నేర్చుకోవడానికి వీలుగా అనేక సంస్కృత పుస్తకాలు రాశాడు.

సంఘ సంస్కరణలు

రాజా రామ్మోహన్‌రాయ్‌లా ఈశ్వరచంద్రుడు స్త్రీ జనోద్ధరణకు విశేష కృషి చేశాడు. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, వరకట్న దురాచారాలను ఖండించాడు. వితంతు వివాహాలను చట్టబద్ధం చేయాలని ప్రచారం చేసి వితంతు వివేకం అనే గ్రంథాన్ని రాశాడు. తన కుమారుడికి వితంతువును ఇచ్చి వివాహం చేసి ఆదర్శప్రాయుడయ్యాడు. ఈయన కృషి వల్ల 1856లో డల్హౌసీ వితంతు పునర్వివాహ చట్టం చేశాడు. తన సంపాదనంతా సంఘ సంస్కరణలకు ఖర్చు చేశాడు. ఈశ్వరచంద్రుడు 1891లో మరణించాడు.

ద్వీపకల్ప భారతదేశంలో ఎత్తయిన పర్వత శిఖరం?

ద్వీపకల్ప ప్రాంతం.. భారతదేశ నైసర్గిక విభాగాల్లో అతి పెద్దది. పశ్చిమాన సహ్యాద్రి కొండలు, తూర్పున తూర్పు కనుమలు, ఉత్తరాన గంగా మైదానం, సరిహద్దులుగా ఉన్న ద్వీకల్ప ప్రాంతం.. దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించి ఉంది. ఇది వివిధ పీఠభూములు, కొండలు, నదీలోయలతో కూడి ఉంది. ద్వీపకల్ప భారతదేశ ఉత్తర భాగాన్ని మధ్యమెట్టభూములుగా, దక్షిణ భాగాన్ని దక్కన్ పీఠభూమిగా వ్యవహరిస్తారు. మధ్య మెట్టభూముల ప్రాంతం.. మాళ్వా, బుందేల్‌ఖండ్, బాగేల్‌ఖండ్, ఛోటా నాగ్‌పూర్, మైకాల పీఠభూములు, వింధ్య, సాత్పూరా, అజంతా, బాలాఘాట్, చందేరి, క్రైమూరు, ఆరావళి మొదలైన కొండలతో కూడి ఉంది!!



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం

ద్వీపకల్ప భారతదేశం - నైసర్గిక స్వరూపం

దక్కన్ పీఠభూమి

మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ల్లో దక్కన్ పీఠభూమి విస్తరించి ఉంది. దక్కన్ పీఠభూమిలో బసాల్ట్ రకానికి చెందిన లావాతో ఉన్న ప్రాంతాన్ని దక్కన్ నాపలు అంటారు. పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణాల్లో దక్కన్ నాపలు విస్తరించి ఉన్నాయి. బసాల్టిక్ లావా ఘనీభవించి ఏర్పడ్డ అగ్నిపర్వత శిలలు శిథిలమవడంతో దక్కన్ నాపల ప్రాంతంలో నల్లరేగడి నేలలు ఏర్పడ్డాయి.

ఆరావళి పర్వత శ్రేణులు

ఇవి ద్వీపకల్ప పీఠభూమికి వాయవ్య సరిహద్దులో నైరుతి-ఈశాన్య దిశలో విస్తరించాయి. ఈ శ్రేణులు గుజరాత్‌లోని పాలంపూర్ నుంచి ఢిల్లీ వరకు వ్యాపించి ఉన్నాయి. ఆరావళి పర్వతాలు పురాతన ముడుత పర్వతాల కోవకు చెందుతాయి. ఇవి ప్రీ కాంబ్రియన్ భౌమ్యయుగంలో ఏర్పడ్డాయి. ఆ కాలంలో ఇవి ప్రస్తుత హిమాలయాల కంటే విశిష్టంగా ఉండేవని నిపుణుల అంచనా. తర్వాత ఇవి శిథిలమై.. ప్రస్తుతం అవశిష్ట పర్వతాలకు ఉదాహరణగా మిగిలాయి. వింధ్య-సాత్పూరా పర్వతశ్రేణుల మధ్య ఉన్న విదరణ లోయ (Rift valley) ద్వారా నర్మదా నది ప్రవహిస్తోంది. వింధ్య-సాత్పూరా పర్వతశ్రేణులు భ్రంశ/ఖండ పర్వతాలకు మంచి ఉదాహరణలు. వింధ్య పర్వతశ్రేణులను ఆనుకొని ఉన్న మాళ్వా పీఠభూమి గిరిపద పీఠభూములకు మంచి ఉదాహరణ. మైకాల పీఠభూమిలోని అమర్‌ఖంటక్ శిఖర ప్రాంతం నుంచి నర్మదా నది ప్రవహిస్తోంది. పశ్చిమ తీరంలోని పశ్చిమ కనుమలు(సహ్యాద్రి కొండలు) మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళల్లో విస్తరించి ఉన్నాయి. కేరళలోని పాల్‌ఘాట్ కనుమను మినహాయిస్తే ఇవి దాదాపు అవిచ్ఛిన్నంగా విస్తరించి ఉన్నాయి.

పశ్చిమ కనుమలు

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అన్నామలై, పళని, ఏలకుల కొండల రూపంలో పశ్చిమ కనుమలు వ్యాపించి ఉన్నాయి. పాల్‌ఘాట్ కనుమ వద్ద నీలగిరి కొండలు, పశ్చిమ-తూర్పు కనుమలను అనుసంధానిస్తున్నట్లుగా కనిపిస్తాయి. ఇవి శంఖు ఆకార శిఖరాలను పోలి ఉంటాయి. ఇవి పశ్చిమాన అరేబియా సముద్రం వైపు నిట్రవాలుగా ఉంటాయి. దక్కన్ పీఠభూమి వైపు మెట్లలా తిన్నని వాలులను కలిగి ఉంటాయి. వీటిని 'ట్రిపియన్ నైసర్గిక స్వరూపం'గా అభివర్ణిస్తారు.

తూర్పు కనుమలు

మహారాష్ట్రలోని సహ్యాద్రి కొండల్లో ఉన్న సన్నని థాల్‌ఘాట్, భోర్‌ఘాట్ కనుమల ద్వారా ముంబై-పుణే, ముంబై-ఇండోర్ రైలు, రహదారి మార్గాలు నిర్మించారు. పశ్చిమ కనుమలతో పోలిస్తే తూర్పు కనుమల సగటు ఎత్తు తక్కువ. తూర్పు కనుమలు కూర్చొని ఉన్న ఏనుగుల ఆకారంలో కనిపిస్తాయి. విస్తారమైన వికోషీకరణం వల్ల వీటి శిఖర భాగాలు బోర్లించిన మూకుళ్ల మాదిరిగా ఉంటాయి. తూర్పు కనుమలు మహానది-కృష్ణానది డెల్టాల మధ్య మాత్రమే అవిచ్ఛిన్న పర్వత శ్రేణిగా వ్యాపించాయి. ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతంలో సుమారు 150 కిలోమీటర్ల మేర దాదాపు అదృశ్యమవుతాయి. కృష్ణానది డెల్టాకు దక్షిణంగా నల్లమలై, ఎర్రమలై, వెలికొండ పర్వతాలుగా తూర్పు కనుమలు విస్తరించాయి.

నీలగిరి కొండలకు దక్షిణంగా దక్షిణ తమిళనాడులోని షెవరాయి, జావ్వో కొండలను తూర్పు కనుమల విస్తరణలుగా పరిగణిస్తారు. మేఘాలయలోని షిల్లాంగ్ పీఠభూమి ఒకప్పుడు ద్వీపకల్ప భారతదేశంలో భాగంగా ఉండేది. గారో- రాజ్‌మహల్ కొండల మధ్య భూఅవనతం జరగడంతో ఈ భాగం ద్వీపకల్ప భారత ప్రాంతం నుంచి విడిపోయి ఈశాన్య భారతదేశం వైపు వెళ్లింది. అందువల్ల షిల్లాంగ్ పీఠభూమిని ద్వీపకల్ప భారతదేశ అవుట్‌పోస్ట్ అంటారు. ద్వీపకల్ప భారతదేశ పీఠభూములు ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన శిలలు కలిగి ఉన్నాయి. ఆర్కియన్ (ప్రీ కాంబ్రియన్) భౌమ్య యుగానికి చెందిన శిలలు వీటి పునాదులు. వీటి వయసు దాదాపు 2500 మిలియన్ ఏళ్లకు పైనే. ద్వీపకల్ప పీఠభూముల శిలలు అతి కఠినమైన రూపాంతర, అగ్నిశిలల తరగతికి చెందినవి. ద్వీపకల్ప పీఠభూమి పటలం ఏ రకమైన భౌమ్య చలనాలకు గురికాకుండా సుస్థిరంగా ఉండటంతో ఇక్కడ భూకంప ప్రక్రియ జరగడం అరుదు.

మాదిరి ప్రశ్నలు

1. ద్వీపకల్ప భారతదేశంలో ఎత్తయిన పర్వత శిఖరం?
   ఎ) వావుల్‌మాలా బి) అనైముడి
   సి) మహేంద్రగిరి డి) హరిశ్చంద్ర
2. దొడబెట్ట కింది ఏ పర్వతశ్రేణుల్లో ఎత్తయిన శిఖరం?
   ఎ) తూర్పు కనుమలు బి) పళని కొండలు
   సి) నీలగిరి కొండలు
   డి) అన్నామలై కొండలు
3. రాంచీ పీఠభూమి ఏ నైసర్గిక స్వరూపంలో భాగం?
   ఎ) మైకాల పీఠభూమి
   బి) మాళ్వా పీఠభూమి
   సి) బుందేల్‌ఖండ్ పీఠభూమి
   డి) ఛోటానాగపూర్ పీఠభూమి
4. ఆరావళి పర్వతశ్రేణులు ఏయే నదీ లోయలను వేరు చేస్తున్నాయి?
   ఎ) గంగా-సింధు బి) గంగా-యమున
   సి) గంగా-చంబల్ డి) గంగా-సట్లెజ్
5. దక్కన్ నాపల ప్రాంతం ఏ తరగతికి చెందిన శిలలతో ఉంది?
   ఎ) గ్రానైట్ బి) సున్నపురాయి
   సి) బసాల్ట్ డి) ఇసుకరాయి
6. పచ్‌మాడి వేసవి విడిది కేంద్రం ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
   ఎ) సాత్పూరా బి) మహాదేవ
   సి) వింధ్య డి) బాలాఘాట్
7. గోదావరి, కృష్ణా నదులు ఏ పర్వతాల్లో ఉద్భవిస్తున్నాయి?
   ఎ) తూర్పు కనుమలు
   బి) అజంతా కొండలు
   సి) నీలగిరి కొండలు
   డి) సహ్యాద్రి కొండలు
8. దక్కన్ పీఠభూమి ఏ దిశ వైపు వాలి ఉంది?
   ఎ) తూర్పు-ఆగ్నేయ బి) ఉత్తర
   సి) ఈశాన్య డి) తూర్పు-ఈశాన్య
9. కింది ఏ పర్వతశ్రేణులు భారతదేశాన్ని ఉత్తర దక్షిణాలుగా విభజిస్తాయి?
   ఎ) వింధ్య పర్వతాలు
   బి) సాత్పూరా పర్వతాలు
   సి) మైకాల డి) అజంతా కొండలు
10. బస్తర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
    ఎ) ఒడిశా బి) మధ్యప్రదేశ్
    సి) ఛత్తీస్‌గఢ్ డి) కర్ణాటక
11. ద్వీపకల్ప భారతదేశంలోని ఏ ప్రాంతంలో బ్యాడ్ ల్యాండ్ భూ దృశ్యం ఏర్పడింది?
    ఎ) మాళ్వా పీఠభూమి
    బి) బీగల్ ఖండ్ పీఠభూమి
    సి) చంబల్ లోయ డి) సోన్ లోయ
12. ద్వీపకల్ప భారతదేశంలో తీవ్ర స్థాయిలో భూకంపాలు సంభవించే ప్రాంతం?
    ఎ) మరఠ్వాడ బి) విదర్భా
    సి) బుందేల్ ఖండ్ డి) కచ్
13. దక్కన్ నాపలు సుమారు ఎన్ని సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి?
    ఎ) 100 బిలియన్ సంవత్సరాలు
    బి) 150 బిలియన్ సంవత్సరాలు
    సి) 200 బిలియన్ సంవత్సరాలు
    డి) 250 బిలియన్ సంవత్సరాలు
14. షేన్ కొట్టా కనుమ ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
    ఎ) తూర్పు కనుమలు
    బి) పశ్చిమ కనుమలు
    సి) బాలాఘాట్ పర్వత శ్రేణులు
    డి) అజంతా కొండలు
15. ద్వీపకల్ప భారతదేశంలోకెల్లా నిట్రవాలులు కలిగిన పీఠభూమి?
    ఎ) కర్ణాటక బి) మహారాష్ట్ర
    సి) తెలంగాణ డి) అమరఖంటక్
16. ఆంధ్రప్రదేశ్‌లో సుప్రసిద్ధ శ్రీశైలం పుణ్య క్షేత్రం ఏ కొండల్లో ఉంది?
    ఎ) ఎర్రమలై బి) నల్లమలై
    సి) శేషాచలం డి) వెలిగొండ
17. గురు శిఖర్ ఏ పర్వత శ్రేణుల్లో ఎత్తయిన శిఖరం?
    ఎ) వింధ్య బి) సాత్పూరా
    సి) ఆరావళి డి) తూర్పు కనుమలు
18. భారతదేశంలోని ఏ ప్రాంతంలో అతి పురాతన శిలలు లభ్యమవుతున్నాయి?
    ఎ) హిమాలయాలు
    బి) పూర్వాంచల్ కొండలు
    సి) గంగా మైదానం
    డి) ద్వీపకల్ప పీఠభూమి
19. మాళ్వా పీఠభూమి ఏ దిశగా వాలి ఉంది?
    ఎ) ఉత్తర బి) దక్షిణ
    సి) తూర్పు డి) పడమర
20. పెండ్రా పీఠభూముల్లో ఏ నది ఉద్భవిస్తోంది?
    ఎ) చంబల్ బి) సోన్
    సి) దామోదర డి) తపతి
21. సహ్యాద్రి కొండల్లో ఎత్తయిన పర్వత శిఖరం?
    ఎ) అనైముడి బి) త్రయంబక్
    సి) వావుల్ మలై డి) హరిశ్చంద్ర
22. రాజమహల్ కొండలు ఏ పీఠభూమిలో భాగం?
    ఎ) ఛోటా నాగపూర్ బి) దక్కన్
    సి) షిల్లాంగ్ డి) బస్తర్

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) ఎ; 5) సి; 6) డి; 7) డి; 8) ఎ; 9) ఎ; 10) సి; 11) సి; 12) డి; 13) ఎ; 14) బి; 15) ఎ; 16) బి; 17) సి; 18) డి; 19) ఎ; 20) బి; 21) సి; 22) ఎ.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్టీపీసీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఎన్టీపీసీ లిమిటెడ్(ఎన్టీపీసీ) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన సీనియర్ ఎగ్జిక్యూటివ్ (కమర్షియల్).. పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 08.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, పీజీడీఎం, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 38 ఏళ్లలోపు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.1,00,000.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష , ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 21.01.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 04.02.2025.
» వెబ్‌సైట్: https://www.nspcl.co.in/

ప్రసార భారతిలో సీనియర్ కరస్పాండెంట్ పోస్టులు

ప్రసార భారతి హైదరాబాద్‌లో సీనియర్ కరస్పాండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(ఎంసీజే) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 16.01.2025 తేది నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» దరఖాస్తులకు చివరితేది: 31.01.2025.
» వెబ్‌సైట్: https://prasarbharati.gov.in/

యూజీసీ, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 05.
» పోస్టుల వివరాలు: యంగ్ ప్రొఫెషనల్-03, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-01, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: యంగ్ ప్రొఫెషనల్‌కు 40 ఏళ్లు, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌కు 64 ఏళ్లు, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» దరఖాస్తులకు చివరితేది: 25.01.2025.
» వెబ్‌సైట్: https://www.ugc.gov.in/

అష్ట సూత్ర పథకం నుంచి తెలంగాణ ఏర్పాటు దాకా..

కాంగ్రెస్.. దేశంలోనే ప్రాచీనమైన రాజకీయ పార్టీ. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటులో, ఆ తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట ఆంధ్రప్రదేశ్ రూపుదిద్దుకోవడంలో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకోవడంలోనూ కాంగ్రెస్‌ది కీలకపాత్ర. రాష్ట్ర విభజన విషయంలో తొలుత ఊగిసలాట ధోరణిని అవలంభించినా.. ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడానికే ఆ పార్టీ మొగ్గు చూపింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వివిధ రాజకీయ పార్టీల పాత్ర

కాంగ్రెస్ పార్టీ

కాంగ్రెస్ పార్టీ 1885 డిసెంబర్ 28న ఆవిర్భవించింది. దేశంలోనే పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ భారత్‌ను ఎక్కువ కాలం పాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సుమారు 38 ఏళ్లపాటు పరిపాలన సాగించారు.

- జవహర్‌లాల్ నెహ్రూ 16 సంవత్సరాల 286 రోజులు, ఇందిరా గాంధీ 15 సంవత్సరాల 350 రోజులు(రెండు పర్యాయాలు), రాజీవ్ గాంధీ 5 సంవత్సరాల 32 రోజులు ప్రధానిగా పనిచేశారు.
- కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లోనూ సుమారు 42 ఏళ్లపాటు (1956-83, 1989-94, 2004-14) అధికారంలో ఉంది.
- 1971లో పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఈయనే తెలంగాణకు చెందిన తొలి ముఖ్యమంత్రి. పీవీ తర్వాత మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వీరెవరూ పూర్తి కాలం పదవిలో కొనసాగలేదు.

ఉద్యమంలో కాంగ్రెస్ పాత్ర

- 1956-83 వరకు ఏపీ కాంగ్రెస్‌లో వైరివర్గాల ఆధిపత్యమే కొనసాగింది. 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆ ప్రాంత కాంగ్రెస్ నేతలు కీలక పాత్ర పోషించారు.
- ఉద్యమాన్ని శాంతింపజేసేందుకు 1969 ఏప్రిల్ 11న ఢిల్లీలో అష్టసూత్ర పథకాన్ని ప్రకటించారు. 1971లో చెన్నారెడ్డి అధ్యక్షత వహించిన తెలంగాణ ప్రజాసమితి పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు సాధించింది. తెలంగాణలోని 14 పార్లమెంట్ స్థానాల్లో పదింటిని టీపీఎస్ అభ్యర్థులు గెలుచుకున్నారు. కాంగ్రెస్ దారుణంగా ఓటమి పాలైంది.
- ముల్కీ నిబంధనలు చెల్లుబాటు అవుతాయని 1972 అక్టోబర్ 3న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీంతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ప్రారంభమైంది.

కాంగ్రెస్ (ఐ) ఏర్పాటు

- ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని 1972 నవంబర్ 27న ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించారు. వెంటనే పంచసూత్ర పథకాన్ని విడుదల చేశారు. అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో కాసు బ్రహ్మానందరెడ్డికి ఇందిరా గాంధీతో అభిప్రాయభేదాలు వచ్చాయి. పార్టీని చీల్చేందుకు ప్రయత్నించారు. ఇందిరా గాంధీ 1978 జనవరి 1న కాంగ్రెస్ (ఐ)ను స్థాపించారు.
- అదే సమయంలో కాసు బ్రహ్మానందరెడ్డి 'రెడ్డి కాంగ్రెస్'ను స్థాపించారు.
- 2000లో జి.చిన్నారెడ్డి నాయకత్వంలో 41 మంది ఎమ్మెల్యేలు తెలంగాణకు అనుకూలంగా సోనియా గాంధీకి వినతిపత్రం ఇచ్చారు.
- 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్, వామపక్ష పార్టీలు కలిసి పోటీ చేసి విజయం సాధించాయి. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో తెలంగాణ అంశాన్ని చేర్చింది. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలోనూ యూపీఏ ప్రభుత్వం ఈ అంశాన్ని పొందుపర్చింది.
- 2004 జూన్ 7న రాష్ట్రపతి ప్రసంగించారు. యూపీఏ ప్రభుత్వం ఆ ప్రసంగంలోనూ తెలంగాణ అంశాన్ని చేర్చింది. తెలంగాణపై విస్తృత అంగీకారం కోసం ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన 2004 నవంబర్‌లో కేంద్రం ఒక ఉపసంఘాన్ని నియమించింది.
- ఉద్యమం తీవ్రం కావడంతో తెలంగాణ ఏర్పాటుపై అభిప్రాయాలు స్వీకరించడానికి వైఎస్ ప్రభుత్వం 2008లో రోశయ్య కమిటీని నియమించింది.
- 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా బరిలో దిగింది. అధికారంలోకి వస్తే తెలంగాణ ఇస్తామని ఆ పార్టీ ప్రచారం చేసింది.
- ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 156 స్థానాల్లో విజయం సాధించింది. వైఎస్ రాజశేఖర రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు.
- రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తూ 2009 సెప్టెంబర్ 2న నల్లమల అటవీ ప్రాంతంలోని పావురాల గుట్ట వద్ద హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ మరణించారు.
- 2009 సెప్టెంబర్ 3న రోశయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.
- 2009 అక్టోబర్ 9న హైదరాబాద్ ఫ్రీజోన్ అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుతో తెలంగాణవాదుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది.



2009 అక్టోబర్ 13న రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

- 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించారు. తెలంగాణలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. 2009 డిసెంబర్ 7న సచివాలయంలో రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎం, ఎంఐఎం తప్ప ఈ సమావేశంలో పాల్గొన్న మిగిలిన పార్టీలన్నీ తెలంగాణకు మద్దతిచ్చాయి.

అఖిలపక్ష సమావేశం

- 2009 డిసెంబర్ 9న రాత్రి 11.30 గంటలకు హోంమంత్రి చిదంబరం తెలంగాణపై ప్రకటన చేశారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించి, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడతారు' అని చిదంబరం పేర్కొన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన తర్వాతే తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని డిసెంబర్ 23న మరో ప్రకటనలో పేర్కొన్నారు.
- రెండో ప్రకటనతో తెలంగాణలో ఆందోళనలు మొదలయ్యాయి.
- తెలంగాణకు మద్దతుగా కాంగ్రెస్ నేతలు రాజీనామా చేయకపోవడం పట్ల ఆగ్రహంతో ఉన్న విద్యార్థులు, జేఏసీ నేతలు 2010 ఫిబ్రవరి 14న మంత్రులు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇళ్లపై దాడి చేశారు.
- కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణ తరఫున ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆంధ్రా తరఫున కావూరి సాంబశివరావు హాజరయ్యారు.

శ్రీకృష్ణ కమిటీ

- 2010 ఫిబ్రవరి 3న జస్టిస్ శ్రీకృష్ణ కమిటీని నియమించారు. 2010 ఫిబ్రవరి 19న రాజకీయ జేఏసీ నుంచి కాంగ్రెస్ బయటకు వచ్చింది. రాష్ట్రంలో ఆందోళనల నేపథ్యంలో కేంద్రం రోశయ్యను సీఎం పదవి నుంచి తప్పించింది. 2010 నవంబర్‌లో ఆయన స్థానంలో స్పీకర్ కిరణ్‌కుమార్ రెడ్డిని సీఎంగా నియమించింది.
- విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు 2010 డిసెంబర్ 26న గన్‌పార్క్ వద్ద దీక్ష చేశారు. అదే నెల 30న శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను కేంద్ర హోంశాఖకు సమర్పించింది.
- 2011 జనవరి 6న కేంద్ర ప్రభుత్వం శ్రీకృష్ణ కమిటీ నివేదికను బహిర్గతం చేసింది.
- శ్రీకృష్ణ కమిటీ సమైక్యాంధ్రకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చింది. దీంతో తెలంగాణలో ఆందోళనలు కొనసాగాయి. తెలంగాణ ఏర్పాటుపై ఆలస్యానికి నిరసనగా జూపల్లి కృష్ణారావు 2011 మార్చి 3న మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 2011 జూన్‌లో పీసీసీ అధ్యక్షుడిగా డి. శ్రీనివాస్ స్థానంలో బొత్స సత్యనారాయణను నియమించారు. ఈ ఘటనతో సీఎం, స్పీకర్, పీసీసీ అధ్యక్షుడు లాంటి మూడు కీలక పదవులు ఆంధ్రా ప్రాంతానికే దక్కాయి.
- 2011 అక్టోబర్ 1న నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 2012 డిసెంబర్ 28న హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. 2013 జూన్ 30న హైదరాబాద్‌లో తెలంగాణ సాధన సభ పేరు తో కాంగ్రెస్ బహిరంగ సభ నిర్వహించింది.

రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

- 2013 జూలై 11న ఢిల్లీలో కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో తెలంగాణపై చర్చ జరిగింది. 2013 జూలై 30న హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ప్రకటించింది. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని 2013 ఆగస్టు 5న చిదంబరం పార్లమెంటులో ప్రకటించారు. ఆగస్టు 6న ఆంటోని నేతృత్వంలో అంతర్గతంగా విభజన కమిటీ ఏర్పాటైంది. దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, అహ్మద్ పటేల్ ఈ కమిటీలో సభ్యులు. 2013 అక్టోబర్ 8న ఎ.కె.ఆంటోనీ చైర్మన్‌గా కేంద్ర మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు.
- 2013 డిసెంబర్ 5న 'తెలంగాణ ముసాయిదా బిల్లు 2013'ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ బిల్లు డిసెంబర్ 12న రాష్ట్రానికి చేరింది. డిసెంబర్ 15న బిల్లు ప్రతులను ఎమ్మెల్యేలకు అందజేశారు. తర్వాతి రోజు చర్చ ప్రారంభమైంది. 2014 జనవరి 22న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.
- సభలో 87 మంది ఎమ్మెల్యేలు మాట్లాడారు. మిగతా సభ్యులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలిపారు. దీనిపై చర్చ ముగిసిందంటూ 2014 జనవరి 30న స్పీకర్ ప్రకటించారు.
- పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా ఫిబ్రవరి 9న ఆంధ్రాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాసానికి కారణమైన పదకొండు మంది ఎంపీలను ఫిబ్రవరి 11న కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. ఫిబ్రవరి 14న కాంగ్రెస్ ఎంపీ లగడపాటి రాజగోపాలరెడ్డి లోక్‌సభలో పెప్పర్ స్ప్రేతో దాడిచేశారు.
- ఈ సందర్భంగా 16 మంది ఆంధ్రప్రదేశ్ ఎంపీలను స్పీకర్ మీరాకుమార్ లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. 2014 ఫిబ్రవరి 13న యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది.
- 2014 ఫిబ్రవరి 18న తెలంగాణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఫిబ్రవరి 20న యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టగా, ఆ రోజే బిల్లు ఆమోదం పొందింది. 2014 మార్చి 1న బిల్లుపై రాష్ట్రపతి సంతకం చేశారు. మార్చి 2న కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.
- జూన్ 2ను అపాయింటెడ్ డేగా కేంద్రం 2014 మార్చి 4న ప్రకటించింది.
- దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది.

ఎంఐఎం

- హైదరాబాద్ కేంద్రంగా ఎంఐఎం రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.
- ప్రస్తుత అసెంబ్లీలో ఈ పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.
- తెలంగాణ ఉద్యమానికి ఎంఐఎం దూరంగానే ఉంది.
- 2010 జనవరి 5న ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశానికి ఎంఐఎం అగ్రనేతలు అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు.
- తెలంగాణ ఏర్పడితే మతతత్వ శక్తులు విజృంభిస్తాయనే భయాన్ని వారు వెలిబుచ్చారు.
- 2013 నవంబర్ 12, 13 తేదీల్లో రాష్ట్ర విభజనపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి ఎంఐఎం తన సూచనలు, సలహాలు అందజేసింది.
- 2014 జనవరి 20న ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ విభజన బిల్లుపై అసెంబ్లీలో మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో కోస్తాంధ్ర పాత్ర ఏమీలేదని, నిజాం కాలం నుంచే హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని గణాంకాలతో సహా వివరించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణకు మొగ్గు చూపారు.

A graphical user interface displays..

BANK EXAMS
COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came me to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.

Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).



- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.

1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www)

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
1) Folder 2) Pod 3) Version
4) Bag 5) None of the above

2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
1) System menu
2) Address bar 3) Menu bar
4) Tool bar
5) None of the above

3. A _____ is a set of computer instructions that carry out a task on the computer.
1) Program 2) Database
3) Memory file4) Folder
5) None of the above

4. An operating system version designed for home use is Microsoft Windows XP______
1) Home Edition
2) Media Center Edition
3) Tablet PC Edition
4) All of the above 5) None

5. A user-interface that is easy to use is considered to be______
1) user-happy 2) user-simple
3) user-friendly 4) Interface
5) None of the above

6. When you press and release the secondary mouse button you are______
1) Right-clicking
2) Left-clicking
3) Either 1 or 2
4) All of the above
5) Neither 1 nor 2

7. Another term for hyperlink is_______
1) Link 2) Source
3) Bar 4) All of the above
5) None of the above

8. A graphical user interface displays__________
1) Graphics 2) Text
3) Both 1 and 2
4) Neither 1 nor 2 5) None

9. The ______ program compresses larger files into a smaller file.
1) Win Zip 2) Win Shrink
3) Win Style 4) Win small
5) None of the above

10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is __________.
1) Queue 2) Linked list
3) Doubly linked list
4) Binary tree
5) None of the above

11. Caps lock, Num-lock are known as ________.
1) Modifier key 2) Toggle key
3) Function key 4) Numeric key
5) None of these

12. Which of the following memories must be refreshed many times per second?
1) Static RAM
2) Dynamic RAM 3) EPROM
4) ROM 5) None of these

13. Anurag is a supercomputer developed in _____
1) China 2) USA 3) India
4) England 5) None of these

14. A result of a computer virus can not lead to_________.
1) Disk Crash
2) Mother Board Crash
3) Corruption of program
4) Deletion of files
5) None of these

15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
1) Begin the line with a # sign
2) Begin the line with double slashes (/ /)
3) Begin and end the line with double hyphens (-_-)
4) Indent the line
5) None of these

16. Programming language built into user programs such as Word and Excel are known as_____.
1) 4GLs 2) Macro languages
3) Procedure-oriented languages
4) Visual programming languages
5) None of these

17. Firewalls are used to protect against _______.
1) Unauthorized Attacks
2) Virus Attacks
3) Data Driven Attacks
4) Fire Attacks
5) All of these

18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
1) Management 2) Processing
3) Utility 4) Application
5) None of these

19. RAM can be thought of as the ________ for the computer's processor.
1) Factory 2) Operating room
3) Waiting room
4) Planning room
5) None of these

20. The CPU and memory are located on the ________.
1) Expansion board
2) Motherboard
3) Storage device
4) Output device
5) None of these

21. Word processing, spreadsheet and photo-editing are examples of ________.
1) Application software
2) System software
3) Operating system software
4) Platform software
5) None of the above

22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
1) <ahref> 2) <a> 3) <link>
4) <hlink> 5) <href>

23. Drop cap option found in which menu?
1) Insert 2) Format 3) Edit
4) Tools 5) None of these

24. A half byte is known as______.
1) Data 2) Bit 3) Half byte
4) Nibble 5) All of these

25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called________.
1) Modern 2) Interface
3) Clue 4) Data bus
5) All of these

26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
1) POS 2) RFID 3) PPS
4) GPS 5) None of these

27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called________.
1) HTML 2) MP3 3) MPEG
4) MIDI 5) None of these

KEY

1) 1	2) 2	3) 1	4) 1	5) 3
6) 1	7) 1	8) 3	9) 1	10) 3
11) 2	12) 2	13) 3	14) 2	15) 2
16) 4	17) 1	18) 4	19) 3	20) 2
21) 1	22) 1	23) 1	24) 4	25) 2
26) 2	27) 4			